


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 54

గురువారం 16-5-2024



సాత్విక్-చిరాగ్ జోడీ శుభారంభం

థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశం. -12లో



విజయ ప్రతీక

ప్రీతిక మెహతాను వరల్డ్ ఎకనామిక్ ఫోరం 'గ్లోబల్ షార్పర్'గా గుర్తించింది. -IIలో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

ఇంటి పనులతోనే సమయం సరిపోవడం లేదనే కంప్లైంట్ గృహిణుల నోట తరచూ వినిపిస్తుంటుంది. కొందరు మాత్రం కొద్దిపాటి ఖాళీ సమయాన్ని కూడా సద్వినియోగం చేసుకుంటూ తమని తాము తీర్చిదిద్దుకుంటారు. అలాంటి కొందరిలో పద్మాసని దరూరి ఒకరు. హైదరాబాద్ మాదాపూర్‌లో ఉంటున్న 53 ఏళ్ల పద్మాసని దరూరి గృహిణిగా ఉంటూ సంస్కృతంతో పాటు అనేక భాషల మీద పట్టు సాధించారు. భర్త ఉద్యోగరీత్యా పుణెలో ఉండటంతో అక్కడి స్థానిక వంటకాలను నేర్చుకున్నారు. పిల్లలు ఉద్యోగాలు చేసే సమయానికి వచ్చేసరికి నగరవాసులకు 'పావ్ మంత్ర' పేరుతో మహారాష్ట్రియన్ వంటకాలను పరిచయం చేస్తూ ఎంట్రప్రెన్యూర్‌గా ఎదిగారు. పుణెలోనూ 'పంచసత్వ' పేరుతో సౌత్ ఇండియన్ క్యుజిన్‌ను ప్రారంభిస్తున్నారు. గృహిణిగా ఉంటూనే వ్యాపారవేత్తగా ఎదిగిన పద్మాసని దరూరిని పలకరిస్తే ఇలా ఎన్నో కబుర్లు మన ముందుంచారు.

వడాపావ్ మంత్రం

పద్మాసని విజయరహస్యం


పద్మాసని దరూరి

''మనలో అభిరుచి ఉండాలే గానీ ఎక్కడ ఉన్నా దానిని వృద్ధిలోకి తీసుకురావచ్చు. మా వారి ఉద్యోగ రీత్యా పుణేలో ఉండేవాళ్లం. గృహిణిగా ఇల్లు, పిల్లల పనులు ఎప్పుడూ ఉండేవే. పిల్లలు హైస్కూల్‌కి వచ్చాక నేను వేదాంత అకాడమీలో చేరి మూడు నెలల్లో సంస్కృతాన్ని నేర్చుకున్నాను. మన పురాణేతిహాసాలు చదువుతూ సబ్జెక్ట్‌పై పట్టు సాధించగలిగాను. కార్పొరేట్ కంపెనీలలో పని చేసే వారి ఆసక్తిని బట్టి, అక్కడకు వెళ్లి సంస్కృతం క్లాసులు తీసుకునే దాన్ని. రామాయణ, మహా భారతాల గురించి క్షుణ్ణంగా వివరించే దాన్ని. వేదాంత అకాడమీలో నేర్చుకున్న విషయాలను ఇంటికి వచ్చి పిల్లలకు చెబుతుండేదాన్ని. దీంతో వారు స్కూల్లో చదువుకున్న విషయాలే కాకుండా మన వేదాల గురించి, పురాణాల గురించీ కూడా తెలుసుకోగలిగారు.

వివిధ రకాల భాషలు

సంస్కృతంతో పాటు హిందీ, ఇంగ్లిష్, మరాఠీ.. ఇలా రకరకాల భాషలను ఆసక్తితో నేర్చుకున్నాను. వీటితోపాటు దేశంలోని అన్ని రకాల ప్రాచీన సంస్కృతుల గురించి తెలుసుకోవడం, వాటిని ఆచరించడం చేస్తుండేదాన్ని. ఈ క్రమంలో అన్ని రకాల వంటకాల తయారీని ఇష్టంగా చేసేదాన్ని. వాటిని మా ఇంట్లో వారికే కాదు మా చుట్టు పక్కల వారికీ రుచి చూపించేదాన్ని. అందరూ మెచ్చుకునేవారు. మా అబ్బాయిలిద్దరూ మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తయ్యాక నాకు మరింత వెసులుబాటు దొరికింది. నా వంటకాల రుచితో బిజినెస్ చేయాలనే ఆలోచన వచ్చింది.

రుచిగా.. పావ్ మంత్ర

తరచూ ఇంట్లో బిజినెస్ ఆలోచనల గురించి చర్చ జరుగుతున్నప్పుడు నేను, మా పెద్దబ్బాయి కలిసి ఒక ఫుడ్ స్టార్టప్ ప్రారంభించాలనుకున్నాం. మా స్టార్టప్‌కి వాత్సల్య అనే పేరు అనుకున్నాం. పుణెలో స్థానిక ఫుడ్ వడా పావ్. అక్కడ స్ట్రీట్‌ఫుడ్‌గా దీనికి పేరుంది. హైదరాబాద్ వాసులకు ఈ వడాపావ్ రుచిని కొత్తగా అందించాలనుకున్నాను. పుణెలో వడా పావ్ టేస్ట్, మన దగ్గర టేస్ట్‌కి భిన్నంగా ఉంటుంది. ఏ పనైనా ఒకసారి మొదలుపెడితే దాంట్లో నూటికి నూరు శాతం దృష్టి పెట్టాల్సిందే అనుకొని వ్యాపారంలోకి దిగాను. పావ్‌కి విభిన్నమైన రుచిని తెప్పించడం కోసం రకరకాల ప్రయోగాలు చేసి, విజయవంతమయ్యాం. మా పిల్లలు వామన్, కేశవ్ లు తమ పూర్తి సహకారాన్ని నాకు అందించారు. దాంతో 'పావ్‌మంత్ర' పేరుతో ఫుడ్ బిజినెస్‌ను కరోనా సెకండ్ వేవ్‌లో మాదాపూర్‌లో ప్రారంభించాం. మా స్టార్టప్‌కి మహారాష్ట్ర, పార్సీ అంబియన్స్ వచ్చేలా ప్లాన్ చేశాం. కొద్ది రోజుల్లోనే నోటి మాట ద్వారానే అందరికీ తెలియడంతో మంచి పేరు వచ్చింది. నేను కన్న కల రెండున్నరేళ్లలోనే సాకారం అయ్యింది. ఈ నెలలో పుణెలో 'పంచసత్వ' పేరుతో సౌత్ ఇండియన్ క్యుజిన్‌ను అందించబోతున్నాను. గృహిణిగా ఇంటి పనులు, వంట పనులు చేసుకుంటూ ఉన్న నేను 53 ఏళ్ల వయసులో ఇలా బిజినెస్ ఉమెన్‌గా ఎదుగుతానని అస్సలు ఊహించలేదు. నా అభిరుచికి మేరకు ఒక్కో ప్రయత్నం చేస్తూ ప్రయాణిస్తున్నాను. ఈ ప్రయాణంలో నా పిల్లలు తోడయ్యారు. తొంభై ఏళ్ల వయసున్న నా తల్లిదండ్రులూ నా ఆసక్తిని, అభిరుచిని గౌరవిస్తూ తమ ఆశీస్సులను అందిస్తున్నారు. అమ్మానాన్నలను చూసుకుంటూ, భర్త, పిల్లల బాగోగులను గమనిస్తూ, నన్ను నేనుగా మెరుగుపరుచుకోవడానికి చేసిన ప్రయత్నం ఎప్పుడూ నాకు మంచి ఫలితాలను ఇస్తూ వచ్చింది. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ మరింతగా ఎదగడానికి ప్రయత్నిస్తున్నాను' అంటూ వివరించారు పద్మాసని.

– నిర్మలారెడ్డి

మల్టీ టాలెంట్

ప్రీతిక మెహతాను వరల్డ్ ఎకనామిక్ ఫోరం 'గ్లోబల్ షార్పర్'గా గుర్తించింది. చండీగఢ్‌కు చెందిన ప్రీతిక బహుముఖ ప్రజ్ఞాశాలి. గణిత మేధావి, డేటా సైంటిస్ట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎక్స్‌పర్ట్‌గా పేరు తెచ్చుకున్న ప్రీతిక 'బటర్‌నట్ ఏఐ'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా కూడా రాణిస్తోంది. మరోవైపు మోటివేషనల్ స్పీకర్‌గా ఎంతోమందికి ధైర్యాన్ని ఇస్తోంది. మార్గనిర్దేశం చేస్తోంది....

విజయ ప్రతీక


ప్రీతిక మెహతా

లెక్కలు అంటే చాలామంది పిల్లలకు భయం. అయితే చిన్నప్పటి నుంచి ప్రీతికకు లెక్కలు అంటే చెప్పలేనంత ఇష్టం. బొమ్మలు వేయడం అంటే కూడా ఇష్టం. పద్నాలుగు సంవత్సరాల వయసులో కోడింగ్ నేర్చుకోవడం మొదలుపెట్టింది.

ఒక ప్రాడక్ట్ స్టార్టప్‌లో తొలి ఉద్యోగం చేస్తున్నప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై ఆసక్తి పెరిగింది. దాంతో ఉద్యోగాన్ని వదులుకొని న్యూయార్క్‌లోని స్టేట్ యూనివర్శిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో మాస్టర్స్ చేసింది.

ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు ఖర్చుల కోసం ఒక రెస్టారెంట్‌లో పనిచేసేది.

గ్రాడ్యుయేషన్ సెర్మనీకి ప్రీతిక తల్లి అమెరికాకు వచ్చింది. తల్లిని తన ప్రొఫెసర్‌కు పరిచయం చేసింది.

'మీ అమ్మాయి బ్రైట్ స్టూడెంట్. క్లాస్‌రూమ్‌లో లోతైన ప్రశ్నలు అడిగేది. మీ కూతురికి మంచి భవిష్యత్ ఉంది' అంటూ ఆ ప్రొఫెసర్ ప్రీతికపై ప్రశంసల వర్షం కురిపించాడు.

ప్రొఫెసర్ మాటలు విన్న తరువాత ప్రీతికకు తన మీద ఉన్న నమ్మకం రెట్టింపు అయింది.

'యస్. నేను సాధించగలను' అనుకుంది.

బోస్టన్‌లోని 'బాంక్ ఆఫ్ అమెరికా'లో పనిచేసే అవకాశం ప్రీతికకు వచ్చింది. అయితే సొంతంగా ఏదైనా సాధించాలనే లక్ష్యంతో అధిక వేతనంతో కూడిన ఉద్యోగానికి రాజీనామా చేసింది. ప్రీతిక నిర్ణయం కుటుంబ సభ్యులతో సహా చాలామందికి నచ్చలేదు.

'బ్యాంక్ ఆఫ్ అమెరికాలో ఉద్యోగ జీవితం బాగున్నప్పటికీ నాలో ఉన్న అన్ని టాలెంట్స్‌ను ఉపయోగించుకునే అవకాశం దొరకలేదు' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంటుంది ప్రీతిక.

అమ్మ చెప్పిన మాట



చదువుకునే రోజుల్లో ఎందరో విజేతల కథలు నాకు స్ఫూర్తి ఇచ్చాయి. అదే సమయంలో 'ప్రతి రంగంలో పురుషులతో పోల్చితే మహిళా విజేతలు ఎందుకు తక్కువగా ఉన్నారు?' అని ఆలోచించేదాన్ని. ఈ ఆలోచనలతోనే నా వంతుగా ఏదైనా సాధించాలనే పట్టుదల పెరిగింది. చిన్నప్పుడు స్కూల్ మార్చమని ఇంట్లో గొడవ చేశాను. దీనికి కారణం క్లాసులో 80 మంది స్టూడెంట్స్ ఉండడం. 'ఇంత మంది మధ్య నేను టాపర్‌గా ఎలా ఉండగలను' అన్నాను.

'ఇరవైమందిలో ఎలాగైతే టాపర్‌గా నిలిచావో 80 మందిలో కూడా టాపర్‌గా నిలవాలి' అని అమ్మ చెప్పింది. వందమందిలో రాణించగలిగినప్పుడు వెయ్యిమందిలో కూడా రాణించగలం అనే సత్యం బోధపడింది. మనలో సామర్థ్యం ఉన్నప్పుడు సంఖ్య ముఖ్యం కాదు. ఒకవైపు భవిష్యత్ లక్ష్యాలు. మరోవైపు ఇరుగు పొరుగు వారి సూటిపోటి మాటలు. 'ఈ డ్రెస్‌తో బయటికి వెళతావా?' 'అబ్బాయిలా పొడుగ్గా పెరుగుతున్నావేమిటి?'... ఇలాంటి నాన్‌సెన్స్ మైండ్‌సెట్ కామెంట్స్ చిరాకు కలిగించేవి కానీ నా భవిష్యత్ లక్ష్యాలను నీరుగార్చలేకపోయాయి. మన దేశంలోనే కాదు అమెరికాలోనూ వృత్తిజీవితంలో లింగవివక్షతను ఎదుర్కొన్న సందర్భాలు ఉన్నాయి. అయితే అలాంటి వాటికి చిన్నబుచ్చుకోకుండా టాలెంట్‌తోనే సమాధానం చెప్పాను.

– ప్రీతిక మెహతా

అమెరికా నుంచి వచ్చిన తరువాత పిల్లలకు కోడింగ్ నేర్పించడానికి 'కిడ్డీకోడర్స్'ను స్టార్ట్ చేసి పన్నెండు దేశాలకు వెళ్లింది. ఆ తరువాత సాక్‌సోహో.కామ్‌తో మెన్స్ ఫ్యాషన్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది.

'మెన్స్ ఫ్యాషన్ ఇండస్ట్రీలో మంచి అవకాశాలు ఉన్నాయని రిసెర్చ్ ద్వారా తెలుసుకున్నాను. ఈ స్పేస్‌లో గ్లోబల్ స్టార్టప్ నిర్మించవచ్చు. దీన్ని దృష్టిలో పెట్టుకొని సాక్‌సోహో మొదలు పెట్టాను' అంటుంది ప్రీతిక.

తనకు పట్టు ఉన్న డేటా, ఏఐ సబ్జెక్ట్‌లతో కస్టమర్‌ల వ్యక్తిగత అనుభవాలతో కంపెనీని బిల్డ్ చేసింది. యూఎస్‌లో చదువుకునే రోజుల్లో పార్ట్‌టైమ్ ఉద్యోగిగా ఒక ఇటాలియన్ రెస్టారెంట్‌లో పనిచేసింది. అది కస్టమర్–ఫేసింగ్ జాబ్ కావడం వల్ల ఎన్నో విషయాలపై అవగాహన వచ్చింది. ఆ జ్ఞానం 'సాక్‌సోహో'కు ఉపయోగపడింది. డైరెక్ట్–టు–కన్స్యూమర్ ఫ్యాషన్ బ్రాండ్ 'సాక్‌సోహో'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయకేతనం ఎగరేసింది ప్రీతిక.

'మనపై మనకు ఉన్న నమ్మకమే శక్తి. దానితో ఎన్ని విజయాలైనా సాధించవచ్చు' అంటుంది ప్రీతిక మెహతా.

మార్గనిర్దేశం

'ఉన్నత స్థానానికి చేరుకున్న మహిళలకు తమ స్థాయిని కాపాడుకోవడానికి రెట్టింపు కష్టపడాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో లక్ష్యసాధనకు సంబంధించి అమ్మాయిలకు మార్గనిర్దేశం చేయడానికి వారికి సమయం దొరకదు' అంటున్న ప్రీతిక ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎంత బిజీగా ఉన్నప్పటికీ లక్ష్యసాధన విషయంలో అమ్మాయిలకు మార్గనిర్దేశం చేయడానికి ఎన్నో సమావేశాల్లో పాల్గొంది. ఎంటర్‌ప్రెన్యూర్‌గానే కాదు మోటివేషనల్ స్పీకర్‌గా కూడా మంచి పేరు తెచ్చుకుంది. 'థింక్. లెర్న్. డిసైడ్ విత్ యువర్ ఓన్ హెడ్ అండ్ హార్ట్' అనేది ఎన్నో సమావేశాలలో ప్రీతిక నుంచి వినిపించే మాట.

బ్యూటిప్స్

పసుపు.. కొబ్బరిపాలు... రోజ్‌వాటర్









- టీస్పూను పసుపు, టీస్పూను ముల్తానీ మట్టి, టీస్పూను ఆరెంజ్ పీల్ పౌడర్, కప్పు రోజ్‌వాటర్, టీస్పూను కొబ్బరి పాలు, ఆరు చుక్కల నిమ్మనూనెను తీసుకుని ఒక బౌల్‌లో వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఐస్‌క్యూబ్స్ ట్రేలో పోసి గడ్డకట్టేంత వరకు రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి. ఈ క్యూబ్‌లు మూడు వారాల వరకు తాజాగా ఉంటాయి.
- ముఖాన్ని శుభ్రంగా కడిగి ఈ ఐస్‌క్యూబ్స్‌తో ఇరవై నిమిషాలపాటు సున్నితంగా మర్దన చేయాలి
- ఇరవై నిమిషాల తరువాత నీటితో కడిగి తడిలేకుండా తుడవాలి. ఇప్పుడు మాయిశ్చరైజర్ లేదా అలోవెరా జెల్‌ను రాసుకోవాలి.
- ఇలా క్రమం తప్పకుండా చేయడం వల్ల ముఖంపై పేరుకుపోయిన మొటిమల తాలూకు మచ్చలు, వైట్, బ్లాక్ హెడ్స్, ట్యాన్ పోయి ముఖం ప్రకాశవంతంగా... తాజాగా కనిపిస్తుంది.
- చర్మం జిడ్డు కారడం నియంత్రణలో ఉండడమేగాక, దీర్ఘకాలంగా వేధిస్తోన్న మొటిమలు కూడా తగ్గుముఖం పడతాయి.
- పసుపు, కొబ్బరి పాలు వృద్ధాప్య ఛాయలను నియంత్రించి చర్మం యవ్వనంగా కనిపించేలా చేస్తాయి.

కిచెన్ టిప్స్

తాజాగా... పొడిగా...



అరకిలో వెల్లుల్లి రెబ్బలను తొక్క తీసి చిన్నచిన్న ముక్కలుగా తరగాలి. కప్పు సూజీ రవ్వను బాణలిలో వేసి, వేడెక్కిన తరువాత రవ్వలో వెల్లుల్లి ముక్కలను వేసి వేయించాలి. రవ్వ, వెల్లుల్లి ముక్కలు గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి మారేంత వరకు వేయించి దించేయాలి. వెల్లుల్లి ముక్కలను రవ్వ నుంచి వేరుచేసి మిక్సీజార్‌లో వేసి పొడిచేసుకోవాలి. దీనిని పిండి జల్లెడతో జల్లించుకుని మెత్తని పొడిని గాలిచొరబడని డబ్బాలో నిల్వచేసుకోవాలి. ఇది ఆరు నెలల పాటు తాజాగా ఉంటుంది. వెల్లుల్లి పేస్టుకు బదులు ఈ పొడిని కావాల్సిన కూరల్లో వేసుకోవచ్చు. ఈ పొడి ఉంటే తరచూ వెల్లుల్లి పొట్టు తీసి దంచే పని ఉండదు.



- అన్నం కొద్దిగా మాడినా, అడుగున మొత్తం మాడిపోయినా మిగతా అన్నం కూడా మాడు వాసన వస్తుంది. ఆ వాసనకు అన్నం తినబుద్ధి కాదు. ఒక ఉల్లిపాయను తీసుకుని నాలుగు ముక్కలుగా తరగాలి. మాడిన అన్నం గిన్నె మధ్యలో నాలుగు ముక్కలను నాలుగు చోట్ల పెట్టి పదిహేను నిమిషాలపాటు మూత పెట్టి ఉంచాలి. పావు గంట తరువాత మూత తీసి ఉల్లిపాయ ముక్కలను తీసేయాలి. ఇలా చేయడం వల్ల మాడు వాసన పోతుంది. అన్నం ఉల్లిపాయ వాసన కూడా రాకుండా చక్కగా ఉంటుంది.





- ఇంట్లో అల్లం ఎక్కువగా ఉన్నప్పుడు... తొక్క తీసి కొద్దిగా నూనె వేసి పేస్టులా చేసుకోవాలి. ఈ పేస్టుని ఐస్ ట్రేలో వేసుకుని ఫ్రీజర్‌లో నిల్వ చేసుకోవాలి. ఈ అల్లం క్యూబ్స్ ఎప్పుడంటే అప్పుడు వాడుకోవచ్చు.



- స్ప్రే బాటిల్‌లో టేబుల్ స్పూను బేకింగ్ సోడా, టేబుల్ స్పూను వెనిగర్, టీస్పూను డిష్‌వాష్ లిక్విడ్, రెండు గ్లాసులు నీళ్లుపోసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కిచెన్ ప్లాట్‌ఫాం, స్టవ్ మీద చల్లుకుని తుడుచుకుంటే ఎటువంటి క్రిములు దరిచేరవు.
- సాల్ట్ డబ్బా అడుగు భాగంలో కొద్దిగా బియ్యం వేసి తరువాత సాల్ట్ వేయాలి. సాల్ట్‌లోని తేమను బియ్యం పీల్చుకుని సాల్ట్‌ను పొడిగా ఉంచుతుంది.



- ప్లాస్టిక్ రోల్ అతుక్కుని త్వరగా ఊడి రాదు. ఇటువంటప్పుడు అరగంట పాటు రోల్‌ని రిఫ్రిజిరేటర్‌లో పెట్టి తరువాత ఓపెన్ చేస్తే అతుక్కోకుండా సులభంగా వచ్చేస్తుంది.

రైజ్ ఏ చైల్డ్

కొత్త తల్లులకు పెద్ద బాలశిక్ష



> ఇందులో ఒకరు తమ సమస్యను పోస్ట్ చేసిన తర్వాత ఆలాంటి సమస్యను ఎదుర్కొని బయటపడిన వాళ్లు తాము ఆ సమస్య ఎలా పరిష్కరించుకున్నారో అనుభవపూర్వకంగా తెలియచేస్తారు.

'పాపాయి నిద్రపుచ్చినంతసేపు కూడా పడుకోలేదు. భుజానికెత్తుకుని తిప్పి తిప్పి నిద్రపుచ్చి ఇలా మంచం మీద పెట్టానో లేదో వెంటనే లేచేసింది. ఈ బిడ్డతో నేనేం చేయను' చంటిబిడ్డను పెంచే ప్రతి తల్లి నుంచి వినవచ్చే మాటే ఇది. ఆ తల్లి వెలిబుచ్చిన నిస్సహాయతలో అగాధం వంటి ఆవేదన దాగి ఉంటుంది. ఈ పాట్లన్నీ పడి పాపాయిని ఆరు నెలలు పెంచేసరికి మెటర్నిటీ లీవ్ అయిపోతుంది. అప్పుడు మరో ప్రశ్న... 'బిడ్డను కేర్ టేకర్ చేతిలో పెట్టి ఉద్యోగానికి వెళ్లవచ్చా. చక్కగా చూసుకోగలిగిన ఆయాలు దొరికితే బావుణ్ను'. బిడ్డకు ఘనాహారం ఎప్పుడు ఇవ్వాలో డాక్టర్‌లు చెబుతారు, కానీ ఎలా తినిపించాలనేది మాత్రం బిడ్డను పెంచిన అనుభవం ఉన్న తల్లులే చెప్పాలి. పిల్లల్ని పెంచడంలో ఎదురయ్యే ఇలాంటి ఎన్నో సందేహాలను నివృత్తి చేసుకోవడానికి వెలిసిందో గ్రామం. దాని పేరే 'రైజ్ ఏ చైల్డ్'. ఎక్కడ ఉందీ గ్రామం. ఈ గ్రామం అడ్రస్ చెప్పాలంటే కేరాఫ్ డిజిటల్ మీడియా అని చెప్పాలి.

ఇప్పుడు ఉమ్మడి కుటుంబాల్లేవు, నగరాల్లో అన్నీ న్యూక్లియర్ ఫ్యామిలీలే. పసిబిడ్డ అమ్మమ్మ, నానమ్మల చేతిలో పెరిగే అవకాశాలు తగ్గిపోయిన ఈ కాలంలో బిడ్డ సంరక్షణలో తల్లులకు ఎదురయ్యే సందేహాలను డిజిటల్ మాధ్యమం ద్వారా ఒకరికొకరు షేర్ చేసుకుంటున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న తల్లులు ఇందులో జాయిన్ అయ్యారు. 'క్వశ్చన్స్ అరౌండ్ బ్రెస్ట్ ఫీడింగ్, బ్రెస్ట్ ఫీడింగ్ సపోర్ట్ ఫర్ ఇండియన్ మదర్స్, బేబీ లెడ్ వీనింగ్, గుడ్ షెడ్యూల్ ఫర్ బేబీస్, క్లాత్ డయాపరింగ్ ఇండియా, ఫస్ట్ ఫార్టీ డేస్ ఆఫ్టర్ చైల్డ్ బర్త్' వంటి పది గ్రూప్‌లను ఒక గొడుగు కిందకు తీసుకువస్తూ 'రైజ్ ఏ చైల్డ్' పేరుతో ఒక వర్చువల్ విలేజ్‌కి రూపకల్పన చేసింది రోహిణి అనే మహిళ. ''నిజానికి నాకెదురైన సమస్యలే ఈ వర్చువల్ విలేజ్ రూపకల్పనకు నాంది. గర్భధారణ, ప్రసవం 30 ఏళ్లలోపు జరగాలని వైద్యులు సూచిస్తుంటారు. కానీ ఇప్పటి పరిస్థితుల్లో ఉన్నత చదువులు, ఉద్యోగాలలో స్థిరపడిన తరవాతనే పెళ్లి. దాంతో పిల్లలను కనే వయసు దాటిపోతోంది. నేను 32 ఏళ్ల వయసులో గర్భం దాల్చాను. డాక్టర్ పర్యవేక్షణలో ఉన్నప్పటికీ రోజువారీ ఎదురయ్యే ఇబ్బందుల పరిష్కారం కోసం మళ్లీ డాక్టర్ చెకప్ వరకు ఆగలేం. అప్పటికీ రోజూ ఫోన్ చేసి అమ్మ, అత్తగారిని అడిగి తెలుసుకుంటున్నప్పటికీ నేను సరైన జాగ్రత్తలు తీసుకుంటున్నానా లేదా అనే సందేహం. పాత తరం వారి అనుభవంతోపాటు కొత్తతరంలో అందుబాటులోకి వచ్చిన సౌకర్యాలను కూడా తెలుసుకోవాలని చేసిన ప్రయత్నంలో సోషల్ మీడియాలో ఇన్ని వేదికలున్నాయని తెలిసింది. ఆ గ్రూప్‌ల అడ్మిన్‌లందరితో మాట్లాడి అన్నింటినీ 'రైజ్ ఏ చైల్డ్' గొడుగు కిందకు తీసుకువచ్చాను. గర్భిణులకు, కొత్త తల్లులకు ఇది ఒక వరంగా మారింది. ఇది మనదేశంలో ఉన్న వాళ్లకే కాదు, విదేశాల్లో ఉన్న మనవాళ్లకు కూడా ఉపయోగపడుతోంది. నిజానికి మనకంటే వాళ్లకే ఎక్కువగా ఉపయోగపడుతోంది. ఎందుకంటే ఐర్లాండ్‌లో ఉన్న ఒక మహిళ అక్కడి వైద్యవిధానాలు, వైద్యుల సూచనను యథాతథంగా పాటించింది. కానీ ఆ పద్ధతులు పాపాయికి సౌకర్యంగా అనిపించడం లేదని తెలిసి 'రైజ్ ఏ చైల్డ్'లో చేరింది. చాలా సంతోషంగా ఉంది. ఇందులో ఒకరు తమ సమస్యను పోస్ట్ చేసిన తర్వాత అలాంటి సమస్యను ఎదుర్కొని బయటపడిన వాళ్లు తాము ఆ సమస్య ఎలా పరిష్కరించుకున్నారో అనుభవపూర్వకంగా తెలియచేస్తారు'' అని వివరించింది రోహిణి. రైజ్ ఏ చైల్డ్ మొత్తానికి కొత్త తల్లులకు పెద్దబాలశిక్ష అయింది.


'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణం
గా ఉన్నత విద్యకు దూరం కాకూడదు.
అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 54

గురువారం 16-5-2024



డిపాజిట్లపై ఎస్‌బీఐ వడ్డీరేట్లు అప్

2023 డిసెంబర్ తర్వాత తొలిసారి వడ్డీరేట్లు పెంచిన బ్యాంకింగ్ దిగ్గజం - 13లో



కేజ్రీవాల్‌కు స్పెషల్ ట్రీట్‌మెంట్ !

సుప్రీంకోర్టు బెయిల్ తీర్పుపై చాలా మంది ఇలాగే భావిస్తున్నారు: అమిత్ షా - 6లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

జూన్ తొలివారంలో రాష్ట్రానికి నైరుతి

- వచ్చే నెల 1న కేరళను తాకనున్న రుతుపవనాలు
- ఆరు రోజుల్లో తెలంగాణకు విస్తరించే అవకాశం
- రాష్ట్రంలో ఈసారి సాధారణం కంటే ఎక్కువగానే వర్షపాతం!

5 లో



సీఏఏ ద్వారా భారత పౌరసత్వ సర్టిఫికెట్ల జారీ

- 14 మంది ముస్లిమేతర కాందిశీకులకు అందించిన కేంద్రం
- ఆన్‌లైన్‌లో వందలాది మందికి డిజిటల్ సంతకాలతో మెయిల్స్

6 లో

మాఫీకి మార్గం చూడండి

ఆగస్టు 15లోగా చేసి తీరాల్సిందే... ఏర్పాట్లు చేయాలన్న సీఎం రేవంత్‌రెడ్డి

నిధుల సమీకరణకు ఉన్న మార్గాలపై అధికారులతో చర్చ

- విధివిధానాలతో కూడిన ప్రణాళికల రూపకల్పనకు ఆదేశం
- భారీగా నిధులిచ్చే బ్యాంకర్లతో సంప్రదింపులు జరపాలని సూచన
- అవసరమైతే కార్పొరేషన్ ఏర్పాటు చేసి సరిపడా రుణాలు సమీకరించాలని స్పష్టీకరణ
- రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లపై మంత్రులతో కలిసి సమీక్ష

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15లోగా రైతు రుణమాఫీ చేసి తీరాల్సిందేనని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, ఆదాయ వ్యయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ ముగిసేలోపు రుణమాఫీకి అవసరమైన నిధులను సమీకరించేందుకు ఉన్న మార్గాలపై చర్చించారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీకి మిగతా 2వ పేజీలో ▶



ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచండి

'ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి. దళారుల జోక్యం లేకుండా చూడాలి. రైతు నుంచి పంటను కొని మిల్లింగ్ చేసి రేషన్ షాపుల్లో సన్న బియ్యం అందించేలా చర్యలు తీసుకోవాలి. వర్షాకాలం ప్రారంభానికి ముందే ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలి. కల్లాల వద్ద రైతులు ఇబ్బంది పడకుండా త్వరగా ధాన్యం కొనాలి. తడిసిన ధాన్యం, తేమ విషయంలో రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి. అక్రమాలకు పాల్పడే రైస్ మిల్లర్లపై ఉక్కు పాదం మోపాలి..' అని సీఎం ఆదేశించారు.



వలిగొండ మండలం ప్రొద్దుటూరులో ధాన్యం కుప్పలు

అన్నదాత ఆగమాగం

- యాదాద్రి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం
- తేమ, తరుగు పేరుతో తప్పని కోతలు

- వివరాలు 5లో

రుణమాఫీకి రూ. 40 వేల కోట్లు!

- నిధుల సర్దుబాటుపై ఆర్థిక శాఖ మల్లగుల్లాలు
- దాదాపు 40 లక్షల మంది రైతుల అసలు, వడ్డీ కలిపితే రూ.40 వేల కోట్లకు పైగా నిధులు అవసరమని అంచనా... ప్రతినెలా రూ.800 కోట్లకుపైనే పక్కన పెట్టాల్సి రావొచ్చని లెక్కలు

3 లో

బడుగులపై బరితెగింపు

వైఎస్సార్‌సీపీ అనుకూల వర్గాలే టార్గెట్.. మహిళలపై పచ్చ మూకల దాష్టీకాలు



- నర్సీపట్నంలో దుశ్శాసన పర్వం..
- ఒంటరి మహిళను జుట్టు పట్టుకొని ఈడ్చి కాళ్లతో తన్నిన అయ్యన్న అనుచరులు
- కృష్ణా జిల్లాలో దమనకాండ... మహిళను ట్రాక్టర్‌తో తొక్కించి చంపడానికి ప్రయత్నించిన టీడీపీ నేత
- మహిళలపై హత్యాయత్నాలు చేస్తున్నా పట్టనట్లు ఈసీ నిర్లిప్తత... గ్రామాలు వీడి దూరంగా తలదాచుకుంటున్న బీసీ, ఎస్సీ, ఎస్టీలు
- చేష్టలుడిగి చూస్తున్న అధికార యంత్రాంగం... ఓట్ల లెక్కింపు దాకా కొనసాగించేలా బాబు పన్నాగం.. ఏపీవ్యాప్తంగా దాడులకు పురిగొల్పుతూ భయానక వాతావరణం
- కౌంటింగ్‌కు వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను దూరంగా ఉంచడమే లక్ష్యం

- 10లో

స్లొవాకియా ప్రధానిపై కాల్పులు

తల, ఛాతీ, పొట్టలో గాయాలు.. పరిస్థితి విషమం... అదుపులో అనుమానితుడు 6 లో

తెలంగాణలో థియేటర్లు బంద్

రెండువారాల పాటు సింగిల్ స్క్రీన్స్ మూసివేత... థియేటర్లకు ప్రేక్షకులు రాకపోవడం వల్లేనన్న ఎగ్జిబిటర్లు 12 లో

సన్నాలకే బోనస్సా?



- 90 శాతం మంది రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారని తెలిసీ వంచిస్తారా?
- సీఎం రేవంత్‌పై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ధ్వజం
- ఎన్నికలకు ముందే దీన్ని ప్రకటించి ఉంటే కాంగ్రెస్‌ను రైతులు తుక్కుతుక్కు చేసేవారని వ్యాఖ్య

ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై నేడు రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపు

- వివరాలు 2లో

క్లుప్తంగా...

బీసీల రిజర్వేషన్లు పెంచాకే స్థానిక ఎన్నికలు జరపాలి

రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య డిమాండ్



కాచిగూడ (హైదరాబాద్): తెలంగాణలో బీసీ కులగణన చేసి పంచాయతీరాజ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ రిజర్వేషన్లు 50 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు,ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. 50 శాతం రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే బీసీలు ఉద్యమిస్తారన్నారు. జూన్ చివరి వారంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతామని సీఎం ప్రకటిస్తున్నారని, అయితే కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో స్థానిక సంస్థల రిజర్వేషన్లు 22 నుంచి 42 శాతానికి పెంచుతామని ప్రకటించిన విషయాన్ని కృష్ణయ్య గుర్తుచేశారు. రాహుల్‌గాంధీ కులగణన జరిపి జనాభా ప్రకారం స్థానిక సంస్థల రిజర్వేషన్లు 50 శాతానికి పెంచుతామని ప్రకటించారన్నారు.

నా గెలుపు ఖాయం

బీజేపీ జహీరాబాద్ అభ్యర్థి పాటిల్



సాక్షి, హైదరాబాద్: జహీరాబాద్‌లో మంచి మెజార్టీతో విజయం సాధిస్తానని బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ ధీమా వ్యక్తం చేశారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ అత్యధిక స్థానాల్లో గెలుపొంది సత్తా చాటనుందన్నారు. ప్రజలంతా కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి రావాలని, మోదీ ప్రధాని కావాలని కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారం, పోలింగ్ సందర్భంగా బీజేపీపై ప్రజల్లో స్పష్టమైన సానుకూలత కనిపించిందన్నారు.

కరెంట్ సరఫరాపై సీఎం శ్వేతపత్రం విడుదల చేయాలి

బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కరెంట్ సరఫరాపై సీఎం రేవంత్‌రెడ్డి శ్వేతపత్రం విడుదల చేయాలని బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం తెలంగాణలో అన్ని రకాల విద్యుత్ ఉత్పత్తి ఎంత? కొనుగోళ్లు, వినియోగంపై సమగ్ర వివరాలు ప్రజల ముందుంచాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో లేని విద్యుత్ కోతలు ఇప్పుడు ఎందుకు వస్తున్నాయో సీఎం చెప్పాలన్నారు. ఇళ్లలో టీవీలు, రిఫ్రిజిరేటర్లు, వ్యవసాయ మోటార్లు, ఏసీలు ఎందుకు కాలిపోతున్నాయో చెప్పాలని నిలదీశారు. విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయని ప్రభుత్వం చిన్నస్థాయి ఉద్యోగులపై చర్యలు తీసుకోవడం అంటే బట్టకాల్చి మీద వేయడమేనన్నారు.

'పట్టభద్రుల ఎమ్మెల్సీ'కి బీజేపీ ఇన్‌చార్జీల నియామకం

సాక్షి, హైదరాబాద్: నల్లగొండ-వరంగల్-ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరగనున్న ఎన్నికకు సంబంధించి చేపట్టాల్సిన కార్యాచరణను బీజేపీ రాష్ట్ర నాయకత్వం సిద్ధం చేసింది. ఈనెల 27న ఈ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నిక జరగనుండగా.. దీనికి సంబంధించి పలువురు పర్యవేక్షకులను కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నియమించారు. ఈ ఎమ్మెల్సీ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, సమన్వయకర్తగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి, సహ సమన్వయ కర్తలుగా కట్టా సుధాకరరెడ్డి, తూటుపల్లి రవికుమార్ నియమితులయ్యారు. మూడు ఉమ్మడి జిల్లాలవారీగా ఇన్‌చార్జులను కూడా నియమించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జులుగా ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పాయల్ శంకర్, ఉమ్మడి నల్లగొండ ఇన్‌చార్జిగా ఎంపీ వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్సీ ఏవీఎస్ రెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జులుగా మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు, మాజీ ఎమ్మెల్సీ కె.జనార్దన్‌రెడ్డిలను నియమించారు.

ఇదం జగత్



అలా చూపించడం బాగోలేదు మేడం!
ఈ చిన్న గరిటె తీసుకోండి!

రైతు సమస్యలు పక్కనపెట్టి రాజకీయాలా?

ధాన్యం కొనుగోలు చేయకుంటే బీఆర్‌ఎస్ రోడ్డెక్కి ధర్నా చేస్తుంది

- కొత్తగా చేస్తున్న అప్పులు ఎవరి జేబుల్లోకి పోతున్నాయో చెప్పాలి
- ఏపీలో జగన్ గెలుస్తారనే సమాచారం ఉంది: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులను విస్మరించిన రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను నెల రోజులుగా పట్టించుకోవడం లేదన్నారు. రైతుల దయనీయ పరిస్థితికి అద్దం పట్టే దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయని చెప్పారు. తెలంగాణభవన్‌లో బుధవారం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలుపై పర్యవేక్షణ లేదని, హమాలీలు, ధాన్యం సంచుల కొరత, తరుగు పేరిట క్వింటాల్‌కు మూడున్నర కిలోల చొప్పున కోత విధించడం వంటి సమస్యలు ఉన్నాయన్నారు. వీటిపై కామారెడ్డి, నిర్మల్, సిరిసిల్ల తదితర జిల్లాల్లో రైతులు ఆందోళనకు దిగుతున్నారని చెప్పారు. రాజకీయాలను పక్కన పెట్టి ఎఫ్‌సీఐ ద్వారా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసేలా చూడాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించని పక్షంలో రైతులకు అండగా రోడ్డెక్కి ఆందోళన చేస్తామన్నారు. రైతాంగం ఆందోళన, ధైర్యం చెడొద్దని, ఆత్మవిశ్వాసంతో ఉండాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. రైతులకు న్యాయం జరిగేంత వరకు వారి తోనే బీఆర్‌ఎస్ పార్టీ నిలబడుతుందన్నారు. రుణ మాఫీ, ధాన్యం కొనుగోలు, బోనస్ వంటి హామీలు అమలయ్యేంత వరకు రైతుల తరఫున బీఆర్‌ఎస్ పోరాడుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

అప్పులపై రేవంత్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

గత ప్రభుత్వం అప్పులు చేసిందంటూ శ్వేతపత్రాల పేరిట చిల్లర రాజకీయం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు కేవలం రూ.3.89లక్షల కోట్లు మాత్రమేనని ఆర్‌బీఐ నివేదిక వెల్లడించిందన్నారు. అప్పులు చేయడం తప్పు అని ప్రచారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఎందుకు అప్పులు చేస్తుందని ప్రశ్నించారు. కొత్తగా చేస్తున్న అప్పులు ఎవరి జేబుల్లోకి పోతున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పులు చేయడానికి అప్పులు చేయడం దివాలాకోరు విధానం అని, దీనిపై ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఏనాడూ విద్యుత్ ఉద్యోగులను పల్లెత్తు మాట అనలేదని, ఉద్యోగులతో తమది పేగుబంధం అని కేటీఆర్ పేర్కొన్నారు.

నయీం లాంటి వ్యక్తికి కాంగ్రెస్ టికెట్

వరంగల్- ఖమ్మం- నల్లగొండ' పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ బ్లాక్‌మెయిలర్, ఎన్నో పార్టీలు మారిన నయీం తరహా వ్యక్తికి టికెట్ ఇచ్చిందన్నారు. ఈ స్థానం నుంచి ఇప్పటివరకు నాలుగు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధించారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలు, ఐదున్నర నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వపాలన చూసి బీఆర్‌ఎస్‌కు మద్దతు పలకాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో జారీ చేసిన నోటిఫికేషన్ల ద్వారా 30 వేల మంది ఉద్యోగులు భర్తీ కాగా, సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి అబద్ధాలతో తన ఖాతాలో వేసుకుంటున్నాడని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ కోసం ప్రశ్నించే గొంతుకగా బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు.

నల్లగొండపైనే కాంగ్రెస్ ఆశలు

ఎంపీ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కేవలం ఒక్క స్థానంలోనే గెలిచే అవకాశముందని కేటీఆర్ అన్నారు. కేవలం నల్లగొండ ఎంపీ స్థానంపైనే కాంగ్రెస్ పార్టీ ఆశలు పెట్టుకుందన్నారు. తెలంగాణభవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే... 'పార్లమెంటు ఎన్నికలు అశావహంగా జరిగినట్టు ఈ రోజు మా ఎంపీ అభ్యర్థులతో జరిగిన భేటీలో చెప్పారు. నేను ప్రత్యేకంగా చేయించిన సర్వేలోనూ బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా సైలెంట్ ఓటింగ్ పడినట్టు తేలింది. కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన ఎంపీ అభ్యర్థులు సరిగ్గా లేరు. సునీతా మహేందర్‌రెడ్డికి మల్కాజిగిరితో ఏమైనా సంబంధం ఉందా. బండి సంజయ్‌ను గెలిపించేందుకు వెలిచాల రాజేందర్‌రావు లాంటి అడ్రస్ లేని వ్యక్తికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చింది. నాగర్‌కర్నూల్‌లో మా అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఏ మాత్రం పోటీ ఇవ్వలేకపోయారు. నాగర్‌కర్నూల్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, కరీంనగర్, ఖమ్మం, మెదక్, చేవెళ్లలో పక్కాగా గెలుస్తున్నాం. పెద్దపల్లి, ఆదిలాబాద్, నిజామాబాద్‌లో బీజేపీతో బీఆర్‌ఎస్‌కు ప్రధానంగా పోటీ ఉంది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు లాభం జరిగే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ మళ్లీ గెలుస్తారని మాకు సమాచారం ఉంది' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

పట్టభద్రుల ఎన్నిక ప్రతిష్టాత్మకం

అన్ని వర్గాల పట్టభద్రులతో ప్రత్యేక భేటీలు

- బూత్ స్థాయిలో ప్రతీ ఓటరును కలుద్దాం.. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులతో సమావేశాలు
- బీఆర్‌ఎస్ ముఖ్యనేతలతో కేటీఆర్ సమావేశం



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో రాకేశ్‌రెడ్డి, అజయ్, సత్యవతి, మధుసూదనాచారి, జగదీశ్‌రెడ్డి, పొన్నాల, బండా ప్రకాశ్, పల్లా, లింగయ్య

సాక్షి, హైదరాబాద్: వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికలో పార్టీ గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పిలుపునిచ్చారు. ఈ నియోజకవర్గం నుంచి వరుసగా నాలుగుమార్లు పార్టీ అభ్యర్థులే విజయం సాధించిన విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ముమ్మర ప్రచారం చేయాలన్నారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ అధ్యక్షతన బుధవారం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు చెందిన బీఆర్‌ఎస్ ముఖ్య నేతలతో కేటీఆర్ భేటీ అయ్యారు. ప్రచారానికి కేవలం పది రోజులే ఉన్నందున సర్వశక్తులొడ్డి పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి వరకు ప్రచారం జరిగేలా సంబంధిత నియోజకవర్గాలకు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు బాధ్యత తీసుకోవాలన్నారు. బూత్‌ల వారీగా ఇన్‌చార్జీలను నియమించి ప్రచారం సమన్వయం చేసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, సింగరేణి-ఆర్టీసీ సంస్థల కార్మికులు, మహిళలు, యువత తదితర వర్గాలను లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులతో సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. అవసరమైన చోట తనతోపాటు హరీశ్‌రావు, ఇతర ముఖ్య నేతలు ప్రచారంలో పాల్గొంటామని చెప్పారు. ముఖ్య నేతల ప్రచారానికి వీలుగా షెడ్యూల్ సిద్ధం చేయాలని, పార్టీ యంత్రాంగాన్ని ప్రచారంలో నిమగ్నమయ్యేలా చూడాలని కేటీఆర్ ఆదేశించారు.

అభ్యర్థి ఎంపికపై అసంతృప్తి!

ఈ సమావేశానికి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు హాజరయ్యారు. ఈ భేటీలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, పువ్వాడ అజయ్, సత్యవతి రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ మూడు జిల్లాల పరిధిలో మొత్తం 33 మంది ఎమ్మెల్యేలు ఉండగా బీఆర్‌ఎస్‌కు నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావు, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరగా, నల్లగొండ నుంచి జగదీశ్‌రెడ్డి, వరంగల్ నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాత్రమే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. సుమారు 130 మంది నేతలకు ఆహ్వానం పంపగా, 60 మంది మాత్రమే హాజరైనట్లు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీలు రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బసవరాజు సారయ్య, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు వాసుదేవరెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లు, యాదవరెడ్డి తదితరులు ఈ భేటీకి హాజరు కాలేదు. ఖమ్మం నుంచి మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకట వీరయ్య, ఉపేందర్‌రెడ్డి తదితరులు కూడా రాలేదు. అభ్యర్థి ఎంపికపై ఉన్న అసంతృప్తి వల్లే పలువురు సమావేశానికి దూరంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

కేటీఆర్‌తో ఎంపీ అభ్యర్థుల భేటీ

రెండు రోజులుగా పార్టీ అధినేత కేసీఆర్‌ను కలిసిన పలువురు బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులు బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా లోక్‌సభ నియోజకవర్గాల వారీగా పోలింగ్ సరళిపై చర్చించారు. మెజారిటీ స్థానాల్లో త్రిముఖ పోటీ బీఆర్‌ఎస్‌కు అనుకూలిస్తుందని సర్వేలు వెల్లడిస్తున్నాయని కేటీఆర్ చెప్పారు. ఈ సందర్భంగా ఫలితాల తర్వాత జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో చోటుచేసుకునే పరిణామాలపైనా చర్చించారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో నామా నాగేశ్వర్‌రావు, మాలోత్ కవిత, డాక్టర్ సుధీర్‌కుమార్, క్యామ మల్లేశ్, కంచర్ల కృష్ణారెడ్డి, పద్మారావు గౌడ్, కొప్పుల ఈశ్వర్, గడ్డం శ్రీనివాస్ యాదవ్, గాలి అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

విభజన వివాదాలపై సీఎం దృష్టి

18న కేబినెట్ భేటీ.. ఆ సమావేశంలో చర్చకు నిర్ణయం

- జూన్ 2తో తెలంగాణ ఏర్పడి పదేళ్లు
- మంత్రులు, అధికారులతో సీఎం సమావేశం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి జూన్ 2తో పదేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో రాష్ట్ర పునర్విభజనకు సంబంధించి ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించారు. రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయంతో పరిష్కరించుకున్న అంశాలతో పాటు అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల విభజన, ఆస్తులు, అప్పుల బట్వాడాకి సంబంధించిన అంశాలన్నింటిపై నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 18న రాష్ట్ర కేబినెట్ సమావేశం నిర్వహించి రాష్ట్ర పునర్విభజన చట్టంలోని పెండింగ్ అంశాలు, ఏపీతో పీటముడిగా ఉన్న అంశాలపై చర్చించనున్నారు. రైతుల రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, వచ్చే ఖరీఫ్ పంటల ప్రణాళికపై కూడా చర్చించనున్నారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగియటంతో సీఎం ప్రజా పాలనపై దృష్టి కేంద్రీకరించారు. బుధవారం సచివాలయంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు.

తదుపరి కార్యాచరణపై చర్చ

పునర్విభజన చట్టంలోని షెడ్యూల్ 9, షెడ్యూల్ 10లో పొందుపరిచిన ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్ల విభజన విషయంలో రెండు రాష్ట్రాల మధ్య పీటముడి ఏర్పడింది. విద్యుత్ సంస్థల బకాయిలు ఇంకా తేలలేదు. ఈ నేపథ్యంలో విభజన సమస్యల పరిష్కారానికి ఇప్పటివరకు చేసిన ప్రయత్నాలను అధికారులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. తదుపరిగా చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. రెండు రాష్ట్రాలు సామరస్యంగా పరిష్కరించుకునేందుకు వీలున్న ఉద్యోగుల విభజన వంటి అంశాలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. రెండు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదిరిన వాటిని పరిష్కరించుకోవాలని, పీటముడి పడిన అంశాలపై తెలంగాణ ప్రయోజనాలను కాపాడేలా తదుపరి కార్యాచరణ చేపట్టాలని కోరారు.

భవనాల స్వాధీనానికి ఆదేశం

పదేళ్లు పూర్తి కానుండడంతో పునర్విభజన చట్టం ప్రకారం ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ కేవలం తెలంగాణ రాష్ట్ర రాజధానిగా మారనుంది. కాగా ఈ పదేళ్ల కాలానికి ఏపీకి కేటాయించిన లేక్‌వ్యూ గెస్ట్ హౌస్ లాంటి భవనాలను జూన్ 2 తర్వాత రాష్ట్ర అధీనంలోకి తీసుకోవాలని అధికారులను రేవంత్ ఆదేశించారు. మరోవైపు రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు సాఫీగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఇక ఉత్తరాదిలో ప్రచారం చేద్దాం!

మిగిలిన మూడు దశల ఎన్నికల ప్రచారానికి కదిలిన బీజేపీ రాష్ట్ర ముఖ్యనేతలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీ నేతలు 'చలో ఉత్తరాది' అంటున్నారు. ఇప్పటికే నాలుగు విడతల పార్లమెంట్ ఎన్నికలు ముగియగా, దేశవ్యాప్తంగా మరో మూడు విడతల్లో ఎన్నికలు జరగాల్సి ఉన్న విషయం తెలిసిందే. ఈ నెల 13న తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగియడంతో...చివరి మూడు విడతల ఎన్నికలు జరగనున్న ప్రాంతాల్లో రాష్ట్ర నాయకులు ప్రచారం చేయనున్నారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు డా.కె.లక్ష్మణ్, బీజేపీ జాతీయ ప్రధాన కార్య దర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ఇతర నేతలు ఇప్పటి కే యూపీ, ఢిల్లీ తదితర రాష్ట్రాలకు చేరుకున్నా రు. బీజేపీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ స్వరాష్ట్రం యూపీ కావడంతో ఆయనకు ఆజంగఢ్‌లోని నాలుగు ఎంపీ సీట్లకు పార్టీ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించినట్టు పార్టీవర్గాల సమాచారం. ప్రధాని మోదీ పోటీచేస్తున్న వారణాసిలో తెలుగు రాష్ట్రాలకు చెందినవారు, తెలుగు మాట్లాడే వారు ఉన్న చోట్లలో రాష్ట్రనాయకులు ప్రచారం చేయనున్నట్టు తెలుస్తోంది. తెలంగాణకు సరిహద్దులో మహారాష్ట్రకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో ఎమ్మెల్యే రాజాసింగ్, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్‌లకు అక్కడి ప్రజల్లో ఆదరణ ఉండటంతో వారక్కడ ప్రచారాన్ని నిర్వహించనున్నట్టు తెలుస్తోంది.

సన్న వడ్లకే బోనస్సా?

- ఇది రైతాంగాన్ని మరోసారి మోసం చేయడమే
- సీఎం రేవంత్‌పై కేసీఆర్ ఫైర్
- ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై నేడు రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై గురువారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. రైతాంగాన్ని ప్రభుత్వం మరోసారి మోసం చేస్తోందని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కేసీఆర్ మండిపడ్డారు. 'పార్లమెంటు ఎన్నికలు ముగిసిన మరుసటి రోజే వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తానని ప్రకటించిన సీఎం ఇప్పుడు సన్న వడ్లకు మాత్రమే వర్తింప చేస్తామనడం రైతాంగాన్ని మరోసారి వంచించి మోసం చేయడం, దగా చేయడమే..' అని దుయ్యబట్టారు.

ఎన్నికలకు ముందైతే తుక్కుతుక్కు చేసేవాళ్లు

'రాష్ట్రంలో 90 శాతం రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారనే విషయం తెలిసీ సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం వంచించడమే. ఓట్లు డబ్బాల్లో పడగానే కాంగ్రెస్‌కు రైతుల అవసరం తీరింది. సన్న వడ్లకు మాత్రమే బోనస్ అని ఎన్నికలకు ముందు ప్రకటించి ఉంటే కాంగ్రెస్ పార్టీని రైతులు తుక్కుతుక్కు చేసేవాళ్లు. రైతాంగ హక్కులను కాపాడేందుకు, ప్రభుత్వ హామీలను సాధించేందుకే బీఆర్‌ఎస్ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపడుతోంది..' అని కేసీఆర్ స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు రైతుల పక్షాన నిలబడి కొట్లాడాలని పిలుపునిచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో వడ్లను కొనడంపై కూడా నిర్లక్ష్యం వహిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతోందని మాజీ సీఎం విమర్శించారు. రాష్ట్ర రైతాంగానికి భరోసా కల్పించే దిశగా పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమాలు, కల్లాల సందర్శన చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

రిజర్వేషన్లు ఎత్తేసే శక్తి ఎవరికీ లేదు

- అంబేడ్కర్ అనుకున్నా ఇవాళ దేశం నుంచి రిజర్వేషన్లు తొలగించలేరు
- రేవంత్ దుష్ప్రచారం చేసినా ప్రజలు మమ్మల్నే విశ్వసించారు
- బీజేపీ ఓట్లను తొలగించడంపై ఈసీకి ఫిర్యాదు చేస్తాం
- బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ నుంచి బీజేపీకి బ్రహ్మాండమైన ఫలితాలు రాబోతున్నాయని... అందరినీ ఆశ్చర్యపరిచేలా కమల వికాసం ఖాయమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దుష్ప్రచారం చేసినప్పటికీ.. ప్రజలు తమపై విశ్వాసం ఉంచారని అన్నారు. రిజర్వేషన్లు ఎత్తేసే శక్తి ఎవరికీ లేదని స్పష్టం చేశారు. కిషన్‌రెడ్డి బుధవారం ఢిల్లీలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణలో ఎవరు గెలిచినా.. తామే కీలకం అన్నట్లు మజ్లిస్ వ్యవహరించిన తీరు సైతం ఎన్నికల్లో బీజేపీకి అనుకూలంగా మారిందన్నారు. అంతేగాక రాజ్యాంగం, రిజర్వేషన్లపై కాంగ్రెస్, బీఆర్‌ఎస్ దుష్ప్రచారం చేస్తే.. ప్రజలు నవ్వు కున్నారని... అంబేడ్కర్ అనుకున్నా ఇవాళ దేశం నుంచి రిజర్వేషన్లు తొలగించలేరని ప్రధాని మోదీ చెప్పిన విషయాన్ని కిషన్‌రెడ్డి గుర్తు చేశారు. రిజర్వే షన్ల పరిధిలోకి వచ్చే వర్గాలన్నీ బీజేపీకి ఓటేశాయ నేది తాజా పరిణామాలతో అర్థమైందని చెప్పారు.

రాష్ట్ర రాజకీయ చరిత్రలో నూతన అధ్యాయం

రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఇన్ని నెలలు గడు స్తున్నా ఇంతవరకు పాలన మొదలు పెట్టనే లేదని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. కానీ.. రేవంత్ పార్లమెంటు ఎన్నికలు తన పాలనకు రెఫరెండం అని చెప్పుకున్నారన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ అస్తిత్వం కోల్పోనుందని చెప్పారు. ఈ ఎన్నికల తర్వాత రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఓ నూతన అధ్యాయం ప్రారంభం కానుందని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు బీజేపీనే సరైన ప్రత్యామ్నాయంగా అవతరించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో ఆర్థిక సంక్షోభం ఏర్పడే పరిస్థితులున్నాయని.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు తెలంగాణ భవిష్యత్తు గురించి ఆలోచించకుండా అనవసర ఖర్చులు పెద్ద ఎత్తున చేశాయని మండిపడ్డారు. హామీల అమలుకు ఆర్థిక వనరుల సమీకరణ ఎలా చేయబోతున్నారో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచా రంలో భాగంగా హైదరాబాద్ వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ కొత్త హామీలిచ్చి పాత హామీల గురించి మాట్లాడటం మరిచిపోయారని విమర్శించారు. చాలాచోట్ల కావాలనే బీజేపీ ఓట్లను తొలగించడంపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయబోతున్నామని కిషన్‌రెడ్డి చెప్పారు. వీటితోపాటు రిగ్గింగ్ జరిగిన బూత్‌ల వివరాలు సేకరిస్తున్నామని... అక్కడ రీపోలింగ్‌కు డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

కుట్రలు మాని పాలనపై దృష్టి పెట్టండి

విద్యుత్‌రంగ వైఫల్యాలకు సీఎం రేవంత్‌దే బాధ్యత: మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: కరెంటు కోతల విషయంలో ప్రభుత్వం తన వైఫల్యాలను అంగీకరించకుండా ప్రతిపక్షాలు, విద్యుత్ ఉద్యోగుల మీద అభాండాలు మోపడం సరికాదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఈ విషయంలో తెలంగాణ ఉద్యోగులపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఆయన సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ రంగం వైఫల్యాలకు హరీశ్‌రావు బాధ్యుడు అన్నట్లుగా రేవంత్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. తనలాగే అందరూ కుట్రలు కుతంత్రాలకు పాల్పడతారనే భ్రమల్లో సీఎం ఉన్నారని ఎద్దేవా చేశారు. కుట్రలు మానుకుని సీఎం రేవంత్ రెడ్డి పాలనపై దృష్టి పెడితే బాగుంటుందని హరీశ్‌రావు సూచించారు. 24 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ ఉద్యోగుల సహకారంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పటిష్టమైన వ్యవస్థను నిర్మించిందన్నారు. రెప్పపాటు సమయం కూడా కరెంటు కోతలు లేని రాష్ట్రంగా తాము తెలంగాణను తీర్చిదిద్దామన్నారు. రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే విద్యుత్ వ్యవస్థను కుప్పకూల్చిందన్నారు. గృహ, వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలకు సరిపోయే విద్యుత్‌ను సరఫరా చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. తెలంగాణ ఉద్యమంలో, రాష్ట్ర పునర్నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన విద్యుత్ ఉద్యోగులను చీటికీమాటికీ నిందించడం, చర్యలు తీసుకోవడం వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. కరెంటు కోతలను ఎలా సరిదిద్దాలనే చిత్తశుద్ధి ముఖ్యమంత్రికి లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఇతరులపై నిందలు మోపే కుట్రలు, చిల్లర చేష్టలు మానుకుని సమస్యను పరిష్కరించాలని హితవు పలికారు.

బహదూర్‌పురలో రిగ్గింగ్ తప్పుడు ప్రచారం

ఖండించిన సీఈఓ వికాస్‌రాజ్.. రెండేళ్ల పాత వీడియో అని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలోని బహదూర్‌పుర అసెంబ్లీ నియోజకవర్గంలో సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఓ పోలింగ్ కేంద్రంలో రిగ్గింగ్ జరిగిందని ఆరోపిస్తూ కొందరు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్న వీడియోలో వాస్తవం లేదని సీఈఓ వికాస్‌రాజ్ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. తెలంగాణలో జరిగిన లోక్‌సభ, ఇతర ఎన్నికలతో ఆ వీడియోకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టంచేశారు. పశ్చిమబెంగాల్‌లో 2022, ఫిబ్రవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఓ పోలింగ్ బూత్‌లో రిగ్గింగ్ జరుగుతుండగా రికార్డు చేసిన వీడియోను తెలంగాణలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని వివరణ ఇచ్చారు. 2022, ఫిబ్రవరిలోనే ఈ వీడియోను యూట్యూబ్‌లో టీవీ-9 బంగ్లా చానల్ షేర్ చేసిందని తెలిపారు. యూట్యూబ్ వీడియో లింక్‌ను ఆయన ప్రకటనలో పొందుపరిచారు. పోలింగ్ బూత్‌లోకి ఓటేసేందుకు వచ్చిన ఓటర్లకు బదులుగా ఓ వ్యక్తి ఈవీఎం కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్లి ఓటేస్తున్నట్లు ఈ వీడియోలో ఉంది.

మాఫీకి మార్గం చూడండి

▶ మొదటి పేజీ తరువాయి

సంబంధించిన విధివిధానాలతో ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. బుధవారం సచివాలయంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, తన సలహాదారు వేం నరేందర్ రెడ్డితో కలిసి రైతు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లపై సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేయండి

'రైతుల సంక్షేమానికి అవసరమైతే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణమాఫీకి సరిపడా నిధులను సర్దుబాటు చేయాలి. రైతులను రుణ విముక్తులను చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నందున, నిర్ణీత గడువులోగా నిధులను సమీకరించే ప్రయత్నాలు పూర్తి చేయాలి. భారీ మొత్తంలో నిధులు ఇచ్చేందుకు ముందుకు వచ్చే బ్యాంకర్లతో సంప్రదింపులు జరపాలి. రైతు రుణమాఫీకి సంబంధించి మహారాష్ట్ర, రాజస్తాన్, ఇతర రాష్ట్రాల్లో అనుసరించిన విధానాలను అధ్యయనం చేయాలి..' అని రేవంత్ ఆదేశించారు.

రుణమాఫీకి రూ.40 వేల కోట్లు!

నిధుల సర్దుబాటుపై ఆర్థిక శాఖ మల్లగుల్లాలు ● దాదాపు 40 లక్షల మంది రైతుల బకాయిలుంటాయన్న అధికారులు

- ఆగస్టు 15లోగా ఎట్టి పరిస్థితుల్లోనూ రుణమాఫీ చేస్తామన్న సీఎం
- అసలు, వడ్డీ కలిపితే రూ.40 వేల కోట్లకు పైగా అవసరం



సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీకి నిధుల సర్దుబాటు అంశం ఆర్థిక శాఖను కలవరానికి గురి చేస్తోంది. బహిరంగ మార్కెట్లో తీసుకునే అప్పులు, కేంద్ర గ్రాంట్లు, రాష్ట్రానికి వచ్చే నెలసరి ఆదాయం మొత్తం.. రెవెన్యూ వ్యయం, ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్లు, సంక్షేమ కార్యక్రమాలు, గతంలో చేసిన అప్పులకు అసలు, వడ్డీ చెల్లింపులకే సరిపోతుంటే.. రుణమాఫీకి నిధులు ఎలా సర్దుబాటు చేయాలన్న దానిపై ఆర్థిక శాఖ మల్లగుల్లాలు పడుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు 15వ తేదీలోగా ఎట్టి పరిస్థితుల్లోనూ రుణమాఫీ అమలు చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో నిధుల వేటలో తలమునకలైంది. రైతు రుణాలు అసలు, వడ్డీ కలుపుకొని దాదాపు రూ.40 వేల కోట్లు ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

సంక్షేమం, గృహ నిర్మాణం ఎలా?

ఎన్నికల సమయంలో గరిష్టంగా రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకుంటున్న రైతు సంక్షేమ మండలి (ఎఫ్‌డబ్ల్యూసీ)కి రైతు రుణాలన్నింటినీ బదలాయించి, రైతుల పాస్ పుస్తకాలను విడిపించి వారికి అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశంగా చెబుతున్నారు. అయితే కార్పొరేషన్‌కు రుణ మొత్తాన్ని బదలాయించినా..ఆ మొత్తం 'ఆర్థిక జవాబుదారీ బడ్జెట్ నిర్వహణ' (ఎఫ్ఆర్‌బీఎం) పరిధిలోకే వస్తుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోనే రుణం తీసుకుంటామని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నా.. ఈ ఒక్క పథకానికే భారీ మొత్తంలో నిధులు తీసుకుంటే, మిగిలిన సంక్షేమ పథకాలు, గృహ నిర్మాణం తదితర పథకాలకు నిధులెలా అన్న ఆందోళన వ్యక్తం అవుతోంది.

ఎన్నికల వేళ అప్పుల మోత

ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త అప్పుల మోత మోగించింది. ఏప్రిల్, మే నెలల్లో ఇప్పటికే రూ.6 వేల కోట్ల రుణాలను బహిరంగ మార్కెట్ నుంచి సేకరించింది. ఆర్‌బీఐ ద్వారా సెక్యూరిటీలను వేలం వేసి ఈ మొత్తాన్ని తీసుకుంది. ఏప్రిల్ నెలలో రెండు దఫాల్లో రూ.2 వేల కోట్లు తీసుకోగా, మే నెలలో రెండు దఫాల్లో రూ.4 వేల కోట్లను సేకరించింది. ఏప్రిల్ 23న రూ.1,000 కోట్లు, అదే నెల రెండో తేదీన రూ.1,000 కోట్లు, మే 7వ తేదీన రూ.3 వేల కోట్లు, మే 14న మరో రూ.1,000 కోట్లు తీసుకుంది. ఈ మొత్తాన్ని 12 నుంచి 28 ఏళ్ల కాలవ్యవధిలో చెల్లించనుంది.

అప్పు చెల్లించడానికి అప్పు కుదురుతుందా?

దాదాపు 40 లక్షల మంది రైతుల బకాయిలకు సంబంధించి ఐదేళ్ల కాలంలో బ్యాంకులకు వడ్డీ, అసలు కలుపుకొని రూ.40 వేల కోట్ల వరకు అవుతుందని అంచనా. కాగా ఇప్పటికే దాదాపు ఆరు నెలలు గడిచిపోయాయి. ఒకవేళ ఆర్బీఐ, ఆర్థిక సంస్థలు అంగీకరించినా.. రుణమాఫీ కింద ప్రతినెలా చెల్లించేందుకు రూ.800 కోట్లకు పైగానే కచ్చితంగా పక్కన పెట్టాల్సి వస్తుందని అంటున్నారు. ఇప్పటికే అనివార్య ఖర్చుల భారం పెరిగి ఇతర కార్యక్రమాలకు నిధులు సర్దుబాటు కావడం లేదని, ఇప్పుడు కొత్తగా చేరే రుణమాఫీ పద్దు ఖజానాకు భారమేనని ఆర్థిక శాఖ వర్గాలంటున్నాయి. మరోవైపు అప్పు చెల్లించడం కోసం తిరిగి అప్పు చేయడానికి ఆర్థిక సంస్థలు ఎంతవరకు అంగీకరిస్తాయన్నది అనుమానమేనని ఆర్థిక నిపుణులు అంటున్నారు. ఇక మహాలక్ష్మి, ఉద్యోగుల పీఆర్సీ, ఇతర పథకాలు దశల వారీగా అమలు చేసినా.. వాటికి కూడా నిధులు సమకూర్చుకోవాల్సిన అవసరం ఉంటుందని చెబుతున్నారు. అయితే రైతు రుణమాఫీకి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అధికారవర్గాలు అందుకు ఉన్న మార్గాలను అన్వేషించే పనిలో పడ్డాయి.

తొలి మూడు నెలల్లో రూ.11 వేల కోట్లు

ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.59 వేల కోట్ల మేర అప్పులు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్ ప్రణాళికల్లో ప్రతిపాదించింది. ఈ మేరకు ఆర్‌బీఐ ద్వారా తొలి త్రైమాసికంలో (ఏప్రిల్, మే, జూన్) రూ.11 వేల కోట్లను రుణాల రూపంలో సేకరించాలని నిర్ణయించింది. ఆ మొత్తంలో ఇప్పటికే రూ.6 వేల కోట్లు పూర్తి కాగా, మే నెలలోనే మరో రూ.2 వేల కోట్ల రుణ సేకరణ ఆర్‌బీఐ వద్ద షెడ్యూల్ అయి ఉంది. జూన్‌లో మరో రూ.3వేల కోట్లను తీసుకోనుంది. మొత్తం మీద ఆర్‌బీఐకి ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఈ మూడు నెలల్లో రూ.11 వేల కోట్ల రుణాలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోనుంది.

సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ ఇవ్వాలి

- పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలి
- సీఎస్ శాంతికుమారికి టీజీఓ నేతల వినతి



సాక్షి, హైదరాబాద్: వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న సీపీఎస్ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏలూరి శ్రీనివాసరావు, ఎ.సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం టీజీఓ ప్రతినిధి బృందంతో కలసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్లతో సహా ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఎంప్లాయిస్ హెల్త్ స్కీం అమలు చేయాలన్నారు. అదేవిధంగా కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, మే నెలలో పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చేలా ఎన్నికల కమిషన్ నుంచి ప్రత్యేక అనుమతి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బదిలీల జీవోను ఎత్తివేయాలని, ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి కేటాయించిన 144 మంది ఉద్యోగులను తిరిగి తెలంగాణకు కేటాయించే విధంగా ఎన్నికల సంఘం అనుమతి తీసుకోవాలన్నారు. ఉద్యోగులకు సంబంధించి గోపన్‌పల్లిలోని 101 ఎకరాల భూమి సమస్యను పరిష్కరించాలని, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఉద్యోగులకు 24 శాతం హెచ్‌ఆర్ఏ వర్తింప చేయాలని అన్నారు. మధ్యంతర భృతిని 5 శాతం నుంచి 20 శాతానికి పెంచాలని కోరారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. సీఎస్‌ను కలసిన వారిలో టీజీఓ అసోసియేట్ ప్రెసిడెంట్ శ్యామ్, జాయింట్ సెక్రెటరీ పరమేశ్వర్ రెడ్డి, నేతలు ఎంవీ రమణ, కిషన్, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

మ్యూల్ ఖాతాల ముఠాలో మరొకరి అరెస్టు

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరస్తులకు మ్యూల్ బ్యాంక్ ఖాతాలు (ఒకరి వివరాలతో ఉన్న బ్యాంకు ఖాతాను వేరొకరు వినియోగించడం) చేరవేస్తున్న ముఠాలో కీలక సభ్యుడిని తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు బుధవారం అరెస్ట్ చేశారు. నిందితు నుంచి రెండు ల్యాప్‌టాప్‌లు, ఏడు మొబైల్ ఫోన్లు, ఏడు సిమ్ కార్డులు, 10 బ్యాంకు పాస్‌పుస్తకాలు, 19 డెబిట్ కార్డులను స్వాధీనం చేసుకున్నట్టు టీఎస్ సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగులకు అలవాటు పడిన ఖమ్మం జిల్లాకు చెందిన కె.కేశవ రెడ్డి అలియాస్ మహా.. బెంగళూరులో నివాసం ఉండేవాడు. ఈయన ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పోగొట్టుకున్న డబ్బులు తిరిగి సంపాదించేందుకు ఆన్‌లైన్ తనకు పరిచయమైన వారికి మ్యూల్ బ్యాంకు ఖాతాలు సమకూర్చడం మొదలు పెట్టాడు. ఇలా ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పరిచయమైన ప్రణయ్ షిండేతోపాటు మరికొందరితో కలిసి మ్యూల్ ఖాతాలు తెరవడం ప్రారంభించాడు. మ్యూల్ ఖాతాలో జరిగే ప్రతి నగదు లావాదేవీపై 30 శాతం కమీషన్ ఇస్తామని మహాకు షిండే హామీ ఇచ్చాడు. భైంసాలోని ఎంపిక చేసిన గ్రామాల్ని కేంద్రంగా చేసుకుని.. మహా 125 మ్యూల్ బ్యాంకు ఖాతాలు తెరిపించాడు. ఖాతా తెరిచి ఇచ్చిన వారికి రూ.500 ఇచ్చేవాడు. ఖాతా వివరాల్ని షిండే మనుషులకు చేరవేసేవాడు. ఇలా ఈ గ్యాంగ్ వ్యవహారాన్ని పసిగట్టిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఈ ముఠాలోని షిండేతో సహా మరికొందరిని ఇటీవలే అరెస్ట్ చేశారు. దర్యాప్తులో భాగంగా తాజాగా మహా అలియాస్ కేశవ్ రెడ్డిని అరెస్టు చేసినట్టు అధికారులు వెల్లడించారు.

క్లుప్తంగా...

పట్టభద్రుల పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన



నల్లగొండ: 'నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. నామినేషన్ల ఉపసంహరణల అనంతరం పోటీలో 52 మంది అభ్యర్థులు ఉన్నారు' అని ఎన్నికల అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ హరిచందన తెలిపారు. బుధవారం నల్లగొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో మొత్తం 4,63,839 మంది పట్టభద్రులు ఓటు నమోదు చేసుకున్నారని, వారి కోసం 5 లక్షల బ్యాలెట్ పేపర్లను ముద్రిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి మూడు జిల్లాల పరిధిలోని కొత్తగా ఏర్పడిన 12 జిల్లాల్లో ఆర్డీవోలందరినీ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్‌వోలు)గా నియమించామన్నారు. మొత్తం 37 మంది ఏఆర్‌వోలు ఉన్నారని చెప్పారు. ఉమ్మడి మూడు జిల్లాల పరిధిలో 605 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ ఎన్నికలు బ్యాలెట్ పద్ధతిలో జరుగనున్నాయని, పోటీలో 52 మంది అభ్యర్థులు ఉన్నందున బ్యాలెట్ పేపర్ సైజ్ పెద్దగా ఉండబోతుందని, దాంతో ఎన్నికల్లో జంబో బ్యాలెట్ బాక్సులను వాడుతున్నామని పేర్కొన్నారు. ఈ నెల 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు పోలింగ్ జరుగుతుందని, పోలింగ్ అనంతరం జూన్ 5న నల్లగొండలోనే కౌంటింగ్ జరుగుతుందని వెల్లడించారు.

గ్రామీణ టీచర్లకు ప్రత్యేక అలవెన్సు ఇవ్వాలి

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రత్యేక అలవెన్స్‌లు ఇవ్వాలని తెలంగాణ నాన్‌స్పౌజ్ టీచర్ అసోసియేషన్(టీఎన్ఎస్‌టీఏ) కోరింది. ఈ మేరకు బుధవారం రెండో పీఆర్సీ చైర్మన్ శివశంకర్‌ను బీఆర్‌కేఆర్ భవన్‌లో టీఎన్ఎస్‌టీఏ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వెంకట్‌రెడ్డి, సక్కుబాయి, కోశాధికారి దేవరుషి, కృష్ణకుమారి తదితరులు కలిసి వినతి పత్రం సమర్పించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో హెచ్‌ఆర్ఏ వ్యత్యాసాన్ని సరిచేయాలని, ఫిట్‌మెంట్ 40% ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

పీఆర్సీ కమిటీని కలిసిన టీఎన్ఎస్‌టీఏ రాష్ట్ర కార్యవర్గం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నాన్ స్పౌజ్ టీచర్స్ అసోసియేషన్ (టీఎన్ఎస్‌టీఏ) ప్రతినిధి బృందం బుధవారం పీఆర్సీ కమిటీ చైర్మన్ ఎన్.శివశంకర్‌ను కలిసి ఉద్యోగుల సమస్యలను వివరించింది. ప్రస్తుత పరిస్థితుల కు అనుగుణంగా వేతన సవరణ సిఫార్సులు చేయాలని కోరింది. కార్యక్రమంలో టీఎన్ఎస్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.సక్కుబాయి, ఉపాధ్యక్షుడు కృష్ణకుమారి, రూపారాణి, సలహాదారు పద్మారెడ్డి తదితరులున్నారు.

'ఇగ్నో' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో జూలై-2024 నుంచి ప్రారంభమయ్యే విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇగ్నో విజయవాడ ప్రాంతీయ కేంద్రం సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ డీఆర్ శర్మ తెలిపారు. పోస్టు గ్రాడ్యుయేషన్, డిగ్రీ, డిగ్రీ ఆనర్స్, పీజీ డిప్లొమో, డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం జూన్ 30 ఆఖరు తేదీగా ప్రకటించినట్లు తెలిపారు. పీజీ రెండో సంవత్సరం, డిగ్రీ రెండు, మూడు సంవత్సరాలు, సెమిస్టర్ విధానంలో చదివే విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజులను ఆన్‌లైన్ ద్వారా జూన్ 30 లోపు చెల్లించాలని సూచించారు. వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్‌ను గాని లేదా విజయవాడ కొత్తపేట లోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలో ఉన్న ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా గాని లేదా 0866-2565253 నంబర్‌లో సంప్రదించాలి.

18 నుంచి సీపీగెట్‌కు దరఖాస్తుల స్వీకరణ

నోటిఫికేషన్ విడుదల..
జూలై 5న ఎంట్రన్స్ పరీక్ష

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో (పీజీ) ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష (కామన్ పోస్టు-గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్-సీపీగెట్-2024) నోటిఫికేషన్ విడుదలైంది. బుధవారం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం నోటిఫికేషన్ విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు యూనివర్సిటీల పరిధిలో 294 పీజీ కాలేజీలున్నాయి. వీటిల్లో పీజీ కోర్సులతో పాటు, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ పీజీకి సంబంధించిన 54 కోర్సులున్నాయి. వీటిల్లో 47,211 పోస్టు గ్రాడ్యుయేట్ సీట్లున్నాయి. వీటిని సీపీగెట్ ద్వారా భర్తీ చేస్తారు. సీపీగెట్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఈనెల 18 నుంచి మొదలవుతుంది. జూలై 5 నుంచి కంప్యూటర్ బేస్డ్ మోడ్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. ఈ ఎంట్రన్స్ ద్వారా ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు, జేఎన్టీయూహెచ్, తెలంగాణ మహిళా వర్సిటీల్లో పీజీ కోర్సుల్లోని సీట్లను భర్తీచేస్తారు. ఏటా పీజీ కాలేజీల్లో సగానికిపైగా సీట్లు భర్తీ కావడం లేదు. గతేడాది కేవలం 43.46 శాతం సీట్లు మాత్రమే నిండినట్లు అధికార వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో మొత్తంగా 47,211 సీట్లుంటే నిరుడు కేవలం 20,519 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. 73 శాతం మహిళలే పీజీ కోర్సుల్లో చేరారు. మహిళలు 15,107 మంది చేరగా, పురుషులు 5,412 మంది మాత్రమే పీజీ కోర్సుల్లో చేరారు. ఈ సారి 10 శాతం సీట్లు నిండని కాలేజీలను బ్లాక్ చేసే ఆలోచనలో అధికారులున్నారు. ఈ ఏడాది విద్యార్థుల నుంచి స్పందన అంతంతమాత్రంగానే ఉండే అవకాశాలున్నాయి. దరఖాస్తులు సహా పూర్తి వివరాల కోసం www.osmania.ac.in, www.ouadmissions.com, www.c pget.tsche.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్.లింబాద్రి, వైస్‌చైర్మన్ వెంకటరమణ, కార్యదర్శి శ్రీరాం వెంకటేష్, పలు వర్సిటీల వీసీలు రవీందర్, గోపాల్‌రెడ్డి, మల్లేశ్, విద్యుల్లత, సీపీగెట్ కన్వీనర్ పాండురంగారెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీపీగెట్	షెడ్యూల్
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం	18-05-24
రిజిస్ట్రేషన్‌కు తుది గడువు	17-06-24
రూ.500 ఆలస్య రుసుముతో గడువు	25-06-24
రూ.2 వేల ఆలస్య రుసుముతో గడువు	30-06-24
ప్రవేశ పరీక్షలు	5-07-24

వర్సిటీలకు నెలాఖరులోగా కొత్త వీసీలు

- సెర్చ్ కమిటీలను నియమించిన ప్రభుత్వం
- గవర్నర్‌కు ప్రతిపాదనలు పంపనున్న కమిటీ
- వీసీ పోస్టులకు భారీగా దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాలకు కొత్త ఉప కులపతులను నియమించే ప్రక్రియ ఊపందుకుంది. వీలైనంత త్వరగా నియామక ప్రక్రియను పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. వీసీల నియామకాన్ని చేపట్టే అత్యంత కీలకమైన సెర్చ్ కమిటీలను కూడా నియమించినట్లు అధికారులు చెప్పారు. ఒక్కో వర్సిటీకి ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈమేరకు విద్యాశాఖ బుధవారం వేర్వేరు జీవోలను జారీచేసింది. యూనివర్సిటీల పాలకమండలి నామినీ, ప్రభుత్వ నామినీ, యూజీసీ నామినీలతో సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసింది. మూడు, నాలుగు రోజుల్లోనే ఈ సెర్చ్ కమిటీలు సమావేశం కానున్నాయి. ఒక్కో వర్సిటీ వీసీ పోస్టుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ముగ్గురు ప్రొఫెసర్ల పేర్లను ఈ కమిటీ గవర్నర్‌కు పంపిస్తుంది. అయితే రెండు పర్యాయాలు వీసీలుగా పనిచేసిన వారిని, 70 ఏళ్లు నిండిన వారిని వీసీలుగా నియమించొద్దని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. యూజీసీ నిబంధనల ప్రకారమే వీసీలను నియమించనుండగా, వీసీలకు పోటీపడే వారి నేపథ్యంపై ఇప్పటికే ఇంటెలిజెన్స్ విభాగంతో విచారణ చేయించారు. కొత్తగా నియమితులయ్యే వీసీలకు న్యాయ, పరిపాలన పరమైన అంశాలపై ఐఐటీలు, ఐఐఎంల పూర్వ డైరెక్టర్లు, ప్రముఖ విద్యావేత్తలతో శిక్షణ ఇప్పిస్తారు. 10 వర్సిటీల వీసీ పోస్టులకు 312 మంది ప్రొఫెసర్లు దరఖాస్తు చేశారు. ఒక్కో ప్రొఫెసర్ మూడు, నాలుగు వర్సిటీల వీసీలకు పోటీపడటంతో మొత్తంగా 1,380 దరఖాస్తులొచ్చాయి.

ఎన్నికల కమిషన్ అనుమతి

రాష్ట్రంలోని 10 వర్సిటీ వీసీ పోస్టులు ఈనెల 21తో ఖాళీకానున్నాయి. దీనికన్నా ముందే వీసీలను నియమించాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలోనే జనవరిలోనే ప్రక్రియను ప్రారంభించింది. కానీ పార్లమెంట్ ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారడంతో వీసీల నియామకానికి అనుమతివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని కోరింది. ఇందుకు మంగళవారం ఈసీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీలైనంత త్వరగా నియామక ప్రక్రియనంతా పూర్తిచేసి ఈనెల 21లోపు లేదా మే నెలాఖరులోగా కొత్త వీసీలను నియమిస్తామని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. కొత్త వీసీలు వచ్చేలోపు ఐఏఎస్ అధికారులను లేదా ఇప్పుడున్న వీసీలను ఇన్‌చార్జి వీసీలుగా నియమించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

కొమ్మకొమ్మకో సవ్వడి!



వృక్ష జాతులు	
కాపర్‌పాడ్ :	95
వేప:	47
పొంగమియా అయిల్ ట్రీ:	31
సుబాబుల్ చెట్లు:	18
బోధి వృక్షాలు/ పీపల్:	14
ఆఫ్రికన్ తులిప్ చెట్లు:	13
ఇండియన్ క్రాక్ ట్రీ:	11
బూడిద చెట్లు:	10
ఇతర వృక్షాలు:	134



ఒక్క చెట్టుపై 10 రకాల వన్యప్రాణులు!!	రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలపై 2-3 జంతుజాలాలు	శబ్ద, వాయు కాలుష్యం కారణంగా వీటి తగ్గుదల	జీహెచ్ఎంసీ పరిధిలో 120 రకాల వృక్ష, 85 రకాల పక్షి జాతులు	23 ప్రాంతాల్లో వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ ఇండియా అధ్యయనం

సాక్షి, హైదరాబాద్: వాహనాలు, ట్రాఫిక్ రద్దీతో వెలువడే శబ్ద, వాయు కాలుష్యంతో రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లు, వాటి మీద మనుగడ సాగించే జీవవైవిధ్యంపై ప్రభావాన్ని చూపిస్తోంది. గాలి నాణ్యత మెరుగ్గా ఉన్న ప్రాంతాల్లో ఒక్క చెట్టుపై 10 రకాల వన్యప్రాణులు మనుగడ సాగిస్తుండగా.. హానికరంగా ఉన్న ప్రదేశాల్లో చెట్టుపై 2-3 రకాల జంతు జాలాలు మాత్రమే ఉన్నాయని వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) ఇండియా అధ్యయనంలో తేలింది. వృక్షాలు, జంతువుల మధ్య సంబంధంపై ఈ సంస్థ హైదరాబాద్‌లో వార్షిక వృక్ష సర్వేను నిర్వహించింది. గాలి నాణ్యత మెరుగ్గా ఉన్న ప్రాంతాల్లోని 32 వృక్షాలపై 322 వన్య ప్రాణులు, మధ్యస్థంగా ఉన్న చోట 490 చెట్లపై 5,169 జంతు జాలాలను గుర్తించారు. శబ్ద, వాయు కాలుష్య ప్రభావం ఎక్కువగా రోడ్లకు ఇరువైపులా ఉన్న 117 మొక్కలపై 302 వన్య ప్రాణులు మాత్రమే మనుగడ సాగిస్తున్నట్లు తేలింది.



అధ్యయనం చేసింది ఇలా..

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లోని ఆరు జోన్ల పరిధిలో మారేడ్‌పల్లి, ఉప్పల్, సరూర్‌నగర్, జూబ్లీహిల్స్, అల్వాల్, బేగంపేట, ఫిల్మ్‌నగర్, గచ్చిబౌలి వంటి 23 ప్రధాన ప్రాంతాల్లో 160కి పైగా వలంటీర్లు సర్వే నిర్వహించారు. రోడ్లకు ఇరువైపులా 6 మీటర్ల లోపల 10 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వ్యాసం, ఎత్తు ఉన్న అవెన్యూ ప్లాంట్లను మాత్రమే సర్వేలో ఎంపిక చేశారు. పార్కుల్లోని చెట్లకు ఎలాంటి పరిమితులు విధించలేదు. జీహెచ్ఎంసీ పరిధిలో 120 రకాల జాతులకు చెందిన 753 ప్రత్యేకమైన చెట్లు, 85 రకాల పక్షులు, 6,065 వన్యప్రాణులను గుర్తించారు.

అత్యధికంగా రాగిపాడ్, వేప చెట్లే..

120 చెట్ల జాతుల్లో అత్యధికంగా రాగిపాడ్ 95, వేప 47, పొంగమియా 31 రకాల వృక్షాలున్నాయి. వీటిలో 32 జాతులు తెలంగాణ నేల, వాతావరణ పరిస్థితులకు అనువైనవి కాగా.. 39 భారతీయ జాతులు, 45 కృత్రిమ జాతులు, 4 సహజ సిద్ధమైన జాతులకు చెందిన వృక్షాలు. కృత్రిమ చెట్లతో పోలిస్తే సహజ సిద్ధమైన వృక్షాలపై చీమలు, చెద పురుగులు, పక్షులు వంటి పలు రకాల జీవవైవిధ్య జంతు జాలాలు ఎక్కువగా మనుగడ సాగిస్తున్నాయి.



గ్రీనరీ పెరగాలి..

కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న హైదరాబాద్‌లో గ్రీనరీని రక్షించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. పౌరులు తమ చుట్టూ ఉన్న వృక్ష, జంతుజాలం గురించి తెలుసుకోవడం ద్వారా ప్రకృతితో అనుబంధాన్ని కలిగి ఉంటారు. దీంతో భావితరాలకు పర్యావరణంపై స్పృహ పెరుగుతుంది.

– ఫరీదా తంపాల్, రాష్ట్ర డైరెక్టర్, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఇండియా

ఎలక్షన్.. ఆర్టీసీ కలెక్షన్

- రికార్డు స్థాయిలో ఒకే రోజు రూ. 24.23 కోట్ల ఆదాయం
- పోలింగ్ మరుసటి రోజు.. బస్సుల్లో 54 లక్షల మంది ప్రయాణం
- 106 శాతంగా నమోదైన ఆక్యుపెన్సీ రేషియో

సాక్షి, హైదరాబాద్: 24 గంటల వ్యవధిలో తెలంగాణ ఆర్టీసీ ఏకంగా 54 లక్షల మంది ప్రయాణికులను గమ్యం చేర్చి రికార్డు సృష్టించింది. ఈ రూపంలో రూ.24.23 కోట్ల ఆదాయం పొంది పాత రికార్డులను బ్రేక్ చేసింది. ఈ నెల 13న ఓటేసేందుకు జనం పోటెత్తిన విషయం తెలిసిందే. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ఓటు హక్కు ఉండి, నగరంతోపాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో ఉంటున్న ఏపీ ఓటర్లు సొంతూళ్లకు క్యూ కట్టారు. రెండో శనివారం, ఆదివారంతో కలిసి రావటంతో చాలామంది పోలింగ్‌కు రెండు రోజుల ముందే వెళ్లారు. మిగతావారు వీలునుబట్టి పోలింగ్ రోజు వరకు వెళ్లారు. కానీ, చాలామంది ఆ మరుసటి రోజు..అంటే 14వ తేదీన తిరిగి హైదరాబాద్‌తోపాటు వారు పనిచేసే ప్రాంతాలకు వచ్చారు. దీంతో తెలంగాణ ఆర్టీసీ బస్సులు బుధవారం కిక్కిరిసి తిరిగాయి. ఆ రోజు ఏకంగా 54 లక్షల మంది టీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించటం విశేషం. ఆరోజు తెలంగాణ ఆర్టీసీ బస్సులు 35.12 లక్షల కిలోమీటర్ల మేర తిరిగాయి.

'గ్రాండ్ ఎలక్షన్ చాలెంజ్'గా..

ప్రత్యేక సందర్భాల్లో గరిష్ట సంఖ్యలో ప్రయాణికులను గమ్యం చేర్చటం ద్వారా అధికంగా ఆదా యం ఆర్జించేందుకు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దసరా, సంక్రాంతి, రాఖీ, సమ్మక్క- సారలమ్మ జాతర లాంటి సందర్భాల్లో ప్రత్యేకంగా 'చాలెంజ్' అంటూ ఉద్యోగులకు టార్గెట్ పెడుతున్నారు. గతంలో అదే సందర్భంలో వచ్చిన ఆదాయాన్ని మించి సాధించాలని చెబుతున్నారు. ఆ కోవలోనే పోలింగ్ రోజును 'గ్రాండ్ ఎలక్షన్ చాలెంజ్' అంటూ ఉద్యోగులకు టార్గెట్ ఇచ్చారు. స్పేర్‌లో ఉన్న బస్సులను కూడా సిద్ధం చేసి రోడ్డెక్కించటం మొదలు, సిబ్బంది ప్రత్యేక ప్రాంతాల్లో ఉండి ప్రయాణికులు ఆర్టీసీ బస్సులు ఎక్కేలా చూడటం వరకు జాగ్రత్తలు తీసుకున్నారు. సెలవులు, వీక్లీఆఫ్‌లు లేకుండా వీలైనంత ఎక్కువ మంది విధుల్లో ఉండేలా చూశారు. ఫలితంగా రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. ఆ రోజుల్లో బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో ఏకంగా 106%గా నమోదవటం విశేషం. ప్రతి కిలోమీటరుకు రూ.69 చొప్పున ఆదాయం సమకూరింది.

టికెట్లు కొనటం ద్వారా రూ.15 కోట్లు..

బుధవారం రోజున ఆర్టీసీకి సమకూరిన మొత్తం ఆదాయంలో టికెట్లు కొన్న ప్రయాణికుల ద్వారా రూ.15 కోట్లు సమకూరాయి. మహిళలకు ఉచిత ప్రయాణ వసతి రూపంలో జీరో టికెట్లు కొన్నవారి రూపంలో దాదాపు 9 కోట్ల ఆదాయం(ఈ మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి రీయింబర్స్ చేయాల్సి ఉంటుంది) సమకూరింది. పోలింగ్‌కు జనం సొంతూళ్లకు తరలిన నేపథ్యంలో గత నాలుగు రోజులుగా ఆదాయం భారీగా పెరిగింది. బుధవారం టికెట్ల ద్వారా రూ.15 కోట్లు సమకూరింది. దీంతో రోజువారీ ఆదాయం ఒక్కసారిగా రూ.11 కోట్ల నుంచి రూ.15 కోట్లకు చేరింది. అదనంగా రూ.,కోటి రావాల్సిన చోట రూ.4 కోట్లు సమకూరటం విశేషం.

సహనం అనేది మరణం కాదు. నిజానికి ప్రతి ఒక్కరి హృదయంలో జీవించడం. ఒక మనిషి మీకు ఎంత వ్యతిరేకమైనా, ఒక్కసారి కాదు పదిసార్లు సహించాల్సి వచ్చినా, సహనపు శక్తి అనేది వృథాగా పోదు. తియ్యటి ఫలితం ఇస్తుంది.

– బ్రహ్మకుమారీలు

సాక్షి
గురువారం, 16 మే 2024

అమెరికా బెదిరింపు ధోరణి

అహంకారం తలకెక్కితే బుద్ధి మందగిస్తుంది. పెత్తనం చలాయించాలన్న యావ పరిధుల్ని మరిచిపోతుంది. భారత్–ఇరాన్‌ల మధ్య సోమవారం కుదిరిన ఒప్పందంపై అమెరికా స్పందించిన తీరు దాని అహంకారానికి నిలువెత్తు నిదర్శనం. ఇరాన్‌తో ఒప్పందానికి సిద్ధపడేవారు ఆంక్షలు ఎదుర్కొనక తప్పదంటూ అమెరికా విదేశాంగ ప్రతినిధి వేదాంత్ పటేల్ చేసిన వ్యాఖ్య బెదిరింపు ధోరణిలో వుంది. 2003లో వాజపేయి నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వ హయాంలో ఇరాన్‌తో చాబహార్ ఓడరేవు నిర్మాణంపై ఒప్పందం కుదిరింది మొదలు అమెరికా అడుగడుగునా అడ్డుపడుతోంది. అందువల్లే అయిదేళ్లలో పూర్తికావాల్సిన ప్రాజెక్టు కాస్తా ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొంది. 2018లో పూర్తయిందనిపించి లాంఛనంగా ప్రారంభించారు. కానీ దానికి సంబంధించి రోడ్లు, రైల్వేలైన్లు మొదలుకొని వివిధ మౌలిక సదుపాయాల కల్పన, యంత్ర సామగ్రి వగైరాల విషయం అనిశ్చితిలో పడింది. మొత్తంమీద ఇప్పటికి 21 ఏళ్లయింది. ప్రభుత్వ రంగ సంస్థ ఇండియా పోర్ట్స్ గ్లోబల్ లిమిటెడ్ (ఐపీజీఎల్), ఇరాన్ పోర్టులు, నౌకా సంబంధ సంస్థల మధ్య ఓడరేవు టెర్మినల్ ప్రారంభంపై ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం కింద ఐపీజీఎల్ 12 కోట్ల డాలర్ల (రూ. వెయ్యికోట్లుపైగా) పెట్టుబడి పెడుతుంది. మన దేశం మరో 25 కోట్ల డాలర్ల రుణం సమకూరుస్తుంది. చాబహార్ సమీపంలో నిర్మించిన ఈ షహీద్ బెహెస్తీ పోర్టు మన దేశానికి లాభదాయకమైన ప్రాజెక్టు. అంతేకాదు... మధ్య ఆసియా, పశ్చిమాసియా, యూరప్ దేశాలకు అది 'బంగారువాకిలి'. ఈ ప్రాజెక్టు కింద నిర్మాణమయ్యే రోడ్లు, రైల్వేలైన్లు వివిధ ఓడరేవులతో అనుసంధానమవుతాయి. సరుకు రవాణా చకచకా సాగుతూ పలు దేశాల ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేస్తుంది. పెట్రో కెమికల్స్, ఉక్కు, ఎరువుల రంగాల్లో ఇరాన్ బ్రహ్మాండమైన అభివృద్ధి సాధిస్తుంది. మధ్య ఆసియా మార్కెట్లలో ఇప్పటికే తిష్ఠ వేసి, బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ (బీఆర్ఐ) ప్రాజెక్టుతో బంగారు భవిష్యత్తును కలగంటూ అందరినీ మించి ఎదగాలని దూకుడుగా వెళ్తున్న చైనాకు చాబహార్ ఓడరేవు కంట్లో నలుసు. ఎందుకంటే ఇది పూర్తి స్థాయిలో పనిచేయటం ప్రారంభిస్తే బీఆర్ఐ ప్రాజెక్టుకు పెద్ద విలువుండదు.

ఇంతలోనే అమెరికా కొరడా ఝుళిపించటం ప్రారంభించింది. 'మేం ఇరాన్‌పై ఆంక్షలు విధించాం కనుక దానితో ఎవరూ వాణిజ్యబంధం నెలకొల్పుకోరాద'ంటూ ఫర్మానాలు జారీచేస్తోంది. రెండు సార్వభౌమత్వ దేశాల మధ్య ఒప్పందం కుదిరితే ఎందుకీ కడుపుమంట? ఏమిటీ బెదిరింపులు? ఇరాన్‌లో తనకు అనుకూలమైన మహమ్మద్ రెజా పహ్లవి (ఇరాన్ షా) పాలన సాగినంతకాలమూ అమెరికా ఆ దేశంతో సఖ్యంగా వుంది. ఇస్లామిక్ విప్లవం విజయవంతం కావటంతో ఆ పాలకుడు కాస్తా నిష్క్రమించాడు. ఆ తర్వాత ఖొమేనీ కనుసన్నల్లోకి ఇరాన్ వచ్చిననాటి నుంచీ ఆ దేశాన్ని అమెరికా అష్టదిగ్బంధం చేస్తోంది. ఏదో ఒక కారణంతో కయ్యానికి దిగుతోంది. తన సమస్యను ప్రపంచ సమస్య చేసి ఎవరూ ఆ దేశంతో వ్యాపార, వాణిజ్యాలను నడపరాదంటూ బెదిరిస్తోంది. పోనీ ఈ విషయంలోనైనా నిలకడగా వున్న చరిత్ర లేదు. 2003లో ఒప్పందం కుదిరినప్పుడు మౌనంగావున్న అమెరికా, ఆ తర్వాత కాలంలో ఇరాన్‌పై ఆంక్షలు విధించింది. పర్యవసానంగా ఆ ప్రాజెక్టు మూలనపడింది. 2014లో ప్రధాని నరేంద్ర మోదీ వచ్చేనాటికి అంతర్జాతీయంగా పరిస్థితులు చక్కబడ్డాయి. అమెరికా, యూరప్ దేశాలు ఇరాన్‌తో అణు ఒప్పందం కుదుర్చుకుని ఆంక్షలు సడలించాయి. మరుసటి ఏడాదికల్లా చాబహార్‌పై భారత్–ఇరాన్ ద్వైపాక్షిక ఒప్పందం కుదిరింది. కానీ 2017లో డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడయ్యాక ఇరాన్‌తో కుదిరిన అణు ఒప్పందం నుంచి వైదొలగుతున్నట్టు ప్రకటించారు. ఆంక్షల పర్వం మళ్లీ మొదలైంది. కానీ మన దేశానికి మాత్రం మినహాయింపు ఇచ్చారు. అప్పటికి అఫ్గాన్ ఆర్థికాభివృద్ధిని, దానికి అందాల్సిన మానవతా సాయాన్ని దృష్టిలో ఉంచుకుని మినహాయింపు ఇచ్చామని అమెరికా ప్రకటించింది. సారాంశంలో క్షణక్షణమూ మారే తన చిత్తానికి అనుగుణంగా ప్రపంచ దేశాలన్నీ మసులుకోవాలని అమెరికా వాంఛిస్తోంది. ఇలాంటి పోకడలను మొగ్గలోనే తుంచే ప్రయత్నం చేసివుంటే వేరుగా వుండేది. అది లేకపోవటం వల్లనే తాజాగా మరోసారి హుంకరిస్తోంది.

దేశాలకు తమవైన విధానాలుంటాయి. ధూర్త దేశంగా మారి ఇరుగు పొరుగుకే కాక ప్రపంచ శాంతికే భంగంగా పరిణమించినప్పుడు ఎవరూ అలాంటి దేశంతో కలవాలనుకోరు. గతంలో ఇరాన్ విషయంలో భారత్‌కు ఇచ్చిన మినహాయింపులకు షరతులున్నాయి. ఇరాన్‌నుంచి దిగుమతి చేసుకునే ముడి చమురును వెంటనే తగ్గించుకోవాలని, మున్ముందు ఆపేయాలని అప్పట్లో అమెరికా కోరింది. అప్పటికి రోజుకు ఏడు లక్షల చమురు బ్యారెళ్లు దిగుమతి చేసుకునే భారత్... చివరకు ఆ దిగుమతిని ఆపేసింది కూడా! ఉక్రెయిన్ యుద్ధం కారణంగా రష్యా నుంచి చమురు దిగుమతులు నిలిపేయాలని అమెరికా కోరినా లెక్కచేయని భారత్... మొదటినుంచీ అన్ని విషయాల్లో మద్దతుగా నిలుస్తున్న తమ విషయంలో భిన్నంగా ఉంటున్నదని ఇరాన్ ఇప్పటికే విమర్శించింది. ఇరాన్ వైఖరేమిటన్న సంగతలావుంచి మన ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చి మనవైన విధానాలు రూపొందించుకోవటం తప్పనిసరి. విదేశాంగమంత్రి జైశంకర్ అన్నట్టు అంతర్జాతీయంగా ఎన్నో దేశాల ఆర్థిక ఎదుగుదలకు తోడ్పడే చాబహార్ పోర్టును అమెరికా సంకుచిత దృష్టితో చూడటం, మోకాలడ్డాలని ప్రయత్నించటం తగదు. మన దేశం ఇతర దేశాలతో కూడా ఈ విషయంలో చర్చించాలి. కాస్త వెనకా ముందూ కావొచ్చుగానీ ఇలాంటి అనారోగ్య ధోరణులు అందరికీ ముప్పు తెచ్చేవే!

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.అష్టమి ఉ.7.22 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** మఖ రా.7.12 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ఉ.6.06 నుండి 7.50 వరకు, తదుపరి తె.4.02 నుండి 5.46 వరకు(తెల్లవారితే శుక్రవారం), **దుర్ముహూర్తం:** ఉ.9.47 నుండి 10.35 వరకు, తదుపరి ప.2.58 నుండి 3.46 వరకు, **అమృతఘడియలు:** సా.4.31 నుండి 5.56 వరకు.

సూర్యోదయం : 5.32
సూర్యాస్తమయం: 6.20
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

గాజాలో కూలుతున్న జ్ఞాన వ్యవస్థలు

విశ్లేషణ



అమర్‌జిత్ భుల్లర్

ప్రపంచ బ్యాంకు ప్రకారం పాలస్తీనా అక్షరాస్యత రేటు 97.51 శాతం. పాలస్తీనియన్లు 'ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యావంతులైన శరణార్థులు'. అయితే గాజాలోని విశ్వవిద్యాలయాలు ఇప్పుడు ఇజ్రాయెల్ దాడిలో నాశనమయ్యాయి. ఇప్పటివరకూ సుమారు 90 మందికి పైగా ప్రొఫెసర్లు ఈ దాడుల్లో మరణించారు. గాజా పిల్లల విద్యావకాశాలను నిర్మూలిస్తూ... పాఠశాలలు, పుస్తకాల దుకాణాలు, లైబ్రరీలు ధ్వంసమయ్యాయి. పాలస్తీనా విజ్ఞానం, జ్ఞానాన్ని ఉత్పత్తి చేసే సంస్థల వినాశనం సమస్త జ్ఞానాన్ని అంతమొందించడం కంటే తక్కువేమీ కాదు! ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యావేత్తలు దీనిని అర్థం చేసుకున్నారు. అమెరికా, ఇతర దేశాలలోని విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థుల ఆందోళనలకు కారణం అదే.

గాజాలోని విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యా సంస్థలపై ఇజ్రాయెల్ దాడి పాలస్తీనా విజ్ఞాన, పర్యావరణ వ్యవస్థలను నాశనం చేయడానికి చేసిన ఉద్దేశపూర్వక ప్రయత్నంగా కనిపిస్తుంది. ఇప్పటివరకు, మొత్తం 12 విశ్వవిద్యాలయాలు వైమానిక దాడులకు గురయ్యాయి. ఇజ్రాయెల్ లక్ష్యాలలో అల్–అజహర్ విశ్వవిద్యాలయం, ఇస్లామిక్ యూనివర్సిటీ ఆఫ్ గాజా (ఐయూజీ) ఉన్నాయి. దీని ఫలితంగా పాలస్తీనా అధ్యాపకులు, పండితులు, విద్యార్థులు సంవత్సరాల తరబడి సాగించిన పరిశోధన ధ్వంసమైపోయింది.

ఐయూజీ ప్రెసిడెంట్, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సుఫియాన్ తాయెహ్, ఆయన కుటుంబ సభ్యులు విశ్వవిద్యాలయ క్యాంపస్‌పై జరిగిన ఇజ్రాయెల్ దాడిలో మరణించారు. ఐయూజీ అనేది గాజాకు చెందిన ప్రముఖ విద్యాసంస్థ. ప్రొఫెసర్ తాయెహ్ అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన పరిశోధకుడు. అలాగే, కొనసాగుతున్న దాడిలో మరణించిన 90కి పైగా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లలో ఐయూజీలో ఆంగ్ల సాహిత్యం బోధించే డాక్టర్ రెఫాత్ అలరీర్ మరొకరు.

పాలస్తీనా విద్యా మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, 2024 జనవరి 20 వరకు దాదాపు 4,400 మంది విద్యార్థులు మరణించారు, 7,800 మంది గాయపడ్డారు. 231 మంది ఉపాధ్యాయులు, నిర్వాహకులు మరణించారు, 756 మంది గాయపడ్డారు. అలాగే 378 ప్రభుత్వ నిర్వహణలోని పాఠశాలలతోపాటు, గాజాలో యునైటెడ్ నేషన్స్ రిలీఫ్ అండ్ వర్క్స్ ఏజెన్సీ (యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ) నిర్వహణలోని పాఠశాలలు పూర్తిగా లేదా పాక్షికంగా ధ్వంసమయ్యాయి. 2023 అక్టోబర్‌లో యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి కనీసం 97 మంది జర్నలిస్టులు, మీడియా కార్యకర్తలతోపాటు 35,000కు పైగా ప్రజలు మరణించారు.

''దాదాపు 90,000 మంది పాలస్తీనియన్ విశ్వవిద్యాలయ విద్యార్థులు గాజాలోని విశ్వవిద్యాలయానికి హాజరు కాలేరు. 60 శాతానికి పైగా పాఠశాలలు, దాదాపు అన్ని విశ్వవిద్యాలయాలు, లెక్కలేనన్ని పుస్తకాల దుకాణాలు, లైబ్రరీలు దెబ్బతిన్నాయి లేదా ధ్వంసమయ్యాయి. గాజా పిల్లలు, యువకుల విద్యావకాశాలను నిర్మూలిస్తూ, యూనివర్సిటీల డీన్‌లు, ప్రముఖ పాలస్తీనా పండితులతో సహా... వందలాది మంది ఉపాధ్యాయులు, విద్యావేత్తలు చంపబడ్డారు'' అని దక్షిణాఫ్రికా న్యాయపరమైన అంశాల ప్రతినిధి బ్లిన్నె నీ ఘ్రాలే అంతర్జాతీయ న్యాయస్థానంలో వెల్లడించారు.

ప్రజల చిహ్నాలను, డాక్యుమెంట్ చరిత్రను తుడిచిపెడుతూ లైబ్రరీలు, ఆర్కైవ్‌లు, మ్యూజియంలతో సహా అనేక సాంస్కృతిక వారసత్వ ప్రదేశాలు కూడా ధ్వంసమయ్యాయి. పాలస్తీనా మేధావులు దీనిని 'చరిత్ర నుండి పాలస్తీనా ఉనికిని తుడిచివేయడానికి' చేసే ప్రయత్నంగా చూస్తున్నారు. కెనడియన్ అసోసియేషన్ ఆఫ్ యూనివర్సిటీ టీచర్స్‌కు రాసిన లేఖలో కెనడాలోని మౌంట్ రాయల్ యూనివర్సిటీకి చెందిన సోషియాలజీ ప్రొఫెసర్ ముహన్నద్ అయ్యాష్ దీనిని 'రాజకీయ పటం నుండి పాలస్తీనాను తుడిచిపెట్టే ప్రయత్నం'గా పేర్కొన్నారు. 'పాలస్తీనా విజ్ఞానం, విజ్ఞాన నిర్మాతలు మరియు జ్ఞానాన్ని ఉత్పత్తి చేసే సంస్థల వినాశనం సమస్త జ్ఞానాన్ని అంతమొందించడం(ఎపిస్టెమిసైడ్) కంటే తక్కువేమీ కాదు' అని వ్యాఖ్యానించారు.



'ఎపిస్టెమిసైడ్' అంటే జ్ఞాన వ్యవస్థను చంపడం, మూగబోయేలా చేయడం, నాశనం చేయడం లేదా విలువ తగ్గించడం అని అర్థం. సోషియాలజిస్ట్ బోవెంచురా డి సౌసా శాంటోస్ ఈ పదాన్ని రూపొందించారు. 'వలస పాలన, అణచివేత, మారణహోమాల కారణంగా అధీన సంస్కృతిలో సంభవించే విజ్ఞాన మరణంగా' దీనిని ఆయన అభివర్ణించారు. ఇది సైనికపరంగా, సైద్ధాంతికపరంగా రెండు విధాలుగానూ ఉండొచ్చు. ఇది విముక్తి పేరుతో స్వాధీనం, శాంతి పేరుతో దురాక్రమణ, జీవన పవిత్రత పేరుతో జీవన విధ్వంసం, హక్కుల పరిరక్షణ పేరుతో మానవ హక్కులను ఉల్లంఘించే రూపంలో జరగవచ్చు.

1948లో ఇజ్రాయెల్‌కు స్థానం కల్పించడం కోసం తాము వైదొలగాల్సి వచ్చిన తర్వాత పాలస్తీనియన్ విద్యావంతులైన ఉన్నతవర్గాలు పాలస్తీనా విద్యావ్యవస్థను పునర్నిర్మించడానికి అత్యంత ప్రాధాన్యమిచ్చాయి. వారు విద్యను తమ జీవితాలను పునర్నిర్మించడానికి, పురోగతిని సాధించడానికి ఒక చోదకశక్తిగా భావించారు. అర్థవంతమైన సాంస్కృతిక మార్పిడి, శాస్త్రీయ పురోగతి, చరిత్రపై అవగాహన, సృజనాత్మక సాహిత్య రచనలతో గాజాను పాలస్తీనా సమాజాన్ని అభివృద్ధి చేసే ప్రదేశంగా మార్చాలనే ఆశతో అనేక మంది పండితులు వివిధ ప్రాంతాల నుండి అక్కడికి వెళ్లారు. ఇందులో వారు విజయం సాధించారా లేదా అనేది చర్చనీయాంశం. కానీ కచ్చితంగా, పాలస్తీనా నేడు అత్యధిక అక్షరాస్యత రేటు ఉన్న ప్రాంతాలలో ఒకటిగా పరిగణించబడుతోంది. ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం పాలస్తీనా అక్షరాస్యత రేటు 97.51 శాతం. పాలస్తీనియన్లను 'ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యావంతులైన శరణార్థులు' అంటారు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న విద్యావేత్తలు దీనిని అర్థం చేసుకున్నారు. అమెరికా, ఇతర దేశాలలోని విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, విద్యార్థుల తిరుగుబాటు వెనుక ఉన్న కారణం అదే. పాలస్తీనా విద్యా సంస్థల్లో జరుగుతున్న ప్రతిధ్వనులు విదేశాల్లోని క్యాంపస్‌లలో వినిపిస్తున్నాయి. ఇజ్రాయెల్ దురాక్రమణకు అమెరికా ప్రభుత్వం అందిస్తున్న నిరంతర ద్రవ్య, సైనిక, దౌత్య, నైతిక మద్దతును నిరసిస్తూ అనేక విశ్వవిద్యాలయాలలో శిబిరాలు ఏర్పాటైనాయి. దాదాపు 10 విశ్వవిద్యాలయాలలోకి పోలీసులను పిలిపించారు, 645 మందిని అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిలో చాలా మందిని తర్వాత విడుదల చేశారు. ఉన్నత స్థాయి కొలంబియా, బోస్టన్ విశ్వవిద్యాలయాలు నిరసనల కేంద్రాలుగా మారాయి. ఈ రెండు విశ్వవిద్యాలయాల క్యాంపస్‌ల నుండి 200 మందికి పైగా అరెస్టులు చేశారు. గాజాలో కాల్పుల విరమణ పిలుపులో గణనీయమైన సంఖ్యలో అధ్యాపకులు పాల్గొన్నారు లేదా మద్దతు ఇచ్చారు. కొన్ని యూనివర్సిటీలలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పాలనాధికారులు విరుచుకుపడ్డారు, వారిలో కొందరిని బహిష్కరించారు.

లాస్‌ఏంజిల్స్‌లోని క్యాలిఫోర్నియా విశ్వవిద్యాలయం,ఇతర ప్రదేశాలలో పాలస్తీనా అనుకూల, ఇజ్రాయెల్ అనుకూల ప్రదర్శనకారుల మధ్య గొడవలు జరిగినట్లు వార్తలు వచ్చాయి. పాలస్తీనా విద్యను విధ్వంసకరమైన విభజన దురదృష్టాల నుండి రక్షించడానికి ప్రపంచం తన స్వరాన్ని పెంచాలి. జ్ఞాన వ్యవస్థను నాశనం చేయడానికి వారాలు పడుతుంది. కానీ దానిని పునర్నిర్మించడానికి దశాబ్దాలు పడుతుంది.

ఇజ్రాయెల్‌తో జట్టు కట్టిన దేశాలలోని కొన్ని విశ్వవిద్యాలయాలు దురదృష్టవశాత్తూ పాలస్తీనా సంస్థలతో విద్యా మార్పిడి ఒప్పందాలను కుదుర్చుకోవడానికి విముఖత చూపాయి. మరోవైపు, ఇజ్రాయెల్ విశ్వవిద్యాలయాల విద్యార్థులను అంతర్జాతీయ సహకారానికి చెందిన ప్రయోజనాలను ఆస్వాదించడానికి సాదరంగా స్వాగతించారు. ఇజ్రాయెల్ విశ్వవిద్యాలయాలు కెనడాకు చెందిన పోస్ట్–సెకండరీ సంస్థలతో ఇప్పటికే 60 విద్యా ఒప్పందాలను కలిగి ఉన్నాయి. ముఖ్యంగా అభివృద్ధి చెందిన ప్రపంచంలోని విద్యావేత్తలు, అధ్యాపక సంఘాలు, యూనియన్లు... అస్తవ్యస్తంగా ఉన్న పాలస్తీనా వ్యవస్థను పునర్నిర్మించడానికి వాగ్దానం చేయడంతో పాటు, యుద్ధాన్ని ముగించే వైపుగా ప్రజల అభిప్రాయాన్ని నిర్మించడానికి, ఆత్మపరిశీలన చేసుకోవడానికి ఇది తగిన సమయం.

వ్యాసకర్త నార్తర్న్ బ్రిటిష్ కొలంబియా విశ్వవిద్యాలయ విశ్రాంత ప్రొఫెసర్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

వెనక ఎవరున్నారు?



తీవ్రమైన లైంగిక దాడుల ఆరోపణలు ఎదుర్కొంటూ, దేశం విడిచి వెళ్లిన ప్రజ్వల్ రేవణ్ణ డిప్లొమాటిక్ పాస్‌పోర్టును ఇంకా ఎందుకు రద్దు చేయలేదు? ఎవరు అతడిని కాపాడుతున్నారు? ఎందుకు?

– సుమంత్ రామన్, టీవీ హోస్ట్

చూస్కుందాం!



2020లో డోనాల్డ్ ట్రంప్ రెండు డిబేట్లలో నాతో ఓడిపోయారు. అప్పటినుంచీ మళ్లీ నాతో చర్చకు రాలేదు. మళ్లీ ఇప్పుడు ఆయన నాతో చర్చకు సిద్ధంగా ఉన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. అలా అయితే స్నేహితుడా, నేనేమిటో చూపిసా!

– జో బైడెన్, అమెరికా అధ్యక్షుడు

విచక్షణారహితం



ఐక్యరాజ్యసమితి కోసం పనిచేస్తున్న రిటైర్డ్ కల్నల్ వైభవ్ అనిల్ కాలే గాజాలో యూరోపియన్ హాస్పిటల్‌కు కారులో వెళ్తుండగా చంపబడ్డారు. ఇజ్రాయిల్ దాడులు ఎంత విచక్షణా రహితంగా సాగుతున్నాయో ఇది చెబుతుంది. అయినా వాళ్లు ఎవరికీ జవాబుదారీ కాదు. మహా అయితే వాళ్లు ప్రభుత్వానికి ఒక అధికారపూర్వక క్షమాపణ చెబుతారంతే!

– జావేద్ అఖ్తర్, కవి

సునాయాస విజయం



ఇప్పటికి 70 శాతం స్థానాలకు ఓటింగ్ ముగిసింది. దాదాపుగా మా దగ్గర మొత్తం భారతదేశానికి సంబంధించిన డేటా ఉంది. మా అంచనాలో బీజేపీ (మొత్తం ఎన్డీయే కాదు) 43 శాతం ఓటు షేరుతో (ప్లస్ ఆర్ మైనస్ 3 శాతం) 358 (ప్లస్ ఆర్ మైనస్ 3 శాతం) స్థానాలను కచ్చితంగా గెలుచుకుంటుంది.

– రణదీప్ సింగ్ సిసోడియా, విశ్లేషకుడు

పడిపోయిన ప్రమాణాలు



'న్యూస్‌క్లిక్' వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్‌కాయస్థను 'ఉపా' కింద అరెస్ట్ చేయడం చట్టబద్ధం కాదంటూ సుప్రీంకోర్టు విడుదల చేయడానికే సంతోషించాల్సి రావడం ఎంత దారుణం! కక్షపూరిత ప్రభుత్వం ఒక సంపాదకుడిని అక్రమ అరెస్టు చేయడం పట్ల గగ్గోలు చెలరేగొద్దా?

– కత్యూషా, వ్యాఖ్యాత


అవే చేయగలిగితే...



బాలాకోట్ సర్జికల్ దాడులే 2019 ఎన్నికల చిత్రాన్ని మార్చాయని ప్రతిపక్షాల వాళ్లు అంటుంటారు. కానీ నాగరికత పరంగా, సంస్కృతి పరంగా అంతకంటే ఎన్నో రెట్లు ప్రాధాన్యం ఉన్న రామ మందిరం మాత్రం ఎన్నికలను ప్రభావితం చేయదంటారు. తారాస్థాయి భ్రమ!

– అభిజిత్ అయ్యర్ మిత్రా, వ్యాఖ్యాత

మోదీజీ ఇంటికే...



సార్వత్రిక ఎన్నికల్లో ఇప్పటి వరకూ జరిగిన నాలుగు దశల పోలింగును బట్టి చూస్తే, ఇండియా కూటమి పటిష్ఠమైన స్థితిలో ఉంది. భారత ప్రజలు నరేంద్ర మోదీజీని బయటికి పంపేయడానికి కచ్చితంగా నిర్ణయించుకున్నారు. జూన్ 4న ఇండియా కూటమి నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆత్మవిశ్వాసంతో చెబుతున్నాను.

– మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు

వైజ్ఞానిక వేగుచుక్కలు

వెల్లూరు సీఎమ్‌సీ వెనుక...



ఐడా ఎస్. స్కడ్డర్

గుంటూరులో కుర్గర్ ఆసుపత్రితో చరిత్ర సృష్టించిన అన్నా సారా బృందంలో పని చేసిన డాక్టర్ మేరీ బేయర్ 1912లో చీరాలలో మరో ఆసుపత్రిని ప్రారంభించి, సుమారు ఆరు దశాబ్దాలు గణనీయమైన సేవ చేశారు. అన్నా సారాతో కొన్ని రోజులు పని చేసిన అమెరికన్ మిషనరీ ఐడా ఎస్. స్కడ్డర్ వెల్లూరులో నేడు సీఎంసీగా పేరుగాంచిన క్రిస్టియన్ మెడికల్ ఆసుపత్రిని తొలుత మెడికల్ స్కూల్‌గా బాలికలకు మాత్రమే 1918లో ప్రారంభించారు. మద్రాస్‌కు 80 మైళ్ళ దూరంలో ఉన్న తిండివనంలో జీవిస్తున్న రోజుల్లో ఒకే రాత్రి ప్రసవ సమయంలో సరైన వైద్య సహాయం లేక ముగ్గురు స్త్రీలు మరణించడం ఆమెను కలచివేసింది. ఆ రాత్రి తను వైద్యశాస్త్రం అభ్యసించాలని నిర్ణయించుకున్నారు. ఫలితంగా 1899లో న్యూయార్క్ సిటీలోని కార్నెల్ మెడికల్ కాలేజీలో డాక్టర్ పట్టా పొందారు. 1900లో చిత్తూరు పట్టణానికి 20 మైళ్ళ దూరంలో ఉండే వెల్లూరు లేదా రాయవెల్లూరులో ఒక చిన్న డిస్పెన్సరీని ప్రారంభించారు. తొలి రెండేళ్లలోనే దాదాపు 5,000 మంది రోగులకు వైద్య సేవలు అందించారు.

1902లో మేరీ టేబర్ స్కెల్ హాస్పిటల్‌ను ప్రారంభించారు. 1928లో వెల్లూరుకు సమీపంలో ఉండే బాగాయం వద్ద 200 ఎకరాల్లో హిల్ సైట్ మెడికల్ స్కూల్ ప్రాంగణాన్ని మొదలుపెట్టారు. అదే సంవత్సరం మహాత్మా గాంధీ ఈ మెడికల్ స్కూల్‌ని సందర్శించడం విశేషం.1945లో ఈ వైద్య కళాశాలలో యువకులకు కూడా ప్రవేశాన్ని కల్పించారు. చివరికి ఐడా సోఫియా స్కడ్డర్ ద1960 మే 23న కన్ను మూశారు.

ఎల్సీ ఎమ్ మోరీస్ అనే అమెరికన్ మిషనరీ డాక్టర్ 1930లో నెల్లూరులోని మిషనరీ హాస్పిటల్‌లో చేరి (ఆ కాలంలో ఆమె ఒక్కరే క్వాలిఫైడ్ డాక్టర్) ఆ ప్రాంతంలో ఎనలేని సేవలందించారు. బెల్జియంలో జన్మించిన క్లైర్ మేరీ జీన్ వెల్లట్ కంచి సమీపంలోని పోలంబక్కంలో కుష్టు ఆసుపత్రి 1955లో ప్రారంభించి చాలా పెద్ద ఎత్తున వైద్య సేవలు అందించి 1981లో పద్మశ్రీ గౌరవాన్ని కూడా పొందారు.

డా॥ నాగసూరి వేణుగోపాల్ । ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి

ఎమ్మెల్సీ ఉపఎన్నికలో కీలకాంశాలు

సందర్భం



బైరి వెంకటేశం

తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు సందడి చేస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ –నల్గొండ –ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఉప ఎన్నికలు మే 27న జరగనున్నాయి. ఉమ్మడి వరంగల్– ఖమ్మం – నల్గొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి 2021 సంవత్సరంలో ఎమ్మెల్సీగా గెలిచిన పల్లా రాజేశ్వర్ రెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా గెలవడం వల్ల ఆయన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఇక్కడ ఉపఎన్నికలు అనివార్యమయ్యాయి.

ఈ ఉప ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ తరఫున తీన్మార్ మల్లన్న బరిలో ఉండగా, బీఆర్ఎస్ ఏనుగుల రాకేశ్ రెడ్డిని బరిలోకి దించింది. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని ఆ పార్టీ నిలిపింది. వీరు కాక బక్క జడ్సన్, ప్రొఫెసర్ అశోక్ లాంటి బలమైన స్వతంత్ర అభ్యర్థులూ ఎన్నికల బరిలో ఉన్నారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా నిలిచిన ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల విద్యార్థులతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు ఈ ఎన్నికపై ప్రభావం చూపబోతున్నారు.



నీళ్లు, నిధులు, నియామకాలు ఈ మూడు లక్ష్యాలపై తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. రాష్ట్రం ఏర్పడి పదేళ్ళు గడుస్తున్న తరుణంలో కూడా ఇంకా నియామకాల అంశంపై పోరాటాలు జరుగుతుండడం అనేది గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతుంది. ఇంటికో ఉద్యోగం ఇస్తా అని ప్రజలను మభ్యపెట్టి అధికారం చేజిక్కించుకున్న గత పాలకులు నిరుద్యోగులను పట్టించుకోవడం మానేశారు.

బన్సల్ కమిటీ నివేదిక ప్రకారం రాష్ట్రంలో లక్షా 92 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉంటే కేవలం 35 వేల ఉద్యోగాలు మాత్రమే నింపి చేతులు దులుపుకున్నారు. గత ప్రభుత్వ పాలనలో టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో జరిగిన గ్రూప్1, ఏఈ, ఏఈఈ పరీక్షల పేపర్లు లీకేజీ వ్యవహారంలో నిరుద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. నిరుద్యోగం, నియామకాల అంశం ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధాన ప్రచార అస్త్రంగా మారనున్నది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన టీఎస్‌ఎస్‌పీ కానిస్టేబుల్ ఉద్యోగాల నియమకాలలో 1956 నుండి స్టేట్ లెవెల్ పోస్ట్‌గా ఉన్న ఉద్యోగాన్ని 2019లో జీఓ నం. 46ని తీసుకువచ్చి దానిని జిల్లా స్థాయి పోస్టుగా మార్చారు. దీంతో రాష్ట్ర స్థాయిలో మెరిట్‌పై ఉద్యోగాలు దక్కాల్సిన అభ్యర్థులు ఈ జీఓ వల్ల తీవ్రంగా నష్టపోయారు. అందుకే దీన్ని రద్దుచేసి తమ సమస్యను పరిష్కరించాలని వేలాదిమంది అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలోనే తెచ్చిన 317 జీఓ వల్ల ఉద్యోగాలు చేస్తున్న భార్యాభర్తలు వేర్వేరు జిల్లాలకు కేటాయించడం వల్ల వారి కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయి. ఈ జీఓల ప్రభావం ఎమ్మెల్సీ ఎన్నికలపై ఉండే అవకాశం ఉంది.

కొంత కాలం క్రితం 'యూత్ డిక్లరేషన్' పేరుతో కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్‌లో 'యువ సంఘర్షణ సభ' నిర్వహించింది. దీనికి పార్టీ అగ్రనేత ప్రియాంకా గాంధీ హాజరై పలు హామీలిచ్చారు. ముఖ్యంగా అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాల భర్తీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ, జూన్ 2 నాటికి అన్ని శాఖల్లోని ఖాళీలతో జాబ్ క్యాలెండర్ ప్రకటించి, సెప్టెంబరు 17లోపు నియామకాలు పూర్తి చేయడం, సెంట్రలైజ్డ్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ఏర్పాటు, ప్రతి జిల్లాలో ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజీ, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ఏర్పాటు, ప్రభుత్వ రాయితీలు పొందిన ప్రైవేటు కంపెనీల్లో తెలంగాణ యువతకు 75 శాతం ఉద్యోగాలు... ఇలా వివిధ అంశాలతో డిక్లరేషన్ ప్రకటించింది.


బీఆర్ఎస్ తమ ప్రభుత్వ హయాంలో సుమారు రెండు లక్షల ప్రైవేట్ ప్రభుత్వ, రంగాలలో ఉద్యోగాలు కల్పించామని చెబుతూ పట్టభద్రులు మా సిట్టింగ్ స్థానంలో మాకే పట్టం కడతారని ప్రచారం చేస్తోంది. ఇక భారతీయ జనతా పార్టీ 'మోదీ గ్యారంటీ వికసిత్ భారత్– 2047' పేరుతో ప్రచారం చేస్తోంది. పట్టభద్రులు ఎటువైపు మొగ్గుచూపుతారో జూన్ 5 వరకు వేచి చూడాల్సిందే.

వ్యాసకర్త ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు
। 9491994090

సర్వం ఆధ్యాత్మికమే!

ప్రమాదకరమైన లేక సందిగ్ధ పరిస్థితులన్నింటిలో భగవన్నామమే లంగరు వంటిది. కాబట్టి హృదయాంతరంగంలో భగవన్నామాన్నే నిలుపుకోవాలి. ఆత్మసాధనలో ఆచరించు పద్ధతులు అన్నింటిలోనూ 'రామ, కృష్ణ, గోవింద' అని ఉచ్చరించుటే సులభమైంది. కలియుగంలో భగవంతుని కృప పొందటానికి భగవన్నామం ఉచ్చరించడం లేదా నామ సంకీర్తన చేయడం అత్యంత సులభమైన మార్గం. ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా హృదయపూర్వకంగా తదేక ధ్యానంతో భగవంతుని నామస్మరణ చేయాలి. భగవన్నామాన్ని మించిన మార్గం లేదు. మార్గాలన్నీ సమానమైన ప్రాముఖ్యం కలిగినవీ, ప్రభావ వంతమైనవే. ఎందుకంటే జీవాత్మను పరమాత్మునిలో చేర్చుటయే ఈ మార్గములన్నింటి లక్ష్యం. ఏ వ్యక్తికి ఏ మార్గం సులభంగా, మనస్సుకు నచ్చినట్లుంటుందో అదే అతనికి అత్యంత ఉత్తమ మార్గము. అనేక నదులు వివిధ దిశల నుండి వేగంగా ప్రవహిస్తూ చివరగా సముద్రంలో కలసిపోయినట్లే... భక్తి, జ్ఞాన మార్గాల్లో పయనించు వారందరూ చివరిగా చేసే ప్రయత్నం ఒక్కటే. జీవుడు ఏ మూలం నుండి వచ్చాడో, అదే మూలంలోనికి జీవుని చేర్చుటమే భక్తి, జ్ఞాన మార్గాల లక్ష్యం.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

సర్వమూ ఆధ్యాత్మికమే. ఇది ఆధ్యాత్మికం, అది ప్రాపంచికం అని రెండింటి మధ్య గీత గీచి విభజించటం సరైంది కాదు. అలాగే నిత్యజీవితం, ఆధ్యాత్మిక జీవితం వేరు వేరు కాదు. నిత్యజీవితం ఆధ్యాత్మిక జీవితానికి భిన్నంగా ఉండడాన్ని ఎంతవరకు ఊహిస్తావో, అంతవరకు నీ ఆధ్యాత్మిక ప్రగతి మార్గంలో విరోధ భావాలు ఏర్పడుతూనే ఉంటాయి. ప్రతివిషయం పవిత్రమైనదే. చర్యలన్నీ ఒకదానితో ఒకటి సమానంగా ఉంటాయి. జీవితంలో ఒడుదొడుకులు, సుఖ దుఃఖాలు ఒకదాని తర్వాత ఇంకొకటి కలుగుతూనే ఉంటాయి. దీనిలో నీ మానసిక ప్రవర్తన ముఖ్యమైంది. పైన పేర్కొన్న విషయాలన్నింటినీ ఒకే రీతిగా చూడాలంటే గురుకృప, సహాయం కావాలి. తగిన ప్రవర్తనను పెంపొందించుకొని బాధల నుండి విముక్తి పొందటానికై భగవంతుని ప్రార్థిద్దాం.

క్లుప్తంగా...

17 నుంచి పద్మావతీ పరిణయోత్సవాలు



తిరుమల: శ్రీ పద్మావతీ శ్రీనివాసుల పరిణయోత్సవాలు ఈ నెల 17–19 వరకు తిరుమలలో జరగనున్నాయి. నారాయణగిరి ఉద్యానవనాల్లోని పరిణయోత్సవ మండపంలో ఈ వేడుకలను టీటీడీ నిర్వహించనుంది. తొలి రోజు శ్రీ మలయప్పస్వామివారిని గజవాహనం, రెండో రోజు అశ్వవాహనం, చివరిరోజు గరుడవాహనంపై వేంచేపు చేస్తారు. మరోపక్క ఉభయనాంచారులు ప్రత్యేక పల్లకీలలో పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేసి కల్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా 17–19 వరకు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను రద్దు చేశారు.

యాదాద్రి విద్యుత్ ప్లాంట్‌కు కొత్త ఈసీ

- పనుల కొనసాగింపునకు తొలగిన అడ్డంకి

సాక్షి, హైదరాబాద్: యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి పర్యావరణ అడ్డంకులు తొలగిపోయాయి. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ) ఆదేశాలకు అనుగుణంగా ప్రాజెక్టుకు సవరించిన పర్యావరణ అనుమతులను కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ జారీ చేసింది. రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి, జెన్‌కో ఇన్‌చార్జ్ సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఏఎం రిజ్వీ ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్ర పర్యావరణశాఖతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. ఎట్టకేలకు గత నెలలో శాఖలో నిపుణుల మదింపు కమిటీ అదనపు షరతులతో సవరించిన పర్యావరణ అనుమతులను జారీ చేయాలని సిఫారసు చేయగా, ఈ నెల 7న పర్యావరణ శాఖ జారీ చేసింది. రూ.25,099.42 కోట్ల అంచనాలతో ఈ ప్రాజెక్టును గత బీఆర్ఎస్ సర్కారు చేపట్టగా, తర్వాతి కాలంలో అంచనాలు రూ.34,542.95 కోట్లకు ఎగబాకాయి. పొడిగించిన గడువుల మేరకు 2025 మార్చితో ఈ ప్రాజెక్టు పనులను పూర్తి చేయాల్సి ఉంది.

'కాంగ్రెస్‌కే ప్రజల మద్దతు'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి స్థానం లేదని, బీజేపీ, బీఆర్ఎస్‌లు కుమ్మక్కయి చీకటి రాజకీయాలు చేసినా లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ వైపే సంపూర్ణంగా మద్దతు పలికారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి అభిప్రాయపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 14 స్థానాల్లో విజయం సాధిస్తుందని బుధవారం ఒక ప్రకటనలో ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అభినవ గోబెల్స్‌గా మారిపోయారని, అబద్ధాలు ఆడడంతో ఆయన గిన్నిస్ బుక్‌లోకి ఎక్కుతారని విమర్శించారు. బీజేపీ మాటలను తెలంగాణ ప్రజలు నమ్మలేదని ఆ ప్రకటనలో మల్లు రవి స్పష్టం చేశారు.

రాయల మృతి పట్ల కేసీఆర్ సంతాపం

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా సీనియర్ నాయకుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రాయల వెంకట శేషగిరిరావు మరణం పట్ల పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు సంతాపం ప్రకటించారు. శేషగిరిరావుతో దశాబ్దాలకాలంగా తనకున్న రాజకీయ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రైతాంగం, ప్రజలు, పార్టీ కోసం శేషగిరిరావు చేసిన కృషిని ఈ సందర్భంగా కేసీఆర్ స్మరించుకున్నారు. శేషగిరిరావు కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

అన్నదాత ఆగమాగం

యాదాద్రి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం

- ఒకవేళ కొన్నా మిల్లులకు తరలించరు
- కొన్ని లారీల్లో తరలించినా అన్‌లోడింగ్ కాదు
- తేమ, తరుగు పేరుతో తప్పని కోతలు
- అకాల వర్షాలతో ఇప్పటికే తడిసి మొలకెత్తుతున్న ధాన్యం
- తడిసిన ధాన్యం కొనుగోళ్లు ఏవీ?

వర్షం ఎప్పుడు పడుతుందోనన్న భయం ఒకవైపు.. కొనుగోళ్లలో ఎడతెగని జాప్యం మరోవైపు.. కాంటా అయినా ధాన్యం మిల్లుల్లో అన్‌లోడింగ్ చేయకపోవడం, తడిసిన ధాన్యం కొనుగోళ్లపై అనుమానం ఇలా అనేక సమస్యలు అన్నదాతను చుట్టుముట్టాయి. దీంతో కడుపు మండిన రైతు కన్నెర్ర జేశాడు. వడ్లు ఎప్పుడు కొంటారంటూ ఆందోళనకు దిగుతున్నాడు.

సాక్షి, యాదాద్రి: యాదాద్రి భువనగిరి జిల్లాలో ఈ ఏడాది ధాన్యం కొనుగోలు లక్ష్యం 4,16,600 మెట్రిక్ టన్నులు కాగా ఇప్పటివరకు 2,20,7 98 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. ఇప్పటికే తడిసిన ధాన్యం కొనుగోలు కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సహనం నశించి వారం రోజులుగా భువనగిరి జిల్లాలో అక్కడక్కడ రైతులు ఆందోళనకు దిగుతున్నారు. మరోవైపు అకాల వర్షాలతో తడిసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మొలకెత్తుతోంది. పొరుగున ఉన్న నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో కొనుగోళ్లు పూర్తి కావొస్తున్నా ఇక్కడ మాత్రం ఇంకా ఆలస్యమవుతున్నాయి.

మిల్లుల్లో జాగా లేదని...

ఖాళీ స్థలం లేదని చెప్పి మిల్లర్లు ధాన్యం లారీలను మిల్లుల్లో అన్‌లోడింగ్ చేసుకోవడం లేదు. 2022–23 యాసంగి, వానాకాలం, 2024 యాసంగి సీఎంఆర్ 3.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంతోపాటు, ప్రభుత్వం ఈ సంవత్సరం టెండర్లతో విక్రయించిన 1.30 లక్షల మెట్రిక్ టన్నులు మిల్లుల్లోనే ఉన్నాయి. వాస్తవానికి ఈనెల 23వ తేదీలోగా మిల్లుల్లో నుంచి ధాన్యాన్ని కాంట్రాక్టర్ ఖాళీ చేయాలి. ఇంతవరకు ఒక్క క్వింటా ధాన్యం కూడా బయటకెళ్లలేదు. దీంతో ప్రైవేట్‌కు కొందరు రైతులు అమ్ముకున్నారు. అయినా ఇంకా జిల్లాలో 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్మకానికి సిద్ధంగా ఉంది. ప్రస్తుతం జిల్లవ్యాప్తగా ఆయా మిల్లుల్లో 5.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంది.

రోడ్డెక్కుతున్న రైతులు



గూడూరు వద్ద రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోలులో జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బుధవారం బీబీనగర్ మండలం గూడూరులో హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై రైతులు ధాన్యం బస్తాలు తగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ కొనుగోలు కేంద్రానికి 120 మంది రైతులు ధాన్యం తీసుకొచ్చారు. 8 రోజుల క్రితం 40 మంది రైతుల ధాన్యం కాంటా వేసి మిల్లులకు పంపించారు. అక్కడ ఇంకా దిగుమతి కాలేదు. ఇంకా 30 వేల బస్తాల ధాన్యం కాంటా వేసి ఉంచారు. ఇంకా 60 మంది రైతులు కాంటా కోసం ఎదురుచూస్తున్నారు. దీంతో కడుపు మండిన రైతులు రాస్తారోకోకు దిగారు. రెండు గంటల పాటు రైతులు రహదారిపై బైఠాయించడంతో 2 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

● భువనగిరి మండలం ఆకుతోటబావికి చెందిన రైతులు తడిసి మొలకెత్తిన ధాన్యంతో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. ● అడ్డగూడూరు మండలం చౌళ్లరామారం ఐకేపీ కొనుగోలు కేంద్రంలో రైతులు జాతీయ రహదారిపై ధాన్యం పోసి నిరసన తెలిపారు. ● పోలింగ్ రోజు భూదాన్ పోచంపల్లి మండలం జలాల్‌పూర్ రైతులు తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తేనే ఓట్లు వేస్తామని ఆందోళనకు దిగారు. ● ఆలేరు మండలం కొలనుపాకలో ధర్నా చేశారు.

ఆయా జిల్లాల్లో ఇలా

● సంగారెడ్డి జిల్లాలో 1.80 లక్షల మెట్రిక్ టన్నులు టార్గెట్ కాగా, ఇప్పటివరకు 63,400 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. చాలా కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం పేరుతో ప్రతి 40 కిలోల బస్తాకు రెండున్నర కిలోలు కోత విధిస్తున్నారు. ఇది చాలదన్నట్టు తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు వచ్చే లారీల సిబ్బంది రైతుల నుంచి డబ్బు డిమాండ్ చేస్తున్నారు. ఒక్కో ట్రిప్పునకు రూ. రెండు వేల వరకు వసూలు చేస్తున్నారు. ● వరంగల్ జిల్లాలో ఈనెల 12న గాలివాన బీభత్సం సృష్టించడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిముద్దయింది. వడ్ల గింజలు చాలా వరకు వరదలో కొట్టుకుపోయాయి. తడిసిన ధాన్యాన్ని రైతులు కల్లాలు, రోడ్లపై ఆరబోసుకుంటున్నారు. తడిసిన ధాన్యాన్ని కేంద్రాల్లో కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. దీనిపై అధికారులను వివరణ కోరగా తడిసిన ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని చెబుతున్నారు. ● మంచిర్యాల జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. 1.76 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 76,437 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. తూకం వేసిన ధాన్యం మిల్లులకు తరలించకపోవడం, మిల్లులకు వెళ్లిన లారీలు రోజుల తరబడి అక్కడే ఉండడం, అకాల వర్షాలతో ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నారు. తాలు, తప్ప ఉందని తిరకాసుతో బస్తాకు మూడు నాలుగు కిలోల చొప్పున తరుగు తీస్తున్నారనే ఆరోపణలున్నాయి.

నెలరోజులు అవుతోంది



కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసి నెల రోజులు అవుతోంది. వెంట వెంటనే కాంటాలు వేయడం లేదు. వారం రోజుల క్రితం 3 వేల బస్తాలు కాంటా వేసినా మిల్లుకు తరలించలేదు. దీంతో వానకు తడిసి ఎండకు ఎండిపోయాయి. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆందోళనకు దిగుతున్నాం.

– మాధవరెడ్డి, గూడూరు

కొనుగోలు వేగవంతం చేస్తాం

కొనుగోళ్లు వేగవంతం చేస్తాం. మిల్లుల్లో వడ్లు దించుకోవడానికి స్థలం లేనందున జాప్యం జరుగుతోంది. టెండర్ ధాన్యం, సీఎంఆర్ ధాన్యం ఇంకా మిల్లుల్లో ఉంది అయితే జనగామ, హనుమకొండలకు 20 మెట్రిక్ టన్నుల ధాన్యం పంపించడానికి చర్యలు తీసుకున్నాం.

– గోపీకృష్ణ, యాదాద్రి భువనగిరి జిల్లా పౌరసరఫరాల అధికారి

మొత్తం ధాన్యం కొనుగోలు చేస్తాం

- పౌరసరఫరాల శాఖ
- ముస్తాబాద్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, హైదరాబాద్/ముస్తాబాద్: కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో సేకరిస్తామని పౌరసరఫరాల శాఖ తెలిపింది. బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'ధాన్యానికి తేమ కొర్రీ'కథనంపై ప్రభుత్వం స్పందించింది. పౌరసరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డీఎస్ చౌహాన్ ఆదేశాల మేరకు సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా పౌరసరఫరాల అధికారి ఎస్. జితేందర్‌రెడ్డి, ఇతర అధికారులు సందర్శించారు. తమ ధాన్యాన్ని కొనడం లేదని, తేమ పేరుతో కాలయాపన చేస్తున్నారని 'సాక్షి'కి చెప్పిన మీసా పరుశరాములు, రేణుక దంపతులతో వారు మాట్లాడారు. ధాన్యంలో తేమ శాతాన్ని పరీక్షించగా, 12 శాతం ఉన్నట్లు తేలింది. దీంతో ఎందుకు కొనుగోలు చేయలేదని నిర్వాహకులను ప్రశ్నించగా, పరుశరాములు సీరియల్ నంబర్ 103 అని, ఇప్పటివరకు 75 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు అధికారులకు తెలిపారు. నిర్దేశిత తేమ శాతం (17%) వచ్చే వరకు ఆరిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని కేంద్రం నిర్వాహకులను అధికారులు ఆదేశించారు. వచ్చే నాలుగు రోజుల్లో మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేసి, కొనుగోలు కేంద్రాన్ని మూసివేయనున్నట్లు డీఎస్ఓ జితేందర్ రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. ధాన్యం తడిస్తే నిర్దేశిత తేమ శాతం వచ్చేంత వరకు ఆరబెట్టిన తరువాతే కొనుగోలు చేస్తామని పరోక్షంగా స్పష్టం చేశారు.

బొడ్రాయి ప్రతిష్టకు చందా ఇవ్వలేదని..

- 20 కుటుంబాలకు కుల బహిష్కరణ
- భద్రాద్రి జిల్లా వడ్డెర రంగాపురంలో ఘటన

అశ్వారావుపేట రూరల్: బొడ్రాయి ప్రతిష్ట వేడుకకు చందా ఇవ్వలేదని 20 కుటుంబాలను కుల బహిష్కరణ చేసిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం వడ్డెర రంగాపురం గ్రామంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. బహిష్కరణకు గురైన వారికి ఎవరైనా సహకరిస్తే జరిమానా విధిస్తామని కుల పెద్దలు తీర్మానించడంతో బాధిత కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. వడ్డెర రంగాపురంలో సుమారు 120 వడ్డెర కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కొద్ది రోజుల క్రితం గ్రామంలో బొడ్రాయిని ప్రతిష్ఠించాలని నిర్ణయించారు. ఇందుకు రూ.8 లక్షల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ క్రమంలో గ్రామంలోని ప్రతీ ఇంటి నుంచి రూ.3 వేల చొప్పున చందా ఇవ్వాలని తీర్మానించారు. కాగా, గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు తాము క్రైస్తవ మతం స్వీకరించినందున బొడ్రాయి ప్రతిష్టకు చందా ఇవ్వబోమని చెప్పారు. దీంతో ఆగ్రహించిన కుల పెద్దలు ఆ 20 కుటుంబాల వారిని కులం నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో మూడు రోజులుగా తమకు గ్రామస్తులు దూరంగా ఉంటున్నారని, కిరాణా దుకాణాల్లో సరుకులు అమ్మడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై బాధితులు అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు సీఐ జితేందర్‌రెడ్డి తెలిపారు.

రైతులకు ఉచితంగా విత్తనాలు!

- సోయా, వేరుశనగ, నువ్వులు, ఆముదం ఇచ్చే యోచన
- మార్గదర్శకాలు ఖరారు చేస్తున్న అధికారులు
- ఎంత ఖర్చవుతుందన్న దానిపైనా కసరత్తు

సాక్షి, హైదరాబాద్: రైతులకు నూనె గింజలకు సంబంధించిన విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని వ్యవసాయశాఖ సూత్రప్రాయంగా నిర్ణయించింది. సోయాబీన్, వేరుశనగ, నువ్వులు, ఆముదం విత్తనాలు ఉచితంగా ఇచ్చేందుకు అవసరమైన మార్గదర్శకాలు రూపొందిస్తున్నారు. ఉచితంగా ఎంతమందికి ఇవ్వాల్సి వస్తుంది, ఖజానాపై ఏ మేరకు భారం పడుతుందన్న దానిపై ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు పంపింది. ఆయా పంటలు సాగు చేసే రైతులందరికీ ఇవ్వాలా? లేక దీనికి ఏమైనా అర్హతలు నిర్ధారించాలా అన్నదానిపై తర్జనభర్జన పడుతోంది. ఈ వానాకాలం సీజన్‌లో వేరుశనగ 23 వేల ఎకరాల్లో సాగవుతుందని అంచనా ఆ మేరకు 13,800 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయి. అలాగే సోయాబీన్ పంటను 4.96 లక్షల ఎకరాల్లో సాగు చేస్తారు. అందుకోసం 1.49 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం. ఇక 3,500 ఎకరాల్లో సాగయ్యే ఆముదం కోసం 70 క్వింటాళ్ల విత్తనాలు, 500 ఎకరాల్లో సాగయ్యే నువ్వులు కోసం 12.50 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని అధికారులు అంచనా వేశారు. తాజాగా ఆ మేరకు విత్తనాలు ఉచితంగా ఇవ్వాలంటే ఎంత ఖర్చవుతుందనే దానిపై అంచనాలు వేస్తున్నారు. అవసరమైన విత్తనాలను వివిధ ప్రాంతాల నుంచి తెప్పించి రైతులకు ఇవ్వనున్నారు.



60.53 లక్షల ఎకరాల్లో సాగయ్యే చాన్స్

ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో దాదాపు 60.53 లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతుందని అంచనా వేశామని మంత్రి తెలిపారు. దానికి సరిపడా పత్తి విత్తనాలను మే చివరి నాటికి రైతులకు అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. 2021లో 60.53 లక్షలు ఉన్న పత్తి విస్తీర్ణం క్రమంగా తగ్గుతూ 2023లో 45.17 లక్షలకు చేరుకుందని, అయినప్పటికీ ప్రపంచ మార్కెట్లో పత్తికి పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా ఈసారి విస్తీర్ణం పెరిగే అవకాశముందని తెలిపారు. గతేడాది 90 లక్షల ప్యాకెట్ల విత్తనాలు అమ్ముడుపోగా, ఈసారి 1.20 కోట్ల ప్యాకెట్లను మార్కెట్లో అందుబాటులో ఉంచామని వివరించారు.

పత్తి విత్తనాలు అధిక ధరలకు అమ్మితే చర్యలు: మంత్రి తుమ్మల

కేంద్ర ప్రభుత్వం ఈసారి బీజీ–2 పత్తి విత్తన ప్యాకెట్ గరిష్ట ధరను రూ.864.00 గా నిర్ణయించిందని, ఏ డీలరైనా అంతకంటే ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. విత్తన సరఫరాలో ఇబ్బందులు సృష్టిస్తే ఏ కంపెనీని ఉపేక్షించబోమన్నారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ చర్యనూ సహించమని పేర్కొన్నారు. జిల్లాల వారీగా తనిఖీ బృందాలు ఏర్పాటు చేసుకొని, ఎప్పటికప్పుడు అమ్మకాలను పర్యవేక్షిస్తూ నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

అక్రమ నిర్మాణాలపై వివరాలు ఇవ్వండి



సాక్షి, హైదరాబాద్: టేల్స్ ఓవర్ స్పిరిట్స్ అక్రమ నిర్మాణాల ఆరోపణలపై పూర్తి వివరాలు తెలుసుకుని చెప్పాలని జీహెచ్ఎంసీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. అధికారిక ప్రతివాదులతో పాటు టేల్స్ ఓవర్ స్పిరిట్స్‌కు నోటీసులు జారీ చేస్తూ.. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 26కు వాయిదా వేశారు. టేల్స్ ఓవర్ స్పిరిట్స్ నిబంధనలు ఉల్లంఘించి, జీహెచ్ఎంసీ అనుమతి లేకుండా బంజారాహిల్స్‌లో నిర్మా ణాలు చేపట్టిందని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని యూసుఫ్‌గూడ ప్రగతినగర్‌కు చెందిన కొండా చంద్రశేఖర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. టీఎస్ బీపాస్ చట్టానికి విరుద్ధంగా నిర్మాణం చేపట్టడంపై ఏప్రిల్ 15న తాను ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేసేలా జీహెచ్ఎంసీ అధికారులకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ టి.వినోద్‌కుమార్ విచారణ చేపట్టారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ ముఖ్యకార్యదర్శి, కమిషనర్, డైరెక్టర్, జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ డిప్యూటీ కమిషనర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ కమిషనర్‌తో పాటు టేల్స్ ఓవర్ స్పిరిట్స్‌కు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేశారు.

బండి సంజయ్ 'గెట్ టు గెదర్'

- భారీగా తరలివచ్చిన కార్యకర్తలు
- ఫలితాలతో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు దిమ్మ తిరగడం ఖాయం: బండి సంజయ్



గెట్ టు గెదర్‌లో మాట్లాడుతున్న సంజయ్

కరీంనగర్ టౌన్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ బుధవారం రాత్రి కరీంనగర్ వీ–కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన 'గెట్ టు గెదర్'కార్యక్రమానికి వేలాది మంది కార్యకర్తలు తరలివచ్చారు. ఊహించని తాకిడితో వీ–కన్వెన్షన్ మొత్తం జనంతో నిండిపోవడమే కాకుండా రోడ్డు బయట, బొమ్మకల్ బైపాస్‌పైనా జనం బారులుతీరారు. దీంతో బొమ్మకల్ బైపాస్ రోడ్డు మొత్తం స్తంభించింది. ఈ కార్యక్రమానికి వరంగల్, మహబూబాబాద్, నల్లగొండ, పెద్దపల్లి నుంచి పోటీ చేసిన బీజేపీ అభ్యర్థులు ఆరూరి రమేశ్, సీతారాం నాయక్, సైదిరెడ్డి, గోమాస శ్రీనివాస్, బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, ధన్‌పాల్ సూర్యనారాయణ, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.మనోహర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధులు రాణీ రుద్రమదేవి, జెనవాడ సంగప్ప తదితరులు హాజరయ్యారు. ఇది 'గెట్ టు గెదర్'పేరుతో ఏర్పాటు చేసిన కృతజ్ఞత కార్యక్రమమా? లేదా విజయోత్సవ సభనా? అని నేతలు ఆశ్చర్యపోయారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ జూన్ 4న వెలువడే ఫలితాలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతల దిమ్మ తిరగడం ఖాయమన్నారు.

జూన్ మొదటి వారంలో నైరుతి


వచ్చే నెల 1న కేరళను తాకనున్న రుతుపవనాలు

ఆరు రోజుల్లో తెలంగాణకు విస్తరించే అవకాశం

రాష్ట్రంలో ఈసారి సాధారణం కంటే ఎక్కువగానే వర్షపాతం!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. గతేడాదితో పోలిస్తే ఈసారి రాష్ట్రంలో సంతృప్తికర వర్షాలు కురుస్తాయని తెలిపింది. జూన్ మొదటి వారంలోనే రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయని పేర్కొంది. నైరుతి రుతుపవనాల సీజన్‌పై ప్రాథమిక అంచనాలను వాతావరణ శాఖ విడుదల చేసింది. 'సాధారణంగా మే నెల చివరి వారంలో దక్షిణ అండమాన్ సముద్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయి. ఆ తర్వాత రెండు వారాల్లో కేరళను తాకిన తర్వాత క్రమంగా ఇతర ప్రాంతాలకు వ్యాప్తి చెందుతాయి. కానీ ఈ సీజన్‌లో కాస్త ముందుగానే దక్షిణ అండమాన్ సముద్రంలోని నైరుతి రుతుపవనాలు ప్రవేశించే పరిస్థితులు ఎక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలో జూన్ ఒకటో తేదీన కేరళను తాకుతాయి. అవి క్రమంగా వ్యాప్తి చెంది ఆరు రోజుల్లో తెలంగాణలోకి ప్రవేశిస్తాయి..' అని వాతావరణ శాఖ వెల్లడించింది.

బుధవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్‌లలో)



ఎల్‌నినో బలహీనపడే అవకాశం

'ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ మధ్యన నైరుతి రుతుపవనాల సీజన్లో వర్షాలు ఆశాజనకంగా ఉంటాయి. గతేడాది కంటే కాస్త ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రస్తుతం భూమధ్యరేఖ పసిఫిక్ ప్రాంతంలో మధ్యస్థ ఎల్‌నినో పరిస్థితులు నెలకొని ఉన్నాయి. నైరుతి సీజన్ ప్రారంభంలో ఎల్‌నినో పరిస్థితులు బలహీనపడే అవకాశం ఎక్కువగా ఉన్నాయి. దీంతో వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా ఉంటుంది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల సీజన్‌లో కురవాల్సిన సాధారణ వర్షపాతం 72.21 సెంటీమీటర్లు. గత 2021, 2022 సీజన్లలో సాధారణం కంటే 40 శాతం అధిక వర్షాలు నమోదయ్యాయి. అయితే 2023 నుంచి ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం ఒక్కసారిగా తగ్గింది. గతేడాది వానాకాలం సీజన్‌లో సాధారణ వర్ష పాతం నమోదైనప్పటికీ కొన్ని ప్రాంతాల్లో తీవ్ర మైన డ్రైస్పెల్స్, కొన్ని ప్రాంతాల్లో కుండపోత వానలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే సాధారణ వర్షపాతం నమోదు కాగా.. జిల్లాల వారీగా పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. చాలా మండలాల్లోని అనేక ప్రాంతాల్లో లోటు వర్షపాతం నమోదయ్యింది. కాగా ఈసారి నైరుతి సీజన్ ప్రథమార్థంలో ఎల్‌నినో ప్రభావం బలహీనపడి, సీజన్ ప్రారంభం నుంచే వర్షాలు కురుస్తాయని, రాష్ట్రంలో సీజన్ సాధారణ వర్షపాతం 72.21 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతమే నమోదు కావొచ్చని వివ రించింది. నైరుతి సీజన్‌లో 106 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

తేలికపాటి నుంచి మోస్తరు వర్షసూచన

పశ్చిమ విదర్భ, దాని పరిసర ప్రాంతాలలో ఏర్పడిన ఆవర్తనం బుధవారం తూర్పు విదర్భ దాని పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమై ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది. ఇది సముద్ర మట్టం నుంచి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతున్నట్లు తెలిపింది. రాష్ట్రానికి దక్షిణ, ఆగ్నేయ దిశ నుంచి బలమైన గాలులు వీస్తున్నట్లు సూచించింది. రానున్న రెండ్రోజులు రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉందని వివరించింది. బుధవారం రాష్ట్రంలో చాలాచోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి. ప్రధాన నగరాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. నల్లగొండలో 39.5 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత, మెదక్‌లో 21.5 డిగ్రీ సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

జార్ఖండ్ మంత్రి ఆలంగీర్ అరెస్ట్



రాంచీ: కాంగ్రెస్ నేత, జార్ఖండ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఆలంగీర్ ఆలంను మనీ లాండరింగ్ ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు అరెస్ట్ చేశారు. రాంచీలోని జోనల్ కార్యాలయంలో మంగళవారం 9 గంటలపాటు ఆయన్ను విచారించారు. బుధవారం కూడా ఆరు గంటలపాటు విచారించిన అనంతరం కస్టడీలోకి తీసుకున్నారు. గత వారం ఈడీ బృందం రాంచీలోని ఓ ఇంట్లో జరిపిన సోదాల్లో రూ.32 కోట్ల నగదు పట్టుబడటంతో ఇందుకు సంబంధించి ఆలం వ్యక్తిగత కార్యదర్శి, రాష్ట్ర పరిపాలనా విభాగం అధికారి సంజీవ్ కుమార్ లాల్‌తోపాటు ఆయన పనిమనిషి జహంగీర్ ఆలంను అరెస్ట్ చేయడం తెల్సిందే. మంత్రి ఆలంగీర్‌తో పాటు ఇతర పలుకుబడి కలిగిన వ్యక్తుల తరఫున కాంట్రాక్టర్ల నుంచి లాల్ కమీషన్లు వసూలు చేస్తున్నారని ఈడీ ఆరోపిస్తోంది.

జ్యోతిరాదిత్యకు మాతృవియోగం



మాధవీ రాజె

న్యూఢిల్లీ/గ్వాలియర్: కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తల్లి మాధవీ రాజె సింధియా(70) బుధవారం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో కన్నుమూశారు. న్యుమోనియా, సెప్సిస్‌తో బాధపడుతున్న మాధవీ రాజె మూడు నెలలుగా ఎయిమ్స్‌లోనే చికిత్స పొందుతున్నారు. కొన్ని రోజులుగా వెంటిలేటర్‌పై కొనసాగుతున్న ఆమె బుధవారం ఉదయం 9.28 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. నేపాల్ రాజ కుటుంబీకురాలైన మాధవీ రాజె, మధ్యప్రదేశ్‌కు చెందిన ఒకప్పటి గ్వాలియర్ రాజ కుటుంబ వారసుడు, కేంద్ర మాజీ మంత్రి మాధవ్‌రావు సింధియాను 1966లో వివాహమాడారు. ఈ దంపతులకు కుమారుడు జ్యోతిరాదిత్య సింధియా, కుమార్తె చిత్రాంగద రాజె సింగ్ ఉన్నారు. గురువారం ఆమె అంత్యక్రియలు గ్వాలియర్‌లో జరుగుతాయని కుటుంబవర్గాలు తెలిపాయి. మాధవీ రాజె సింధియా మృతిపట్ల ప్రధాని మోదీ సంతాపం ప్రకటించారు. ఆమె మృతి తీరని లోటని పేర్కొన్నారు.

'న్యూస్‌క్లిక్' పురకాయస్థ అరెస్ట్ అక్రమం

కస్టడీ నుంచి విడుదల చేయండి: సుప్రీం



న్యూఢిల్లీ: న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పురకాయస్థ అరెస్ట్ చట్టం దృష్టిలో చెల్లదని పేర్కొంటూ ఆయనను కస్టడీ నుంచి విడుదలచేయాలని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. ''గత ఏడాది అక్టోబర్ నాలుగో తేదీన ఆయన రిమాండ్ ఉత్తర్వులను ఢిల్లీ హైకోర్టు జారీచేయడానికి ముందే పురకాయస్థకు రిమాండ్ దరఖాస్తు ప్రతిని చట్టప్రకారం ఇవ్వాలి. కనీసం ఆయన తరఫు లాయర్‌కు ఆ రిమాండ్ అప్లికేషన్ కాపీని ఇవ్వలేదు. చట్టం దృష్టిలో ఈ రకంగా అరెస్ట్ చెల్లదు. ఆ లెక్కన రిమాండ్‌కు పంపడం కూడా చట్టప్రకారం కుదరదు. అందుకే పంకజ్ బన్సల్ కేసు తరహాలోనే ఈయన విడుదలకు ఆదేశాలిస్తున్నాం'' అని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం పేర్కొంది. దీంతో బుధవారం తిహార్ జైలు నుంచి పురకాయస్థ విడుదలయ్యారు. '' ఈయన అరెస్ట్‌కు, రిమాండ్‌కు ఆదేశాలిస్తూ గతంలో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టేస్తున్నాం. గత ఏడాది అక్టోబర్ మూడున అరెస్ట్ చట్టవ్యతిరేకం కాబట్టి విడుదల వేళ ఆయన ఎలాంటి పూచీకత్తు బాండ్లు సమర్పించాల్సిన అవసరం లేదు. కానీ ఇప్పటికే ఈ కేసులో చార్జిషీట్ కోర్టులో దాఖలుచేసిన కారణంగా ట్రయల్ కోర్టు సంతృప్తిమేరకు బెయిల్ బాండ్లను సమర్పించాలని ఆదేశిస్తున్నాం'' అని కోర్టు వివరించింది.

పిండానికీ జీవించే ప్రాథమిక హక్కుంది

27 వారాల గర్భ విచ్ఛిత్తికి సుప్రీం నో



న్యూఢిల్లీ: 27 వారాల గర్భ విచ్ఛిత్తికి అనుమతించాలంటూ 20 ఏళ్ల అవివాహిత వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. పిండానికి కూడా జీవించే ప్రాథమిక హక్కు ఉందని వ్యాఖ్యానించింది. గర్భవిచ్ఛిత్తికి నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు మే 3వ తేదీన ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బాధితురాలు వేసిన పిటిషన్‌ను బుధవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఎస్ భట్టి, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారించింది. బాధితురాలు నీట్‌కు ప్రిపేరవుతోందని, ఆమె ప్రస్తుతం బయటకు వెళ్లలేని బాధాకరమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఆమె శారీరక, మానసిక శ్రేయస్సును పరిగణనలోకి తీసుకోవాలని ఆమె తరఫు లాయర్ తెలిపారు. స్పందించిన ధర్మాసనం.. 'కడుపులో ఉన్న ఏడు నెలల పిండానికి కూడా జీవించే ప్రాథమిక హక్కు ఉంది. దానిపై మీరేం చెబుతారు? చట్టానికి విరుద్ధంగా ఎటువంటి ఆదేశాలను జారీ చేయలేం' అని పేర్కొంది.

స్లొవాకియా ప్రధానిపై కాల్పులు

- మీటింగ్ నుంచి తిరిగి వెళ్తుండగా దారుణం
- నాలుగైదు రౌండ్లు పేల్చిన దుండగుడు
- తల, ఛాతీ, పొట్టలో గాయాలు, పరిస్థితి విషమం
- పోలీసుల అదుపులో అనుమానితుడు



కాల్పులకు కొద్దిసేపటి ముందు మీడియాతో మాట్లాడుతున్న ఫికో



దుండగుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ప్రేగ్: స్లొవాకియా ప్రధానమంత్రి రాబర్ట్ ఫికో (59)పై హత్యాయత్నం జరిగింది. ఆయన బుధవారం మధ్యాహ్నం హండ్లోవా నగరంలో ఓ ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం తిరిగి వెళ్తూ భవనం బయట గుమిగూడిన అభిమానులకు అభివాదం చేస్తుండగా ఓ దుండగుడు తుపాకీతో ఆయనపై నాలుగైదు రౌండ్లకు పైగా కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడ్డ ఫికోను హుటాహుటిన బాన్స్కా బైస్ట్రికాలోని ఆస్పత్రికి హెలికాప్టర్‌లో తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్టు ప్రధాని అధికారిక ఫేస్‌బుక్ ఖాతాలో పోస్ట్ చేసిన సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. తూటాలు పొట్టలోంచి దూసుకుపోయినట్టు చెబుతున్నారు. ఫికో తలకు, ఛాతీకి కూడా గాయాలైనట్టు ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పారు. ఘటన జరిగిన వెంటనే అనుమానితున్ని ప్రధాని బాడీగార్డులతో పాటు అభిమానులు నిర్బంధించినట్టు సమాచారం. దీన్ని దేశ ప్రజాస్వామ్యంపైనే దాడిగా అధ్యక్షురాలు జుజానా కపుటోవా అభివర్ణించారు. దుండగునిగా భావిస్తున్న 71 ఏళ్ల అనుమానితున్ని అదుపులోకి తీసుకున్నట్టు ప్రకటించారు. అతను రచయిత అని, ప్రత్యర్థి పార్టీకి చెందిన రాజకీయ కార్యకర్త అని రకరకాలుగా వార్తలొస్తున్నాయి. దుండగుడు తన లైసెన్స్‌డ్ తుపాకీతో కాల్పులకు తెగబడ్డట్టు సమాచారం. దాడికి కారణం తెలియరాలేదు. దాడి సమయంలో స్లొవాకియా పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నాయి. ఘటనపై స్పీకర్ ప్రకటన అనంతరం సభ వాయిదా పడింది. మూడు వారాల్లో యూరోపియన్ పార్లమెంట్‌కు ఎన్నికలు జరగనున్నాయి. వాటిలో ఫికో పార్టీతో కూడిన అతివాద పక్షాల కూటమిదే పై చేయి అవుతుందని భావిస్తున్న వేళ ఈ దారుణం చోటుచేసుకుంది. దాడిని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, నాటో ప్రధాన కార్యదర్శి జెన్స్ స్టోల్టెన్‌బర్గ్, ఈయూ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లియన్, పలు దేశాల అధినేతలు తీవ్రంగా ఖండించారు.

రష్యా అనుకూలుడు

ఫికో రష్యా అనుకూలునిగా పేరుబడ్డారు. దేశవ్యాప్తంగా ప్రజాదరణ ఉన్న నాయకుడు. గత సెప్టెంబర్లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో రష్యా అనుకూల, అమెరికా వ్యతిరేక ప్రచారంతో తన జాతీయవాద సంకీర్ణ కూటమికి విజయం సాధించిపెట్టి మూడోసారి ప్రధాని అయ్యారు. వెంటనే ఉక్రెయిన్‌కు సాయాన్ని నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఫికో రాకతో స్లొవాకియా పాశ్చాత్య అనుకూల విధానాలకు తెరపడుతుందని, హంగరీ వంటి యూరప్ దేశాల మాదిరిగా రష్యా అనుకూల వైఖరితో దేశ భద్రతను ఆయన ప్రమాదంలోకి నెడతారని విమర్శకులు అంటున్నారు. ఫికో విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ కొద్ది రోజులుగా రాజధానిలో వేలాదిమంది రోడ్లపైకి వచ్చి ఆందోళనలకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయనపై దాడి జరిగింది. ఫికో, దేశాధ్యక్షుడు కపుటోవా రాజకీయ ప్రత్యర్థులు. ఫికో రాజకీయ మిత్రుడైన పీటర్ పలెగ్రినీ ఇటీవలే అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. దేశ ప్రజాస్వామ్యానికి పొంచి ఉన్న పెను ముప్పుకు ఫికోపై దాడి తాజా ఉదాహరణ అని పలెగ్రినీ అన్నారు. రాజకీయ అభిప్రాయాలను పోలింగ్ బూత్‌ల్లో కాకుండా ఇలా తూటాల ద్వారా వ్యక్తం చేస్తూ పోతే దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు 30 ఏళ్లుగా చేసిన కృషి మట్టిపాలవుతుందని ఆవేదన వెలిబుచ్చారు. చెకస్లొవాకియా 1992లో చెక్ రిపబ్లిక్, స్లొవాకియాగా విడిపోవడం తెలిసిందే.

బైడెన్, ట్రంప్ రె'ఢీ'

డిబేట్‌కు సిద్ధమని ప్రకటించిన అధ్యక్ష అభ్యర్థులు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల సందర్భంగా ఇరు పార్టీల అభ్యర్థులు వాదనలతో ఎదురెదురుగా బలాబలాలు తేల్చుకునే 'చర్చల' అంకానికి డెమొక్రటిక్ అభ్యర్థి జో బైడెన్, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తెరలేపారు. సీఎన్ఎన్ టీవీ ఛానల్‌లో జూన్ 27వ తేదీన, ఏబీసీ ఛానల్‌లో సెప్టెంబర్ పదో తేదీన ఈ డిబేట్‌లు ఉంటాయి. మూడు దశాబ్దాలుగా డిబేట్‌లు నిర్వహించే 'కమిషన్ ఆన్ ప్రెసిడెన్షియల్ డిబేట్'ను కాదని ఈసారి మీడియాసంస్థల ఆధ్వర్యంలో టీవీ ఛానళ్లలో డిబేట్‌కు బైడెన్ ప్రచార బృందం ఓకే చెప్పింది. ''అట్లాంటా స్టూడియోలో ఈ డిబేట్‌ను నిర్వహిస్తాం' అని సీఎన్ఎన్ తెలిపింది. జనం మధ్యలో డిబేట్ జరిపితే బాగుంటుందని ట్రంప్ అన్నారు.

మతం ఆధారంగా బడ్జెట్ కేటాయింపులా?


- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 15 శాతం నిధులు మైనార్టీలకే
- మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారంలో మోదీ ధ్వజం



నాసిక్: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో 15 శాతం నిధులను మైనార్టీలకే కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ కుట్రలు పన్నుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. మతం ఆధారంగా బడ్జెట్ కేటాయింపులను తాము అనుమతించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. అలాగే విద్య, ఉద్యోగాల్లో మతపరమైన రిజర్వేషన్లకు తాము వ్యతిరేకమని స్పష్టంచేశారు. 2004 నుంచి 2014 దాకా కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు బడ్జెట్‌లో 15 శాతం నిధులను వారికి ప్రీతిపాత్రమైన ఓటు బ్యాంక్‌కు కట్టబెట్టడానికి ప్రయత్నించిందని చెప్పారు. అప్పట్లో బీజేపీ గట్టిగా ప్రతిఘటించడంతో కాంగ్రెస్ వెనక్కి తగ్గిందని పేర్కొన్నారు. ఆ సమయంలో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న తాను కాంగ్రెస్ ప్రతిపాదనను వ్యతిరేకించానని తెలిపారు. కానీ, మైనార్టీలకు 15 శాతం నిధుల ఆలోచనను కాంగ్రెస్ ఇప్పటికీ విరమించుకోలేదని, ఒకవేళ కేంద్రంలో అధికారంలోకి వస్తే అమలు చేయాలని యోచిస్తోందని విమర్శించారు. బుధవారం మహారాష్ట్రలోని పింపాల్‌గావ్ బస్వంత్, థానే పట్టణాల్లో లోక్‌సభ ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. మతం ఆధారంగా బడ్జెట్ కేటాయింపులు అనేది చాలా ప్రమాదకరమైన ఆలోచన అని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మత ఆధారంగా దేశాన్ని ఇప్పటికే ఒకసారి విభజించిందని, మరోసారి అలాంటి పథకమే రచిస్తోందని ధ్వజమెత్తారు. తాము మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. గత పదేళ్లలో తమ ప్రభుత్వం సాధించిన ఘనతలను ప్రధానమంత్రి ప్రస్తావించారు. ఇప్పుడు జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలు కేవలం ఎంపీలను ఎన్నుకోవడం కోసం కాదని అన్నారు. దేశం కోసం బలమైన నిర్ణయాలు తీసుకొనే సామర్థ్యం గల ప్రధానమంత్రిని ఎన్నుకోవడానికి జరుగుతున్నాయని ఉద్ఘాటించారు. ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని వివరించారు. గత పదేళ్లలో తన పని తీరును ప్రజలు గమనించారని. వికసిత్ భారత్ కోసం తనను మూడోసారి గెలిపించాలని కోరారు.

కేజ్రీవాల్‌కు స్పెషల్ ట్రీట్‌మెంట్ !

- చాలా మంది ఇలాగే భావిస్తున్నారు
- కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు బెయిల్‌పై అమిత్ షా వ్యాఖ్య



న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం విధానంలో అవకతవకలు జరిగాయంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్ట్ చేసిన అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు ఇచ్చిన బెయిల్ సాధారణ 'ప్రక్రియ'లాగా లేదని బీజేపీ అగ్రనేత అమిత్ షా వ్యాఖ్యానించారు. బుధవారం ఏఎన్ఐ వార్తాసంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అమిత్ షా పలు అంశాలపై మాట్లాడారు. ఇంటర్వ్యూ విశేషాలు ఆయన మాటల్లోనే..

జడ్జీలు ఇది గమనించాలి

''కేజ్రీవాల్‌కు ఎన్నికల సందర్భంగా బెయిల్ రావడం చూస్తుంటే సుప్రీంకోర్టు ఆయన విషయంలో స్పెషల్ ట్రీట్‌మెంట్ ఇచ్చినట్లు అనిపిస్తోంది. ఈ మాట నేను అనట్లేదు. దేశవ్యాప్తంగా చాలా మంది ఇలాగే భావిస్తున్నారు. విపక్షాల కూటమి అధికారంలోకి వస్తే తాను మళ్లీ జైలు కెళ్లాల్సిన అవసరం రాదని బెయిల్ తర్వాత కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ వ్యాఖ్యలు పూర్తిగా కోర్టు ధిక్కారమే. ఎవరైనా ఎన్నికల్లో గెలిస్తే వాళ్లను సుప్రీంకోర్టు జైలుకు పంపదని ఆయన మాటల్లోని అసలు అర్థం. ఆయన మాటలు విన్నాక అయినా ఆయనకు బెయిల్ ఇచ్చిన జడ్జీలు.. కేజ్రీవాల్ బెయిల్‌ను ఎలా వాడుకుంటున్నారు, ఎంతగా దుర్వినియోగం చేస్తున్నాడు అనే విషయాన్ని గమనించాలి'' అని షా విజ్ఞప్తిచేశారు.

బెయిల్ తీర్పుపై..

''చట్టాన్ని ఏ కేసుల్లో ఎలా ఆపాదించాలో సర్వోన్నత న్యాయస్థానానికి బాగా తెలుసు. అయితే ఈ ఒక్క కేజ్రీవాల్ బెయిల్ విషయంలో మాత్రం కోర్టు ఇచ్చిన తీర్పు మిగతా తీర్పుల్లా సాధారణంగా అనిపించట్లేదు. దేశ జనాభాలో చాలా మంది మనసుల్లో ఇలాంటి భావనే నెలకొంది. తిహార్ జైలు అమర్చిన కెమెరాల సీసీటీవీ ఫుటేజీ నేరుగా ప్రధాని మోదీకి వెళ్తుందని కేజ్రీవాల్ ఆరోపించారు. అది పూర్తిగా అబద్ధం. ఎందుకంటే తిహార్ జైలు కేంద్రం అధీనంలో ఉండదు. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో పనిచేస్తుంది అని వివరించారు.

ప్రధానిగా మోదీ రిటైర్మెంట్‌పై

''వచ్చే ఏడాదికి మోదీకి 75 ఏళ్లు వస్తాయి. 75కి చేరినందుకు బీజేపీ నియమావళి ప్రకారం మోదీని పక్కనబెట్టి అమిత్‌షాను ప్రధాని చేయాలని చూస్తున్నారని కేజ్రీవాల్ ఆరోపించారు. అదంతా అబద్ధం. ఇప్పుడు, ఎప్పుడూ మోదీయే మా ప్రధాని అభ్యర్థి. మేం గెలిచాక 2029 ఏడాదిదాకా మోదీయే ప్రధానిగా కొనసాగుతారు. ఆయన సారథ్యం, మార్గదర్శకత్వంలోనే 2029 సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారానికి వెళ్తాం'' అని అమిత్ అన్నారు.

పీవోకే మనదే వెనక్కి తీసుకొస్తాం: షా

కోల్‌కతా: పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే) ముమ్మాటికీ భారత్‌లో అంతర్భాగమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టంచేశారు. పీఓకేను వెనక్కి తీసుకొస్తామని ప్రకటించారు. పీఓకే ప్రస్తుతం నిరసనలతో అట్టుడికిపోతోందని, అక్కడి ప్రజలు స్వాతంత్ర్యం కోరుకుంటున్నారని చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో గతంలో జనం ఆజాదీ కోసం నినదించేవారని గుర్తుచేశారు. 2019లో ఆర్టికల్ 370 రద్దయ్యాక అవన్నీ ఆగిపోయాయని చెప్పారు. పీఓకే మన దేశంలో కలిసిపోతే అక్కడ శాంతి నెలకొంటుందని శ్రీరాంపూర్ (బెంగాల్) ప్రచార సభలో అన్నారు.

400కుపైగా సీట్లొస్తే ఇండియాలో పీఓకే విలీనం: అస్సాం సీఎం

రామ్‌గఢ్: బీజేపీకి 400కు పైగా స్థానాలు లభిస్తే పీఓకేను ఇండియాలో విలీనం చేయడం తథ్యమని అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ వెల్లడించారు. బుధవారం జార్ఖండ్‌లోని రామ్‌గఢ్‌లో ఎన్నికల ప్రచారంలో హిమంతబిశ్వ శర్మ ఈ వ్యాఖ్యలు చేశారు. శ్రీకృష్ణ జన్మభూమి ఆలయం, జ్ఞానవాపీ ఆలయం నిర్మించడానికి బీజేపీకి 400కుపైగా సీట్లు కావాలన్నారు.

హెచ్1-బీ వీసాదారులకు తీపికబురు

- ఉద్యోగం పోతే 60 రోజులకు పైగా అమెరికాలో ఉండొచ్చు
- వీసా స్టేటస్‌ను మార్చుకొనే అవకాశం

వాషింగ్టన్: అమెరికాలోని ఐటీ కంపెనీలు ఉద్యోగాల్లో కోత విధిస్తున్నాయి. గూగుల్, మెటా, ఆపిల్, డెల్, ట్విటర్, అమెజాన్, మైక్రోసాఫ్ట్ వంటి ప్రఖ్యాత కంపెనీల్లో ఉద్యోగాల కోత కొనసాగుతోంది. నాన్-ఇమ్మిగ్రెంట్లను తొలగిస్తున్నాయి. ఫలితంగా వేలాది మంది ఉద్యోగాలు కోల్పోతున్నారు. ఈ ఏడాది ఇప్పటిదాకా అమెరికాలో 237 ఐటీ కంపెనీలు 58,499 మందిని తొలగించాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. లే-ఆఫ్‌ల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ప్రధానంగా హెచ్-1బీ వీసాలతో అమెరికా ఐటీ కంపెనీల్లో పని చేస్తున్న భారతీయుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. కంపెనీ యాజమాన్యం జాబ్ నుంచి తొలగిస్తే 60 రోజుల్లోగా మరో ఉద్యోగం వెతుక్కోవాలి. లేకపోతే స్వదేశానికి వెళ్లిపోవాల్సిందే. ఇలాంటి వారికి యూఎస్ సిటిజెన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) తీపి కబురు అందించింది. హెచ్-1బీ వీసాదారులు ఉద్యోగం పోతే 60 రోజులు దాటినా కూడా అమెరికాలోనే చట్టబద్ధంగా ఉండొచ్చని వెల్లడించింది. అయితే, నాన్-ఇమిగ్రెంట్ వీసా స్టేటస్ మార్చుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అమెరికాలోనే ఉన్న జీవిత భాగస్వామిపై డిపెండెంట్‌గా మారొచ్చు. అంటే హెచ్-4, ఎల్-2 వీసా పొందొచ్చు. ఈ వీసాలు ఉన్నవారికి పని చేసుకొనేందుకు(వర్క్ ఆథరైజేషన్) అనుమతి లభిస్తుంది. స్టూడెంట్(ఎఫ్-1), విజిటర్ (బి-1/బి-2) స్టేటస్ కూడా పొందొచ్చు. కానీ, బి-1/బి-2 వీసా ఉన్నవారికి పని చేసుకొనేందుకు అనుమతి లేదు. 60 రోజుల గ్రేస్ పిరియడ్‌లోనే వీసా స్టేటస్ మార్పు కోసం దరఖాస్తు చేసుకోవాలని యూఎస్‌సీఐఎస్ సూచించింది.

రాజ్యాంగ పరిరక్షణే ప్రధానం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: తాను మళ్లీ జైలుకెళ్తే ఎలాగ అనే విషయం వదిలేసి రాజ్యాంగ పరిరక్షణ మీదే దృష్టిపెట్టాలని, అది మీ బాధ్యత అని ఓటర్లకు ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ హితవు పలికారు. బుధవారం చాందినీ చౌక్, నార్త్‌వెస్ట్ ఢిల్లీ కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ప్రచార రోడ్‌షోలో కేజ్రీవాల్ ప్రసంగించారు. ' హరియాణా, ఉత్తరప్రదేశ్.. ఇలా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో వాకబు చేశా. దేశవ్యాప్తంగా చూస్తే బీజేపీ గెలవబోయే సీట్లు బాగా తగ్గిపోతున్నాయి. విపక్షాల 'ఇండియా' కూటమి అధికారంలోకి రాగానే దేశాభివృద్ధి కోసం పని మొదలుపెడతాం. దీంతో నియంతృత్వం అంతమవుతుంది. నేను మళ్లీ జైలుకెళ్తే ఎలాగ అన్న ఆలోచనలు పక్కనపడేయండి. రాజ్యాంగ పరిరక్షణే అత్యావశ్యకం. అది మీ బాధ్యత'' అని ఓటర్లకు హితవు పలికారు.



ఢిల్లీలో ఓ మహిళకు పౌరసత్వ సర్టిఫికెట్‌ను అందజేస్తున్న హోం శాఖ కార్యదర్శి అజయ్

సీఏఏ ద్వారా పౌరసత్వం సర్టిఫికెట్ల జారీ

న్యూఢిల్లీ: శరణార్థులుగా భారత్‌కు వచ్చిన మూడు దేశాలకు చెందిన ముస్లిమేతర కాందిశీకులకు భారత పౌరసత్వం ఇచ్చే ప్రక్రియ మొదలైంది. పౌరసత్వ(సవరణ)చట్టం (సీఏఏ) కింద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో తొలి విడతగా 14 మందికి బుధవారం ఢిల్లీలో స్వయంగా కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా సర్టిఫికేట్లు అందజేశారు. ఆన్‌లైన్‌లో వందలాది మందికి డిజిటల్ సంతకంతో కూడిన సర్టిఫికెట్లను కేంద్రం ఈమెయిల్ ద్వారా పంపింది. సంబంధిత చట్టం అమల్లోకి వచ్చినట్లు రెండు నెలల క్రితం కేంద్రం నోటిఫై చేసిన తర్వాత పౌరసత్వం ఇవ్వడం ఇదే తొలిసారి. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అధికార, విపక్ష పార్టీలు పలు అంశాలపై పరస్పర విమర్శలు గుప్పించుకుంటున్న ఈ తరుణంలో మోదీ సర్కార్ పౌరసత్వాల జారీ ప్రక్రియ చేపట్టడం గమనార్హం. ''పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌లో మతపర వివక్ష, దాడులకు గురైన వారు దశాబ్దాలుగా భారత పౌరసత్వం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుంది' అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. '' భారత పౌరసత్వం పొందడం గొప్ప అనుభూతినిస్తోంది. భారత్ నాకు కొత్త జీవితాన్ని ప్రసాదించింది'' అని 24 ఏళ్ల భరత్‌కుమార్ అన్నారు. 11 ఏళ్ల క్రితం పాక్‌లోని సింధ్ నుంచి భారత్‌కు వచ్చిన భరత్ బుధవారం పౌరసత్వం తీసుకున్న వారిలో ఉన్నారు.



ఎన్నికల విచిత్రం

ఈయన పేరు బీకే శర్మ. పంజాబ్‌లోని అమృత్‌సర్ జిల్లాలో రోడ్డు పక్కన దాబా నడుపుకుంటున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో అమృత్‌సర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి స్వతంత్రునిగా పోటీ చేస్తున్న బీకే శర్మ బుధవారం తన సొంత దాబాలో ఎప్పటిలాగానే ఇలా వంట చేస్తూ కనిపించారు..!

ఎలక్షన్ బీట్

వారణాసిలో రంగీలా నామినేషన్ తిరస్కరణ

వారణాసి: ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి లోక్‌సభ స్థానానికి కమెడియన్ శ్యామ్ రంగీలా వేసిన నామినేషన్‌ను తిరస్కరించినట్లు బుధవారం ఎన్నికల కమిషన్ ప్రకటించింది. అచ్చం ప్రధాని మోదీలా మాట్లాడుతూ శ్యామ్ రంగీలా బాగా పేరు తెచ్చుకున్నాడు. వారణాసిలో ప్రధాని మోదీపై పోటీకి దిగుతానని ఎప్పటి నుంచో ఇతడు చెబుతున్నాడు. అయితే, మే 10వ తేదీ నుంచి నామినేషన్ పేపర్లను ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నా అధికారులెవరూ స్పందించడం లేదని చెప్పాడు. మోదీ నామినేషన్ వేసిన ఈ నెల 14వ తేదీన, కనీసం కలెక్టరేట్ ఆవరణలోకి కూడా తనను రానివ్వలేదని వాపోయాడు. ఎట్టకేలకు సాయంత్రం తన నామినేషన్ పత్రాలను అధికారులు తీసుకున్నారని సోషల్ మీడియాలో ప్రకటించాడు. ఆ మరునాడే అతడి నామినేషన్‌ను తిరస్కరిస్తున్నట్లు ఈసీ తన వెబ్‌సైట్‌లో తెలిపింది. కారణాలను మాత్రం వివరించలేదు. తనను పోటీ చేయనివ్వరాదని ఈసీ ముందే నిర్ణయించుకున్న విషయం దీంతో రుజువైందని 'ఎక్స్' వేదికగా శ్యామ్ వ్యాఖ్యానించాడు.

కూటమికి బయటి నుంచి మద్దతు: మమత

కోల్‌కతా: కాంగ్రెస్‌తో సీట్ల ఒప్పందంలో విభేదాలు రావడంతో ఇండియా కూటమిలో చేరేందుకు ససేమీరా అన్న , తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ కాస్త మెత్తబడ్డారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధిస్తే.. తాము బయటి నుంచి మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. 'ఇండియా కూటమికి నాయకత్వాన్ని అందిస్తాం. బయటి నుంచే అవసరమైన అన్నివిధాలుగా సహాయపడతాం. కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. అప్పుడు బెంగాల్‌లోని మా తల్లులు, అక్కాచెల్లెళ్లకు ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా ఉంటాయి. 100 రోజుల ఉపాధి హామీ పథకంలో పనిచేసే వారికీ ఎలాంటి సమస్యలూ రావు' అని మమత బుధవారం అన్నారు. అయితే ఇండియా కూటమికి మమత తనదైన కొత్త నిర్వచనాన్ని ఇచ్చారు. అందులో సీపీఎం. అధిర రంజన్ చౌదరి నేతృత్వంలోని బెంగాల్ కాంగ్రెస్ భాగస్వాములు కావన్నారు. సీపీఎం, బెంగాల్ కాంగ్రెస్‌లు తమతో లేవని, బీజేపీతో కలిసి పనిచేస్తున్నాయని ఆరోపించారు.

మతం పేరుతో ఏమార్చుతోంది: ప్రియాంక

రాయ్‌బరేలీ: ఎన్నికల ప్రచారంలో మతం ప్రస్తావన తెస్తూ బీజేపీ ప్రజల దృష్టిని మరల్చుతోందని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ ఆరోపించారు. మతం పేరుతో అధికారంలోకి రావొచ్చనే విషయం గ్రహించిన బీజేపీ..గత పదేళ్లుగా ప్రజల సమస్యలను పట్టించుకోలేదని ఆమె ఆరోపించారు. బుధవారం ఆమె రాయ్‌బరేలీలో ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 'దేశంలో రెండు రకాలైన రాజకీయాలు నడుస్తున్నాయి. అందులో ఒక వర్గం నిజాయతీ, అంకితభావంతో ప్రజలకోసం పనిచేయాలని భావిస్తుండగా మరో వైపు బీజేపీ ప్రజల మనోభావాలను వాడుకుంటూ మతం పేరుతో అధికారంలో కొనసాగుతోంది'అని ఆమె అన్నారు. తమకే ఓట్లేయించాలంటూ రాయ్‌బరేలీలోని గ్రామ పెద్దలను బీజేపీ బెదిరింపులకు గురిచేస్తోందని ప్రియాంక ఆరోపించారు.

ప్రభుత్వరంగం ప్రైవేట్‌పరం

బీజేపీపై రాహుల్ గాంధీ ఆరోపణలు

బలాంగీర్(ఒడిశా): బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా ప్రభుత్వరంగాన్ని ప్రైవేటీకరిస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. బుధవారం ఒడిశాలోని బాలాంగీర్ పట్టణంలో ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ మాట్లాడారు. రాజ్యాంగ ప్రతిని చూపిస్తూ.. '' బీజేపీ ఈ పుస్తకాన్ని చించిపడేయాలని చూస్తోంది. బీజేపీ అందుకు ప్రయత్నిస్తే కాంగ్రెస్‌తోపాటు దేశ ప్రజలంతా ఆ పని జరగకుండా అడ్డుకుంటారు. దేశంలోని పేదలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు, రైతులు, కార్మికులు ఎలాంటి లబ్ధిపొందినా అది రాజ్యాంగం వల్లే సాధ్యమైంది. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్‌ను రద్దుచేస్తారు. ప్రభుత్వరంగమంతా ప్రైవేట్‌పరం చేస్తారు. 22 మంది బిలియనీర్లే దేశాన్ని పాలిస్తారు. అందుకే ప్రజాప్రభుత్వం ఏర్పడాల్సిన సమయం వచ్చిందని పదేపదే చెబుతున్నాం'' అని అన్నారు.

దక్షిణాదిన బీజేపీ మాయం: జైరాం రమేశ్

రాంచీ: లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో ప్రధాని మోదీ పదవి నుంచి దిగిపోవడం ఖాయమని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ జోస్యం చెప్పారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ 'ఇప్పటి వరకు జరిగిన పోలింగ్ సరళిని చూసి మోదీలో నిరాశ కనిపిస్తోంది. అమిత్ షా సైతం హోం మంత్రి పదవి నుంచి తప్పుకుంటారు. వీరిద్దరి ప్రచారం 'మోదీ కీ గ్యారెంటీ, వికసిత్ భారత్' బదులుగా ఇప్పుడు మొత్తం హిందూ-ముస్లిం కేంద్రంగానే సాగుతోంది. ఈ అబద్ధాల మహమ్మారిని జూన్ 4 తర్వాత వదిలించుకోబోతున్నాం'అని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా, బీజేపీ దక్షిణాదిన తుడిచిపెట్టుకుపోతుందని, మిగతా చోట్ల ఆ పార్టీకి సగం సీట్లు మాత్రమే దక్కుతాయని ఆయన తెలిపారు.

మేమొస్తే 10 కేజీల ఉచిత బియ్యం: ఖర్గే

లక్నో: కేంద్రంలో 'ఇండియా' కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేదలకు నెలకు 10 కిలోల చొప్పున బియ్యం ఉచితంగా అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం 5 కిలోలు మాత్రమే ఇస్తోందని, తమ ప్రభుత్వం వచ్చాక రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చారు. దేశంలో ఆహార భద్రత చట్టాన్ని తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. బుధవారం ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌తో కలిసి ఖర్గే మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటకలో పేదలకు 10 కిలోల బియ్యం ఉచితంగా ఇస్తున్నట్లు గుర్తుచేశారు. కేంద్రంలో తమ ప్రభుత్వం వస్తే దేశమంతటా అమలు చేస్తామన్నారు.

అమిత్ షాతో శ్రీకళారెడ్డి భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన బీఎస్పీ నేత శ్రీకళారెడ్డి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. బుధవారం తన ఎక్స్ ఖాతా వేదికగా ఈ విషయాన్ని ప్రకటించడంతో రాజకీయం వేడెక్కింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ప్రధాని మోదీ జౌన్‌పూర్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఇదే సభలో ప్రధాని మోదీ సమక్షంలో ఆమె బీజేపీలో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. తెలంగాణకు చెందిన శ్రీకళారెడ్డి జౌన్‌పూర్‌కు చెందిన బలమైన నేత, బీఎస్పీ మాజీ ఎంపీ ధనంజయ్ సింగ్ భార్య. శ్రీకళారెడ్డిని జౌన్‌పూర్ అభ్యర్థిగా బీఎస్పీ ప్రకటించింది. కానీ ఆ తర్వాత ఎందుకో బరిలోనుంచి తప్పించి సిట్టింగ్ ఎంపీ శ్యామ్‌సింగ్ యాదవ్‌కు మళ్లీ టికెట్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో శ్రీకళారెడ్డి కేంద్రమంత్రి అమిత్ షాను బుధవారం కలిశారు.

సాక్షి
కరీంనగర్
గురువారం । 16 । మే । 2024



క్వింటాల్ పత్తి రూ.7,150

జమ్మికుంట: పత్తి మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర గరిష్ఠంగా రూ.7,150 పలికింది. బుధవారం మార్కెట్‌కు ఎనిమిది వాహనాల్లో 95 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు.



తోటలో పేలిన తూటా

సిరిసిల్ల : తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష చాటిన 'జనశక్తి' వీరన్న ఎన్‌కౌంటర్‌కు పాతికేళ్లు పూర్తయ్యాయి.

8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
39.0/28.0

వాతావరణం

వాతావరణం ఎండగా ఉంటుంది. వడ గాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది. స్వల్పంగా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఆశ వర్కర్లకు టీఏ, డీఏ ఇవ్వాలి



కరీంనగర్: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించిన ఆశ వర్కర్లకు టీఏ, డీఏ ఇవ్వాలని కోరుతూ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం డీఆర్వో పవన్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ సొంతూరిలో కాకుండా ఇతర ప్రాంతాల్లో ఎన్నికల విధులు నిర్వహించిన ఆశ వర్కర్లు తమ చేతిలో నుంచి ఆటో కిరాయి, టిఫిన్, భోజనం ఖర్చులు పెట్టుకున్నారని, ఒక్కొక్కరికి రూ.500 వరకు ఖర్చు అయ్యిందన్నారు. ఈ విషయమై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తే పక్క జిల్లాలైన జగిత్యాల, సిరిసిల్ల ప్రాంతాల్లో టీఏ, డీఏలు ఇచ్చారని, కరీంనగర్ జిల్లాలోని ఆశవర్కర్లకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆశవర్కర్లకు టీఏ, డీఏ చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు సరిత, వెంకటలక్ష్మీ, అంజలి, ప్రియాంక, భాగ్య, లక్ష్మి, శోభ పాల్గొన్నారు.

30 శాతం ఆదాయం పెంచాలి



కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థకు రావాల్సిన ఆదాయాన్ని పెంచాలని కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం నగర పాలకసంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. బల్దియా ఆదాయాన్ని కనీసం 30శాతం పెంచాలని ఆదేశించారు. పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వర్షాకాలం సీజన్ రానుండడంతో హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇందుకు సంబంధించి గురువారం పూర్తిస్థాయిలో సమీక్ష నిర్వహిస్తామని, సన్నద్ధమై రావాలని అధికారులను ఆదేశించారు. నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ జనార్దన్, ఎస్‌ఈ మహేందర్, శానిటరీ సూపర్‌వైజర్ రాజమనోహర్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ అభివృద్ధి పనులు త్వరగా చేపట్టాలి



కొత్తపల్లి: టీఎస్‌ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ పరిధిలో విద్యుత్ అభివృద్ధి పనులు త్వరగా చేపట్టాలని ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్ సూచించారు. ఎస్‌ఈ చాంబర్‌లో బుధవారం కరీంనగర్ సర్కిల్ పరిధిలోని కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఎన్పీడీసీఎల్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టర్లు సమన్వయంతో, అధికారికంగా ఎల్‌సీ తీసుకుని అత్యవసర పనులు వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈలు విజయేందర్‌రెడ్డి, రాజం, తిరుపతి, ఏడీలు ఎస్.నరేందర్, సుధీర్ కుమార్, కె.రాజు, శ్రీనివాస్‌రెడ్డి, సీహెచ్ ప్రశాంత్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్వర్ణోత్సవాలు



జమ్మికుంట: పట్టణంలోని కేవీకే(కృషి విజ్ఞాన కేంద్రం)లో స్వర్ణోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన కార్యక్రమంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. వాతావరణం, వ్యవసాయంలో వచ్చే మార్పులు గమనించి, అందుకనుగుణంగా చేపట్టాల్సిన విధానాలు, వివిధ పంటలపై వివరించారు. ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేయాలని, నేలను రక్షించుకోకపోతే భావితరాలకందించడానికి ఏం మిగలదని, నేల, నీరు, ప్రకృతిని కాపాడుకోవాలన్నారు. వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాలైన చేపల పెంపకం, నాటు కోళ్లు, పాడి పెంపకంపై రైతులు దృష్టి సారించాలని, తద్వారా ఆర్థిక లాభాలు చేకూరుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు ప్రభాకర్, ప్రశాంతి, వేణుగోపాల్, విజయ్, శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్, రైతులు, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

చేతులెత్తేశారా?

- సమ్మర్ క్యాంప్‌లు ఉన్నట్టా.. లేనట్టా?
- 2017 నుంచి గతేడాది వరకు నిర్వహించిన నగరపాలక సంస్థ
- ప్రస్తుతం ఆటల ఊసెత్తని బల్దియా
- ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు, చిన్నారులు
- ఇప్పటికే సగం వేసవి సెలవులు పూర్తి
- మిగిలిన రోజుల్లో అయినా నిర్వహించాలంటున్న సిటీ ప్రజలు



కరీంనగర్‌స్పోర్ట్స్:

ఏడేళ్ల వ్యవధిలో ఐదు పర్యాయాలు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించిన కరీంనగర్ నగరపాలక సంస్థ ఈసారి క్యాంపుల నిర్వహణపై చేతులెత్తేసినట్లేనా అని సిటీ ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల బిజీలో ఉన్నామని బల్దియా అధికారులు చెబుతుండగా.. పక్కజిల్లాలో పక్షం రోజుల నుంచే శిబిరాలు నిర్వహించడం విశేషం. క్రీడలకోటగా పేరుగాంచిన కరీంనగర్ జిల్లాకేంద్రంలో వేసవి క్రీడా శిబిరాలు నిర్వహించకపోవడంపై తల్లిదండ్రులు, చిన్నారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమ్మర్ క్యాంపులపై బల్దియా అధికారులు చేతులెత్తేశారా..? అనే అనుమానం వ్యక్తపరుస్తున్నారు.

2017 నుంచి ఉచిత శిక్షణ

వేసవిసెలవుల్లో ఇంటిపట్టునే ఉంటున్న చిన్నారులకు కరీంనగర్ నగరపాలక సంస్థ 2017 నుంచి ఉచిత క్రీడాశిక్షణ శిబిరాలు జిల్లా క్రీడాశాఖ సహకారంతో నిర్వహిస్తోంది. నగరంలోని అంబేడ్కర్ స్టేడియంలో ఆసక్తి ఉన్న క్రీడాంశాల్లో చిన్నారులు శిక్షణ పొందారు. ఈ ఏడాది వేసవి సెలవులు సగం పూర్తయినా నగరపాలక సంస్థ క్రీడా శిబిరాలపై ఎలాంటి ప్రకటన చేయలేదు. శిబిరాల్లో 2017లో 15క్రీడాంశాల్లో సుమారు 1,500 మంది, 2018లో 20క్రీడల్లో 2500మంది, 2019లో 22 క్రీడాంశాల్లో 3వేల మంది, 2022లో 27 క్రీడల్లో సుమారు 3,200 మంది, 2023లో 28 క్రీడల్లో సుమారు 3వేల మంది వరకు శిక్షణ తీసుకున్నారు. వేల మందికి తర్ఫీదునిచ్చిన నగరపాలక సంస్థ ప్రస్తుతం శిబిరాల ఊసెత్తకపోవడం విడ్డూరం. ఈసారి వేసవి క్రీడా శిబిరాలు నిర్వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి సిద్ధారెడ్డి వినతిపత్రం ఇచ్చినా లాభం లేకుండా పోయింది.

సిరిసిల్లలో జోరుగా...

సిరిసిల్లలో జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో మే 3నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 10 గ్రామీణ ప్రాంతాల్లో శిబిరాలు ఏర్పాటు చేయగా సిరిసిల్లలో అదనంగా 10 క్రీడాంశాల్లో కోచ్‌లను నియమించి శిక్షణ ఇస్తున్నారు. క్రీడల్లో తెలంగాణకు తలమానికంగా నిలిచిన కరీంనగర్‌లో శిబిరాలు నిర్వహించకపోవడంపై పలువురు ఆందోళన చెందుతున్నారు. సిరిసిల్ల జిల్లా తరహాలో ఇక్కడా శిబిరాలు నిర్వహించాలని చిన్నారులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

కోచ్‌లకు అందని గౌరవ వేతనం

శిక్షణశిబిరాల్లో కోచింగ్ ఇచ్చిన కోచ్‌లకు గౌరవ వేతనం ఇవ్వడం ఆనవాయితీ. 2023 మే నెలలో 28 క్రీడాంశాల్లో సుమారు 70 మందికిపైగా కోచ్‌లు చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. వీరికి ఇస్తామన్న గౌరవవేతనం రూ.10వేలు నేటికీ ఇవ్వలేదు. ప్రైవేటు పాఠశాలల్లో అరకొర వేతనాలతో పీఈటీలుగా పనిచేస్తున్నాం.. వేసవి సెలవుల్లో అందరూ ఎంజాయ్ చేస్తుంటే మే మాత్రం చిన్నారులకు శిక్షణ ఇచ్చాం. ఇచ్చిన శిక్షణకు గౌరవ వేతనం ఇవ్వాలని కోచ్‌లు కోరుతున్నారు.

ఏటా జూడోలో..



ప్రతీ సమ్మర్‌లో మా బాబు జూడోలో కోచింగ్ తీసుకున్నాడు. ఐదుసార్లు నిర్వహించగా ప్రతీసారి హాజరయ్యాడు. ఈ వేసవిలో కూడా పంపిస్తానని అనుకున్న. సమ్మర్ క్యాంప్‌లు ఇంకా ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా ప్రారంభించాలి.

– కోడూరి సత్యనారాయణ, పేరెంట్

చెస్‌కు భారీ స్పందన



నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో జరిగే సమ్మర్ క్యాంప్‌లో చెస్ క్రీడకు భారీ స్పందన ఉండేది. ఏటా పెద్ద సంఖ్యలో చిన్నారులు చెస్‌లో శిక్షణ తీసుకున్నారు. ఐదుగురు కోచ్‌లు శిక్షణ ఇచ్చేవారు. ఇంకా సగం సెలవులు ఉన్నాయి. వెంటనే క్యాంపులు ప్రారంభించాలి.

– అనూప్‌కుమార్, చెస్ కోచ్

గౌరవ వేతనం ఇవ్వండి



ఏటా జిమ్నాస్టిక్స్‌లో కోచింగ్ ఇస్తున్నా. నగర పాలక సంస్థ ఇచ్చే గౌరవ వేతనం ఆలస్యంగా ఇస్తున్నారు. గతేడాది ఏప్రిల్‌లో ఇచ్చారు. ప్రస్తుతం సంవత్సరం గడిచిన ఇంకా ఇవ్వలేదు. గౌరవ వేతనం ఇచ్చి ఈ సంవత్సరం కూడా సమ్మర్ క్యాంప్‌ల నిర్వహణ చేపట్టాలి.

– కాయితోజు బ్రహ్మచారి, జిమ్నాస్టిక్స్ కోచ్

క్యాంపులు నిర్వహించాలి



వేసవి క్రీడాశిబిరాలతో క్రీడాకారుల సామర్థ్యాలు మెరుగుపడుతాయి. 40 రోజుల పాటు అత్యున్నతమైన ప్రమాణాలతో కోచ్‌లు శిక్షణ ఇస్తారు. రాష్ట్ర, జాతీయస్థాయి లాంటి పోటీల్లో పతకాలు సాధించేలా చిన్నారులు తయారవుతారు. చిన్నారులు క్రీడల్లో ఉన్నతస్థాయిలో నిలవాలంటే సమ్మర్ క్యాంపులు నిర్వహించాలి.

– గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి

నయ వంచకుల అరెస్ట్?



- అత్యాచారం కేసులో పోలీసుల చర్యలు
- నిందితుల్లో ఒకరు మైనర్?
- చొప్పదండిలో పెనుముప్పగా మారిన గంజాయి

చొప్పదండి: బాలికను నమ్మించి, బెదిరించి అత్యాచారం చేసిన నయవంచకులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. పోక్సోచట్టం కింద కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఇంటర్ చదివే బాలికను బ్లాక్ మెయిల్ చేసి అత్యాచారం చేసిన సంఘటనను జిల్లా పోలీస్ బాస్ సీరియస్‌గా తీసుకున్నారు. బాలికకు న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు చేపట్టారు.

గంజాయి మత్తు

చొప్పదండి పట్టణంలో రెండేళ్లుగా గంజాయి గుప్పుమంటోంది. యువత మత్తులో తూగుతోంది. పలు షాపులు, రూముల్లో గుంపులుగా చేరి గంజాయి సేవిస్తున్నారన్నది ఇక్కడ బహిరంగ రహస్యమే. గంజాయి మత్తులో పట్టణంలో పలు ప్రమాదాలు కూడా చోటుచేసుకోగా.. ప్రాణాలు పోయిన ఘటనలు కూడా ఉన్నాయి. గ్రామాల్లో గంజాయి వినియోగం పెరిగిపోయింది. గంజాయి మత్తులో యువత రోడ్లపై బైక్ రైడింగ్ పోటీలు నిర్వహిస్తుండటం వారిలో విచ్చలవిడి తనానికి అద్దం పడుతోంది. చొప్పదండి పట్టణంతో పాటు, మల్లన్నపల్లి తదితర చోట్ల పలుమార్లు గతంలో గంజాయి పట్టుబడింది. అయినా పట్టణంలో జోరుగానే గంజాయి అమ్మకాలు సాగుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. మత్తుకు బానిసై బాలికపై అత్యాచారం చేసినట్లు పోలీసులు, స్థానికులు భావిస్తున్నారు. చొప్పదండి పరిధిలో గంజాయి వినియోగం, రవాణాపై పోలీసులు దృష్టిసారించి, యువత పెడతోవ పట్టకుండా చర్యలు తీసుకోవాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

'గెట్ టు గెదర్' గ్రాండ్ సక్సెస్



బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో కరీం'నగరం'లోని వి–కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన 'గెట్ టు గెదర్'కు వేలాది మంది కార్యకర్తలు తరలివచ్చారు. వరంగల్, మహబూబాబాద్, నల్లగొండ, పెద్దపల్లి నుంచి పోటీ చేసిన బీజేపీ అభ్యర్థులు ఆరూరి రమేశ్, సీతారాం నాయక్, సైదిరెడ్డి, గోమాస శ్రీనివాస్, బీజేపీ ఎమ్మెల్యేలు పాయల శంకర్, ధన్‌పాల్ సూర్యనారాయణ, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.మనోహర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధులు రాణి రుద్రమాదేవి, సంగప్ప తదితరులు హాజరయ్యారు. – కరీంనగర్‌టౌన్

బీసీ స్టడీ సర్కిల్‌లో ప్రిలిమ్స్ గ్రాండ్ టెస్ట్

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1, సివిల్ సర్వీసెస్‌కు సంబంధించి ప్రిలిమ్స్ గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు బీసీ స్టడీసర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఆఫ్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రూప్–1కు సంబంధించి ఈ నెల 18, 20, 22, 24, 25, 27, 29, 31, జూన్ 1,3 తేదీల్లో ప్రిలిమ్స్ పరీక్ష కరీంనగర్ బీసీ స్టడీసర్కిల్‌లో నిర్వహిస్తామని, యూపీపీఎస్సీకి సంబంధించి ఈ నెల 23, 26, 28, 30, జూన్ 2, 4, 6, 8, 10, 12 తేదీల్లో పరీక్షలు హైదరాబాద్ స్టడీ సర్కిల్‌లో జరుగుతాయని వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పూర్తివివరాలకు 040–24071178, 040–27077929 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీయాక్ట్

- రైతులకు నష్టం జరిగితే సహించం
- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: రైతులకు నకిలీ విత్తనాలు, నిషేధిత పురుగుమందులు అమ్మితే పీడీయాక్ట్ ప్రయోగిస్తామని కలెక్టర్ పమేలా సత్పతి స్పష్టం చేశారు. బుధవారం కరీంనగర్‌లోని టీటీడీ కల్యాణమండపంలో జిల్లాలోని విత్తనాలు, ఎరువుల డీలర్లకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. డీలర్లు నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు, నిషేధిత పురుగుమందులు అమ్మొద్దని సూచించారు. అమ్మితే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. మార్కెట్లోకి నకిలీ విత్తనాలు, పురుగుమందులు రాకుండా వ్యవసాయ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం నిషేధించిన బీటీ–3 పత్తి విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించవద్దని స్పష్టం చేశారు. డీలర్లు ఎప్పటికప్పుడు రికార్డులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, పీఓఎస్ మిషన్ల ద్వారానే ఎరువుల అమ్మకాలు చేపట్టాలని పేర్కొన్నారు. డీఏవో శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి రామానుజాచార్య, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ దివ్యభారతి, ఏడీఏలు రణధీర్, సునీత, అంజలి, ఫర్టిలైజర్స్ అసోసియేషన్ ప్రతినిధి గౌరిశెట్టి మహేందర్ పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూంకు నిరంతర భద్రత

నగరంలోని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో భద్రపరిచిన ఈవీఎంల స్ట్రాంగ్‌రూంల వద్ద పోలీస్ భద్రతను బుధవారం కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మహంతి పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, పోలీస్ సిబ్బంది విధుల నిర్వహణ, భద్రత అంశాలపై చర్చించారు. ఉదయం, సాయంత్రం వాకర్స్, ఇతర వ్యక్తులు కళాశాలలోకి రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. కరీంనగర్ ఆర్డీవో కే.మహేశ్వర్, టౌన్ ఏసీపీ నరేందర్ పాల్గొన్నారు.

పాఠశాలను మీ ఇల్లుగా చూసుకోవాలి

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలలను సొంతఇల్లుగా చూసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి హెచ్‌ఎంలకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో పదోతరగతి ఫలితాలపై సమీక్ష నిర్వహించారు. పదో తరగతిలో 100శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల హెచ్‌ఎంలను ఘనంగా సన్మానించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యేలా చూడాలని అన్నారు. ప్రతీవారం జిల్లాలో ఒక పాఠశాలను సందర్శిస్తానని, పాఠశాలల్లో వసతుల కల్పనతో పాటు విద్యాభివృద్ధికి హెచ్‌ఎంలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. 6నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు షూ అందించేందుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఈవో జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టీచర్లపై అడ్మిషన్ల కత్తి

- కార్పొరేట్ ప్రవేశాలు'
- పిల్లలను చేర్పిస్తేనే కొనసాగింపు, జీతం పెంపు
- బోధన, బోధనేతర సిబ్బందికి టార్గెట్లు
- వేసవిలో ఇంటింటికీ తిరుగుతున్న టీచర్లు

'వారంతా విద్యావంతులు.. భావిభారత పౌరులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు. కానీ వారి భవిష్యత్ మాత్రం అగమ్యగోచరం. ఆదివారమైనా, వేసవి సెలవులైనా స్కూల్ పని చేయాల్సిందే. ఇక కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమవుతుందంటే వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతుంటాయి. యాజమాన్యం చెప్పినన్ని అడ్మిషన్లు చేయించకుంటే ఉద్యోగం ఉంటుందో, ఊడుతుందో తెలియదు. అందుకే వేసవి సెలవుల్లోనూ ఇంటింటా తిరుగుతూ మీ పిల్లలను మా విద్యాసంస్థల్లో చేర్పించండి అంటూ తల్లిదండ్రులను బతిమాలుకుంటున్నారు.'

'వావిలాలపల్లిలోని ఓ కార్పొరేట్ స్కూల్‌లో పని చేస్తున్న టీచరు వారం క్రితం కట్టరాంపూర్‌లోని ఓ ఇంటికి వెళారు. మీ బాబును 6వ తరగతికి మా స్కూల్‌లో చేర్పించండంటూ తల్లిదండ్రులను బతిమాలాడారు. ఇప్పుడే రిజర్వ్ చేసుకుంటే ఫీజులో రాయితీ ఇస్తామని చెప్పారు. అడ్మిషన్ ఫాంలో సంతకం చేసే వరకు ఆ ఇంటి వద్దే ఉండిపోయారు'

'ఓ పేరు మోసిన కార్పొరేట్ కాలేజీ టీచర్ ఇటీవల రాంనగర్‌లోని ఓ ఇంటికి వెళ్లి మీ పాపను ఇంటర్‌లో మా కాలేజీలో చేర్పించండి అని తల్లిదండ్రులను ఒప్పించే ప్రయత్నం చేశారు. ఎక్కడ చదివించాలో ఆలోచిస్తున్నామని పేరెంట్స్ చెప్పడంతో పాటు తర్వాత చూద్దామని తల్లిదండ్రులంటే .. తనకు టార్గెట్ ఇచ్చారని, అడ్మిషన్లు చేయకపోతే సెలవుల్లో జీతం రాదని, పైగా వచ్చే విద్యా సంవత్సరం ఇంక్రిమెంట్ కూడా రాదని సదరు టీచర్ వాపోయారు. మీరు ఇప్పుడే సీటు బుక్ చేసుకుంటే ఫీజులో రాయితీ ఇప్పిస్తానని చెప్పుకొచ్చారు. దీంతో ఆ తల్లిదండ్రులు సానుకూలంగా స్పందించారు.'

కరీంనగర్: ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది మెడపై అడ్మిషన్స్ అనే కత్తి వేలాడుతోంది. 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు భారీగా చేయాలంటూ యాజమాన్యాలు తీవ్రస్థాయిలో ఒత్తిడి చేస్తున్నాయి. అడ్మిషన్ల సంఖ్యను బట్టే వచ్చే విద్యాసంవత్సరంలో జీతాల చెల్లింపు, ఇంక్రిమెంట్లు, ఉద్యోగ భద్రత ఉంటుండటం టీచర్లకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. యాజమాన్యాలు పెట్టే నిబంధనలు భరించలేక, అలాగని బయటకు రాలేక సతమతమవుతున్నారు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిని యాచకవృత్తి కంటే హీనంగా దిగజార్చుతున్నారంటూ వాపోతున్నారు. జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల్లో 15 వేల మందికిపైగా బోధన, బోధనేతర సిబ్బంది పనిచేస్తుండగా, దాదాపు అందరిదీ అదే పరిస్థితి.



5 నుంచి 40 వరకు టార్గెట్..

ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల్లో పనిచేస్తున్న టీచర్లు, ఇతర ఉద్యోగులు 5 నుంచి 10 అడ్మిషన్లు చేయాలి. అదే కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీ అయితే 30–40 అడ్మిషన్లు చేయాల్సిందే. దీంతో ఎండను సైతం లెక్కచేయకుండా ఇంటింటా తిరుగుతున్నారు. 'మీ ఇంట్లో పిల్లలు ఎంత మంది, ఏమి చదువుతున్నారు. ఎక్కడ చదువుతున్నారు.. మా పాఠశాల/కళాశాలలో చేర్పించండి. నాణ్యమైన బోధన ఉంటుంది. ఫలితాలు చూడండంటూ' పేపర్లు చూపుతున్నారు. తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు తీసుకుని రోజూ నాలుగైదు సార్లు ఫోన్లు చేస్తున్నారు. తమకు టార్గెట్లు కూడా ఉన్నాయంటూ వేడుకుంటున్నారు.

మానసికంగా వేధిస్తున్నారు

ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అడ్మిషన్ల పేరుతో టీచర్లు, అధ్యాపకులను మానసికంగా వేధిస్తున్నారు. సెలవు దినాల్లోనూ పని చేయించుకుంటున్నారు. వర్క్‌షాపుల పేరుతో మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇన్ని చేస్తున్నా చాలా విద్యాసంస్థల్లో జీతాలు కూడా సరిగా ఇవ్వడం లేదు.

– ఎ.రవీందర్‌రెడ్డి, ప్రైవేట్ టీచర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి

ఉద్యోగులతో వెట్టిచాకిరీ

అడ్మిషన్ల టార్గెట్ మాత్రమే కాకుండా యాజమాన్యాలు తమతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాయని బోధన, బోధనేతర సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ 10–12 గంటలు పనిచేయాలని, సెలవు రోజులు, పండుగ దినాల్లో సైతం స్కూళ్లకు వెళ్లాల్సిందేనని, పనికి తగ్గ వేతనాలు ఇవ్వడం లేదని వాపోతున్నారు. టీటీసీ, బీఈడీ, పీజీ, ఎంబీఏ తదితర కోర్సులు చేసి ఉపాధి కోసం పనిచేస్తున్నామని, ఇక్కడ ఉద్యోగ భద్రత లేకపోగా పని ఒత్తిడి చేస్తూ తీవ్ర మానసిక క్షోభకు గురి చేస్తున్నారని పేర్కొంటున్నారు. కాగా, చాలా స్కూళ్లు, కాలేజీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం కూడా లేకపోవడం గమనార్హం.

క్లుప్తంగా

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య


వెంకటయ్య (ఫైల్)

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లికి చెందిన పెద్ద బత్తుల వెంకటయ్య(38) ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. వెంకటయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. దీనికితోడు ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది, మంగళవారం సాయంత్రం క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంలో భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తుండగానే వెంకటయ్య మృతిచెందాడు. మృతుడి కుమారుడు గతంలోనే చనిపోగా, కూతురికి వివాహమైంది. మృతుడి భార్య ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్ పేర్కొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త..

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని పురాణిపేటకు చెందిన ఎండీ.ముబీన్(23) ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ ఎస్సై నరేశ్ వివరాల ప్రకారం.. ముబీన్ భార్య కొంతకాలంగా కాపురానికి రాకపోవడంతో తల్లిదండ్రులతో ఉంటున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై, మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి మజీద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఈత నేర్చుకునేందుకు వెళ్లి యువకుడి మృతి


అరవింద్ (ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): వ్యవసాయ బావిలో ఈత నేర్చుకునేందుకు వెళ్లిన ఓ యువకుడు నీటిలో మునిగి మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. ఓదెల మండలంలోని జీలకుంటకు చెందిన దొడ్డిపల్లి అరవింద్(20) బుధవారం సాయంత్రం తన స్నేహితులతో కలిసి, గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. అందరూ బుర్రలు కట్టుకొని బావిలో దిగారు. ఈత నేర్చుకుంటుండగా అరవింద్ వీపునకు కట్టుకున్న బుర్ర అకస్మాత్తుగా ఊడిపోయింది. దీంతో అతను నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు కేకలు వేయగా గ్రామస్తులు వచ్చేసరికే అరవింద్ చనిపోయాడు. మృతుడి తండ్రి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు.

వడదెబ్బతో గొర్రెల కాపరి..


భూమయ్య (ఫైల్)

కోరుట్ల రూరల్: జోగిన్‌పెల్లికి చెందిన బూరుగుల భూమయ్య(62) అనే గొర్రెల కాపరి వడదెబ్బతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. భూమయ్య మంగళవారం గొర్రెలు మేపేందుకు వెళ్లాడు. ఎండలో తిరగడంతో సాయంత్రం వాంతులు, విరేచనాలు అయ్యాయి. కుటుంబసభ్యులు స్థానికంగా చికిత్స చేయించారు. తగ్గక పోవడంతో రాత్రి కోరుట్ల తరలించేందుకు ప్రయత్నిస్తుండగానే చనిపోయాడు. మృతుడికి భార్య కాంతమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

బావిలో పడి వృద్ధుడు..

వీణవంక(హుజూరాబాద్): కిష్టంపేటకు చెందిన బొద్దుల బాలయ్య(98) ప్రమాదవశాత్తు బావిలో బుధవారం మృతి చెందాడు. ఎస్సై తిరుపతి వివరాల ప్రకారం.. బాలయ్య బుధవారం సమీపంలోని పొలాల వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో ఆయన మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో వచ్చి, మృతదేహాన్ని బయటకు తీయించారు. బాలయ్యకు మతిస్థిమితం సరిగా ఉండదని, ప్రమాదవశాత్తు బావిలో పడి చనిపోయాడని ఆయన మనవడు రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తోటలో పేలిన తూటా

- 'జనశక్తి' వీరన్న ఎన్‌కౌంటర్‌కు పాతికేళ్లు
- తెలంగాణ రాష్ట్ర సాధన ఆకాంక్షను చాటిన ఉద్యమ నేత
- తెలంగాణవాది.. దళిత బహుజన పక్షపాతి
- హైదరాబాద్‌లో అరెస్ట్.. నర్సింగాపూర్‌లో ఎన్‌కౌంటర్

సిరిసిల్ల: బహుజన సిద్ధాంతం.. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా విప్లవ ఉద్యమాలు రూపొందించారు మారోజు వీరన్న. కులాల ప్రాతిపదికన ఉద్యమించాలని నమ్మి.. సహచరులతో విభేదించి సొంతంగా విప్లవోద్యమాన్ని నిర్మించారు. రెండున్నర దశాబ్దాల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరుడైన ఆయనపై ప్రత్యేక కథనం.


మారోజు వీరన్న (ఫైల్)

నర్సింగాపూర్‌లో వీరన్న ఎన్‌కౌంటర్ అయిన మామిడి తోట స్థలం

ఉద్యమనేలలో విప్లవ బీజం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండున్నర దశాబ్దాల కిందట నెత్తురు పారని రోజు లేదు. సమసమాజ స్థాపన కోసం నక్సలైట్లు.. వారిని కట్టడి చేసేందుకు పోలీసులు.. ఇలా జిల్లాలో కాల్పులు.. ఎదురు కాల్పులు నిత్యకృత్యం. నేటి రాజన్నసిరిసిల్ల జిల్లాలోని పల్లెలు ఆనాడు వామపక్ష ఉద్యమాలకు పురిటిగడ్డలు. ఇక్కడ 'దున్నేవాడికే భూమి' నినాదంతో మొదలైన రైతుకూలి పోరాటం సాయుధ విప్లవోద్యమాలుగా రూపాంతరం చెందాయి. సీపీఐ(ఎంఎల్) జనశక్తి అగ్రనేత మారోజు వీరన్న ఈ ప్రాంతంలో ఉద్యమాలు రూపొందించారు. 1999, మే16న బోయినపల్లి మండలం నర్సింగాపూర్ శివారులోని మామిడితోటలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో వీరన్న ప్రాణాలు కోల్పోయారు.

పీడీఎస్‌యూ అగ్రనేతగా..

- మారోజు వీరన్న సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం కర్విరాల కొత్తగూడెంలో 1962లో వడ్రంగి కుటుంబంలో జన్మించారు.
- స్వగ్రామంలోనే ప్రాథమిక విద్య, సూర్యాపేటలో ఇంటర్మీడియెట్, సైఫాబాద్ కాలేజీలో బీఎస్సీ, ఓయూలో ఎమ్మెస్సీ చదివారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు.
- 14 ఏళ్ల ప్రాయంలో 'అన్యాయం', 'ఊరు తిరగబడింది' అనే నాటకాలు రాశారు.
- వీరన్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉంటూ సీపీఐ(ఎంఎల్) జనశక్తి పార్టీ అగ్రనేత కూర రాజన్నతో కలిసి పనిచేశారు.


తుంగతుర్తి వద్ద వీరన్న స్మారక స్తూపం

- అప్పట్లో మెడికల్, డెంటల్ కాలేజీల్లో క్యాపిటల్ ఫీజులను ప్రభుత్వం విధించడంపై పోరాడి ఆ ఫీజులను రద్దు చేయించారు.
- 1991లో మండల్ కమిషన్ ఉద్యమంలోనూ కీలకంగా వ్యవహరించారు.
- 1994లో కరీంనగర్ జిల్లా చొప్పదండి నుంచి వీరన్న ఎమ్మెల్యేగా పోటీచేసి 22వేల ఓట్లు సాధించారు.

కూర రాజన్నతో విభేదించి..

జనశక్తి పార్టీ అగ్రనేతల్లో ఒకరుగా ఉంటూ వీరన్న కుల, వర్గ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారతదేశంలో కులాలు ఉన్నాయని, కుల ప్రాతిపదికన సంఘాలను బలోపేతం చేస్తేనే విప్లవోద్యమాలు బలపడతాయని వీరన్న సూత్రీకరించగా.. జనశక్తి అగ్రనేతలు ఈ వాదనను విభేదించారు. విప్లవ గ్రూపుల్లో కులప్రస్తావన అర్థరహితమని కొట్టిపారేశారు. దీంతో 1995లో చంద్రపుల్లారెడ్డి వర్గంలోని జనశక్తి గ్రూపు నుంచి విడిపోయి జనశక్తి వీరన్న వర్గం, జనశక్తి రాజన్న వర్గంగా(మే 17)న రెండు విప్లవ గ్రూపులు ఏర్పాటయ్యాయి. అప్పటికే ఉమ్మడి కరీంనగర్, నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన 14 సాయుధ దళాలు వీరన్న వెంట నడిచాయి. జనశక్తి రాజన్న వెంట కేవలం 9 సాయుధ దళాలు ఉన్నాయి. ఫలితంగా రాజన్నసిరిసిల్ల జిల్లాలో వీరన్న వర్గం సాయుధ దళాలు రెండు ఏర్పాటయ్యాయి. ఈక్రమంలోనే జనశక్తి రాజన్నవర్గం, వీరన్న వర్గాల మధ్య అంతర్గత కలహాలు బయటపడ్డాయి. జిల్లాలో అప్పటికే పీపుల్స్‌వార్, జనశక్తి పార్టీలు ఉండగా.. కొత్తగా వీరన్న వర్గం ఏర్పడింది. 1999 జనవరిలో వీరన్న వర్గానికి చెందిన 11 మంది సాయుధులను గంభీరావుపేట మండలం నాగంపేట వద్ద మామిడితోటలో పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. ఈ సాయుధులను హైదరాబాద్ శివారులో ఓ ఇంట్లో నిర్బంధించి నాగంపేట వద్ద ఎన్‌కౌంటర్ చేసినట్లు అప్పట్లో ఆ పార్టీ ప్రకటించింది. ఈ ఎన్‌కౌంటర్‌తో జనశక్తి వీరన్న వర్గం కార్యకలాపాలు జిల్లాలో సద్దుమణిగాయి. కానీ ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలో పనిచేశాయి.

నర్సింగాపూర్ వద్ద వీరన్న ఎన్‌కౌంటర్

బోయినపల్లి మండలం నర్సింగాపూర్ మామిడి తోటలో 1999, మే 16న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మారోజు వీరన్న మరణించారు. ఆయనను హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్ వినాయక్‌నగర్‌లో పట్టుకొని నర్సింగాపూర్‌కు తెచ్చి ఎన్‌కౌంటర్ చేశారని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. పార్టీ కొరియర్ సిద్దేశ్వర్‌తో కలిసి వెళ్తుండగానే వీరన్నను మఫ్టీలో ఉన్న పోలీసులు పట్టుకుని మారుతీవ్యాన్‌లో తీసుకెళ్లినట్లు వెల్లడించారు. అప్పటికే మారోజు వీరన్న రాష్ట్ర సాధన కోసం తెలంగాణ మహాసభలను ఏర్పాటు చేసి సూర్యాపేటలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. విప్లవకారుడిగా, వక్తగా, ఆలోచనపరుడిగా అనేక వ్యాసాలు, పాటలు రాసి, పాడారు. 1989లో సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఎన్వీ కృష్ణయ్య విజయం సాధించినప్పుడు జగిత్యాలతో ఆత్మీయ సన్మానసభ నిర్వహించారు. ఈ సభలో వీరన్న జనశక్తి శ్రేణులను ఉత్సాహ పరిచేందుకు 'అందుకోర గుప్త అందుకో ఈ దొంగల తరిమేతందుకు' అంటూ.. విప్లవ గీతాలను ఆలపించి సభను ఉర్రూతలూగించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఆకాంక్షను బలంగా చాటిచెప్పారు. వీరన్న రాష్ట్ర సాధన ఉద్యమాన్ని బలంగా తీసుకెళ్తున్న క్రమంలో ఎన్‌కౌంటర్ అయ్యారు.

వీరన్న సంస్మరణ సభలు..

జిల్లాలో వీరన్న సంస్మరణ సభలను ఆయన అభిమానులు, ప్రగతిశీల వాదులు ఏటా నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సభలు సమావేశాలు నిర్వహించి విప్లవ యోధుడికి నివాళి అర్పిస్తారు.

ఆమె నేత్రాలు సజీవం


అహల్యమ్మ (ఫైల్)

కమాన్‌పూర్(మంథని): మండలంలోని జూలపల్లికి చెందిన పెరటి అహల్యమ్మ అనే వృద్ధురాలు బుధవారం అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె నేత్రాలను దానం చేసేందుకు కుటుంబసభ్యులు ముందుకురాగా, సదాశయ ఫౌండేషన్, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరిఫ్ సేకరించారు. ఈ సందర్భంగా అహల్యమ్మ కుటుంబసభ్యులను ఫౌండేషన్ జాతీయ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు శ్రవణ్‌కుమార్, రామకృష్ణారెడ్డి, మహిళా అధ్యక్షురాలు కవిత, క్లబ్ కార్యదర్శి శంకర్ అభినందించారు.

కుక్కల దాడిలో మేకలు మృతి


చనిపోయిన జీవాలతో మున్సిపల్ ఆఫీస్‌లో ధర్నా చేస్తున్న అజీజొద్దీన్

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి బస్టాండ్ ప్రాంతంలో అజీజొద్దీన్‌కు చెందిన మేకల మందపై బుధవారం మధ్యాహ్నం కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో 4 మేకలు చనిపోయాయి. దీనిపై ఆగ్రహించిన యజమాని అజీజొద్దీన్ చనిపోయిన జీవాలతో కొత్తపల్లి మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లి, ధర్నాకు దిగారు. తనకు సుమారు రూ.40 వేల నష్టం వాటిల్లిందన్నారు. గతంలోనూ 5 మేకలను చంపేయడంతో 9 ఫీట్ల ప్రహరీ నిర్మించానని, అయినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు హామీ ఇవ్వడంతో బాధితుడు ఆందోళన విరమించాడు. చికెన్ సెంటర్ల వ్యర్థాలను సేకరించడంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

డీజిల్ ట్యాంకర్ పడి ఒకరి దుర్మరణం

- ఏడుగురికి తీవ్ర గాయాలు
- తాడికల్ గ్రామంలో ఘటన


శ్రీనివాస్ (ఫైల్)

శంకరపట్నం(మానకొండూర్): రోడ్డు పక్కనున్నవారిపై డీజిల్ ట్యాంకర్ పడిన ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. శంకరపట్నం మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు బుధవారం సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. దీనికి హాజరైన సీనియర్ ఖోఖో ప్లేయర్ పూదరి శ్రీనివాస్, సాగంటి ప్రకాశ్ నీళ్లు తాగేందుకు వాటర్ ప్లాంట్ వద్దకు వెళ్తున్నారు. అదే సమయంలో హుజూరా బాద్ వైపు నుంచి అంబాల్‌పూర్ వెళ్లాల్సిన జాతీయ రహదారి నిర్మాణ సంస్థ డీబీఎల్‌కు చెందిన డీజిల్ ట్యాంకర్ రావడంతో రోడ్డు దిగి, పక్కన నిల్చున్నారు. కరీంనగర్ ఆస్పత్రికి, ఇతర పనుల కోసం వెళ్లడానికి ఆర్టీసీ బస్సు కోసం తాడికల్‌కు చెందిన వంగల కనకమ్మ, తాడిచర్ల సంపత్, ఉప్పరి మధురమ్మ, చింతగుట్టకు చెందిన ఆడెపు లాస్య, ఆడెపు మౌనిక, మంద రాజమ్మ అక్కడే చెట్టు కింద కూర్చున్నారు. డీజిల్ ట్యాంకర్ అక్కడికి చేరుకోగానే పక్కకు ఒరిగి, వారిపై పడింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ ట్యాంకర్ కింద నలిగి, మృతిచెందాడు. మిగతా ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు.

అంతకుముందు మరొకరిని ఢీకొన్న ట్యాంకర్

డీజిల్ ట్యాంకర్ ఈ ప్రమాదానికి ముందు వంకాయలగూడెం వద్ద అదే గ్రామానికి చెందిన జడల రాజయ్యను ఢీకొట్టడంతో అతను గాయపడ్డాడు. గ్రామస్తులు పట్టుకుంటారేమోనన్న భయంతో డ్రైవర్ ట్యాంకర్‌ను ఆపకుండా వెళ్లిపోయాడు. ఆ హడావుడిలోనే తాడికల్ గ్రామంలో స్పీడ్ బ్రేకర్ వద్ద సడన్ బ్రేక్ వేయడంతో ట్యాంకర్ గ్రామస్తులపై బోల్తా పడింది.


ట్యాంకర్‌ను క్రేన్ సహాయంతో పక్కకు తీయిస్తున్న పోలీసులు

ట్రాఫిక్ జాం..

సమాచారం అందుకున్న హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ, ఎస్సైలు లక్ష్మారెడ్డి, ఆరోగ్యం సంఘటన స్థలానికి చేరుకున్నారు. ట్యాంకర్ నుంచి డీజిల్ కారడంతో రహదారిపై అధిక సంఖ్యలో వాహనాలు నిలిచిపోయి, ట్రాఫిక్ జాం అయింది. పోలీసులు క్రేన్ సహాయంతో ట్యాంకర్‌ను పక్కకు జరిపించారు. ఆ సమయంలో ట్యాంకర్ నుంచి డీజిల్ ఎక్కువగా కారడంతో ఎలాంటి ప్రమాదం జరగకుండా పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని తెప్పించి, చల్లించారు. శ్రీనివాస్ మృతదేహాన్ని హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రహదారి సంస్థకు చెందిన సూపర్‌వైజర్‌పై గ్రామస్తులు చేయిచేసుకున్నారు. ప్రమాదానికి కారణమైన ట్యాంకర్ డ్రైవర్‌ను గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


రోదిస్తున్న మృతుడి కుమారుడు, కూతురు, సోదరుడు

కూతురిపై లైంగిక దాడి కేసులో తండ్రికి 25 ఏళ్ల జైలు

జగిత్యాల జోన్: కన్న కూతురిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ఓ కసాయి తండ్రికి 25 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ బుధవారం తీర్పు చెప్పారు. అంతేకాకుండా, బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లికార్జున్ కథనం ప్రకారం.. కోరుట్ల మండలం ఎఖిన్‌పూర్‌కు చెందిన ఎల్లాల తుకారాం వ్యవసాయం చేసేవాడు. భార్యను కత్తితో పొడిచి, చంపాడు. ఈ దంపతులకు ఒక కుమారుడు ఉన్నాడు. తర్వాత కొడుకు తండ్రితో తెగదెంపులు చేసుకొని, నానమ్మ వద్ద ఉంటున్నాడు. అనంతరం తుకారం రెండో పెళ్లి చేసుకున్నాడు. అతని వేధింపులు భరించలేక ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. తర్వాత, మూడో పెళ్లి చేసుకోగా ఒక కూతురు జన్మించింది. అయితే, అక్టోబర్ 14, 2022న రాత్రి తుకారాం తన భార్య, 12 ఏళ్ల కూతురితో కలిసి భోజనం చేసి, నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో ఆ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బిడ్డ కేకలు విని నిద్ర లేచిన తల్లికి జరిగిన సంఘటనను వివరించింది. దీంతో ఆగ్రహించిన ఆమె భర్తను కోప్పడగా, విషయం ఎక్కడైనా చెబితే ఇద్దరినీ పెట్రోల్ పోసి, చంపుతానని బెదిరించాడు. రెండు రోజులకు వారు తుకారం మొదటి భార్య కొడుకు మహేశ్‌కు చెప్పారు. అతని సహాయంతో కోరుట్ల ఠాణాలో ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి ఎస్సై సతీశ్ కేసు నమోదు చేయగా, సీఐ రాజశేఖర్ రాజు దర్యాప్తు చేపట్టారు. తుకారాంను అరెస్టు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ సిబ్బంది కోర్టులో బలమైన సాక్ష్యాలను ప్రవేశపెట్టడంతో నేరం రుజువైంది. దీంతో తుకారాంకు న్యాయమూర్తి జైలుశిక్ష, జరిమానా విధించారు.

హత్య కేసులో నేరస్తుడికి జీవితఖైదు

మేడిపల్లి(జగిత్యాల): హత్య కేసులో నేరస్తుడికి జీవితఖైదు, జరిమానా విధిస్తూ జగిత్యాల న్యాయస్థానం తీర్పు వెలువరించిందని ఎస్సై శ్యాంరాజు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఓరుగంటి రాజు, పూదరి లక్ష్మణ్.. ఇద్దరిదీ భీమారం మండల కేంద్రం. నాలుగేళ్ల క్రితం పెళ్లి బరాత్‌లో గొడవ పడ్డారు. రాజు క్షణికావేశంలో లక్ష్మణ్‌ను కత్తితో పొడిచి, హత్య చేశాడు. మృతుడి అన్న సతీశ్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై సుధీర్‌రావు కేసు నమోదు చేయగా సీఐ రాజశేఖర్ విచారణ చేపట్టి, కోర్టులో చార్జిషీట్ వేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి బుధవారం రాజుకు జీవితఖైదు, రూ.5 వేల జరిమానా విధించారని ఎస్సై పేర్కొన్నారు.

వికటించిన మహిళా ఆర్‌ఎంపీ వైద్యం

- చావుబతుకుల మధ్య వృద్ధురాలు
- ఎక్కువ రోజులు బతకదన్న వైద్యులు
- ఇంటికి తీసుకొచ్చిన కుటుంబసభ్యులు

మానకొండూర్ రూరల్: మహిళా ఆర్‌ఎంపీ చేసిన వైద్యం వికటించి, ఓ వృద్ధురాలు చావుబతుకుల మధ్య ఉంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబసభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. లింగాపూర్ గ్రామంలోని రాంనగర్ బేడబుడిగ జంగాల కాలనీకి చెందిన భూపతి కనకవ్వకు ఈ నెల 2న జ్వరం వచ్చింది. దీంతో ఆమె కుటుంబసభ్యులు వైద్యం కోసం స్థానిక ఆర్‌ఎంపీ మమతను ఇంటికి పిలిపించారు. కనకవ్వను పరీక్షించిన ఆమె, గ్లూకోజ్ పెట్టి, అందులో ఇంజెక్షన్ కలిపి వెళ్లిపోయింది. 30 నిమిషాల తర్వాత ఆ వృద్ధురాలి శరీరంపై దద్దుర్లు, బొబ్బలు రావడంతో ఆర్‌ఎంపీకి సమాచారం ఇచ్చారు. ఆమె మళ్లీ వచ్చి, ఇంకో ఇంజెక్షన్ వేసి, వెళ్లిపోయింది. 20 నిమిషాల తర్వాత కనకవ్వ నాలుక లావై, కాళ్లుచేతులు చచ్చుబడిపోయాయి. వెంటనే కుటుంబసభ్యులు 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి, 6 రోజులు చికిత్స చేయించారు. అక్కడినుంచి మరో దవాఖానాలో చేర్పించారు. కనకవ్వ ఎక్కువ రోజులు బతకదని వైద్యులు నిర్ధారించడంతో మంగళవారం రాత్రి ఇంటికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఆమె చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. బాధితురాలి కుమారుడు రమేశ్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.


వారం క్రితం చికిత్స పొందుతున్న కనకవ్వ

పెట్రోల్ బంకు సమీపానికి మంటలు

- ఆర్పివేసిన పోలీసులు
- బంధంపల్లిలో తప్పిన ప్రమాదం


మంటలను ఆర్పుతున్న పోలీసులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణ శివారు బంధంపల్లిలో బుధవారం ఓ రైతు తన పొలంలో వరికొయ్యలకు నిప్పుపెట్టాడు. మంటలు చెలరేగి, స్థానిక పెట్రోల్‌బంకు సమీపంలోకి రావడాన్ని గమనించిన ఏఎస్సై రామస్వామి పోలీస్ సిబ్బంది శరత్, శ్రీకాంత్, డ్రైవర్ శ్రీనివాస్‌తో కలిసి వాటిని అదుపు చేస్తూ నే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చేలోగా మంటలను ఆర్పివేశారు. ప్రమాదం జరగకుండా చూసిన పోలీసులను పలువురు అభినందించారు.

విద్యుత్ సేవల్లో పెద్దపల్లి టాప్


సుదర్శనం, ఎస్ఈ

పెద్దపల్లిరూరల్: ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడంలో మనజిల్లా అగ్రస్థానంలో నిలిచింది. బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సంస్థ సీఎండీ వరుణ్‌రెడ్డి ఈ విషయాన్ని ప్రకటించారు. అధికారులు, సిబ్బంది సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని ట్రాన్స్‌కో ఎస్ఈ సుదర్శనం తెలిపారు. అదేవిధంగా అధికారులు, సిబ్బంది మెరుగైన పనితీరు కనబర్చి మంచి ర్యాంక్‌లు సాధించారని అన్నారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లికి చెందిన ఏఈ సైపుద్దీన్‌కు ప్ర థమ ర్యాంక్ వచ్చిందన్నారు. ఆపరేషన్, మెయింటనెన్స్‌లో ఫోర్‌మెన్ వరకు ఏఈ, సబ్‌ఇంజినీర్.. ఇలా అన్ని విభాగాల సహకారంతోనే జిల్లాకు ఈ గౌరవం దక్కిందని ఎస్ఈ పేర్కొన్నారు. మేలో విద్యుత్ వినియోగం అధికంగా ఉన్నా.. ఇబ్బందులు లేకుండా సరఫరా చేస్తున్నామని తెలిపారు. కొత్త విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసే సత్వరమే మంజూరు చేస్తామని తెలిపారు.

జేవీ చలపతిరావుకు మాతృవియోగం


సూరమ్మ (ఫైల్)

సిరిసిల్ల: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ జేవీ చలపతిరావు తల్లి సూరమ్మ(90) బుధవారం హైదరాబాద్‌లోని అల్వాల్‌లో మరణించారు. సిరిసిల్ల భూపోరాట ఉద్యమంలో, రైతాంగ పోరాట నిర్మాణంలో చలపతిరావుకు బాటలు వేశారు. రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం తిమ్మాపూర్‌కు చెందిన జువ్వాడి సూరమ్మ, మురళీమనోహర్‌రావు దంపతుల కొడుకు చలపతిరావు. ఆయన విద్యార్థి దశలోనే ఉద్యమాల వైపు సాగాడు. సీపీఐ(ఎంఎల్) జనశక్తి ఉద్యమంలో కీలక నాయకుడిగా ఎదిగారు. మూడు దశాబ్దాలపాటు అజ్ఞాత జీవితం గడిపారు. 1994లో అజ్ఞాతవాసం వీడి, సిరిసిల్ల ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఆయన తల్లి సూరమ్మ సిరిసిల్ల ప్రాంతంలో కరుడుగట్టిన భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో ముందునిలిచారు. దోపిడీ, అణ చివేతలకు వ్యతిరేకంగా సాగిన ప్రజాపోరాటాలకు సూరమ్మ సాక్షిభూతమయ్యారు. సూరమ్మ హైదరాబాద్‌లోని తన చిన్నకుమారుడి ఇంట్లో తుదిశ్వాస విడిచారు. ఆమె అంత్యక్రియలు గురువారం ఉదయం 9 గంటలకు అల్వాల్ శ్మశానవాటికలో నిర్వహించనున్నారు. సూరమ్మ మృతిపై రాజన్నసిరిసిల్ల జిల్లా సీపీఐ కార్యదర్శి గుంటి వేణు సంతాపం ప్రకటించారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- యువకుడికి తీవ్ర గాయాలు

చందుర్తి(వేములవాడ): బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. చందుర్తి మండలంలోని మల్యాలకు చెందిన యెల్ల రమేశ్ బుధవారం ద్విచక్రవాహనంపై చందుర్తి వెళ్తున్నాడు. మల్యాల బస్టాండ్‌లో చందుర్తి నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని స్థానికులు 108 వాహనంలో వేములవాడ ఆస్పత్రికి తరలించారు.

గుంజపడుగులో ప్రహరీ వివాదం

- ఇరు కుటుంబాల మధ్య గొడవ
- ఇల్లు ధ్వంసం, ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీస్ పికెట్ ఏర్పాటు

గొల్లపల్లి(ధర్మపురి): ప్రహరీ విషయంలో రెండు కుటుంబాల మధ్య గొడవ ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలవగా, ఒకరి ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది. ఎస్సై సతీశ్‌కుమార్ వివరాల ప్రకారం.. గొల్లపల్లి మండలంలోని గుంజపడుగుకు చెందిన కళ్లెం తిరుపతి, పస్తం శారద ఇళ్ల మధ్య ప్రహరీ ఉంది. దీని గురించి కొంతకాలంగా ఇరుకుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గతంలో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం మాటామాట పెరిగి, తిరుపతి శారద ఇంటిపై దాడి చేసి, ఆమెను దూషించాడు. దీంతో ఆమె కుటుంబసభ్యులు సైతం గొడవకు దిగారు. ఇరుకుటుంబాల వారు కర్రలతో దాడి చేసుకునేవరకు వెళ్లారు. స్థానికులు అడ్డుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సంఘటనలో తిరుపతి ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది. విషయం పోలీసులకు తెలియడంతో సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై సతీశ్‌కుమార్ అక్కడికి చేరుకున్నారు. పరిస్థితులను చక్కదిద్దేందుకు పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. అప్పటికే శారద సోదరులు సమ్మయ్య, పోచయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుపతి, తిరుమలేశ్, శ్రీకాంత్‌తోపాటు మరో 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.


ధ్వంసమైన ఇల్లు


గ్రామంలో పోలీస్ పికెట్

కలెక్టర్‌కు సేంద్రియ మామిడి పండ్లు అందజేత



విద్యానగర్(కరీంనగర్): సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేస్తూ రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డు పొందిన బొప్పు శ్రీహరి తన వ్యవసాయ క్షేత్రంలో పండిన మామిడి పండ్లను బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పమేలా సత్పతికి అందజేశారు. ఈ సందర్భంగా సేంద్రియ సాగు చేస్తున్న శ్రీహరిని, ఆయన తనయులు బొప్పు వాను, దేవేందర్‌లను కలెక్టర్ అభినందించారు. ఆరోగ్య సంరక్షణకు దోహదపడే సేంద్రియ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, సాగువైపు దృష్టి సారించేలా చూడాల్సిన బాధ్యత ఉత్తమ రైతుగా ఉందని, ఆ దిశగా కృషి చేయాలని శ్రీహరికి ఆమె సూచించారు.

అలయన్స్ క్లబ్ సమావేశం



కరీంనగర్: అలయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నింగ్ బాడీ ఇన్‌స్టాలేషన్ సన్నాహక సమావేశం బుధవారం సంఘం కార్యాలయంలో జరిగింది. సన్నాహక సమావేశంలో కొత్తగా ఏర్పాటైన శ్రీనగర్‌కాలనీ, సరస్వతీనగర్ క్లబ్‌ల సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈనెల 19న క్లబ్ ఇన్‌స్టాలేషన్, పీఎస్‌టీ, ట్రైనింగ్, మెర్లో సెరిమనిలను నిర్వహించేందుకు వేదికగా అచీవర్ పాఠశాలను ఎంపిక చేసినట్లు ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ ఎలగందుల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ సభ్యులు కోల అన్నారెడ్డి, కుమారస్వామి, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌గాంధీ, మహేశ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలకు నిప్పు.. పర్యావరణానికి ముప్పు



కరీంనగర్‌రూరల్: యాసంగి వరికోత పనులు పూర్తయ్యాయి. వానాకాలం పంట సాగు కోసం రైతులు సన్నద్ధమవుతున్నారు. హార్వెస్టర్లతో వరిపంటను కోసిన రైతులు ప్రస్తుతం వరికొయ్యలు, వరిగడ్డి వ్యర్థాలను పొలాల్లో తగులబెడుతున్నారు. వరిగడ్డి వ్యర్థాలను తగులబెట్టకుండా నీళ్లు పెట్టి కలియ దున్నితే నేలకు అవసరమైన పోషకాలు లభిస్తాయి. అయితే పలువురు రైతులు వ్యర్థాలను తగులబెట్టేందుకు మొగ్గు చూపుతుండటంతో వాతావరణ కాలుష్యం ఏర్పడుతోంది. రైతులు వ్యర్థాలను తగులబెట్టకుండా పొలాల్లో కలియదున్నితే ఎంతో ప్రయోజనముంటుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

క్లుప్తంగా

శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకున్న 'గంగుల'



కరీంనగర్‌కల్చరల్: శ్రీశైలం మహాక్షేత్రం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని బుధవారం మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన గోపురం వద్ద ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలతో పాటు కరీంనగర్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని శ్రీశైల మల్లికార్జున స్వామిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో చేపట్టిన విద్యుత్ మరమ్మతు పనులతో పాటు విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు 11 కేవీ గౌతమినగర్ ఫీడర్ పరిధిలోని తిరుమల్‌నగర్, కట్టరాంపూర్, కోతిరాంపూర్, భవానినగర్, శ్రీనివాసనగర్, ప్రొఫెసర్‌నగర్, దుర్గాదేవినగర్, మహాలక్ష్మీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు.

వీధి వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ



సప్తగిరికాలనీ(కరీంనగర్): నగరంలోని 75 మంది నిరుపేద వీధి వ్యాపారులకు బుధవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో తోపుడు బండ్లు, లైట్లు పంపిణీ చేవారు. ఇంకా ఎంతో మంది నిరుపేదలు ఉన్నారని, వారికి కూడా ఉచితంగా బండ్లు, లైట్లు పంపిణీ చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని రోటరీ క్లబ్ సభ్యులు తిప్పారపు ఆంజనేయులు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయే..

- బద్దిపల్లిలో స్వయంభువుగా వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి
- 18, 19, 20 తేదీల్లో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు
- వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

'ఆశ్రితజనపరిపాలక అలివేలుమంగ లక్ష్మీపతి బద్దిపల్లి గిరినివాస వైకుంఠదాన్విత శ్రీనివాసాయ మంగళం'

అడిగిందల్లా అందించే ఆపద మొక్కులవాడి వార్షిక బ్రహోత్సవాలకు వేళయింది. కొత్తపల్లి మండలం బద్దిపల్లి శివారులో స్వయంభువుగా వెలిసిన స్వామి వారి వార్షిక బ్రహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈనెల 18న ఉదయత్ పూర్వం నుంచే వేదుకలు ప్రారంభం కానున్నాయి. 400 ఏళ్ల చరిత్ర కలిగిన అలివేలు మంగ, లక్ష్మీసహిత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంపై ప్రత్యేక కథనం.. - కొత్తపల్లి


కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామానికి ఈశాన్యంగా పచ్చని కొండలు.. ఆహ్లాదకరమైన వాతావరణంలో కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి శ్రీదేవి భూదేవి సమేతంగా కొలువుదీరారు. కరీంనగర్ జిల్లాలోనే స్వయంభువుగా వెలిసిన ఆలయంగా ప్రసిద్ధి చెందినట్లు చరిత్ర చెబుతోంది. ఈ ఆలయ క్షేత్ర పాలకులుగా గరుడ ఆంజనేయులు నెలవై ఉన్నారు.

స్థల పురాణం

స్వయంభువు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం సుమారు 400 ఏళ్ల క్రితం వెలిసినట్లు తెలుస్తోంది. ఆలయ పరిసరాల్లో బౌద్ధులు నివసించడం మూలంగా ఈ గ్రామానికి బౌద్ధపల్లి అని.. కాలక్రమేణా బద్దిపల్లిగా రూపాంతరం చెందిందని ప్రతీతి. ఈ ఆలయం గుట్టపై ఉండటంతో భక్తులకు మానసిక ప్రశాంతతో ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తోంది.

కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం

స్వయంభువు శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులకు కోరిన కోర్కెలు తీర్చి అడిగిందల్లా ప్రసాదించే ఆపద్బాంధువుడిగా ప్రత్యక్షమవుతున్నారన్న అపార నమ్మకం ఇక్కడి ప్రజల్లో నాటుకుంది. ముఖ్యంగా సంతానంలేని వారు స్వామిని దర్శించుకున్నా, హోమంలో పాల్గొన్న సంతాన భాగ్యం కలుగుతుందని ప్రత్యక్షంగా అనుభవం పొందిన భక్తుల విశ్వాసం. శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో శ్రీవేంకటేశ్వరస్వామి వెలసిన స్వామివారిని దర్శించుకుంటే కుటుంబ దాంపత్యం సజావుగా సాగుతుంది. స్వామివారి కటాక్షంతో వ్యాపారం వృద్ధి చెంది, ఉన్నత చదువులు అభ్యసించిన అనేకమంది భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు వస్తుంటారు. బద్దిపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం భక్తిమయం.. ముక్తికి మార్గం.. పాపనాశనకరంగా అర్చకులు చెబుతున్నారు.



బద్దిపల్లిలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం

ప్రకృతి సోయగం.. ప్రశాంతతకు నిలయం

శ్రీవేంకటేశ్వరస్వామి కొలువుదీరిన గుట్ట ప్రకృతి సోయగంగా.. ప్రశాంతతకు నిలయంగా ఉంది. శబ్దకాలుష్యం, రణగొన ధ్వనుల నుంచి ప్రశాంతత పొందేందుకు స్వామి ఆలయ దర్శనం ఒక అద్భుతమైన అనుభూతిని మిగుల్చుతుంది. విహార యాత్రలకు ఎక్కడికో వెళ్లకుండా గుట్టపైకి వస్తే భక్తితో పాటు మానసికోల్లాసం సొంతమవుతుంది. పావురాల గుట్టపైకి ఎక్కితే ప్రకృతి సౌందర్యం అద్భుతంగా కనిపిస్తుంది. నెమళ్ల గుంపులు కనులవిందు చేస్తాయి. వీటికి తోడు పచ్చని పొలాలు ప్రకృతిని ప్రతిబింబజేస్తాయి. కొండపై ఉన్న కోనేరులో ఎప్పటికీ నీరు ఇంకకపోవడం స్వామివారి మహత్యంగా చెప్పుకుంటారు. శిఖరం (శిక్లమ్) గుట్టపై చివరికి చేరుకోవడం కష్టంతో కూడిన సాహసం. ఈ గుట్టపై ప్రతీది అద్భుతంగా గ్రామస్తులు తెలుపుతున్నారు.



స్వయంభువుగా వెలిసిన శ్రీవేంకటేశ్వరస్వామి

ఏటా బ్రహ్మోత్సవాలు

బద్దిపల్లి కొండపై వెలిసిన అలువేలు మంగ, లక్ష్మీ సహిత శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఏటా ఘనంగా నిర్వహిస్తున్నారు. అలాగే ప్రతీ శ్రావణమాసంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులవుతున్నారు. ఈనెల 18న ఉదయం 6 గంటల నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 6 గంటలకు ప్రాబోధిక, 8 గంటలకు విశ్వక్సేన, వాసుదూవా పుణ్యాహవాచన, అంకురారోపణ, 10 గంటలకు అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, సా.6.35లకు స్వామివారి ఎదుర్కోలు, శ్రీవ్యూహహోమం, సర్వదేవతా ఆహ్వానం, సర్వదైవికహోమం బలిహననం, తీర్థప్రసాద వితరణ చేయనున్నారు. 19న సా.6.35కు శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. 20న గ్రామ పురవీధుల్లో స్వామివారి రథోత్సవం చేపట్టనున్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



బద్దిపల్లి స్వయంభువు శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలి. స్వామివారి కల్యాణం, హోమంతో పాటు ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొనాలి. కల్యాణంలో పాల్గొనే దంపతులు పేర్లు నమోదు చేసుకోవాలి.

– ఉప్పు తిరుపతి, ఆలయ కమిటీ చైర్మన్

కరీంనగర్‌లో 'లండన్' ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్ ముఖ ద్వారం

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లో ఈనెల 1న లండన్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు మహ్మద్ ఇలియాస్, మహ్మద్ అలీ, మహ్మద్ సమీర్ తెలిపారు. బుధవారం పద్మనగర్‌లోని ఎగ్జిబిషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. ఈ ఎగ్జిబిషన్‌లో లండన్ బ్రిడ్జి, రోబోటిక్ ఎనిమల్ జంతువుల ప్రదర్శన, లండన్ సిటీ, లండన్ ప్యాలెస్, దుబాయ్ ఫ్రేమ్‌లు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయన్నారు. 20కు పైగా స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూన్ 20వరకు ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటుందని, నగరవాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు.



ఎగ్జిబిషన్‌లో యువతుల సందడి



శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం

జమ్మికుంట: జగ్గయ్యపల్లి గ్రామంలో శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా ఆలయ అర్చకుడు కొదుమగుళ్ల శ్రీధరాచార్యుల వేద మంత్రోచ్ఛరణలతో శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. దాతలు రాములోరి కల్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఉత్సవ మూర్తులను ఊరేగించారు. గ్రామంలో రామ నామస్మరణ మారుమోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దుగ్గినాల రవీందర్, వైస్ చైర్మన్ తిరుపతి రావు, కోశాధికారి రాజు, ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకర్‌రావు, రాజేశ్వర్‌రావు, రవీందర్‌రావు, సంపత్‌రావు, మహేందర్, వెంగల్‌రావు, రంజిత్‌కుమార్, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంఈవో సేవలు మరువలేనివి



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సత్యం

చొప్పదండి: వెల్గటూరు, ధర్మపురి తదితర మండలాల్లో ఎంఈవోగా సేవలు అందించి ప్రజల మన్ననలు పొందిన బత్తుల భూమయ్య సేవలు మరువలేనివని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. పట్టణానికి చెందిన ఎంఈవో బత్తుల భూమయ్య ఇటీవల ఎన్నికల విధుల్లో పాల్గొని వడదెబ్బకు గురై మృతి చెందగా.. బుధవారం ఆయన స్వగృహంలో సంతాప సభ నిర్వహించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు భూమయ్య సేవలను కొనియాడారు. ఎంపీపీ చిలుక రవీందర్, వల్లాల కృష్ణహరి, పెరుమాండ్ల గంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పనులు సత్వరమే పూర్తి చేయాలి



బొమ్మనపల్లి జెడ్పీ పాఠశాలలో వివరాలు తెలుసుకుంటున్న ఏపీడీ సునీత



తిమ్మాపూర్: పరిశీలిస్తున్న డీపీవో రవీందర్, అధికారులు

- ఏపీడీ సునీత

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా జరుగుతున్న పనులను సత్వరమే పూర్తి చేయాలని డీఆర్‌డీవో అదనపు పీడీ సునీత అన్నారు. బుధవారం ఓగులాపూర్, చిన్నముల్కనూర్, గాగిరెడ్డిపల్లి, బొమ్మనపల్లి పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఏఈ కృష్ణమూర్తిని అడిగి తెలుసుకున్నారు. అన్ని గదుల్లో విద్యుత్ సౌకర్యం, వాటర్ సంపులు, టాయిలెట్ల మరమ్మతు పనులను వచ్చే విద్యాసంవత్సరం లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. నాలుగు గ్రామాల్లో జరుగుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో మధుసూదన్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఐకేపీ సీసీలు, సీఏలు, పాఠశాలల విద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: గ్రామ పంచాయతీలో యూపీఎస్, పీఎస్ పాఠశాలలను జిల్లా పంచాయతీ అధికారి(అమ్మ ఆదర్శ పాఠశాలల మండల ప్రత్యేకాధికారి) రవీందర్ బుధవారం తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. గ్రామ సమైక్య అధ్యక్షురాళ్లకు పనులు చేసే విధానంపై సూచనలు, సలహాలు చేశారు. తిమ్మాపూర్‌లో పనులు ప్రగతిలో ఉన్నందున, వెంటనే రికార్డు చేసి అందుబాటులో ఉన్న నిధుల ద్వారా వెంటనే చెల్లింపులు చేయాలని పంచాయతీరాజ్ ఏఈ, మండల విద్యాధికారికి సూచించారు. ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంపీవో కిరణ్, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ సురేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కె.మహేందర్‌రావు, వీవో కోమలత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి, మూత్రశాలలకు సంబంధించిన పనులు వేగవంతం చేసి పాఠశాలల ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని ప్రత్యేకాధికారి పద్మావతి సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పర్యవేక్షణలో భాగంగా పత్తికుంటపల్లి, ఇస్లాంపూర్, మంగపేట, ఇస్తారుపల్లి, లక్ష్మిదేవిపల్లి, నారాయణపూర్, నాగిరెడ్డిపూర్, నర్సింహులపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను బుధవారం పరిశీలించారు. ఆమె వెంట ఎంఈవో వేణుకుమార్, ఏఈ రమేశ్ తదితరులున్నారు.

నేలకు సారం.. పంటకు ప్రాణం

- పూడిక మట్టితో బహుళ ప్రయోజనం
- ఉపాధి కూలీలతో ఉచితంగా చెరువు మట్టి తరలింపు

కరీంనగర్‌రూరల్: చెరువు మట్టిలో సాగు భూములకు కావాల్సిన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. పూడిక మట్టిని పొలాలకు తరలించడంతో నేల సారవంతమవుతోంది. ఉపాధిహామీ పథకంలో పూడిక మట్టి కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు ఉచితంగా సరఫరా చేస్తున్నారు. ఉపాధి కూలీలతో చెరువుల నుంచి మట్టిని తవ్వించి ట్రాక్టర్లలో పొలాలకు తరలిస్తున్నారు. కరీంనగర్ మండలంలో మూడేళ్ల నుంచి చెరువులు, కుంటల్లో పూడిక తీత పనులు నడుస్తున్నాయి. ప్రస్తుతం బహదూర్‌ఖాన్‌పేటలోని ఊరచెరువు, బొమ్మకల్‌లోని నల్లచెరువు, గోధుమ కుంట, చేగుర్తిలోని అయ్యవారి కుంట, గోపాల్‌పూర్‌లోని చింతలచెరువు, మొగ్దుంపూర్‌లోని మన్నెం కుంట, చామనపల్లిలోని అప్పన్నచెరువు, నగునూరులోని పెద్ద చెరువుల నుంచి పూడిక మట్టి తవ్వకం పనులు జోరుగా సాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో దాదాపు 42మంది రైతులు పూడికమట్టి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు 1150 ట్రాక్టర్ల ట్రిప్పుల మట్టిని రైతుల పొలాలకు సరఫరా చేశారు. పూడిక మట్టిని రైతులు పొలాల్లో ఉపయోగిస్తుండటంతో ఎరువుల వాడకం తగ్గి పెట్టుబడి ఖర్చు తగ్గిపోతుండగా కూలీలకు ఉపాధి లభిస్తోంది.



చేగుర్తిలో ట్రాక్టర్‌లో చెరువు మట్టి నింపుతున్న కూలీలు

పుష్కలంగా నత్రజని, పొటాష్

చెరువు మట్టిని రైతులు పొలాల్లో వేసుకోవడంతో అనేక లాభాలున్నాయి. వివిధ పంటల మొక్కలకు అవసరమైన నత్రజని, పొటాష్, జింక్, మెగ్నీషియం పూడిక మట్టిలో పుష్కలంగా ఉంటాయి. నత్రజని మొక్క పెరుగుదలకు ఉపయోగపడుతుండగా, పొటాష్ తెగుళ్లను తట్టుకునే శక్తినిస్తుంది. చెలక భూములకు చెరువుమట్టి సేంద్రియ ఎరువుగా పనిచేస్తోంది. పూడిక మట్టితో రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుండటంతో రైతులపై ఎరువుల కొనుగోలు భారం కొంతమేరకు తగ్గుతోంది.

భూసారం పెరుగుతుంది

నాలుగు ఎకరాల పొలముంది. రెండు ఎకరాల్లో ఎత్తు పల్లాలుండటంతో సాగు చేయడం ఇబ్బందిగా ఉంది. ఇప్పటివరకు 80 ట్రాక్టర్ ట్రిప్పుల పూడికమట్టిని పొలాల్లో పోశాం.పొలం చదునుతో పాటు భూసారం పెరుగుతుందనే ఉద్దేశ్యంతో మట్టిని పోశా.

– కారుకూరి రమేశ్, రైతు, చేగుర్తి

రైతులందరికీ పూడిక మట్టి

దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ చెరువుమట్టిని సరఫరా చేస్తున్నాం. రైతులు ట్రాక్టర్ తెచ్చుకుంటే కూలీలతో ఉచితంగా లోడింగ్ చేసి పంపిస్తున్నాం. వేసవిలో కూలీలందరికీ ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో గ్రామాల్లో జరుగుతున్న పనులను పర్యవేక్షణ చేస్తున్నాం. అన్ని గ్రామాల్లో కూలీల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నాం.

– శోభారాణి, ఏపీవో, ఉపాధిహామీ పథకం

బీమా చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న సభ్యులు

తిమ్మాపూర్: పోరండ్ల గ్రామానికి చెందిన ఆదర్శ పురుషుల పొదుపు సహకార సంఘం సభ్యుడు నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. సామూహిక నిధి బీమా 1, 2 క్లెయిమ్ రూ.60వేలు, అభయనిధి విపత్సహాయం రూ.10వేలు, పొదుపు బోనస్ వడ్డీ రూ.33,219 మొత్తం రూ1,03,219 చెక్కును నామిని సదిరే కనకవ్వకు సమితి అధ్యక్షుడు గుంటి వెంకటేశ్, సంఘం అధ్యక్షుడు నాగపురి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సదిరే సంపత్ అందించారు. సభ్యులు బిజిలీ సమ్మయ్య, బొజ్జ రాజమౌళి, నాగపురి మహేశ్, నీలం రాజ్‌కుమార్, బొజ్జ కొమురయ్య, నీలం సుదర్శన్, పల్లె అంజయ్య, బొజ్జ ఐలయ్య, వెల్డి కనకయ్య సంఘం అకౌంటెంట్ నూనె వెంకటేశ్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు వేద పండితుల ఆశీర్వచనం

పూర్ణాహుతితో ముగిసిన శ్రీ మహారుద్ర సహిత రాజశ్యామల సహస్ర చండీయాగం

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజాహిత పాలన కొనసాగాలని, ఆయనకు మరోసారి విజయం చేకూరాలని ఆకాంక్షిస్తూ.. 41 రోజులుగా 45 మంది వేద పండితులతో తాడేపల్లిలో నిర్వహిస్తున్న శ్రీ మహారుద్ర సహిత రాజశ్యామల సహస్ర చండీయాగం బుధవారం దిగ్విజయంగా ముగిసింది. ఈ సందర్భంగా బుధవారం ముఖ్యమంత్రి నివాసంలో సీఎం వైఎస్ జగన్‌తో వేద పండితులు ప్రత్యేక పూజలు చేయించారు. పూర్ణాహుతికి వినియోగించే ద్రవ్యాలకు సీఎం జగన్‌తో షోడశోపచార పూజలు చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు, వేద ఆశీర్వచనం అందజేశారు. బ్రహ్మశ్రీ నల్లపెద్ది శివరామ ప్రసాద్ శర్మ, గౌరావఝ్జల నాగేంద్రశర్మ ఆధ్వర్యంలో ఈ యాగం జరిగింది. పూర్ణాహుతి కార్యక్రమంలో చండీయాగ నిర్వాహకులు డాక్టర్ ఆరిమండ వరప్రసాద రెడ్డి, విజయ శారదా రెడ్డి దంపతులు, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి దంపతులు, రక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకులు పడమట సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


బుధవారం సీఎం జగన్‌కు ఆశీర్వచనం చేస్తున్న వేద పండితులు

ఎన్నికల హింసపై ఈసీ సీరియస్

నేడు ఢిల్లీకి ఏపీ సీఎస్, డీజీపీ
- పోలింగ్‌కు ముందు ఆకస్మిక బదిలీలతో సమస్యలు ఉత్పన్నం
- కొన్ని చోట్ల పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించినట్లు ఎన్నికల పరిశీలకుల నివేదిక

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పోలింగ్ రోజు, ఆ తరువాత హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవటాన్ని కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. దీనిపై స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్.జవహర్‌రెడ్డి, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాను ఆదేశించింది. ఈ నేపథ్యంలో వారిద్దరూ ఢిల్లీ వెళ్లి గురువారం మధ్యాహ్నం వివరణ ఇవ్వనున్నారు. పోలింగ్ అనంతరం పల్నాడు, కారంపూడి, చంద్రగిరి, తాడిపత్రిలో ఘర్షణలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి హెచ్చరించినా స్థానిక పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించటాన్ని తీవ్రంగా పరిగణించిన ఈసీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. కొంత మంది పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారని, ప్రేక్షక పాత్ర పోషించారని కేంద్ర పరిశీలకులు ఈసీకి నివేదిక ఇచ్చారు.

ఆకస్మిక బదిలీలతో సమస్యలు: సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి బందోబస్తు ఏర్పాట్లు చేసినా అక్కడ పోలీసు ఉన్నతాధికారులను ఈసీ హఠాత్తుగా బదిలీ చేయడంతోనే సమస్యలు ఉత్పన్నమైనట్లు అధికార యంత్రాంగం భావిస్తోంది. కొత్త అధికారులకు క్షేత్రస్థాయి పరిస్థితులపై సమగ్ర అవగాహన లేకపోవడంతో కొన్ని చోట్ల ఘర్షణలు చోటు చేసుకున్నట్లు పేర్కొంటున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా బుధవారం సచివాలయంలో సమావేశమై చర్చించారు. విధి నిర్వహణలో ఏకపక్షంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్చించారు. ఏకపక్షంగా వ్యవహరించిన అధికారులను ఇప్పటికే గుర్తించామని, వారిపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా స్పష్టం చేశారు.

పల్నాడులో ఆగని విధ్వంసం

- ఎన్నికలు ముగిసి మూడు రోజులైనా ఇంకా ఉద్రిక్తతలు
- జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలు
- దుకాణాలు బంద్, అనుమానితుల బైండోవర్

టీడీపీ గూండాలపై కేసు నమోదు

ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంట్లో పోలీసుల విధ్వంసం

టీడీపీ విధ్వంసకాండకు ఈసీదే బాధ్యత

- స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఈసీ పక్షపాతంతో వ్యవహరిస్తోంది
- పోలింగ్ రోజు, ఆ తర్వాత రాష్ట్రంలో టీడీపీ గూండాల విధ్వంసం
- రాజకీయ కక్షతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలపై టీడీపీ దాడులు
- పట్టించుకోని పోలీసులు.. కౌంటింగ్ రోజునా అల్లర్లకు టీడీపీ కుట్ర
- జగన్ మళ్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయం
- పక్షపాతంతో వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవు
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టీకరణ

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

టీడీపీ గూండాగిరికి పోలీసుల వత్తాసు

- ఈసీ అసంబద్ధ నిర్ణయాలతోనే దాడులు, విధ్వంసం
- చంద్రబాబు, పురందేశ్వరి ఒత్తిడితో పోలీసు అధికారుల బదిలీ
- పథకం ప్రకారం ఆ ప్రాంతాల్లో పచ్చ ముఠాల స్వైర విహారం
- తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీకి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

బడుగులపై బరితెగింపు

వైఎస్సార్‌సీపీ అనుకూల వర్గాలే టార్గెట్.. మహిళలపై పచ్చ మూకల దాష్టీకాలు

నర్సీపట్నంలో దుశ్శాసన పర్వం.. కృష్ణా జిల్లాలో దమనకాండ
మహిళలపై హత్యాయత్నాలు చేస్తున్నా ఏమీ పట్టనట్లు ఈసీ నిర్లిప్తత
గ్రామాలు వీడి దూరంగా తలదాచుకుంటున్న బీసీ, ఎస్సీ, ఎస్టీలు.. చేష్టలుడిగి చూస్తున్న అధికార యంత్రాంగం

ఫ్యాన్‌కు ఓటేసిందని.. మహిళను ట్రాక్టర్‌తో తొక్కించాడు!

ఓ మహిళ వైఎస్సార్‌సీపీకి ఓటు వేసిందని కక్షగట్టిన టీడీపీ నాయకుడు ఏకంగా ట్రాక్టర్‌తో తొక్కించాడు! కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు గ్రామానికి చెందిన వేముల సంధ్యారాణి వైఎస్సార్ సీపీకి ఓటు వేసిందని టీడీపీ నాయకుడు ఏడుకొండలు కక్ష పెంచుకున్నాడు. బుధవారం ఉద్దేశపూర్వకంగా ఆమెతో ఘర్షణ పడి తన ట్రాక్టర్‌తో ఢీకొట్టాడు. చిన్నమనేని సిద్ధార్థ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని గన్నవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంశీమోహన్ పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అయ్యన్న గ్యాంగ్ దుశ్శాసన పర్వం

ఎన్నికల్లో చురుగ్గా పని చేసిందనే కక్షతో అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం ధర్మసాగరంలో ఓ ఒంటరి మహిళ పట్ల అయ్యన్నపాత్రుడి అనుచరులు దుశ్శాసనుల్లా వ్యవహరించారు. మంగళవారం అర్ధరాత్రి బాధితురాలి ఇంట్లోకి చొరబడి జుత్తు పట్టుకొని ఈడ్చుకొచ్చి కాళ్లతో తన్నుతూ.. తాకరాని చోట తాకుతూ అసభ్యంగా ప్రవర్తించారు. ఈ దుశ్చర్యను అడ్డుకోడానికి ప్రయత్నించిన స్థానికులపై పచ్చముఠాలు విరుచుకుపడ్డాయి. బాధితురాలు పొలమూరి రాజకుమారి 13 ఏళ్ల తన కుమారుడితో కలసి జీవిస్తోంది. కొన్నాళ్లు వలంటీరుగా పని చేసింది. పోలింగ్ రోజు ఓటర్లకు స్లిప్‌లు రాసిచ్చి వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పని చేయడం అయ్యన్న పాత్రుడి అనుచరులకు మింగుడు పడలేదు. పోలింగ్ మర్నాడు బాధితురాలు అదే గ్రామంలో ఉన్న తన పుట్టింటికి వెళ్లింది. రాత్రి 10 గంటల సమయంలో టీడీపీకి చెందిన రెడ్డి రాజేష్, రెడ్డి సత్యసాయి, కామిరెడ్డి శివ, సుకల రాజేష్, పెట్ల గంగాధర్, అల్లు రాజు, వానపల్లి రాజేష్, సార్ల రఘు, నందిపల్లి బోయిల నాయుడు ఆమె ఇంటిని చుట్టుముట్టి తలుపులు బాదటంతో బయటకు వచ్చింది. రౌడీ మూకలు ఆమె మొబైల్‌ను లాక్కుని భౌతిక దాడికి పాల్పడ్డాయి. మెడలోని బంగారు గొలుసు లాక్కున్నారు. దీన్ని ప్రతిఘటించిన వృద్ధురాలు సీతమ్మ చెంపపై కొట్టి చెవి దుద్దులు లాక్కున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు 324, 506, 509 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అయ్యన్నపాత్రుడి అనుచరురాలు, జెడ్పీటీసీ సుకల రమణమ్మ తన అనుచరులను దాడికి పురిగొల్పినట్లు బాధితురాలు పేర్కొంది.

సాక్షి, అమరావతి/విశాఖ సిటీ/ఉంగుటూరు, నెట్‌వర్క్: 'ఈసీ' ఉదాసీనతతో పేట్రేగుతున్న పచ్చ ముఠాలు రాష్ట్రవ్యాప్తంగా భయానక వాతావరణాన్ని సృష్టిస్తూ మహిళలు, బీసీలు, ఎస్సీ, ఎస్టీలపై పాశవికంగా దాడులకు తెగబడుతున్నాయి. గ్రామాల్లో హింసను ప్రేరేపిస్తూ దమనకాండకు తెర తీశాయి. అనకాపల్లి జిల్లాలో టీడీపీ నేత అయ్యన్నపాత్రుడి అనుచరులు ఒంటరి మహిళపై కీచక పర్వానికి తెగబడగా కృష్ణా జిల్లా ఉంగుటూరులో ఫ్యాన్‌కు ఓటేసిందనే కక్షతో ఓ మహిళను ట్రాక్టర్‌తో తొక్కించి హత్యాయత్నానికి తెగబడ్డాయి. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతుగా పని చేయడమే ఈ అక్కచెల్లెమ్మలు చేసిన నేరం! తాజాగా పల్నాడులోనూ టీడీపీ మూకల దాష్టీకాలకు బడుగు, బలహీన వర్గాలు ఓ రాత్రంతా దేవాలయంలో తలదాచుకుని ప్రాణాలు కాపాడుకోవడం తెలిసిందే. ఎన్నికలు ముగిసినా ఓట్ల లెక్కింపు వరకు విధ్వంసకాండ కొనసాగించే ప్రణాళికను టీడీపీ మూకలు అమలు చేస్తున్నాయి. ఓట్ల లెక్కింపు చేపట్టే జూన్ 4వరకు రాష్ట్రం రావణ కాష్టంగా రగులుతూ ఉండాలని టీడీపీ నేతలు, కార్యకర్తలకు పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అందుకు అనుగుణంగానే టీడీపీ గూండాలు, రౌడీ మూకలు స్వైర విహారం చేస్తుండటంతో రాష్ట్రంలో భీతావహ పరిస్థితులు నెలకొన్నాయి. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గిన ఎన్నికల కమిషన్ ఈ దాడుల పట్ల నిర్లిప్తంగా వ్యవహరించడం పరిస్థితిని మరింత దిగజారుస్తోంది. సమస్యాత్మక జిల్లాల్లో బదిలీలపై వచ్చిన పోలీసు అధికారులు పచ్చమూకల దౌర్జన్యకాండకు కొమ్ము కాస్తుండటం నివ్వెర పరుస్తోంది.

బెదిరించి.. భయపెట్టి

ప్రజాబలంతో టీడీపీ నెగ్గలేదని స్పష్టం కావడంతో పోలింగ్ రోజు రాష్ట్రవ్యాప్తంగా అవ్వాతాతలు, మహిళలను బెదిరిస్తూ దాడులతో హడలెత్తించే కుట్రలను చంద్రబాబు అమలు చేశారు. పోలింగ్ రోజు మొదలైన ఈ విధ్వంస కాండ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఓట్ల లెక్కింపు సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కల్పించేందుకు పథకాలను రచిస్తున్నారు. వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు కొనసాగిస్తూ గ్రామాల్లో లేకుండా చేయాలని, జూన్ 4న కౌంటింగ్ కేంద్రాల వద్దకు సైతం రాకుండా భయో త్పాతం సృష్టించాలని చంద్రబాబు ఎత్తుగడలు వేస్తున్నారు.


టీడీపీ మూకల చేతిలో గాయపడి బంగారు చెవి దుద్దులు కోల్పోయిన వృద్ధురాలు

పోలీసుల దన్ను... ఈసీ ఉదాసీనత

టీడీపీ మూకలు బరితెగించి దాడులు, విధ్వంసానికి పాల్పడుతున్నా పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం విస్మయపరుస్తోంది. హింసాకాండ చెలరేగిన పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో డీఐజీ నుంచి ఎస్పై వరకూ పోలీసు అధికారులను పోలింగ్‌కు ముందు ఈసీ హఠాత్తుగా బదిలీ చేసింది. వారి స్థానంలో క్షేత్రస్థాయి పరిస్థితులపై ఏమాత్రం అవగాహనలేని అధికారులను నియమించింది. శాంతిభద్రతల పరిరక్షణలో అత్యంత కీలకమైన డీజీపీ, ఇంటెలిజెన్స్ డీజీలను కూడా ఈసీ బదిలీ చేసింది. చంద్రబాబు ఆదేశాలతో పురందేశ్వరి అందచేసిన జాబితాలో సూచించిన వారినే నియమించింది. అదే దన్నుగా టీడీపీ గూండాలు చెలరేగిపోతున్నారు. ఈసీ టీడీపీకి అనుకూలంగా ఉందనే సంకేతాలు వెలువడటంతో విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నాయి. అధికార యంత్రాంగాన్ని నడిపిస్తున్న ఈసీ ఈ దాడుల పట్ల బుధవారం వరకూ స్పందించలేదు. ఎస్పీలు, డీఐజీలకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వలేదు. డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌లతో చర్చించలేదు. ఈసీ, పోలీసుల తీరుపై వైఎస్సార్‌సీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ గట్టిగా నిలదీయడంతో ఇక తప్పదన్నట్లుగా సమీక్షకు ఉపక్రమించింది.

పల్నాడులో చల్లారని ఉద్రిక్తతలు

ఎన్నికలు ముగిసి మూడు రోజులైనా పల్నాడులో ఉద్రిక్తతలు చల్లబడలేదు. టీడీపీ మూక దాడులతో ఎస్సీ, బీసీ వర్గాలు గ్రామాలు వీడి దూరంగా తలదాచుకుంటున్నాయి. పోలింగ్ రోజు రాత్రి అరాచక ముఠాల దాడులతో మాచవరం మండలం కొత్త గణేశునిపాడులో గ్రామం వదిలి వెళ్లిన ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు ఇంతవరకు స్వగ్రామాలకు చేరుకోలేదు. పల్నాడులో 144 సెక్షన్ విధించడంతో దుకాణాలు మూతబడ్డాయి. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హౌస్ అరెస్ట్‌లో ఉన్నారు. దాచేపల్లి మండలం మాదినపాడులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త దొండేటి ఆదిరెడ్డిపై టీడీపీ నాయకులు బుధవారం కర్రలు, ఇనుపరాడ్లతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో పట్టణాన్ని వీడి వెళ్లిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నివాసంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక చొరబడ్డ పోలీసులు తలుపులు బద్దలు కొట్టారు. సీసీ కెమెరాలు, ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి కంప్యూటర్లను పగులగొట్టారు. హార్డ్ డిస్క్‌లను మాయం చేశారు.

ఓటు వేసేందుకు వచ్చి మృత్యువాత

- హైదరాబాద్ నుంచి ఓటర్లను పిలిపించిన టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి
- తిరుగు ప్రయాణంలో చిలకలూరిపేట వద్ద బస్సు ప్రమాదం
- టిప్పర్‌ను బస్సు ఢీకొనడంతో చెలరేగిన మంటలు
- ఇద్దరు డ్రైవర్లు సహా ఆరుగురు సజీవ దహనం



చినగంజాం/చిలకలూరిపేట: ప్రైవేట్ బస్సు, టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఓటు వేసేందుకు వచ్చి తిరిగి వెళ్తున్న చినగంజాం, చీరాల వాసులు నలుగురు, రెండు వాహనాల డ్రైవర్లు మృత్యువాత పడ్డారు. మరో మహిళ తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. ఇంకో 20 మందికి పైగా తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. బుధవారం తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం ఈవూరివారిపాలెం వద్ద ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఓటేసేందుకు వచ్చి ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని మృతుల కుటుంబ సభ్యులు గుండెలవిసేలా విలపిస్తున్నారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లో ఉంటున్న చాలా మందికి పర్చూరు నియోజకవర్గంలో ఓట్లు ఉన్నాయి. దీంతో పర్చూరు టీడీపీ అభ్యర్థి ఏలూరి సాంబశివరావు ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసి, ఆదివారం రాత్రి వారిని పర్చూరుకు తరలించారు. ఇందులో భాగంగా చినగంజాంకు చెందిన ఓటర్లు సైతం హైదరాబాద్ నుంచి వచ్చారు. వీరంతా సోమవారం ఓట్లు వేసి, మంగళవారం రాత్రి ఏలూరు సాంబశివరావు ఏర్పాటు చేసిన బస్సుల్లో హైదరాబాద్‌కు తిరిగి పయనమయ్యారు. చినగంజాంకు చెందిన 42 మంది చీరాలకు చెందిన ట్రావెల్స్ బస్సు (ఏపీ 27 టీటీ 6577)లో రాత్రి 11 గంటలకు బయలు దేరారు. ఈ క్రమంలో తెల్లవారుజామున 1.30 గంటలకు ఈ బస్సు.. పల్నాడు జిల్లా ఈవూరుపాలెం వద్ద ఎదురుగా కంకర మట్టి లోడుతో వస్తున్న టిప్పర్ (ఆర్‌జే 23 జీసీ 2452)ను ఆయిల్ ట్యాంక్ వద్ద బలంగా ఢీకొట్టింది. దాంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అటు టిప్పర్, ఇటు బస్సుకు మంటలు వ్యాపించాయి. ఒక్కసారిగా బస్సులో బ్యాటరీ ఫెయిల్ అవడంతో చీకటి అలముకొంది. నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులు తప్పించుకొని వెళ్లలేని పరిస్థితి తలెత్తింది. ఆ సమయంలో బస్సు డోర్ వద్ద ఉన్న చినగంజాంకు చెందిన యువకుడు సింగోతు సాయి కేకలు వేస్తూ ప్రయాణికులను నిద్ర లేపాడు. చాలా మంది ప్రయాణికులు హాహాకారాలు చేస్తూ డోర్ ద్వారా బయటకు రాగా, మరికొంత మంది కిటికీ అద్దాలను పగులగొట్టి, అత్యవసర ద్వారాన్ని తెరచుకొని బయటకు దూకేశారు. అప్పటికే మంటలు అంటుకొని కొందరు ప్రయాణికులు హృదయ విదారకంగా కేకలు పెట్టారు. ఈ లోగా మంటలు భారీగా చెలరేగి బస్సు, టిప్పర్ పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రయాణికులు నలుగురు బస్సులోనే కాలి బూడిదయ్యారు. ఈ దుర్ఘటనలో చీరాలలోని పేరాలకు చెందిన బస్సు డ్రైవర్ షేక్ మస్తాన్ షరీఫ్ (47), టిప్పర్ డ్రైవర్ మధ్యప్రదేశ్‌కు చెందిన హరిసింగ్ (39), బస్సులో ప్రయాణిస్తున్న చినగంజాం మండలం నీలాయపాలెం గ్రామానికి చెందిన దంపతులు ఉప్పుగుండూరు కాశీబ్రహ్మేశ్వరరావు (65), ఉప్పుగుండూరు లక్ష్మీ(55), వీరి మనవరాలు ఒంగోలు పట్టణానికి చెందిన బొప్పిరాజు ఖ్యాతి సాయి (9), చినగంజాం మండలం గోనెపూడి గ్రామానికి చెందిన దావులూరి శ్రీనివాసరావు (54) అక్కడికక్కడే మృతి చెందారు. వీరి మృతదేహాలు గుర్తు పట్టలేని విధంగా కాలిపోయాయి.

బస్సు దుర్ఘటనలో గాయపడిన 30 మందిని చిలకలూరిపేట, యడ్లపాడు, నాదెండ్ల మండలాలకు చెందిన 108 వాహనాల ద్వారా చిలకలూరిపేట ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం ఎస్.కీర్తి, కె.వెంకటరావు, సీహెచ్. శంకరరావు, ఎస్.రాజ్యలక్ష్మి, ఎస్.కళావతి, డి.భువన, సీహెచ్.ఆదిలక్ష్మి, పి.లక్ష్మి, కె.లిప్సికలను గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మరో 20 మందికి ప్రాథమిక చికిత్స చేసి ఇంటికి పంపించారు. క్షతగాత్రుల్లో 20 మందికి పైగా చినగంజాం మండల వాసులే.

సీఎం జగన్ దిగ్భ్రాంతి

పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద బస్సు ప్రమాదంలో ఆరుగురు మరణించిన ఘటనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సహాయంగా నిలుస్తామన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున పరిహారం ప్రకటించారు.

చంద్రబాబుపై చర్యలు తీసుకోవాలి

ఈసీకి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో హింస, దాడులు, అల్లర్లలో ప్రధాన ముద్దాయి చంద్రబాబేనని, ఆయనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేసింది. రాష్ట్ర మంత్రులు అంబటి రాంబాబు, మేరుగు నాగార్జున, జోగి రమేష్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు పేర్ని నాని, నంబూరు శంకరరావు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి బుధవారం ఎన్నికల సంఘం కార్యాలయంలో ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాను కలిసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. గొడవలకు సంబంధించిన ఆధారాలు అందజేశారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ ఇటీవల చేసిన హింసాకాండపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. ముఖ్యంగా పల్నాడు ప్రాంతంలో ఉద్దేశపూర్వకంగా, ప్లాన్ ప్రకారం దాడులు చేశారని తెలిపారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, కూటమి పార్టీలకు కొమ్ముకాస్తున్నారని వారు వివరించారు.

వెల్లివిరిసిన మహిళా చైతన్యం

ఏపీలో పురుషులకంటే ఓట్లు వేసిన మహిళల సంఖ్య 4.78 లక్షలు అధికం

- పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి మొత్తం పోలింగ్ శాతం 81.86 శాతం
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా


సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో మహిళా ఓటర్ల చైతన్యం వెల్లి విరిసింది. పురుషులకంటే 4,78,535 మంది మహిళలు అధికంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 81.86 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో పోలైన ఓట్ల తుది వివరాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) ముఖేష్ కుమార్ మీనా బుధవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమవారం జరిగిన పోలింగ్‌లో ఈవీఎంల ద్వారా 80.66 శాతం (3,33,340,333 ఓట్లు), పోస్టల్ బ్యాలెట్ ద్వారా 1.2 శాతం ఓట్లు నమోదైనట్లు చెప్పారు. రాష్ట్ర చరిత్రలో ఇంత భారీ స్థాయిలో ఓట్లు నమోదవడం ఇదే తొలిసారన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో దేశంలో జరిగిన నాలుగు దశల పోలింగ్‌లో రాష్ట్రంలోనే అత్యధికంగా పోలింగ్ శాతం నమోదైనట్లు చెప్పారు. పోస్టల్ బ్యాలెట్‌లో ఉద్యోగులు, అత్యవసర సర్వీసు ఓటర్లు, 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు పాల్గొన్నారని తెలిపారు. 2019 ఎన్నికల్లో 2.62 మంది లక్షల పోస్టల్ బ్యాలెట్లను వినియోగించుకోగా, ఈసారి 4.97 లక్షల మంది వినియోగించుకున్నట్లు తెలిపారు. గత ఎన్నికల్లో 56 వేల పోస్టల్ బ్యాలెట్లు తిరస్కరణకు గురయ్యాయని, ఈసారి ఉద్యోగులు ఎంతో జాగ్రత్తగా ఉన్నందున అటువంటి పరిస్థితి తలెత్తలేదని చెప్పారు.

విశాఖలో ఎక్కువ ఓట్లు పోలవడం శుభపరిణామం

లోక్‌సభ నియోజకవర్గాల్లో ఒంగోలులో అత్యధికంగా 87.06 శాతం ఓట్లు రాగా, అత్యల్పంగా విశాఖపట్నంలో 71.11 శాతం వచ్చాయన్నారు. శాసనసభ నియోజకవర్గాల్లో అత్యధికంగా దర్శి నియోజకవర్గంలో 90.91 శాతం పోలింగ్ నమోదవగా, అత్యల్పంగా తిరుపతిలో 63.32 శాతం నమోదైనట్లు తెలిపారు. గత ఎన్నికల్లో తిరుపతిలో 65.9 శాతం పోలింగ్ నమోదవగా, ఈసారి 63.32 శాతానికి తగ్గడానికి ఆ నియోజకవర్గంలో బోగస్ ఓట్లను నియంత్రించడమే ప్రధాన కారణమని తెలిపారు. విశాఖపట్నం పార్లమెంటరీ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో 67 శాతం పోలింగ్ నమోదుకాగా, ఈసారి ప్రత్యేకించి విశాఖ పట్టణ ప్రాంతంలో 71.11 శాతం పోలింగ్ జరగడం ఎంతో శుభపరిణామమని అన్నారు.

ఎవరూ రీపోలింగ్ కోరలేదు

దేశ, విదేశాల నుండి ఓటర్లు పెద్ద ఎత్తున ఓటింగ్‌కు తరలి రావడం, చివరి రెండు గంటల ముందు క్యూలలో ఓటర్లు ఎక్కువగా ఉండటం వల్ల అర్ధరాత్రి వరకూ ఓటింగ్ కొనసాగిందని మీనా తెలిపారు. దీనికితోడు 5,600 పోలింగ్ స్టేషన్లలో 1,200కు పైబడి ఓటర్లు ఉండటం కూడా ఓటింగ్ ఆలస్యానికి కారణమైందన్నారు. దాదాపు 3,500 పోలింగ్ స్టేషన్లలో నిర్ణీత సమయమైన సాయంత్రం 6.00 గంటలు దాటి పోలింగ్ కొనసాగిందని, చివరి పోలింగ్ స్టేషన్‌లో అర్ధరాత్రి 2 గంటలకు పోలింగ్ ముగిసిందని చెప్పారు. శ్రీకాకుళం, కోనసీమ, ఉదయగిరి తదితర ప్రాంతాల్లో వాతావరణం సహకరించకపోవడం వల్ల ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత ఎలక్షన్ టీమ్‌లు డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకు వచ్చేసరికి ఆలస్యమైందన్నారు. ఎన్నికలు ముగిసిన తదుపరి రోజు పరిశీలకులు, అభ్యర్థులతో రిటర్నింగ్ అధికారి సమావేశం ఏర్పాటు చేసి ఎక్కడైనా రీపోలింగ్‌కు అవసరం ఉందా లేదా అనే విషయాన్ని సమీక్షిస్తారన్నారు. ఈ సమీక్షల్లో ఒక్క పరిశీలకుడు కూడా రీపోలింగ్‌కు సిఫార్సు చేయకపోవడంవల్ల 25 లోక్‌సభ నియోజకవర్గాలు, 175 అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలను అన్నింటినీ మంగళవారం రాత్రి 33 ప్రాంతాల్లో ఉన్న 350 స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచినట్లు తెలిపారు. ఈ స్ట్రాంగ్ రూమ్‌లకు మూడంచెల భద్రత కల్పించామని చెప్పారు. ఈ ప్రక్రియ మొత్తం ముగిసిన తరువాతే అసలైన పోలింగ్ శాతాన్ని ఖరారు చేస్తామని, అందువల్లే పోలింగ్ శాతాన్ని ప్రకటించడంలో కొంత ఆసల్యం జరిగిందని వివరించారు.



హింసాత్మక ఘటనలపై ఈసీ సీరియస్

ఎన్నికల అనంతరం ప్రత్యేకించి తాడిపత్రి, మాచర్ల, చంద్రగిరి, నర్సరావుపేట ప్రాంతాల్లో పలుచోట్ల హింసాత్మక ఘటనలు జరిగాయని మీనా చెప్పారు. ఈ ఘటనలను ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించి, వెంటనే డీజీపీతో చర్చించిందని తెలిపారు. మంగళవారం నుంచి పోలీస్ యంత్రాంగం ప్రత్యేకమైన చర్యలు చేపట్టిందని, ఆయా ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేస్తున్నదని తెలిపారు. ఈ నాలుగు ప్రాంతాలకు సీనియర్ అధికారులు, అదనపు పోలీసు బలగాలను పంపినట్లు చెప్పారు. స్థానికంగా జన సంచారాన్ని నియంత్రించడమే కాకుండా సంబంధిత పార్టీల అభ్యర్థులను గృహ నిర్బంధం చేశామన్నారు. తదుపరి విచారణ జరిపి పోలీస్ కేసులను కూడా పెట్టడం జరుగుతుందన్నారు. 715 ప్రాంతాల్లో పోలీస్ పికెట్లను కూడా ఏర్పాటు చేశామని, అన్ని చోట్లా పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని ఆయన తెలిపారు.

25 లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ శాతం

నియోజకవర్గం	పోలింగ్ శాతం
అరకు (ఎస్టీ)	73.68
శ్రీకాకుళం	74.43
విజయనగరం	81.05
విశాఖ	71.11
అనకాపల్లి	82.03
కాకినాడ	80.30
అమలాపురం (ఎస్సీ)	83.85
రాజమండ్రి	80.93
నర్సాపురం	82.59
ఏలూరు	83.68
మచిలీపట్నం	84.05
విజయవాడ	79.37
గుంటూరు	78.81
నరసరావుపేట	85.65
బాపట్ల (ఎస్సీ)	85.48
ఒంగోలు	87.06
నంద్యాల	80.61
కర్నూలు	76.80
అనంతపురం	80.51
హిందుపురం	84.70
కడప	79.57
నెల్లూరు	79.05
తిరుపతి (ఎస్సీ)	79.10
రాజంపేట	79.09
చిత్తూరు (ఎస్సీ)	85.77

సెన్సెక్స్ డౌట్!



ఓటింగ్ తగ్గుతుండటంతో ఇన్వెస్టర్లలో అలజడి

- బీజేపీకి ఈసారి సీట్లు భారీగా తగ్గొచ్చనే అంచనాలు
- సొంతంగా మేజిక్ ఫిగర్‌ను సాధిస్తుందా అన్న ఆందోళన
- విదేశీ ఇన్వెస్టర్ల రివర్స్ గేర్, నెలలో రూ.30 వేల కోట్లు వెనక్కి
- ఆల్‌టైమ్ గరిష్టాల నుంచి సెన్సెక్స్, నిఫ్టీ 3 శాతం మేర డౌన్
- ఫలితాల వరకూ ఒడిదుడుకులు ఉండొచ్చంటున్న విశ్లేషకులు

మళ్లీ వచ్చేది మోదీయే... ఈసారి ఎన్డీయే కూటమికి 400 పై చిలుకు సీట్లు పక్కా... బీజేపీకి కనీసం 370 సీట్లు ఖాయం... కమలనాథుల అంచనాలివి! తీరా ఎన్నికలు మొదలై ఒక్కో విడత పోలింగ్ ముగుస్తున్నకొద్దీ ఈ ఉత్సాహం మెల్లమెల్లగా నీరుగారుతోంది. నాలుగు విడతల్లోనూ పోలింగ్ గత ఎన్నికలతో పోలిస్తే తగ్గడంతో అధికార పార్టీలో కాస్త అలజడి మొదలైంది. ఇదే మూడ్ స్టాక్ మార్కెట్లోనూ ప్రతిబింబిస్తోంది. ఓటింగ్ తగ్గడంతో బీజేపీ సొంతంగా మేజిక్ ఫిగర్‌ను అందుకుంటుందో లేదోనన్న అనుమానాలు తలెత్తడంతో ఇన్వెస్టర్లలో విశ్వాసం దెబ్బతింది. రోజుకో కొత్త రికార్డులతో రంకెలేసిన బుల్ ఒక్కసారిగా రివర్స్ గేర్ వేసింది. ఎన్నికల 'వేడి'కి తికమకపడుతోంది. నిన్నమొన్నటిదాకా పెట్టుబడుల వరద పారించిన విదేశీ ఇన్వెస్టర్లు పొలోమంటూ అమ్మకాలకు తెగబడుతున్నారు. అయి తే ఫలితాలపై అనిశ్చితి వల్లే సెంటిమెంట్‌పై ప్రభావం పడుతోందని, బీజేపీ మళ్లీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే ఇన్వెస్టర్లు తరలివస్తారని నిపుణులు పేర్కొంటున్నారు...

- సాక్షి, నేషనల్ డెస్క్

స్టాక్ మార్కెట్లో ఈసారి ఎన్నికల ముందస్తు ర్యాలీతో రికార్డుల మోత మోగింది. మోదీ 3.0పై నమ్మకానికి తోడు ఎన్డీయే సీట్ల సంఖ్య కూడా పెరుగుతుందన్న అంచనాలు దీనికి కారణం. అయితే, ఎన్నికల 'వేడి' జోరందుకుని, పోలింగ్ మొదలయ్యాక ఇన్వెస్టర్లలో నెమ్మదిగా నమ్మకం సడలుతూ వస్తోంది. ఇప్పటిదాకా పోలింగ్ పూర్తయిన నాలుగు విడతల్లోనూ గత ఎన్నికలతో పోలిస్తే ఓటింగ్ శాతం తగ్గడం దీనికి ఆజ్యం పోసింది. మండుటెండలు, పట్టణ ఓటర్ల నిరాసక్తత వంటి కారణాలు ఎన్నున్నా ... ఓటింగ్ పడిపోవడంతో ఫలితాల్లో బీజేపీ బంపర్ విక్టరీపై అనుమానాలు ఇన్వెస్టర్లలో గుబులు పుట్టిస్తున్నాయి. ఇటీవలే సెన్సెక్స్ (75,111 పాయింట్లు), నిఫ్టీ (22,795 పాయింట్లు) కొత్త ఆల్‌టైం గరిష్టాలను తాకిన తర్వాత భారీగానే క్షీణించాయి. గడచిన నెల రోజుల్లో సూచీలు దాదాపు 3 శాతం పైగానే పడటం దీనికి అద్దం పడుతోంది. గత ఎన్నికల్లో తొలి విడతల్లో పోలింగ్ తగ్గినా, క్రమంగా పుంజుకుంది. దాంతో మొత్తమ్మీద రికార్డు స్థాయిలో 67.4 శాతం ఓటింగ్ జరిగింది. బీజేపీ సొంత బలం కూడా 282 నుంచి 303 లోక్‌సభ స్థానాలకు ఎగబాకింది. ఈసారి మాత్రం తొలి విడత నుంచే ఓటింగ్ క్రమంగా తగ్గముఖం పడుతూ వస్తోంది. మిగతా 3 విడతల్లోనూ ఇలాగే మందకొడిగా జరిగితే మొత్తం ఓటింగ్ గతం కంటే 2 నుంచి 3 శాతం తగ్గేలా కన్పిస్తోంది.

> అధికార పక్షం గెలుపు అంచనాలు తప్పొచ్చనే ఆందోళనల వల్లే దేశీ ఈక్విటీ మార్కెట్లలో తీవ్ర ఒడిదుడుకులు వస్తున్నాయి. ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. బీజేపీకి సీట్లు భారీగా తగ్గినా, సొంతంగా మెజారిటీ రాకపోయినా, ఫలితాల రోజున మార్కెట్ నుంచి తీవ్ర ప్రతిస్పందన ఉండొచ్చు. ఫలితాలొచ్చేదాకా ఇదే అలజడి ఉంటుంది
> - మాధవీ అరోరా, ఎమ్‌కే గ్లోబల్ ఫైనాన్షియల్ ముఖ్య ఆర్థికవేత్త




విదేశీ ఇన్వెస్టర్లు పీఛే ముడ్..

ఓటింగ్ శాతం తగ్గుతుండటం, ఎన్నికల ఫలితాలపై అనిశ్చితి నెలకొనడంతో విదేశీ ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)లో కూడా ఆందోళన మొదలైంది. మన ఈక్విటీ మార్కెట్లలో గత నెలన్నరలో రూ.30 వేల కోట్లకు పైగా విలువైన షేర్లను అమ్మేయడం దీనికి నిదర్శనం. మార్కెట్లు భారీగా పడటానికి ఎఫ్‌పీఐల విక్రయాలే కీలకంగా నిలుస్తున్నాయి. 2023లో విదేశీ ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) ఏకంగా రూ.1.77 లక్షల కోట్లను దేశీ మార్కెట్లో కుమ్మరించి రికార్డులు బద్దలుకొట్టారు. అంతేకాదు, ఇందులో దాదాపు మూడో వంతు (రూ.58 వేల కోట్లు) ఒక్క డిసెంబర్‌లోనే ఇన్వెస్ట్ చేయడం విశేషం. దీనికి తోడు దేశీ ఇన్వెస్టర్లు, ఫండ్స్ జోరుతో బుల్ రంకెలేసింది. గతేడాది సెన్సెక్స్, నిఫ్టీ 20 శాతం రాబడులు అందించాయి. కార్పొరేట్ కంపెనీల లాభాలు పుంజుకోవడం, ప్రభుత్వ పెట్టుబడుల జోరు, స్థూల ఆర్థిక పరిస్థితులు మెరుగ్గా ఉండటం, వృద్ధి రేటు పుంజుకోవడం, సుస్థిర ప్రభుత్వం, స్థిరమైన పాలసీలు తదితర కారణాలతో విదేశీ ఇన్వెస్టర్లకు భారత్ ఆకర్షణీయ గమ్యస్థానంగా నిలుస్తోంది. గత సార్వత్రిక ఎన్నికల విషయానికొస్తే, 2014లో ఎన్నికలు జరిగిన ఏప్రిల్-మే నెలల్లో విదేశీ ఇన్వెస్టర్లు రూ.23,607 కోట్ల విలువైన షేర్లు కొన్నారు. 2019 ఇదే కాలంలో రూ.29,113 కోట్లు దేశీ మార్కెట్లో కుమ్మరించారు. దీంతో 2019లో నాలుగో దశ పోలింగ్ ముగిసే నాటికి నెల రోజుల్లో సెన్సెక్స్ 3.7 శాతం, నిఫ్టీ 2.2 శాతం చొప్పున ఎగబాకాయి. ఈసారి మాత్రం ట్రెండ్ దీనికి పూర్తి భిన్నంగా ఉంది. ఒకపక్క విదేశీ ఇన్వెస్టర్లు తిరోగమన బాట పట్టగా.. దేశీయంగానూ ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తుండటం మార్కెట్‌కు ప్రతికూలంగా మారింది.

విదేశీ మార్కెట్లు రయ్ రయ్

ఉక్రెయిన్-రష్యా యుద్ధం, మధ్య ప్రాచ్యంలో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతల వంటి భౌగోళిక రాజకీయ అనిశ్చితుల ప్రభావం కంటే, ఎన్నికల ప్రభావమే మన మార్కెట్లో ప్రధానంగా కనిపిస్తోంది. విదేశీ మార్కెట్లు గత నెల రోజుల్లో భారీగా పెరిగినప్పటికీ.. మన సూచీలు ఆ స్థాయిలో పెరగకపోగా, 3 శాతం మేర పడిపోవడం దీనికి నిదర్శనం. గత నెల రోజుల వ్యవధిలో హాంకాంగ్ హాంగ్‌సెంగ్ ఇండెక్స్ ఏకంగా 15.2 శాతం జంప్ చేసింది. బ్రిటన్ ఎఫ్‌టీఎస్‌ఈ సూచీ 6 శాతం, యూఎస్ డోజోన్స్ 4.7 శాతం, జర్మనీ డాక్స్ సూచీ 4.1 శాతం, చైనా షాంఘై ఇండెక్స్ 3 శాతం చొప్పున ఎగబాకాయి. ''ఎన్నికల ఫలితాలపై అనుమానంతోనే విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాల బాట పట్టారు. ఓటింగ్ శాతం భారీగా తగ్గితే, బీజేపీ అంచనాలు తారుమారు కావచ్చు. ఆ పార్టీ సాధించే సీట్లు గణనీయంగా తగ్గే అవకాశముంది. మిగతా విడతల ఓటింగ్‌పై ఇన్వెస్టర్లు దృష్టి సారిస్తారు. తదనుగుణంగానే మార్కెట్ల గమనం ఉంటుంది' అని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిటైల్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా అభిప్రాయపడ్డారు.



బీజేపీకి గనుక సొంతంగా మెజారిటీ రాకపోతే ఎన్డీఏ పక్షాలపై పూర్తిగా ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. దీనివల్ల ప్రాంతీయ పార్టీల డిమాండ్లకు తలొగ్గడం, బుజ్జగింపులు తదితరాలతో విధాన నిర్ణయాలపై ప్రభావం పడుతుందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. అంతేగాక కీలక బిల్లుల ఆమోదం విషయంలో ఇప్పుడున్న స్వేచ్ఛ లేకపోవడం కూడా అటు

ఎందుకీ ఆందోళన...

ఆర్థిక వ్యవస్థకు, ఇటు మార్కెట్లకు ప్రతికూలాంశం. చివరి మూడు విడతల్లో భారీగా ఓటర్లు పోటెత్తితే తప్ప ప్రస్తుత ఓటింగ్ శాతం ప్రకారం చూస్తే బీజేపీకి సొంతంగా 370, ఎన్డీఏ కూటమికి 400 పై చిలుకు సీట్ల లక్ష్యం నెరవేరే అవకాశాలు లేనట్టే. అంతేగాక గతంలో మాదిరిగానైనా రాకుండా బీజేపీ ఏ 260 సీట్ల దగ్గరో ఆగిపోతే మళ్లీ సంకీర్ణ లుకలుకలు తలెత్తే ఆస్కారం లేకపోలేదు. ఇవన్నీ మార్కెట్లకు రుచించని విషయాలే. విదేశీ ఇన్వెస్టర్లలో ఇలాంటి భయాలే నెలకొన్నాయిప్పుడు! అందుకే ప్రస్తుతానికి కొన్ని పొజిషన్లను తగ్గించుకుని, ఫలితాల తర్వాత పరిస్థితులను బట్టి మళ్లీ ఇన్వెస్ట్ చేయొచ్చనే భావన వారిలో కనబడుతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. సూచీల తాజా పతనంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా సైతం స్పందించారంటే, ఇన్వెస్టర్లలో ఆందోళన అధికార పక్షాన్ని కూడా బాగానే కలవరపెడుతోందని పరిశీలకులు చెబుతున్నారు. 'గతంలో కూడా మార్కెట్లు గట్టిగా పడిన సందర్భాలున్నాయి. కాబట్టి స్టాక్ మార్కెట్ కదలికలను నేరుగా ఎన్నికలకు ముడిపెట్టకూడదు. తాజా ఒడిదుడుకులకు 'కొన్ని వదంతులు' ఆజ్యం పోసి ఉండొచ్చు. నా అభిప్రాయం ప్రకారం జూన్ 4కు ముందే షేర్లు కొనుక్కోండి. ఫలితాల తర్వాత మార్కెట్ దూసుకెళ్తుంది' అని అమిత్ షా తాజాగా వ్యాఖ్యానించారు.

2004లో 20% క్రాష్

ఎన్నికల ముందస్తు పరిస్థితులతో సంబంధం లేకుండా గత నాలుగు ఎన్నికల్లోనూ ఫలితాల తర్వాత సెన్సెక్స్, నిఫ్టీ భారీ లాభాలనే అందించాయి. అయితే 2004 ఎన్నికల్లో వాజ్‌పేయి సర్కారు అనూహ్య ఓటమి చవిచూడటం, హంగ్ కారణంగా ఫలితాల తర్వాత 20 శాతం మార్కెట్ క్రాష్ అయింది! కానీ మన్మోహన్ సింగ్ ప్రధానిగా యూపీఏ ప్రభుత్వం కొలువుదీరాక మార్కెట్ విశ్వాసం పుంజుకుంది. మిగతా ఏడాది కాలంలో రాబడులు దండిగానే వచ్చాయి. 2009 ఫలితాల తర్వాత మే 18 నుంచి డిసెంబర్ వరకు 31 వరకు సెన్సెక్స్, నిఫ్టీ ఏకంగా 40 శాతం దూసుకెళ్లడం విశేషం. ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు జోరుకు తోడు, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల వరద, ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు అమెరికాలో సహాయక ప్యాకేజీలు కూడా దోహదం చేశాయి. 2019 ఎన్నికల తర్వాత మాత్రం మార్కెట్లు ఏమంత పెద్దగా పెరగలేదు. ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి, అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం, బలహీన వృద్ధి రేటు వంటి ప్రభావాలతో 4 నుంచి 5 శాతం మాత్రమే రాబడులొచ్చాయి.

ఫలితాల తర్వాత మార్కెట్ రాబడులు ఇలా...
(సెన్సెక్స్ పెరుగుదల/ తగ్గుదల శాతాల్లో)

ఫలితాల తేదీ	6 నెలలు	ఏడాది	రెండేళ్లు
అక్టోబర్ 6, 1999	3.6	-12.9	-40.1
మే 13, 2004	10.5	19.5	127.5
మే 17, 2009	40.1	38.3	49.0
మే 16, 2014	16.3	13.3	6.3
మే 23, 2019	4.0	-21.0●	30.2%

● కోవిడ్ ప్రభావం ముఖ్య కారణం

బస్తీ మే సవాల్

మోదీపై వృద్ధుని పోటీ



ప్రధాని మోదీపై వారణాసిలో ఓ వృద్ధుడు ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నాడు. ఆయన పేరు రామ్‌కుమార్ వైద్య. మధ్యప్రదేశ్‌లోని దతియా జిల్లా ఇందర్‌ఘడ్ వాసి. చిన్న కిరాణా దుకాణం నడుపుతుంటాడు. ఇటీవల రూ.25,000 రూపాయి నాణేలు డిపాజిట్ చేసి నామినేషన్ పత్రాలు కొనుగోలు చేయడంతో ఒక్కసారిగా వార్తల్లోకెక్కాడు. చుట్టుపక్కల ప్రాంతాల్లో చురాన్ బుదియా అమ్ముతూ వేలల్లో నాణేలను పోగేసి వాటినే ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు. వాటిని చూసి వాళ్లు కంగు తిన్నారు. కిందామీదా పడి నాణేలను లెక్కించారు. మంగళవారం నామినేషన్ వేసేందుకు వైద్య 550 కిలోమీటర్లు ప్రయాణం చేసి మరీ వారణాసి వచ్చాడు. ఆయనకు ప్రతిపాదకులుగా వారణాసిలోని కొందరు ఆటోడ్రైవర్లు సంతకాలు చేశారు. ఎన్నికల బరిలో దిగడం ఆయనకు ఇదేమీ కొత్త కాదు. ఇప్పటికే కౌన్సిలర్ నుంచి ఎమ్మెల్యే దాకా పలు ఎన్నికల్లో పోటీ చేశారు. ఈసారి మాత్రం బరిలో దిగుతున్న పార్లమెంట్ స్థానాన్ని మార్చి అందరి దృష్టినీ ఆకర్షించారు. వారణాసి ప్రజల సమస్యలను పార్లమెంటులో లేవనెత్తేందుకే తాను అక్కడి నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని చెబుతున్నారు. ప్రధాని అయినా సరే, మోదీకి గట్టి పోటీ ఇస్తానని ధీమా కూడా వ్యక్తం చేస్తుండటం విశేషం. మిమిక్రీ సంచలనం, ప్రముఖ హాస్య కళాకారుడు శ్యామ్ రంగీలా కూడా వారణాసిలో మోదీపై ఇండిపెండెంట్‌గా బరిలో దిగడం తెలిసిందే. కానీ ఆయన నామినేషన్ బుధవారం తిరస్కరణకు గురైంది. కాంగ్రెస్ నుంచి ఎప్పట్లాగే అజయ్ రాయ్ బరిలో ఉన్నారు. వారణాసిలో జూన్ 1న చివరి విడతలో పోలింగ్ జరగనుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

'వర్జిన్ ఓటర్'గా మిగలకండి!

ఓటుపై సందేశం ఇవ్వాలి. అదే సమయంలో తమ ఉత్పత్తికి ప్రచారం కల్పించుకోవాలి. ఇలాంటి అవకాశం వస్తే వినియోగ ఉత్పత్తుల కంపెనీలు అస్సలు వదులుకోవు. మ్యాన్‌ఫోర్స్ కండోమ్ సంస్థ ఇప్పుడదే చేసింది. సాధారణంగా కండోమ్ కంపెనీ ప్రకటన అంటే కొంచెం ఇబ్బంది కలిగించేలా ఉంటుందనుకుంటాం. కానీ మ్యాన్‌ఫోర్స్ ప్రకటన అలా అనిపించదు. కొత్త ఓటర్లను కదిలించేలా ఉంటుంది. అందుకోసం కంపెనీ కొత్తగా ఆలోచించింది. మొదటిసారి ఓటర్లను ఉద్దేశించి 'ఓటింగ్ వర్జిన్' అన్న పదబంధాన్ని ప్రయోగించింది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో 1.82 కోట్ల మంది ఓటర్లు తొలిసారి ఓటేస్తున్నారు. ఇప్పటిదాకా ఓటేసిన అనుభవం లేదనే అర్థంలో వారినుద్దేశించి 'ఓటింగ్ వర్జిన్'గా పేర్కొంది. ఈ ప్రకటన గట్టిగా పేలడమే గాక వైరల్‌గా మారింది. నెటిజన్లు దీన్ని షేర్ చేస్తూ తొలిసారి ఓటర్లకు ఓటేయాలంటూ పిలుపునిచ్చారు ''నేనూ తొలిసారి ఓటర్‌నే. నన్ను విష్ చేయండి. మీరూ ఓటేయండి. ఓటింగ్ వర్జిన్‌గా మిగలకండి'' అంటూ ఓ యూజర్ పోస్ట్ పెట్టడం విశేషం. ''మీ ఓటు మీ హక్కు. దాన్ని వివేకంతో ఉపయోగించి ప్రజాస్వామ్య ప్రక్రియలో మీ గళం వినిపించండి'' అని మరో యూజర్ కోరాడు.

మథువాల మద్దతెవరికో!

కలకం

బన్‌గావ్‌లో పోరు ఆసక్తికరం
బీజేపీ, టీఎంసీ హోరాహోరీ

బన్‌గావ్ పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ సరిహద్దులోని లోక్‌సభ స్థానం. ఈ ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గంలో మథువాల ప్రాబల్యం ఎక్కువ. ఇక్కడ పార్టీల గెలుపోటములను నిర్ణయించేది వాళ్లే. దాంతో బీజేపీ, తృణమూల్ రెండూ మథువా సామాజిక వర్గానికి చెందిన వారినే బరిలోకి దించాయి. గత ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీతో గెలుపొందిన శంతను కుమార్ బీజేపీ నుంచి మళ్లీ పోటీ చేస్తున్నారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ నుంచి బిశ్వజిత్ దాస్ రంగంలో ఉన్నారు...

- సాక్షి, నేషనల్ డెస్క్


బన్‌గావ్ లోక్‌సభ స్థానం 2009లో ఏర్పడింది. స్వాతంత్ర్యానంతరం, 1971లో బంగ్లాదేశ్ విమోచన యుద్ధ సమయంలో హిందూ శరణార్థులు భారీగా బన్‌గావ్ ప్రాంతానికి వచ్చి స్థిరపడ్డారు. వీరిలో అత్యధికులు మథువాలే. బన్‌గావ్ ఓటర్లలో 67 శాతం దాకా వాళ్లే ఉన్నారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) నేపథ్యంలో వీరు సహజంగానే బీజేపీకి మద్దతిస్తున్నారు. బన్‌గావ్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆరు బీజేపీ చేతిలోనే ఉన్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని మోదీ బన్‌గావ్ నుంచి బెంగాల్ ప్రచారాన్ని ప్రారంభించారు. మథువా సామాజికవర్గానికి పౌరసత్వం ఇస్తామని హామీ ఇచ్చారు. దాంతో వారి ఓట్లు అత్యధికంగా బీజేపీకే పడ్డాయి. అలా ఇక్కడ తొలిసారి బీజేపీ విజయం సాధించింది. శంతను లక్షకు పైగా ఓట్ల మెజారిటీతో గెలిచి కేంద్ర నౌకాయాన శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో కూడా బన్‌గావ్‌లో సీఏఏ ప్రధాన ఎన్నికల అంశంగా మారింది. సీఏఏ చట్టాన్ని అమల్లోకి తెస్తూ ఎన్నికల ముందు కేంద్రం నోటిఫికేషన్ జారీ చేయడం తెలిసిందే. అయితే ఆన్‌లైన్ దరఖాస్తుల్లో బంగ్లాదేశ్‌లో ఉన్నప్పటి చిరునామా, నివాస పత్రాల వివరాలను చాలామంది సమర్పించలేదు. ఇది సమస్యలకు దారి తీయడంపై ఇక్కడి మథువాలు అసంతృప్తితో ఉన్నారు.

తప్పుదారి పట్టిస్తున్నారు: టీఎంసీ

సీఏఏను తృణమూల్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇది మథువా వర్గాన్ని తప్పుదోవ పట్టించేందుకు బీజేపీ చేస్తున్న కుట్రగా అభివర్ణిస్తోంది. మథువాలు ఇప్పటికే భారతీయులని, వారికి ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు ఉన్నాయని తృణమూల్ అధినేత్రి మమత అంటున్నారు. ''ఈ దేశ పౌరులు కాకుంటే ఇన్నేళ్లు వారు ఓటెలా వేశారు? ప్రజాప్రతినిధులుగా పార్లమెంటుకు, బెంగాల్ అసెంబ్లీకి ఎలా వెళ్లారు?'' అని ప్రశ్నిస్తున్నారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో బన్‌గావ్‌లో ఘోర పరాజయం తర్వాత గతేడాది పంచాయతీ ఎన్నికల్లో తృణమూల్ దుమ్ము రేపింది.

బోరో కుటుంబానిదే ఆధిపత్యం...

బన్‌గావ్ రాజకీయాలను బోరో మా (బీనాపాణి దేవి) కుటుంబమే శాసిస్తోంది. 1947లో బీనాపాణి దేవి, ఆమె భర్త ప్రమథ్ రంజన్ ఠాకూర్ బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చి దక్షిణ కోల్‌కతాలోని బల్లిగంజ్‌లో స్థిరపడ్డారు. ప్రమథ్ నామశూద్ర (ఎస్సీ) కమ్యూనిటీకి చెందిన ప్రముఖ నాయకుడు. మథువాల హక్కుల కోసం పోరాడారు. తమలా వలస వచ్చిన వారికి ఆశ్రయం కోసం స్థానిక ఠాకూర్‌నగర్లో భూమి కొనుగోలు చేశారు. 'ఠాకూర్బరీ ల్యాండ్ అండ్ ఇండస్ట్రీస్' పేరుతో కొన్న ఆ స్థలంలో శరణార్థుల కోసం తొలి ప్రైవేట్ కాలనీ నిర్మించారు. ప్రమథ్ 1962లో కాంగ్రెస్ అభ్యర్థిగా హన్స్‌ఖాలీ అసెంబ్లీ స్థానం నుంచి గెలిచారు. కుమారుడు కపిల్ కృష్ణ ఠాకూర్ 2014లో ఎంపీ అయ్యారు. ఆయన మరణానంతరం భార్య మమత 2015 ఉప ఎన్నికలో గెలిచారు. చిన్న కుమారుడు మంజుల్ కృష్ణ ఠాకూర్ టీఎంసీ ఎమ్మెల్యేగా చేశారు. తర్వాత బీజేపీలో చేరారు. బీజేపీ అభ్యర్థి శంతను ఆయన రెండో కుమారుడే.



బిశ్వజిత్ దాస్



శంతను కుమార్

డ్రమ్స్.. ధూం ధాం

బెంగాల్ ప్రచారంలో మహిళా ఢాకీలు



సంప్రదాయ చీరలు. భుజానికి డోలు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి కంటే ముందే దర్శనమిస్తారు. అభ్యర్థిది ఏ పార్టీ అయినా సరే, వీరు మాత్రం ఉండాల్సిందే. వారే మహిళా ఢాకీలు. ఈసారి పశ్చిమబెంగాల్‌లో ఎన్నికల ప్రచారంలో కీలక పాత్ర పోషిస్తున్న కళాకారులు వీళ్లు. ఢాకీ చప్పుడు దుర్గ పూజ సమయంలో ప్రజలను మేల్కొలిపే సంబరం. 'ధునుచి నాచ్'లాగే డ్రమ్స్ వాయించడం దుర్గ పూజలో ముఖ్యమైన అంశం. సాధారణంగా దుర్గ పూజ సమయంలో స్త్రీలు నృత్యకారిణులుగా, పురుషులు ఢాకీలుగా ఉంటారు. కొంత కాలం కింద మహిళలు ఈ సంప్రదాయాన్ని బద్దలు కొట్టారు. దుర్గ పూజల్లో డ్రమ్స్ వాయిస్తూ ఢాకీలుగా ఉపాధి పొందుతున్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లోనూ ప్రచారంలో కీలకంగా మారారు. దాదాపుగా అన్ని పార్టీలూ వీరిని పిలుస్తున్నాయి. వీళ్లు ముఖ్యంగా రోడ్ షోల్లో పాల్గొంటున్నారు. అయితే అదంత సులువైన వ్యవహారం కాదు. రోజంతా డ్రమ్ భుజానికి తగిలించుకునే ఉండాలి. మరోవైపు తీవ్రమైన వేడి. అయినా ఉపాధి దొరుకుతుండటంతో మహిళలు ఢాకీ ధరించి ఉత్సాహంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. ఢాకీ వాయిస్తూ రోజుకు రూ.700 నుంచి రూ.800 దాకా సంపాదిస్తున్నారు. దుర్గాపూజ వేళ వీరికి 5 రోజులకు రూ.8 వేల నుంచి రూ.10 వేల దాకా వస్తాయి. ఇతర రాష్ట్రాల్లో, విదేశాల్లో అయితే ఆదాయం ఇంకాస్త ఎక్కువ వస్తుంది. గతేడాది హైదరాబాద్‌లోనూ దసరా ఉత్సవాల్లో మహిళా ఢాకీలు సందడి చేశారు!

డిమాండ్ పెరిగింది...

ఎన్నికల ప్రచారంలో గతంలో మహిళా ఢాకీలకు ఇంత డిమాండ్ ఉండేది కాదంటున్నారు శివ్‌పాద్ దాస్. ఆయన మాచ్‌లాండ్‌పూర్‌లో ఢాకీ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. ''ఈసారి మహిళా ఢాకీలకు పార్టీల నుంచి బాగా డిమాండ్ ఉంది. సామాన్యులు కూడా మహిళా ఢాకీలనే ఇష్టపడుతున్నారు. పురుషుల సంగీత వాయిద్యాలను మహిళలు తమ భుజాలపై వేసుకుని వాయిస్తుండటంతో చూసేందుకు చాలామంది ఇష్టపడుతున్నారు'' అని శివ్‌పాద్ చెప్పారు. ''భర్తతో పాటు కుటుంబాన్ని ఆదుకోవడానికి ఢాకీలుగా పని చేస్తున్నాం. పిల్లల చదువుల ఖర్చుతో కుటుంబ అవసరాలను తీర్చగలుగుతున్నాం. ఒకేసారి వేల రూపాయలు సంపాదించగలగడం ఆనందాన్నిస్తోంది. ఇప్పుడు ఎన్నికల సీజన్ గనుక తినడానికి, తాగడానికి కూడా సమయం ఉండటం లేదు. రోజూ ఏదో ఒక పార్టీ ప్రచార కార్యక్రమానికి డ్రమ్ భుజాన వేసుకుని వెళ్తూనే ఉన్నాం'' అని ఆనందంగా చెబుతున్నారు మహిళా ఢాకీలు.

14 ఏళ్ల కిందట మొదలై...

ప్రముఖ ఢాకీలలో ఒకరైన గోకుల్ చంద్ర దాస్ పద్నాలుగేళ్ల కిందట తన కుటుంబంలోని మహిళలకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. కోడలు ఉమా దాస్, కుమార్తె టుకుతో కలిసి మహిళా ఢాకీల బృందాన్ని ప్రారంభించారు. 2011లో దుర్గా పూజ పండల్‌లో తొలిసారి ప్రదర్శన ఇచ్చినప్పుడు అంతా ఆశ్చర్యపోయి చూశారు. అయితే బెంగాలీ టాలెంట్-హంట్ షోలో మహిళా ఢాకీలు కనిపించిన తరువాత పరిస్థితి మారింది. వారిని దుర్గా పూజలకు పిలవడం మొదలైంది. ఇప్పుడు బెంగాల్లో అనేక మహిళా ఢాకీ శిక్షణా కేంద్రాలున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్



తొలి రౌండ్‌లోనే సుమిత్ ఓటమి

నెల రోజుల తర్వాత పాల్గొన్న తొలి టోర్నీలో భారత టెన్నిస్ నంబర్‌వన్ సుమిత్ నగాల్‌కు నిరాశ ఎదురైంది. ఫ్రాన్స్‌లోని బోర్డెక్స్‌లో జరుగుతున్న బీఎన్‌పీ పరిబా ప్రిమరోజ్ ఏటీపీ–175 చాలెంజర్ టోర్నీలో సుమిత్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయాడు. ప్రపంచ 93వ ర్యాంకర్ సుమిత్ 2-6, 2-6తో ప్రపంచ 130వ ర్యాంకర్ హారోల్డ్ మయోట్ (ఫ్రాన్స్) చేతిలో పరాజయం చవిచూశాడు. 69 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయాడు.




అర్జున్‌కు మిశ్రమ ఫలితాలు

పార్దూ మాస్టర్స్ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ ఏడో ర్యాంకర్ ఇరిగేశి అర్జున్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. తొలి రౌండ్ గేమ్‌లో అర్జున్ 45 ఎత్తుల్లో ఎల్తాజ్ సఫారిల్ (అజర్‌బైజాన్)పై గెలిచాడు. రెండో రౌండ్ గేమ్‌లో అర్జున్ 28 ఎత్తుల్లో నికోలస్ (గ్రీస్) చేతిలో ఓడిపోయాడు. తెలంగాణకే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ తొలి గేమ్‌లో 28 ఎత్తుల్లో అభినవ్ మిశ్రా (అమెరికా) చేతిలో ఓడిపోయి...లియోన్ మెండోకా (భారత్)తో జరిగిన రెండో గేమ్‌ను 28 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు.

మళ్లీ ఓడిన రాజస్తాన్

వరుసగా నాలుగో ఓటమి ● పంజాబ్‌ను గెలిపించిన స్యామ్ కరన్ ● అదరగొట్టిన చహర్, హర్షల్



ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ స్యామ్ కరన్

గువాహటి: పంజాబ్ కింగ్స్ ఆల్‌రౌండ్ 'షో' ధాటికి రాజస్తాన్ రాయల్స్ చేతులెత్తేసింది. ఐపీఎల్ టోర్నీలో వరుసగా నాలుగో పరాజయం చవిచూసింది. కెప్టెన్ స్యామ్ కరన్ (2 వికెట్లు; 41 బంతుల్లో 63 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరిపించి పంజాబ్ కింగ్స్ జట్టుకు ఐదు వికెట్ల తేడాతో విజయాన్ని అందించాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. రియాన్ పరాగ్ (34 బంతుల్లో 48; 6 ఫోర్లు) ఒక్కడే రాణించాడు. స్యామ్ కరన్, హర్షల్ పటేల్, రాహుల్ చహర్ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన పంజాబ్ కింగ్స్ 18.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 145 పరుగులు చేసి గెలిచింది. జితేశ్ శర్మ (20 బంతుల్లో 22; 2 సిక్స్‌లు), అశుతోష్ శర్మ (11 బంతుల్లో 17 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్)లతో స్యామ్ కరన్ విలువైన భాగస్వామ్యాలు నమోదు చేశాడు.

పరాగ్ నిలబడటంతో...

ఇప్పటికే ప్లే ఆఫ్స్ దశకు అర్హత పొందిన రాజస్తాన్ జట్టు బ్యాటింగ్‌లో తీవ్రంగా నిరాశపరిచింది. ఓపెనర్లు యశస్వి (3), కొహ్లెర్ (18), టాపార్డర్ బ్యాటర్ సామ్సన్ (18) వికెట్లు పారేసుకోవడంతో మెరుపులు కాదుకదా... పరుగుల్లో వేగమే కనిపించలేదు. పరాగ్, అశ్విన్ (19 బంతుల్లో 28; 3 ఫోర్లు, 1 సిక్స్) ఉన్నంత సేపు ఇన్నింగ్స్ మెరుగవుతుందనిపించింది. కానీ అశ్విన్ అవుట్ కాగానే క్రీజులోకి వచ్చిన ఐదుగురు బ్యాటర్లలో బౌల్ట్ (12) మినహా ఇంకెవరూ పది పరుగులైనా చేయలేదు.

కెప్టెన్ ఇన్నింగ్స్

సులువైన లక్ష్యమే అయినా పంజాబ్ తడబడింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ (6)... అవేశ్ వేసిన ఐదో ఓవర్లో రోసో (13 బంతుల్లో 22; ఫోర్లు), శశాంక్ (0) అవుట్ కావడంతో 36 పరుగులకే 3 కీలక వికెట్లను కోల్పోయింది. కాసేపటికే బెయిర్‌స్టో (14)ను చహల్ అవుట్ చేయడంతో రాజస్తాన్ సంబరాల్లో మునిగింది. 48/4 స్కోరు వద్ద పీకల్లోతు కష్టాల్లో పడిన పంజాబ్‌ను కెప్టెన్ స్యామ్ కరన్... జితేశ్ శర్మతో కలిసి ఆదుకున్నాడు. ఇద్దరు వికెట్‌ను కాపాడుకొని తర్వాత భారీషాట్లపై దృష్టి పెట్టారు. జట్టు స్కోరు 100 దాటాకా ఐదో వికెట్‌కు 63 పరుగులు జోడించాక జితేశ్ ఆటను చహల్ ముగించాడు. ఈ దశలో స్యామ్ కరన్ పంజాబ్‌ను లక్ష్యం వైపు తీసుకెళ్లాడు. అశుతోష్‌తో కలిసి మరో వికెట్ పడకుండా 19వ ఓవర్లోనే మ్యాచ్‌ను ముగించాడు.

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (బి) స్యామ్ కరన్ 4; టామ్ కోహ్లెర్ (సి) జితేశ్ (బి) చహర్ 18; సామ్సన్ (సి) చహర్ (బి) ఎలిస్ 18; పరాగ్ (ఎల్బీ డబ్ల్యూ) (బి) హర్షల్ 48; అశ్విన్ (సి) శశాంక్ (బి) అర్ష్‌దీప్ 28; జురెల్ (సి) హర్‌ప్రీత్ (బి) స్యామ్ కరన్ 0; పావెల్ (సి అండ్ బి) చహర్ 4; ఫెరీరా (సి) రోసో (బి) హర్షల్ 7; బౌల్ట్ (రనౌట్) 12; అవేశ్ ఖాన్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 144. వికెట్ల పతనం:** 1-4, 2-40, 3-42, 4-92, 5-97, 6-102, 7-125, 8-138, 9-144. **బౌలింగ్:** స్యామ్ కరన్ 3-0-24-2, అర్ష్‌దీప్ 4-0-31-1, ఎలిస్ 4-0-24-1, హర్షల్ 4-0-28-2, రాహుల్ చహర్ 4-0-26-2, హర్‌ప్రీత్ 1-0-10-0. **పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్:** ప్రభ్‌సిమ్రన్ (సి) చహల్ (బి) బౌల్ట్ 6; బెయిర్‌స్టో (సి) పరాగ్ (బి) చహల్ 14; రోసో (సి) యశస్వి (బి) అవేశ్ 22; శశాంక్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అవేశ్ 0; స్యామ్ కరన్ (నాటౌట్) 63; జితేశ్ (సి) పరాగ్ (బి) చహల్ 22; అశుతోష్ (నాటౌట్) 17; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (18.5 ఓవర్లలో 5 వికెట్లకు) 145. వికెట్ల పతనం:** 1-6, 2-36, 3-36, 4-48, 5-111. **బౌలింగ్:** బౌల్ట్ 3-0-27-1, సందీప్ 4-0-28-0, అవేశ్ ఖాన్ 3.5-0-28-2, అశ్విన్ 4-0-31-0, చహల్ 4-0-31-2.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.రే
కోల్‌కతా	13	9	3	1	19	1.428
రాజస్తాన్	13	8	5	0	16	0.273
చెన్నై	13	7	6	0	14	0.528
హైదరాబాద్	12	7	5	0	14	0.406
ఢిల్లీ	14	7	7	0	14	-0.377
బెంగళూరు	13	6	7	0	12	0.387
లక్నో	13	6	7	0	12	-0.787
గుజరాత్	13	5	7	1	11	-1.063
పంజాబ్	13	5	8	0	10	-0.347
ముంబై	13	4	9	0	8	-0.271

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ X గుజరాత్
వేదిక: హైదరాబాద్
రాత్రి 7:30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

మూడో రౌండ్‌లో మనిక



కపాడోసియా (టర్కీ): వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) ఫీడర్ లెవెల్ టోర్నీలో భారత నంబర్‌వన్ మనిక బత్రా మూడో రౌండ్‌లోకి చేరింది. ప్రపంచ 24వ ర్యాంకర్ మనిక బుధవారం జరిగిన రెండో రౌండ్‌లో 11-9, 6-11, 11-8, 9-11, 11-5తో వాంగ్ జిజు (చైనీస్ తైపీ)పై గెలిచింది. భారత్‌కే చెందిన కృత్విక, యశస్విని, స్వస్తిక కూడా మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో కృత్విక 11-9, 11-8, 11-7తో ఆడ్రీ జరీఫ్ (ఫ్రాన్స్)పై, యశస్విని 11-9, 11-7, 8-11, 11-4తో సిమే కులాక్‌సెకెన్ (టర్కీ)పై, స్వస్తిక 11-5, 11-5, 11-9తో గరీమా గోయల్ (భారత్)పై విజయం సాధించారు.

సెమీస్‌లో అభిషేక్

అస్తానా: ఎలోర్డా కప్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నీలో భారత బాక్సర్ అభిషేక్ యాదవ్ (67 కేజీలు) సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. క్వార్టర్ ఫైనల్లో అభిషేక్ 5-0తో రఖాత్ సెటిజాన్ (కజకిస్తాన్)పై గెలిచి కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. భారత్‌కే చెందిన పవన్ (54 కేజీలు), కవీందర్ సింగ్ బిష్త్ (57 కేజీలు), వరీందర్ సింగ్ (60 కేజీలు), హితేశ్ (71 కేజీలు) క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయారు.

సాత్విక్–చిరాగ్ జోడీ శుభారంభం

ప్రణయ్‌పై మిరాబా సంచలన విజయం





మిరాబా

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో టాప్ సీడ్ సాత్విక్–చిరాగ్ ద్వయం 21-13, 21-13తో నూర్ మొహమ్మద్–తాన్ వీ కియోంగ్ (మలేసియా) జంటపై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్, ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ హెచ్‌ఎస్ ప్రణయ్ తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. భారత రైజింగ్ స్టార్, ప్రపంచ 84వ ర్యాంకర్ మైస్నం మిరాబా లువాంగ్ వరుస గేముల్లో ప్రణయ్‌ను ఓడించి తన కెరీర్‌లో గొప్ప విజయాన్ని అందుకున్నాడు. 55 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో మిరాబా 21-19, 21-18తో ప్రణయ్‌ను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. భారత్‌కే చెందిన కిరణ్ జార్జి, సతీశ్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. కిరణ్ 15-21, 21-13, 17-21తో మాడ్స్ క్రిస్టోఫర్సన్ (డెన్మార్క్) చేతిలో... సతీశ్ 13-21, 17-21తో జేసన్ గుణవన్ (హాంకాంగ్) చేతిలో పరాజయం పాలయ్యారు.

అస్మిత మినహా...


మహిళల సింగిల్స్‌లో భారత్ నుంచి ఐదుగురు బరిలోకి దిగగా... అస్మిత మినహా మిగతా నలుగురు ఉన్నతి హుడా, సామియా, మాళవిక, ఆకర్షి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. అస్మిత 19-21, 21-15, 21-14తో ఎస్తర్ నురిమి (ఇండోనేసియా)పై గెలిచింది. ఉన్నతి 21-14, 14-21, 19-21తో లియాన్ టాన్ (బెల్జియం) చేతిలో, సామియా 13-21, 13-21తో గావో ఫాంగ్ జి (చైనా) చేతిలో... మాళవిక 11-21, 10-21తో హాన్ యువె (చైనా) చేతిలో, ఆకర్షి 13-21, 8-21తో బుసానన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలయ్యారు.

నేపాల్ క్రికెటర్ సందీప్ లమిచానే శిక్ష రద్దు



ఖాట్మండు: క్రిమినల్ కేసు నుంచి నేపాల్ స్టార్ క్రికెటర్ సందీప్ లమిచానేకు హైకోర్టులో పెద్ద ఊరట లభించింది. ఓ మహిళపై లైంగిక దాడి కేసులో ఖాట్మండు జిల్లా కోర్టు విధించిన 8 ఏళ్ల జైలు శిక్షను పటాన్ హైకోర్టు రద్దు చేసింది. నేపాల్ మాజీ కెప్టెన్ లమిచానే 2022 ఆగస్టు 21న ఓ మహిళను రేప్ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఖాట్మండు కోర్టు అతనికి రూ. 3 లక్షలు జరిమానా, మరో రూ. 2 లక్షలు బాధితురాలికి పరిహారంతో పాటు 8 ఏళ్ల జైలు శిక్షను ఖరారు చేసింది. బెయిల్‌పై బయటికి వచ్చిన లమిచానే కేసును బుధవారం విచారించిన హైకోర్టు కింది కోర్టు శిక్షను రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. 23 ఏళ్ల లమిచానే నేపాల్ తరఫున 51 వన్డేలు ఆడి 112 వికెట్లు, 52 టి20లు ఆడి 98 వికెట్లు తీశాడు.

నీరజ్ చోప్రాకు స్వర్ణం




భువనేశ్వర్: స్వదేశంలో మూడేళ్ల తర్వాత తొలిసారి బరిలోకి దిగిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్, ఒలింపిక్, ప్రపంచ చాంపియన్ నీరజ్ చోప్రా స్వర్ణ పతకంతో మెరిశాడు. గతవారం దోహాలో జరిగిన డైమండ్ లీగ్ మీట్‌లో రెండో స్థానంలో నిలిచిన నీరజ్...బుధవారం జరిగిన ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్ మీట్‌లో పసిడి పతకం సాధించాడు. హరియాణాకు చెందిన 26 ఏళ్ల నీరజ్ నాలుగో ప్రయత్నంలో జావెలిన్‌ను 82.27 మీటర్ల దూరం విసిరి బంగారు పతకాన్ని ఖరారు చేసుకున్నాడు. కర్ణాటకకు చెందిన డీపీ మనూ 82.06 మీటర్లతో రజత పతకాన్ని దక్కించుకోగా... మహారాష్ట్రకు చెందిన ఉత్తమ్ పాటిల్ 78.39 మీటర్లతో కాంస్య పతకాన్ని గెల్చుకున్నాడు. గత ఏడాది ఆసియా క్రీడల్లో రజత పతకం నెగ్గిన కిశోర్ కుమార్ జెనా నిరాశపరిచాడు. ఒడిశాకు చెందిన కిశోర్ జావెలిన్‌ను 75.25 మీటర్ల దూరం విసిరి ఐదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. చివరిసారి భారత్‌లో 2021 మార్చి 17న భువనేశ్వర్‌లోనే జరిగిన ఫెడరేషన్ కప్‌లో నీరజ్ పోటీపడి స్వర్ణ పతకం సాధించాడు. మూడేళ్ల తర్వాత ఇదే వేదికపై పోటీ పడ్డ నీరజ్ పసిడి ఫలితాన్ని పునరావృతం చేశాడు.

సినిమా

మీరు నా కెరీర్ రైలు దిగనందుకు కృతజ్ఞతలు

- కాన్స్ చిత్రోత్సవాల్లో నటి మెరిల్ స్ట్రీప్



మెరిల్ స్ట్రీప్



ఊర్వశీ రౌతేలా



దీప్తీ సద్వానీ

ఫ్రాన్స్ నగరంలోని కాన్స్‌లో 77వ కాన్స్ చలన చిత్రోత్సవాలు అట్టహాసంగా ఆరంభమయ్యాయి. ఈ ఏడాది కాన్స్ జ్యూరీ ప్రెసిడెంట్‌గా నటి–దర్శకురాలు గ్రెటా గెర్విగ్ వ్యవహ రిస్తున్నారు. ఆమె నేతృత్వంలో జ్యూరీ ఈ సంవత్సరం పోటీ పడుతున్న 22 చిత్రాల నుండి విజేతను ఎంపిక చేస్తుంది. వేడుక చివరి రోజు విజేతకు అవార్డు ప్రదానం చేస్తారు. ఇక వేడుకలు ప్రారంభం అయ్యే ముందు విలేకరులతో 'మీ టూ' మూమెంట్ గురించి, సమాజంలో సానుకూల మార్పు తెచ్చే శక్తి బలమైన కథలకు ఉంటుందని గ్రెటా గెర్విగ్ పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 25 వరకూ జరిగే ఈ ఫెస్టివల్‌లో తొలి రోజు ప్రారంభ చిత్రంగా క్వెంటిన్ డ్యూపియక్స్ దర్శకత్వంలో రూపొందిన 'ది సెకండ్ యాక్ట్' ప్రదర్శితమైంది. అలాగే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'పామ్ డి ఓర్' పురస్కారాన్ని నటి మెరిల్ స్ట్రీప్‌కి ప్రదానం చేశారు. సినీ రంగానికి మెరిల్ చేసిన సేవలకు గాను ఆమెను ఈ పురస్కారంతో గౌరవించారు. 1989లో కాన్స్ ఉత్సవాల్లో పాల్గొన్నారు మెరిల్. 'ఈవిల్ ఏంజెల్స్'లో కనబర్చిన నటనకుగాను ఆ ఏడాది ఆమె ఉత్తమ నటి అవార్డు అందుకున్నారు. 40 ఏళ్ల వయసు అప్పుడు ఆ అవార్డు అందుకున్న మెరిల్ ఇప్పుడు 74 ఏళ్ల వయసులో ఈ చిత్రోత్సవాలకు హాజరయ్యారు. దాదాపు 35 ఏళ్లకు మళ్లీ కాన్స్‌లో పాల్గొనడం, ప్రతిష్టాత్మక పామ్ డి ఓర్ పురస్కారం అందుకోవడం, అవార్డు అందుకుంటున్న సమయంలో వీక్షకులు ఓ 2 నిమిషాల పాటు నిలబడి చప్పట్లతో అభినందించడంతో మెరిల్ స్ట్రీప్ ఒకింత ఉద్వేగానికి గురై, ఈ విధంగా స్పందించారు.

''గతంలో నేను కాన్స్ చిత్రోత్సవాల్లో పాల్గొన్నప్పుడు నా వయసు 40. అప్పటికి ముగ్గురు పిల్లల తల్లిని. నా కెరీర్ ముగిసిపోయిందనుకున్నాను. కానీ ఈ రాత్రి (కాన్స్ వేదికను ఉద్దేశించి) నేను ఇక్కడ ఉన్నానంటే దానికి కారణం మేడమ్ ప్రెసిడెంట్ (గ్రెటా గెర్విగ్‌ని ఉద్దేశించి... 2019లో గ్రెటా దర్శకత్వం వహించిన 'లిటిల్ ఉమెన్' చిత్రంలో నటించారు మెరిల్)తో సహా నేను పని చేసిన ఎంతోమంది ప్రతిభావంతులైన కళాకారులు. ఇక్కడ నా సినిమాల క్లిప్పింగ్స్‌ని చూస్తుంటే నా కెరీర్‌ని బుల్లెట్ ట్రైన్ కిటికీలోంచి చూస్తున్నట్లుగా ఉంది. ఆ కిటికీలోంచి నా యవ్వనం మధ్యవయసుకి ఎగరడం నుంచి ఇదిగో ఇప్పుడు ఈ వేదిక వరకూ రావడం.. అంతా కనిపిస్తోంది. ఈ ప్రయాణంలో ఎన్నో ప్రదేశాలు... ఎన్నో ముఖాలు గుర్తొస్తున్నాయి. అన్నింటికీ మించి ఇన్నేళ్లుగా నన్ను ఆదరిస్తున్న మీకు (ప్రేక్షకులు) చాలా కృతజ్ఞతలు. నా ముఖం పట్ల మీరు విముఖత చూపనందుకు నా కెరీర్ ట్రైన్‌ని మీరు దిగనందుకు ధన్యవాదాలు'' అంటూ తన ప్రసంగాన్ని ముగించారు మెరిల్ స్ట్రీప్.

మెరిసిన దేశీ తారలు

ఈ వేడుకల్లో పలువురు దేశ, విదేశీ తారలు పొడవాటి గౌనుల్లో ఎర్ర తివాచీపై క్యూట్‌గా క్యాట్‌వాక్ చేసి ఆకట్టుకున్నారు. బాలీవుడ్ తారలు దీప్తీ సద్వానీ, ఊర్వశీ రౌతేలా తదితరులు పాల్గొన్నారు. టీవీ సిరీస్ 'తారక్ మెహతా కా ఉల్టా చష్మా' ఫేమ్, పలు హిందీ చిత్రాల్లో నటించిన దీప్తీ సద్వానీ రెడ్ కార్పెట్ పై మెరిశారు. ప్రారంభ వేడుకలో పాల్గొన్న ఈ బ్యూటీ మొత్తం మూడు రోజుల పాటు ఈ చిత్రోత్సవాల్లో పాల్గొననున్నారు. కాన్స్ ఉత్సవాల్లో పొడవాటి గౌను ధరించిన తొలి తారగా రికార్డ్ సాధించారు దీప్తి. ''ఈ రెడ్ కార్పెట్‌పై నడవడం గౌరవంగా భావిస్తున్నాను. అది కూడా రికార్డు బద్దలు కొట్టే పొడవాటి ట్రైల్ ఉన్న గౌను ధరించడం హ్యాపీగా ఉంది'' అని పేర్కొన్నారు దీప్తీ సద్వాని. ఇక గత ఏడాది కాన్స్ చిత్రోత్సవాల్లో పాల్గొన్న బాలీవుడ్ తార ఊర్వశీ రౌతేలా ఈసారీ హాజరయ్యారు. పింక్ కలర్ ఫ్రాక్‌లో ఆకట్టుకున్నారామె. కాగా 2018లో ఈ వేడుకల్లో పాల్గొన్న దీపికా పదుకోన్ పింక్ రంగు గౌను ధరించారు. ఇప్పుడు ఊర్వశీ ధరించిన గౌనుని అప్పటి దీపికా గౌనుతో పోల్చుతున్నారు.

ఇలా తారల తళుకులు, పురస్కార గ్రహీత భావోద్వేగాలతో కాన్స్ చిత్రోత్సవాలు ఆకట్టుకునేలా సాగుతున్నాయి.

తెలంగాణలో థియేటర్లు బంద్

- రెండు వారాల పాటు సింగిల్ స్క్రీన్స్ మూత



తెలంగాణ రాష్ట్రంలో సింగిల్ స్క్రీన్ థియేటర్లు బంద్ కానున్నాయి. రేపటి నుంచి (శుక్రవారం) పది రోజుల పాటు థియేటర్లు మూసివేయాలని 'తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్' నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయానికి కారణం థియేటర్లకు ప్రేక్షకులు రాకపోవడమే. వేసవి సెలవులను క్యాష్ చేసుకునేందుకు దర్శక–నిర్మాతలు, హీరోలు తమ సినిమాలను సమ్మర్‌లో రిలీజ్ చేసేందుకు పోటీ పడేవారు. అయితే ఈ ఏడాది వేసవిలో పెద్ద సినిమాలేవీ విడుదలకు నోచుకోలేదు. చిన్న చిత్రాలు రిలీజ్ చేస్తున్నా ప్రేక్షకుల ఆదరణ అంతంత మాత్రమే. పైగా ఓ వైపు ఎన్నికల హడావిడి.. మరోవైపు ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల సందడి.. దీనికి తోడు ఎండలు మండుతున్నాయి. మల్టీప్లెక్స్ కల్చర్ కూడా ఎక్కువ అయింది. అదే విధంగా ఓటీటీల ప్రభావం థియేటర్లపై పడుతోంది. సినిమా విడుదలైన మూడు నాలుగు వారాలకే ఓటీటీలోకి వస్తుండటం వల్ల కొందరు థియేటర్‌కు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. ఈ కారణాల వల్ల సింగిల్ స్క్రీన్ థియేటర్లలో సీటింగ్ సామర్థ్యం తగినంత లేదు. దీంతో రోజువారీ ఖర్చులు కూడా రావడం లేదన్నది ఎగ్జిబిటర్స్ (థియేటర్ యజమానులు) ఆవేదన. ఒక్కో థియేటర్‌కు రోజుకు రూ. 12 వేల నుంచి 18 వేల వరకు ఖర్చు అవుతోంది. ఇందులో పది శాతం కూడా కలెక్షన్లు రావడం లేదని వాపోతున్నారు. స్టార్ హీరోల సినిమాలు విడుదలైతే ప్రేక్షకులు థియేటర్లకు వస్తారు. ప్రస్తుత పరిస్థితుల్లో పెద్ద సినిమాల రిలీజ్ లేదు. అందుకే ఈ శుక్రవారం నుంచి పది రోజుల వరకు థియేటర్లను మూయాలనే నిర్ణయానికి వచ్చారట థియేటర్ యజమానులు.

కిరాక్ పోరి వస్తే



● సంజయ్ దత్, రామ్

'ఉస్తాద్ ఇస్మార్ట్ శంకర్ అలియాస్ డబుల్ ఇస్మార్ట్', 'కిరాక్ పోరి వస్తే సైట్ మార్.. ఖతర్నాక్ బీట్ వస్తే స్టెప్పా మార్', 'నాకు తెల్వకుండా నాతో సినిమా ప్లాన్ చేస్తే గుద్దులో కాల్తది' అంటూ హీరో రామ్ చెప్పే డైలాగులు 'డబుల్ ఇస్మార్ట్' ట్రైలర్‌లో ఉన్నాయి. రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. వీరి కాంబినేషన్‌లో వచ్చిన హిట్ మూవీ 'ఇస్మార్ట్ శంకర్' (2019) కి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' రూపొందుతోంది. పూరి కనెక్ట్స్‌పై పూరి జగన్నాథ్, ఛార్మీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో కావ్యా థాపర్ కథానాయికగా, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కీలక పాత్రలో నటిస్తున్నారు. బుధవారం (మే 15) రామ్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''డబుల్ ఇస్మార్ట్' టీజర్‌తో ప్రేక్షకులు డబుల్ డోస్ యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్, మాస్ ఉల్లాసాన్ని ఆస్వాదించారు. పూరి మరోసారి తన హీరోని బెస్ట్ స్టైలిష్, మాస్, యాక్షన్–ప్యాక్డ్ అవతార్‌లో చూపించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా రిలీజ్ కానుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. అలీ, గెటప్ శ్రీను ఇతర పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, కెమెరా: శ్యామ్ కె .నాయుడు, జియాని జియాన్నెలి.

ఆ పిల్ల కనులే...



● గాయత్రి, అల్లు శిరీష్

అల్లు శిరీష్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బడ్డీ'. శామ్ ఆంటోన్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్‌గా చేశారు. కేఈ జ్ఞానవేల్ రాజా, అధన జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ మూవీ విడుదలకు సిద్ధమవుతోంది. హిప్ హాప్ తమిళ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'ఆ పిల్ల కనులే, చూశాక తననే ఊహల్లో ఎగిరే మైకంలో మునిగే , మైకంలో తేలే, మబ్బులు తాకే, ఇద్దరి కథ ఇక మొదలాయే, నింగీ నేల కలిశాయో...' అంటూ సాగే పాటని విడుదల చేశారు. సాయి హేమంత్ లిరిక్స్ అందించిన ఈ పాటను హిప్ హాప్ తమిళ, సంజిత్ హెగ్డే, ఐరా, విష్ణు ప్రియ రవి పాడారు. ''యూత్‌ఫుల్ లవ్ ఎంటర్ టైనర్‌గా 'బడ్డీ' రూపొందింది. 'ఆ పిల్ల కనులే..' పాట మంచి రొమాంటిక్‌గా సాగుతుంది. త్వరలో సినిమా రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అన్నారు మేకర్స్.

సైకో థ్రిల్లర్



● ధన్సిక

'మంత్ర, మంగళ చిత్రాల ఫేమ్ ఓషో తులసీరామ్ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'దక్షిణ'. రజనీకాంత్ 'కబాలి' మూవీ ఫేమ్ సాయి ధన్సిక లీడ్ రోల్‌లో నటించారు. కల్ట్ కాన్సెప్ట్స్ మూవీ బ్యానర్‌పై అశోక్ షిండే నిర్మించిన ఈ చిత్రం రిలీజ్‌కి రెడీ అవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ను 'ఉప్పెన' మూవీ ఫేమ్ దర్శకుడు బుచ్చిబాబు సానా విడుదల చేసి, మాట్లాడుతూ – ''ట్రైలర్ చాలా బాగుంది. ఈ మధ్య కాలంలో నన్ను భయపెట్టిన ట్రైలర్ ఇదే. తులసీరామ్‌గారు టాలీవుడ్‌కి మరో ట్రెండ్ సెట్టర్ సైకో థ్రిల్లర్‌ని 'దక్షిణ'తో ఇవ్వబోతున్నారు'' అన్నారు. ''సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ మూవీ ఇది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు అశోక్ షిండే.

అహంతో వినోదం



● శివాని, రాహుల్

రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ జంటగా మణికాంత్ గెల్లి దర్శకత్వం వహించిన చిత్రం 'విద్య వాసుల అహం'. మహేష్ దత్తా, లక్ష్మి నవ్య నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) 'ఆహా' ఓటీటీలో రిలీజ్ అవుతోంది. బుధవారం ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ వేడుకలో మణికాంత్ గెల్లి మాట్లాడుతూ– ''కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'విద్య వాసుల అహం' రూపొందింది. వెంకీ అద్భుతమైన కథ రాయడం వల్లే నేను ఈ సినిమా చేయగలిగాను'' అన్నారు. రాహుల్ విజయ్ మాట్లాడుతూ– ''ఇదొక చిన్న క్యూట్ ఈగోస్ (అహం) ఉండే ఫన్ ఫిలిం'' అన్నారు. ''రాహుల్ మంచి రైటర్ కూడా. ఈ స్క్రిప్ట్‌ని తను ఒప్పుకున్నాడంటే కథ బాగుంటుందని అనిపించి నేను కూడా ఓకే చేశాను'' అన్నారు శివానీ రాజశేఖర్.

చర్యలు తప్పవు



● మెహరీన్

''ఎగ్ ఫ్రీజింగ్ (అండాలు నిల్వ ఉంచడం) అనేది సున్నితమైన అంశం. దాని గురించి మహిళల్లో అవగాహన కల్పించేందుకు ముందుకొచ్చి నా వంతు ప్రయత్నం చేశాను. ఎగ్ ఫ్రీజింగ్ చేయడానికి మహిళలు గర్భం దాల్చాల్సిన అవసరం లేదని చెప్పాను. అయితే కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారు. మరికొందరు నేను గర్భవతి అయ్యానంటూ కల్పిత వార్తలు రాశారు'' అని హీరోయిన్ మెహరీన్ మండిపడ్డారు. కొద్దిరోజుల క్రితం మెహరీన్ ఎగ్ ఫ్రీజింగ్ గురించి ఒక పోస్ట్ పెట్టారు. పిల్లలు అప్పుడే వద్దని భావించే తల్లిదండ్రులు తమ అండాలను భద్రపరుచుకుంటారు. అవసరమైనప్పుడు గర్భం దాల్చేందుకు ఉపయోగించుకుంటారు. ఈ క్రమంలో మెహరీన్ కూడా ఎగ్ ఫ్రీజింగ్‌ను ఎంపిక చేసుకున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలిపారు. అయితే దీనిపై కొందరు తప్పుగా అర్థం చేసుకుని వార్తలు ప్రచురించారంటూ తాజాగా ఆమె మరో పోస్ట్ పెట్టారు. ''తప్పుడు వార్తలకు ఫుల్‌స్టాప్ పెట్టకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. నాపై పెట్టిన పోస్ట్‌లు తొలగించి, క్షమాపణలు చెప్పాలి'' అన్నారు మెహరీన్.

సాక్షి బిజినెస్
గురువారం
16-5-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
118	17
72,987	22,201

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	16,717	△	206
డోజోన్స్	39,837	△	279
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,446	△	18
డాక్స్	18,869	△	153
షాంఘై	3,120	▽	26
నికాయ్	38,386	▽	30

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్)	71,430
బంగారం (22 క్యారెట్)	68,030
వెండి (కిలో)	91,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.09	84.11
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.06	106.60
€	యూరో	ఒకటి	89.34	91.70
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	52.86	54.03
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.62	56.56
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.59	64.27
SAR	సౌదీ రియాల్	ఖాతాచెక్	21.37	22.93
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాతాచెక్	21.85	23.63
¥	చైనా యువాన్	ఖాతాచెక్	10.44	12.51

డిపాజిట్లపై ఎస్‌బీఐ వడ్డీరేట్లు అప్

ముంబై: రిటైల్ స్థిర డిపాజిట్లకు (రూ.2 కోట్ల వరకూ ఎఫ్‌డీలు) సంబంధించి కొన్ని కాల పరిమితులపై బ్యాంకింగ్ దిగ్గజం – స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వడ్డీరేట్లను పెంచింది. 2023 డిసెంబర్ తర్వాత బ్యాంక్ ఎఫ్‌డీలపై వడ్డీరేటు పెంచడం ఇదే తొలిసారి. బ్యాంక్ వెబ్‌సైట్ ప్రకారం, ఈ రేట్లు మే 15 నుంచి అమల్లోకి వస్తాయి. 46 రోజుల నుంచి 179 రోజులు, 180 నుంచి 210 రోజులు, 211 రోజుల నుంచి ఏడాది లోపు కాలపరిమితుల డిపాజిట్ రేట్లు 25 నుంచి 75 బేసిస్ పాయింట్ల శ్రేణిలో (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) పెరిగాయి. కాగా, సీనియర్ సిటిజన్‌లకు ఆయా కాలపరిమితులపై (టేబుల్‌లో పేర్కొన్న రేట్ల కన్నా అదనంగా) పేర్కొన్న డిపాజిట్ రేట్లకు అదనంగా మరో 50 బేసిస్ పాయింట్ల వడ్డీరేటు లభిస్తుంది. దీర్ఘకాలిక (ఐదేళ్ల నుంచి పదేళ్ల మధ్య) డిపాజిట్‌పై ఏకంగా 1% వరకూ అదనపు వడ్డీరేటు లభిస్తుంది.

తాజా రేట్లు ఇలా...

కాల పరిమితి	వడ్డీ(%)
7-45 రోజులు	3.5
46-179 రోజులు	5.5
180-210 రోజులు	6.0
211 రోజులు- ఏడాది	6.25
ఏడాది-రెండేళ్లు	6.80
రెండేళ్లు-మూడేళ్లు	7.00
మూడేళ్లు- ఐదేళ్లు	6.75
ఐదేళ్లు- పదేళ్లు	6.50



వణికిస్తున్న వాణిజ్యలోటు

- ఏప్రిల్‌లో 4 నెలల గరిష్ట స్థాయి
- 19.1 బిలియన్ డాలర్లుగా నమోదు
- ఏప్రిల్‌లో ఎగుమతులు 1% వృద్ధి
- విలువలో 35 బిలియన్ డాలర్లు
- దిగుమతులు 10 శాతం పెరిగి 54.09 బిలియన్ డాలర్లకు అప్

న్యూఢిల్లీ: భారత్ వస్తు ఎగుమతులు–దిగుమతుల విలువల మధ్య నికర వ్యత్యాసం– వాణిజ్యలోటు ఏప్రిల్‌లో ఆందోళన కలిగించింది. తాజాగా వెలువడిన గణాంకాల ప్రకారం, సమీక్షా నెల్లో ఎగుమతుల విలువ కేవలం ఒక శాతం పెరిగి (2023 ఇదే నెలతో పోల్చి) 35 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతుల విలువ ఇదే కాలంలో 10.25 శాతం ఎగసి 54.09 బిలియన్ డాలర్లకు చేరింది. వెరసి ఎగుమతులు–దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం– వాణిజ్యలోటు 19.1 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. గడచిన నాలుగు నెలల్లో ఈ స్థాయి వాణిజ్యలోటు ఇదే తొలిసారి. కొన్ని ముఖ్యాంశాలు పరిశీలిస్తే...

- ఎలక్ట్రానిక్స్, రసాయనాలు, పెట్రోలియం ప్రొడక్టులు, ఫార్మా ఎగుమతులు బాగున్నాయి.



- విలువైన మెటల్స్ దిగుమతులు రెట్టింపై 3.11 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.
- క్రూడ్ ఆయిల్ దిగుమతులు 20.22% పెరిగి 16.5 బిలియన్ డాలర్లుకు ఎగసింది.
- 30 కీలక రంగాల్లో 13 వస్తు ఎగుమతుల్లో పెరుగుదలను నమోదుచేశాయి. వీటిలో కాఫీ, పొగాకు, సుగంధ ద్రవ్యాలు, ప్లాస్టిక్, హస్తకళలు ఉన్నాయి.

2023-24లో రికార్డు

మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో వస్తు, సేవల ఎగుమతుల మొత్తం విలువ 778.21 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. ఇది ఒక రికార్డు. ఇందులో వస్తు ఎగుమతులు 437.1 బిలియన్ డాలర్లు. సేవల ఎగుమతుల విలువ 341.1 బిలియన్ డాలర్లు.

సేవలు ఇలా...

తొలి అంచనాల ప్రకారం ఏప్రిల్‌లో సేవల ఎగుమతులు 29.57 బిలియన్ డాలర్లు. 2023 ఇదే నెల్లో ఈ విలువ 25.78 బిలియన్ డాలర్లు. దిగుమతుల విలువ 16.97 బిలియన్ డాలర్లు. 2023 ఇదే నెల్లో ఈ విలువ 13.96 బిలియన్ డాలర్లు.



ఎగుమతుల వృద్ధి కొనసాగుతుంది.. అనిశ్చిత అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు ఉన్నప్పటికీ కొత్త ఆర్థిక సంవత్సరం కొంత సానుకూలంగానే ప్రారంభమైంది. ఎగుమతుల వృద్ధి కొనసాగుతుందని భావిస్తున్నాం.
– సునీల్ భరత్వాల్, వాణిజ్య కార్యదర్శి

పీఎఫ్‌సీ లాభం జూమ్

ముంబై: ప్రభుత్వ రంగ దిగ్గజం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ) గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి (క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 23 శాతం జంప్‌చేసి రూ. 7,556 కోట్లను అధిగమించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 20,074 కోట్ల నుంచి రూ. 24,176 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 12,312 కోట్ల నుంచి రూ. 14,579 కోట్లకు పెరిగాయి. స్టాండెలోన్ లాభం సైతం రూ. 3,695 కోట్ల నుంచి రూ. 4,549 కోట్లకు బలపడింది. వాటాదారులకు షేరుకి రూ. 2.5 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. ఇక పూర్తి ఏడాదికి పీఎఫ్‌సీ 25 శాతం అధికంగా రూ. 26,461 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇది సరికొత్త రికార్డ్‌కాగా.. 2022–23లో రూ. 21,179 కోట్లు నమోదైంది. నికర వడ్డీ మార్జిన్లు 3.36 శాతం నుంచి 3.46 శాతానికి మెరుగయ్యాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.91 శాతం నుంచి 3.34 శాతానికి తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో పీఎఫ్‌సీ షేరు బీఎస్‌ఈలో 3.7 శాతం లాభంతో రూ. 437 వద్ద ముగిసింది.

ఎన్‌సీసీ డివిడెండ్ రూ.2.20



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నిర్మాణ రంగ సంస్థ ఎన్‌సీసీ లిమిటెడ్ 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.2.20 డివిడెండ్ చెల్లించాలని బోర్డు ప్రతిపాదించింది. మార్చి త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో కంపెనీ నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 25 శాతం పెరిగి రూ.239 కోట్లకు చేరింది. ఎబిటా రూ.464 కోట్ల నుంచి రూ.550 కోట్లకు ఎగసింది. ఈపీఎస్ రూ.3.04 నుంచి రూ.3.81 తాకింది. టర్నోవర్ రూ.4,981 కోట్ల నుంచి రూ.6,530 కోట్లకు పెరిగింది. 2023–24లో నికరలాభం రూ.609 కోట్ల నుంచి రూ.710 కోట్లకు, ఎబిటా రూ.1,459 కోట్ల నుంచి రూ.1,769 కోట్లు నమోదైంది. టర్నోవర్ రూ.15,701 కోట్ల నుంచి రూ.20,971 కోట్లకు ఎగసింది. జనవరి–మార్చి కాలంలో సంస్థ రూ.27,283 కోట్ల విలువైన ఆర్డర్లను దక్కించుకుందని ఎన్‌సీసీ ఎండీ ఏవీఎస్ రంగ రాజు వెల్లడించారు. ఆర్డర్ బుక్ రూ.57,536 కోట్లకు చేరిందన్నారు.

ఫలితాల నేపథ్యంలో ఎన్‌సీసీ షేరు ధర బీఎస్‌ఈలో బుధవారం 0.85 శాతం క్షీణించి రూ.251.05 వద్ద స్థిరపడింది.

3 రోజుల లాభాలకు బ్రేక్

- సూచీలకు స్వల్ప నష్టాలు
- పరిమిత శ్రేణిలో ట్రేడింగ్



ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీ రంగ షేర్ల పతనంతో బుధవారం స్టాక్ సూచీలు స్వల్ప నష్టాలతో ముగిశాయి. దేశవ్యాప్తంగా ఎన్నికలు కొనసాగుతుండడం, అమెరికా సీపీఐ ద్రవ్యోల్బణ గణాంకాల వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. దేశీయ హోల్‌సేల్ ద్రవ్యోల్బణ 13 నెలల గరిష్టానికి చేరుకోవడం, క్రూడాయిల్ ధరలు పెరగడం, మిశ్రమ అంతర్జాతీయ సంకేతాలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 118 పాయింట్లు పతనమై 72,987 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 17 పాయింట్లు నష్టపోయి 22,201 వద్ద నిలిచింది. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు ట్రేడింగ్ ప్రారంభంలోనే అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. రోజంతా పరిమిత శ్రేణిలో తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఎఫ్‌ఎంసీజీ, ఆటో, బ్యాంకులు, ఫైనాన్స్ షేర్లు నష్టపోయాయి.

టీబీఓ టెక్ సూపర్ హిట్



టీబీఓ టెక్ లిస్టింగ్ భారీ హిట్టయ్యింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.920) తో పోలిస్తే 50% ప్రీమియంతో రూ.1380 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 58% పెరిగి రూ.1,456 వద్ద గరిష్టాన్ని అందుకుంది. ఆఖరికి 53% లాభంతో రూ.1,405 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.15,255 కోట్లుగా నమోదైంది.

ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ ఫ్లాట్..

ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ షేరు బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.315)తో పోలిస్తే 0.30% స్వల్ప నష్టంతో రూ.314 వద్ద ఫ్లాట్‌గా లిస్టయ్యింది. కొనుగోళ్ల మద్దతు లభించడంతో ట్రేడింగ్‌లో 9% పెరిగి రూ.343 వద్ద గరిష్టాన్ని అందుకుంది. చివరికి నాలుగున్నర శాతం లాభంతో రూ.329.55 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.14,053 కోట్లుగా నమోదైంది.

బిగ్‌బాస్ సీజన్ 7 విజేతకు జోస్ ఆలుక్కాస్ సత్కారం



హైదరాబాద్: జోస్ ఆలుక్కాస్ తెలుగు బిగ్‌బాస్ సీజన్ 7 విజేత పల్లవి ప్రశాంత్‌ను సత్కరించింది. బిగ్‌బాస్ హౌస్‌లో ప్రకటించిన విధంగా సంస్థ ఎండీ జాన్ ఆలుక్కా అత్యంత విలువైన డైమండ్ నెక్లెస్ పల్లవి ప్రశాంత్‌కు అందజేశారు. "వివిధ రంగాలలో నిష్ణాతులైన వారిని ప్రోత్సహించడంలో జోస్ ఆలుక్కాస్ ముందుంటుంది. విభిన్న నేపథ్యాలు కలిగిన వ్యక్తులకు అండగా నిలవాలనే నిబద్ధత భవిష్యత్తులోనూ స్థిరంగా ఉంటుంది" అని జాన్ ఆలుక్కా తెలిపారు. బేగంపేట్ జోస్ ఆలుక్కాస్ షోరూంలో నిర్వహించిన ఈ సత్కార కార్యక్రమంలో జోనల్ మేనేజర్ లీనో, షోరూమ్ మేనేజర్ షాన్‌జీలూ పాల్గొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-5-2024	
విశాఖ	550-00
చిత్తూరు	618-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	540-00
హైదరాబాద్	550-00
వరంగల్	552-00

గ్రాన్యూల్స్ 8 శాతం జంప్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ సంస్థ గ్రాన్యూల్స్ ఇండియా మార్చి త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 8 శాతం ఎగసి రూ.129 కోట్లు సాధించింది. ఎబిటా 12 శాతం అధికమై రూ.255 కోట్లకు చేరింది. ఎబిటా మార్జిన్ 19 నుంచి 22 శాతంగా ఉంది. టర్నోవర్ 2 శాతం క్షీణించి రూ.1,176 కోట్లు నమోదైంది. నికర రుణాలు రూ.842 కోట్లుగా ఉన్నాయి. 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను నికరలాభం 22 శాతం తగ్గి రూ.405 కోట్లకు వచ్చి చేరింది. ఎబిటా 6 శాతం క్షీణించి రూ.856 కోట్లుగా ఉంది. టర్నోవర్ రూ.4,512 కోట్ల నుంచి రూ.4,506 కోట్లకు పడిపోయింది. 'ఆర్థిక ఫలితాలు అంచనాల కంటే తక్కువగా నమోదయ్యాయి. సైబర్ దాడి, ప్యారాసిటమాల్ డిమాండ్ తక్కువగా ఉండడం ఇందుకు కారణం' అని గ్రాన్యూల్స్ సీఎండీ కృష్ణ ప్రసాద్ చిగురుపాటి తెలిపారు.

షేరు ధర బీఎస్‌ఈలో బుధవారం 0.91 శాతం క్షీణించి రూ.396.15 వద్ద స్థిరపడింది.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ ప్రవేశాలు

తెలంగాణ రాష్ట్రంలో స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్..ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం(ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఐఐటీ-జేఈఈ, నీట్ తదితర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఒక్కో దాంట్లో 40 సీట్లు ఉంటాయి.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 320.
» **గ్రూపులు:** ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** పదో తరగతి మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.05.2024
» **వెబ్‌సైట్:** www.tsmodelschools.com

ఎన్‌ఎస్‌కేటీయూ, తిరుపతిలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలోని నేషనల్ సాంస్క్రిట్ యూనివర్సిటీ (ఎన్‌ఎస్‌కేటీయూ).. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ విభాగాల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** ఆచార్య, ఎంఏ(సద్భోధ), ఎంఏ హిందీ, ఎంఎస్సీ(కంప్యూటర్ సైన్స్, యోగా థెరపీ), ఎంఏఐఎంటీ.
» **అర్హత:** సీయూఈటీ ఉత్తీర్ణత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.06.2024
» **వెబ్‌సైట్:** https://nsktu.ac.in

యూపీఎస్సీ- 82 ఉద్యోగాలు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. దేశవ్యాప్తంగా కేంద్రశాఖల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 82
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ కమీషనర్-01, టెస్ట్ ఇంజనీర్-01, మార్కెటింగ్ ఆఫీసర్-33, సైంటిఫిక్ ఆఫీసర్ (మెకానికల్)-01, ఫ్యాక్టరీ మేనేజర్-01, అసిస్టెంట్ మైనింగ్ ఇంజనీర్-07, అసిస్టెంట్ రీసెర్చ్ ఆఫీసర్-15, ట్రైనింగ్ ఆఫీసర్-15, ప్రొఫెసర్లు-03, అసోసియేట్ ప్రొఫెసర్-03, అసిస్టెంట్ ప్రొఫెసర్-02.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.05.2024
» **వెబ్‌సైట్:** https://upsc.gov.in

ఐఐపీ ముంబైలో పీజీ, పీజీ డిప్లొమా, సర్టిఫైడ్ కోర్సుల్లో ప్రవేశాలు

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ).. దేశవ్యాప్తంగా ఐఐపీ క్యాంపస్‌లలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ, పీజీ డిప్లొమా, సర్టిఫైడ్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» **ఎంఎస్ ప్యాకేజింగ్ టెక్నాలజీ:** అర్హత: బీఈ, బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. కోర్సు వ్యవధి: రెండేళ్లు(ఫుల్ టైం); క్యాంపస్: హైదరాబాద్, ఢిల్లీ.
» **బీఎస్సీ ప్యాకేజింగ్ టెక్నాలజీ:** అర్హత: ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్/ బయాలజీ/ అగ్రికల్చర్ సైన్స్-ఒకేషనల్ సైన్స్ ప్రధాన సబ్జెక్ట్‌లుగా 12వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **కోర్సు వ్యవధి:** నాలుగేళ్లు(ఫుల్ టైం).
» **పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్(పీజీడీపీ):** అర్హత: సైన్స్/ఇంజనీరింగ్/ ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **కోర్సు వ్యవధి:** రెండేళ్లు(ఫుల్ టైం). క్యాంపస్: ముంబై, కోల్‌కతా,అహ్మదాబాద్.
» **సర్టిఫైడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్(సీపీఈసీ):** అర్హత: బీఈ, బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **కోర్సు వ్యవధి:** ఏడాది(ఆన్‌లైన్). క్యాంపస్: చెన్నై.
» **వయసు:** 31.05.2024 నాటికి 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది. సీపీఈసీ కోర్సుకు వయోపరిమితి లేదు.
» **ఎంఎస్/పీజీడీపీ కోర్సు ఎంపిక విధానం:** రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.07.2024
» **ప్రవేశ పరీక్ష తేది:** 14.07.2024.
» **వెబ్‌సైట్:** https://www.iipin.com

ప్లాస్టిక్ ఇంజనీరింగ్.. కెరీర్ షైనింగ్

» డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులకు సిపెట్ నోటిఫికేషన్
» రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా సీట్ల కేటాయింపు
» కోర్సులు పూర్తి చేసుకుంటే ఉపాధి అవకాశాలు

ఐటీ నుంచి బ్యాంకింగ్ వరకూ.. ఏ రంగంలో చూసినా తీవ్రమైన పోటీ! వందల్లో పోస్టులుంటే.. లక్షల్లో దరఖాస్తులు!! ఇలాంటి పరిస్థితుల్లో కోర్సు పూర్తి చేసుకుంటూనే ఉపాధికి మార్గం చూపుతోంది..ప్లాస్టిక్ ఇంజనీరింగ్! ప్రభుత్వ రంగ సంస్థ.. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సిపెట్)..తాజాగా డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. సిపెట్-డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సుల వివరాలు, ప్రవేశం, ఉద్యోగావకాశాలపై ప్రత్యేక కథనం..



దేశంలో ప్లాస్టిక్ రంగానికి అవసరమైన మానవ వనరులను తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నెలకొల్పిన సంస్థ.. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్). ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 30 ప్రాంతాల్లో సిపెట్ క్యాంపస్‌లు ఉన్నాయి. వీటిలో ప్లాస్టిక్ ఇంజనీరింగ్‌లో పీజీ,పీహెచ్‌డీ, బీటెక్,ఎంటెక్, డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులను అందిస్తున్నారు.

అర్హతలు

- కోర్సును అనుసరించి పదో తరగతి, డిప్లొమా, బీఎస్సీ (ఎంపీసీ) ఉత్తీర్ణత ఉండాలి.
- చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అడ్మిషన్ టెస్ట్ ముగిసిన ఎనిమిది వారాల్లోగా సర్టిఫికెట్లు చూపించాల్సి ఉంటుంది.

డిప్లొమా, పోస్ట్ డిప్లొమా

- దేశ వ్యాప్తంగా 30 క్యాంపస్‌ల ద్వారా పలు స్థాయిల్లో కోర్సులను అందిస్తున్న సిపెట్.. తాజాగా 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిప్లొమా, పోస్ట్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.
- **డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డింగ్ టెక్నాలజీ(డీపీఎంటీ):** అర్హత: పదో తరగతి, కోర్సు వ్యవధి: మూడేళ్లు.
- **డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ(డీపీటీ):** అర్హత: పదో తరగతి, కోర్సు వ్యవధి: మూడేళ్లు.
- **పోస్ట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ డిజైన్ విత్ క్యాడ్/క్యామ్ (పీడీ-పీఎండీ క్యాడ్/క్యామ్):** కోర్సు వ్యవధి: ఒకటిన్నర సంవత్సరం; అర్హత: మెకానికల్/ప్లాస్టిక్ /పాలిమర్/టూల్/ప్రొడక్షన్/మెకట్రానిక్స్/ఆటో మొబైల్/టూల్ అండ్ డై మేకింగ్ /పెట్రో కెమికల్స్/ఇండస్ట్రియల్/ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/టెక్నాలజీల్లో డిప్లొమా ఉత్తీర్ణత లేదా సిపెట్ డీపీఎంటీ/డీపీటీ ఉత్తీర్ణత ఉండాలి.
- **పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్(పీజీడీ-పీపీటీ):**
- **కోర్సు వ్యవధి:** రెండేళ్లు; **అర్హత:** బీఎస్సీ (ఎంపీసీ) ఉత్తీర్ణత ఉండాలి.

ప్రవేశ పరీక్ష

డిప్లొమా, పోస్ట్ డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు సిపెట్ అడ్మిషన్ టెస్ట్ 2024ను నిర్వహిస్తారు. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. కోర్సును అనుసరించి పరీక్ష వేర్వేరు విధానాల్లో ఉంటుంది.

ఉపాధి వేదికలు

ప్లాస్టిక్ ఇంజనీరింగ్ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఆటోమొబైల్ సంస్థలు, పెట్రోలియం ఉత్పత్తుల సంస్థలు. ఆర్ అండ్ డీ విభాగాల్లో ఉపాధి లభిస్తోంది. వీరికి ప్రభుత్వ రంగంలో పెట్రోలియం మంత్రిత్వ శాఖ,ఓఎన్‌జీసీ,ఆయిల్ ఇండియా కార్పొరేషన్ తదితర సంస్థల్లోనూ అవకాశాలు లభిస్తాయి.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్

సిపెట్ క్యాంపస్‌లలో కోర్సులు పూర్తి చేసుకున్న వారికి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహిస్తున్నారు. ఏటా పలు కంపెనీలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ డ్రైవ్స్ ద్వారా నియామకాలు చేపడుతున్నాయి. గత మూడేళ్ల గణాంకాలను పరిశీలిస్తే.. సిపెట్ క్యాంపస్‌లలో దాదాపు 90% మందికి ఆఫర్లు లభించాయి.

ఆసక్తి ప్రధానం

ప్లాస్టిక్ ఇంజనీరింగ్ రంగంలో రాణించేందుకు ఆసక్తి ప్రధానమని నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా సృజనాత్మకత, కొత్త అంశాలను నేర్చుకునే నేర్పు ఎంతో అవసరం. అంతేకాకుండా మార్కెట్‌లో ప్రవేశించే కొత్త వస్తువులు, వాటి డిజైన్ వెనుక ఇమిడి ఉన్న సాంకేతికతలను పరిశీలించే నైపుణ్యం ఉండాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- ఆన్‌లైన్ అప్లికేషన్ చివరి తేదీ: 2024, మే 31
- ఆన్‌లైన్ పరీక్ష తేదీ: 2024, జూన్ 9
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.cipet.gov.in/academics/cipet_admission.php

కలినరీ ఆర్ట్స్.. మాస్టర్ చెఫ్‌కు మార్గం!

» ఐసీఐలో బీబీఏ, ఎంబీఏ ప్రవేశాలకు నోటిఫికేషన్
» ఇంటర్, బ్యాచిలర్ డిగ్రీతో దరఖాస్తు చేసుకోవచ్చు

కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి బీబీఏ కలినరీ ఆర్ట్స్, ఎంబీఏ కలినరీ ఆర్ట్స్ కోర్సుల్లో అడ్మిషన్స్‌కు దరఖాస్తులు కోరుతున్నారు. ఇందులో ప్రవేశం పొందిన వారికి కిచెన్ మేనేజ్‌మెంట్-కలినరీ స్పెషలిస్టులుగా రాణించేందుకు అవసరమైన నైపుణ్య శిక్షణను అందిస్తారు. ఈ నేపథ్యంలో.. కలినరీ ఆర్ట్స్ కోర్సుల ప్రత్యేకత, దరఖాస్తుకు అర్హతలు, ఉపాధి అవకాశాలు తదితర వివరాలు..



కలినరీ ఆర్ట్స్ అంటే ఆహార అలంకరణ మాత్రమేకాదు. అందులో ఉపయోగించే పదార్థాలలో అత్యధిక పోషకాలు ఉండేటట్లు చూడటం కూడా ముఖ్యమే! కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్ (ఐసీఐ)కు ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి,ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో క్యాంపస్‌లు ఉన్నాయి. ఈ రెండు ఇన్‌స్టిట్యూట్స్‌లో కలిపి బీబీఏ(కలినరీ ఆర్ట్స్)లో 240 సీట్లు, ఎంబీఏ(కలినరీ ఆర్ట్స్)లో 60 సీట్లు ఉన్నాయి. ఇందిరాగాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో ఈ కోర్సులు అందిస్తున్నారు.

బీబీఏ కలినరీ ఆర్ట్స్

- కోర్సు వ్యవధి మూడేళ్లు, ఆరు సెమిస్టర్లుగా ఉంటుంది.
- **అర్హత:** కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్మీడియట్/10+2 ఉత్తీర్ణత ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కనీసం 40 శాతం మార్కులు సాధించాలి. ఇంటర్ ఫైనల్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **ఎంపిక విధానం:** సీయూఈటీ (యూజీ) 2024 స్కోరు లేదా ఐసీఐ నిర్వహించే ఐజీఎన్‌టీయూ-ఐసీఐ జేఈఈ (యూజీ) 2024 స్కోరు ఆధారంగా సీటు కేటాయిస్తారు.

ఎంబీఏ కలినరీ ఆర్ట్స్

- ఈ కోర్సు వ్యవధి రెండేళ్లు, నాలుగు సెమిస్టర్లుగా ఉంటుంది.
- **అర్హత:** కనీసం 45 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత సాధించి ఉండాలి.
- **ఎంపిక విధానం:** సీయూఈటీ (పీజీ) 2024 స్కోరు లేదా ఐసీఐ నిర్వహించే ఐజీఎన్‌టీయూ-ఐసీఐ జేఈఈ (పీజీ) 2024 స్కోరు తదితరాల ఆధారంగా సీటు కేటాయిస్తారు.

ఉద్యోగావకాశాలు

బీబీఏ, ఎంబీఏ కోర్సులను పూర్తిచేసిన వారు టూరిజం రంగంలోని రెస్టారెంట్లు, హోటళ్లలో చెఫ్‌లుగా అవకాశాలు సొంతం చేసుకోవచ్చు. అదేవిధంగా హాస్పిటాలిటీ విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి. ఎయిర్వేస్, రైల్వేస్‌లో కేటరింగ్, ఇండియన్ నేవీలో కిచెన్ మేనేజ్‌మెంట్ కొలువులు సొంతం చేసుకోవచ్చు. ప్రముఖ హోటళ్లలో చెఫ్, న్యూట్రిషనిస్ట్, కిచెన్ మేనేజర్, హాస్పిటాలిటీ సర్వీసెస్ తదితర విభాగాల్లో అవకాశాలుంటాయి. కలినరీ ఆర్ట్స్‌లో టీచింగ్ అవకాశాలు కూడా ఉన్నాయి.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:2024, మే 25
- ఆన్‌లైన్ జేఈఈ(యూజీ/పీజీ) పరీక్ష: 2024, మే 26
- వెబ్‌సైట్: https://www.icitirupati.in

ఇంజెక్షన్ ఖరీదు 16 కోట్లు..

సాయం చేయండి

- 6 నెలల చిన్నారికి ప్రాణాంతక జబ్బు..
- అమెరికాలో దొరికే ఇంజెక్షన్ ఖరీదు రూ.16 కోట్లు.. రూ.10 కోట్లు సమకూర్చిన విదేశీ దాతలు
- సాయం కోసం తల్లిదండ్రుల విజ్ఞప్తి..



సాక్షి, యాదాద్రి : ఆరు నెలల బాబుకు అలవికాని జబ్బు వచ్చింది. వైద్యుల పర్యవేక్షణలో ఉన్న చిన్నారి వైద్యానికి రూ.16 కోట్లు అవసరం కాగా, విదేశాల నుంచి రూ.10 కోట్లు దాతల విరాళాలు అందాయి. మిగతా రూ.6 కోట్లు మన దేశంలోనే సమకూర్చుకోవాలని చెప్పడంతో ప్రభుత్వం, దాతలు సహకరించి తమ బిడ్డ ప్రాణాలు కాపాడాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే..యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పులిగిల్ల గ్రామానికి చెందిన కొలను దిలీప్‌రెడ్డి-యామిని దంపతులకు ఆరు నెలల వయస్సున్న భవిక్‌రెడ్డి స్పైనల్ మస్కులర్ అట్రోఫీ వ్యాధితో బాధపడుతున్నాడు. లక్షల్లో ఒక్కరికి వచ్చే అత్యంత ప్రాణాంతకమైన జబ్బుగా పరీక్షల్లో డాక్టర్లు గుర్తించారు. భవిక్‌రెడ్డికి నరాల కండరాల బలహీనత ఎస్ఎంఏ టైప్ -1 హైరిస్క్‌గా డాక్టర్లు నిర్ధారించారు. వ్యాధిని నయం చేసే ఇంజెక్షన్ ఇవ్వకపోతే చనిపోతాడని డాక్టర్లు అంటున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. కాగా అమెరికాలో లభించే ఈ ఇంజెక్షన్ ధర రూ.16 కోట్లు అని వైద్యం చేస్తున్న హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రి డాక్టర్లు చెప్పారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ రమేశ్ కోణంకి పర్యవేక్షణలో బాబుకు వైద్యం జరుగుతోంది. రెయిన్‌బో ఆస్పత్రి సౌజన్యంతోనే విదేశాల నుంచి సుమారు రూ.10 కోట్ల విరాళాలు ఇప్పటికే సేకరించారు. మరో రూ.6 కోట్లు ఇక్కడే సమకూర్చుకోవాలని వైద్యులు చెప్పారు. తమ చిన్నారి ప్రాణాలు కాపాడుకోవడానికి తల్లిదండ్రులు దాతల సహకారం కోరుతున్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే కోసం : 9640160506, అకౌంట్ హోల్డర్ పేరు : కొలను దిలీప్‌రెడ్డి ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్0021766, బ్యాంక్ అకౌంట్ నంబర్ : 42380569990 బ్యాంకు బ్రాంచ్: ఎస్‌బీఐ వలిగొండ.

గ్లోబల్ వార్మింగ్‌పై ఫైటర్..

ది మమ్మోత్

ఐస్‌ల్యాండ్‌లో గాల్లోంచి కార్బన్ డయాక్సైడ్‌ను తొలగించే భారీ ప్లాంట్



ఏటేటా పెరిగిపోతున్న వాహనాలు, పరిశ్రమలు.. వాటి నుంచి వెలువడే కాలుష్యం గ్లోబల్ వార్మింగ్‌కు కారణమవుతోంది. వాతావరణంలో నిరంతరం పెరిగిపోతున్న కార్బన్‌డయాక్సైడ్ భూమి వేడెక్కిపోయేందుకు కారణమవుతోంది. దీనికి పరిష్కారంగానే.. ప్రపంచ దేశాలన్నీ కర్బన ఉద్గారాలను తగ్గించుకోవడంపై ఫోకస్ పెట్టాయి. ప్రతి దేశానికి టార్గెట్లు పెట్టాయి. ఈ క్రమంలోనే ఐస్ ల్యాండ్‌కు చెందిన 'క్లైమ్ వర్క్స్' కంపెనీ సరికొత్త ఐడియాతో ముందుకొచ్చింది. కర్బన ఉద్గారాలను తగ్గించడానికి బదులు.. నేరుగా వాతావరణం నుంచి కార్బన్ డయాక్సైడ్‌ను తొలగించే సరికొత్త సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఆ విశేషాలు ఏమిటో చూద్దామా..

గాలిలోంచి కార్బన్‌డయాక్సైడ్‌ను వేరు చేసి.. దానిని నీటితో కలిపి, భూమిలోపలి పొరల్లోకి పంపేలా క్లైమ్ వర్క్స్ కంపెనీ ఓ భారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. దీని సాయంతో ఏటా 36 వేల టన్నుల కార్బన్‌డయాక్సైడ్‌ను గాలిలోంచి తొలగించి.. భూమి పొరల్లోకి పంపేలా నిర్మించింది. ఇది సుమారు 8 వేల డీజిల్ కార్లు ఏడాదంతా తిరిగితే వెలువడేంత కార్బన్‌డయాక్సైడ్‌తో సమానం కావడం గమనార్హం. చూడటానికి ఇది తక్కువే అనిపించినా.. ఇలాంటి ప్లాంట్లు భారీ సంఖ్యలో పెడితే.. గ్లోబల్ వార్మింగ్ సమస్యకు ఒక పరిష్కారంగా పనికొస్తుందని 'క్లైమ్ వర్క్స్' సంస్థ చెప్తోంది.


ఏటా 36 వేల టన్నుల మేర..

ఎలా పనిచేస్తుంది?

దీనిలో నిలువునా గోడల్లా ఏర్పాటు చేసే ప్రత్యేక నిర్మాణాలు ఉంటాయి. వాటిలో ఒకవైపు భారీ ఫ్యాన్లను ఏర్పాటు చేశారు. వాటి వెనకాల చిన్న చాంబర్ ఉంటుంది. అందులో కార్బన్ డయాక్సైడ్‌ను సంగ్రహించే ఫిల్టర్లు ఉంటాయి.

ఫ్యాన్‌లను ఆన్ చేసినప్పుడు.. అవి వెనకాల చాంబర్ నుంచి గాలిని లాగి.. ముందు వైపునకు వదులుతాయి. ఈ క్రమంలో చాంబర్‌లోని ఫిల్టర్లు కార్బన్ డయాక్సైడ్‌ను సంగ్రహిస్తాయి.

ఫిల్టర్లు కార్బన్ డయాక్సైడ్‌తో నిండిపోతే.. ఆటోమేటిగ్గా చాంబర్ సీల్ అయిపోతుంది. అందులో చేసిన ప్రత్యేక ఏర్పాట్లతో 100 సెంటిగ్రేడ్‌ల మేరకు వేడెక్కుతుంది. దాంతో ఫిల్టర్లలోని కార్బన్ డయాక్సైడ్ ఆవిరి అవుతుంది.



ఈ ఆవిరిని ప్రత్యేక పైపుల ద్వారా భూగర్భంలోకి తరలిస్తారు. ఆ పైపుల్లోకి నీటిని పంపే ఏర్పాట్లు చేస్తారు. దీనితో కార్బన్ డయాక్సైడ్ నీటిలో కరిగి కార్బన్ వాటర్‌గా మారిపోతుంది. భూగర్భంలోకి ఆ కార్బన్ వాటర్ మెల్లగా గడ్డకట్టి రాళ్లుగా తయారవుతుంది.

ఈ ప్రక్రియలో ఫ్యాన్ల కోసం, పైపుల ద్వారా కార్బన్ డయాక్సైడ్, నీరు పంపింగ్ చేయడం కోసం వాడే విద్యుత్‌ను ఆ ప్రాంతంలోని జియోథర్మల్ పవర్ ప్లాంట్ నుంచి తీసుకుంటున్నారు. ఇది వేడినీటి బుగ్గల నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్ కాబట్టి.. దాని వినియోగంతో పర్యావరణానికి సమస్యేమీ లేదని 'క్లైమ్ వర్క్స్' కంపెనీ ప్రతినిధులు చెప్తున్నారు.

అమెరికాలోని లూసియానాలో 2030 నాటికి ఏటా 10 లక్షల టన్నుల కార్బన్‌డయాక్సైడ్‌ను సంగ్రహించగలిగే ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

- సాక్షి సెంట్రల్ డెస్క్

ఏఐకి రూ.19 లక్షలు
సైబర్ సెక్యూరిటీకి రూ.18 లక్షలు

కంప్యూటర్ కోర్సుకు కాలేజీలు చెప్పిందే లెక్క

యాజమాన్య కోటాకు యమ డిమాండ్.. సెట్ రిజల్ట్స్‌కు ముందే బేరసారాలు

కాలేజీల కృత్రిమ డిమాండ్.. రిజర్వు చేసుకుంటేనే సీటు గ్యారంటీ అని షరతు



సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు యాజమాన్య కోటా సీట్ల బేరసారాల జోరు పెంచాయి. వీలైనంత ఎక్కువ డిమాండ్ చేస్తున్నాయి. ముఖ్యంగా కంప్యూటర్ బ్రాంచీల్లో సీట్లను పెద్ద మొత్తంలో అమ్ముకోవాలని చూస్తున్నాయి. డిమాండ్ ఉన్న టాప్ కాలేజీల్లో యాజమాన్య కోటా సీట్లు సామాన్యులు ఆశించే స్థాయిలో లేవని తెలుస్తోంది. ఇంజనీరింగ్ సెట్ ఫలితాలు మరో పది రోజుల్లో రానుండటంతో యాజమాన్య సీట్ల వైపు ఎక్కువ మంది ఆశలు పెట్టుకుంటున్నారు. వాస్తవానికి ప్రభుత్వ నోటిఫికేషన్ వచ్చిన తర్వాతే యాజమాన్య కోటా సీట్లను భర్తీ చేయాల్సి ఉన్నప్పటికీ ఈ నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. అయితే, సీట్లు కొనుగోలు చేసేవాళ్లు, విక్రయించే కాలేజీలకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో తామేమీ చేయలేకపోతున్నామని అధికారులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు.

డబ్బు కడితేనే సీటు గ్యారంటీ

రాష్ట్రంలో ఈ ఏడాది 1.09 లక్షల ఇంజనీరింగ్ సీట్లు ఉండే వీలుంది. ఇందులో 30% అంటే దాదాపు 31 వేల సీట్లు మేనేజ్‌మెంట్ కోటా కిందకొస్తాయి. ఇందులో టాప్ కాలేజీల్లో 19 వేల సీట్ల వరకూ ఉండగా, వీటిలో సగం సీట్లను ఎన్ఆర్ఐ కోటా కింద భర్తీ చేయాలి. బీ కేటగిరీ సీట్లను జేఈఈ, ఈఏపీసెట్ ర్యాంకర్లు, ఇంటర్‌లో మార్కులు ఎక్కువ వచ్చిన వారికి క్రమానుగతంగా ఇవ్వాలి. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఎన్ఆర్ఐ కోటా సీట్లకు ఏడాదికి 5 వేల డాలర్లు (దాదాపు రూ. 4 లక్షలు) వసూలు చేసుకునే వీలుంది. అయితే, బీ కేటగిరీ సీట్లకు దరఖాస్తు చేసే వాళ్ల వివరాలు ప్రభుత్వ సంస్థల పరిధిలోకి రావడం లేదు. ఆన్‌లైన్ విధానంలోనూ ఉండటం లేదు. దీన్ని సాకుగా తీసుకుని యాజమాన్యాలు ముందే సీట్లను అమ్ముకుంటున్నాయి. ఈఏపీ సెట్‌లో మంచి ర్యాంకు రాదని తెలిసిన వాళ్లు సీట్ల కోసం ఎగబడుతున్నారు. సెట్ రిజల్ట్ వస్తే డిమాండ్ పెరుగుతుందని, సీట్లు కూడా అయిపోయే ప్రమాదం ఉందని యాజమాన్యాలు డిమాండ్ సృష్టిస్తున్నాయి. ప్రతీ రోజు ప్రత్యేక విభాగాలు పెట్టి సీట్ల కోసం వచ్చే వారిని ఒప్పించి, మెప్పించి డబ్బు వసూలు చేస్తున్నాయి. సీటు ఇవ్వాలంటే ముందే డబ్బులు కట్టి రిజర్వు చేసుకోవాలని షరతు విధిస్తున్నాయి.

నోటిఫికేషన్ వచ్చాకే అడ్మిషన్లు



యాజమాన్య కోటా సీట్ల భర్తీకి ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ ఇస్తుంది. అప్పుడు మాత్రమే సీట్లు భర్తీ చేయాలి. ఇందుకు విరుద్ధంగా సీట్లు అమ్ముకునే సంస్థలపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం ఈ విషయంలో సీరియస్‌గా ఉంది.

– ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, ఉన్నత విద్యామండలి చైర్మన్

ర్యాంకర్లకూ గాలం

➤ జేఈఈ ర్యాంకర్లతో కాలేజీ యాజమాన్యాలు రాష్ట్ర ఇంజనీరింగ్ సీట్లకు కౌన్సెలింగ్‌లో దరఖాస్తు చేయించేందుకు వ్యూహరచన చేస్తున్నాయి. ఇలాంటి వాళ్లకు రాష్ట్ర సెట్‌లోనూ మంచి ర్యాంకు వస్తుంది. కంప్యూటర్ బ్రాంచీలో సీటుకు దరఖాస్తు చేస్తే తొలి కౌన్సెలింగ్‌లోనే సీటు వస్తోంది. జాయినింగ్ రిపోర్టు చేసి సీటు కన్ఫమ్ చేసుకుంటున్నారు. ఆఖరి దశ కౌన్సెలింగ్ తర్వాత, స్పాట్ అడ్మిషన్‌కు ముందు సీటు వదులుకుని, జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో చేరతారు. ఇలా ఖాళీ అయిన సీట్లనూ యాజమాన్యాలు భారీ మొత్తంలో అమ్ముకుంటాయి. కంప్యూటర్ బ్రాంచీలో సీటుకు రూ.18 లక్షల వరకూ వసూలు చేస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) వంటి కోర్సులకు ఏకంగా రూ. 19 లక్షల వరకూ డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో 58 శాతం సీట్లు కంప్యూటర్ కోర్సుల్లోనే భర్తీ అవుతున్నాయి.

కెనడాలో 'తెలంగాణ నైట్'

రాష్ట్రం ఏర్పడి పదేళ్లు కావొస్తున్న సందర్భంగా టొరంటోలో సంబరాలు

అభినందనల సందేశం పంపిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర ప్రముఖులు

సాక్షి, హైదరాబాద్: వచ్చే జూన్‌తో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు కావొస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని కెనడాలో సంబరాలు జరిగాయి. అక్కడ స్థిరపడిన మన వారు 'తెలంగాణ నైట్' పేరుతో ఉత్సవాలు నిర్వహించారు. ఇందుకు టొరంటో నగరంలోని మిసిసాగ వేదిక అయ్యింది. తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్ (టీడీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు వందలాది మంది తెలంగాణవాసులు కుటుంబాలతో సహా హాజరయ్యారు. తెలంగాణ ఆట, పాటలతో సందడి చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, బీజేపీ సీనియర్ నేత ఈటల రాజేందర్, ప్రొఫెసర్ కోదండరాం, ప్రముఖ కవి రచయిత అందెశ్రీ తదితరులు అభినందనల సందేశాలు పంపారు. ఈ సందర్భంగా టీడీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేందర్ రెడ్డి పెద్ది మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ మార్గదర్శకత్వంలో 2005లో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్ ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రఅభివృద్ధి, సంక్షేమం వైపు పయనించేలా తెలంగాణ ఎన్నారైలు పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయమని చెప్పారు. అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి గార్లపాటి మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వానికి కృషి చేసిన కవులు, కళాకారులను గౌరవిస్తూ, సన్మానించుకోవటం, అమరుల కుటుంబాలను ఆదుకోవడం వంటి కార్యక్రమాలను టీడీఎఫ్ నిర్వహిస్తుందన్నారు. టీడీఎఫ్ వ్యవస్థాపక సభ్యుడు దివంగత గంటారెడ్డి మాణిక్‌రెడ్డి పేరు మీద ఏర్పాటు చేసిన విశేష సమాజసేవ పురస్కారాన్ని పవన్‌కుమార్‌రెడ్డికి అందజేశారు.

యూకే పార్లమెంట్ బరిలో తెలుగు బిడ్డ

లేబర్ పార్టీ అభ్యర్థిగా ఉదయ్ నాగరాజు



సాక్షి, సిద్దిపేట: యూకే పార్లమెంట్ ఎన్నికల బరిలో తెలంగాణ బిడ్డ నిలిచారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామానికి చెందిన ఉదయ్ నాగరాజు లేబర్ పార్టీ నుంచి పోటీ చేస్తున్నారు. నార్త్ బెడ్‌ఫోర్డ్‌షైర్ లేబర్ పార్టీ నుంచి ఆయనను అభ్యర్థిగా ప్రకటించింది. శనిగరం గ్రామానికి చెందిన ఒక సామాన్య మధ్య తరగతి కుటుంబంలో ఉదయ్ జన్మించారు. తల్లిదండ్రులు హనుమంతరావు, నిర్మలాదేవి. బ్రిటన్‌లోని ప్రఖ్యాత యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ లండన్‌లో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పీజీ చేశారు. కష్టపడేతత్వం కలిగిన ఉదయ్ అంచెలంచెలుగా ఎదిగారు. ప్రపంచం, భావితరాలపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావాన్ని ముందుగానే పసిగట్టి ఏఐ పాలసీ లాబ్స్ అనే థింక్ ట్యాంక్‌ని నెలకొల్పారు. మంచి వక్తగా పేరు సంపాదించారు. సర్వే ఫలితాల ప్రకారం ఈ ఎన్నికల్లో ఉదయ్ గెలిచే సాధించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. తెలుగు బిడ్డ బ్రిటన్‌లో ఎంపీగా పోటీ చేస్తుండటం.. విజయం సాధిస్తారనే అంచనాలు ఉండటంతో తల్లి నిర్మలా దేవి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తెలుగు బిడ్డ ఆ స్థాయికి ఎదగడంతో శనిగరం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యాదాద్రిలో సాంస్కృతికోత్సవ వేదిక

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదాన్ని పంచేందుకు తూర్పు మాడవీధిలో ప్రతి శుక్ర, శనివారాల్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీనికోసం చలువ పందిళ్లతో తాత్కాలికంగా వేదికను ఏర్పాటు చేసినా, వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని శాశ్వత వేదికను ఏర్పాటు చేస్తున్నారు. త్వరలోనే ఈ సాంస్కృతికోత్సవ వేదికను పూర్తిచేసి, రోజూ కూచిపూడి, సంగీతం, భరత నాట్యం వంటి ప్రదర్శనలు నిర్వహించేలా చర్యలు తీసుకోనున్నట్లు ఈవో తెలిపారు.



మాడవీధిలో ఏర్పాటు చేస్తున్న శాశ్వత వేదిక



రేపటి నుంచి 'లులు' ఫ్యాషన్ వీక్

సెలబ్రిటీలు, అంతర్జాతీయ మోడల్స్‌తో వేడుక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోనే అతిపెద్ద ఫ్యాషన్ వేడుకలకు నగరం వేదిక కానుంది. లులు గ్రూప్ ఆధ్వర్యంలో 'లులు ఫ్యాషన్ వీక్-2024' (ఎల్ఎఫ్‌డబ్ల్యు) ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు జరగనుంది. దీనికి సంబంధించిన లోగో ఆవిష్కరణ కార్యక్రమాన్ని లులు మాల్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ సెలబ్రిటీ స్టైలిస్ట్ శంఖాన్, లులు గ్రూప్ హైదరాబాద్ రీజనల్ మేనేజర్లు అబ్దుల్ సలీమ్, అబ్దుల్ ఖదీర్ మాట్లాడారు. ఈ అతిపెద్ద ఫ్యాషన్ వేడుకల్లో ఫ్యాషన్ షోలు, ఫ్యాషన్ అవార్డులతో పాటు ఫ్యాషన్ ఇన్‌ఫ్లుయెన్సర్లతో అనేక గ్లోబల్ బ్రాండ్ల సమ్మర్ కలెక్షన్‌లను ప్రదర్శించనున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా శాండల్ వుడ్, ఫ్యాషన్, ఎంటర్‌టైన్‌మెంట్, రిటైల్ పరిశ్రమలకు చెందిన ప్రముఖులు, తారలను ఒకే తాటిపైకి తీసుకురానున్నామని వెల్లడించారు. ఫ్యాషన్ రంగంలో విశిష్టమైన వ్యక్తులు, బ్రాండ్లకు 'స్టైల్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్' అవార్డులతో పాటు ఇతర విభాగాల్లో అవార్డులు ప్రదానం చేస్తామని వివరించారు. ప్రముఖ మోడల్స్‌తో ర్యాంప్ వాక్‌లు, ఫ్యాషన్ ఎగ్జిబిషన్‌లతో ఈ రంగంలోని వైవిధ్యాన్ని ప్రతిబింబించేలా వేడుకలు కొనసాగుతాయన్నారు. ఇందులో దాదాపు 25 జాతీయ-అంతర్జాతీయ బ్రాండ్లు భాగస్వాములవుతాయని పేర్కొన్నారు.

విహంగాలకు 'హైటెన్షన్'

నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం మంచాలకట్ట, వేంకల్ గ్రామాల్లో కృష్ణాతీర ప్రాంతాల్లోని ఎత్తయిన విద్యుత్ టవర్ల తీగలు.. వందలాది ఫ్లెమింగో పక్షుల పాలిట ఉరితాళ్లుగా మారాయి. ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర మధ్య పవర్ గ్రిడ్‌కు అనుసంధానంగా రెండేళ్ల కిందట వరోరా కర్నూల్ ట్రాన్స్‌మిషన్ లైన్(డబ్ల్యూకేఎల్)ను ఎత్తయిన టవర్లతో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ లైన్ నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం మంచాలకట్ట సమీపంలో కృష్ణాతీర ప్రాంతాల గుండా వెళ్తోంది. వేసవిలో నీటి కోసం ఫ్లెమింగో పక్షులు కృష్ణానది తీరంలోని శ్రీశైలం బ్యాక్ వాటర్ దగ్గరకు వందల సంఖ్యలో వస్తున్నాయి. 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ సామర్థ్యం ఉన్న తీగెలను తాకి అక్కడిక్కడే మరణిస్తున్నాయి. వీటి రక్షణకు బర్డ్ రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయాలని డబ్ల్యూకేఎల్ విద్యుత్ సంస్థకు లేఖ రాసినట్టు కొల్లాపూర్ ఫారెస్ట్ రేంజర్ శరత్‌చంద్రారెడ్డి తెలిపారు.

- సాక్షి, నాగర్‌కర్నూల్







Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.